# నవలాహృదయం

వి. రాజారామమోహనరావు

# నవలాహృదయం

**27 ప్రసిద్ధ తెలుగు నవలల విమర్శనాత్మక పరిచయాలు**

వి. రాజారామమోహనరావు

**వి.ఎన్.ఆర్. బుక్ వరల్డ్**

**చౌడేపల్లి, చిత్తూరు జిల్లా**

# NAVALAAHRUDAYAM

*Critical Analysis of 27 famousTelugu Novels*

*Written by*
**V. Raja Rammohana Rao**
*3-1-73/1/A, Ramshankar Nagar*
*Ramanthapur, Hyderabad-013.*
*Ph.: 040-27038805. Mobile: 09394738805*
*email: raja27038805@yahoo.in*

***First Print:*** *January, 2013*

***Publication***
**VNR Book World**
7-196, G.K. Palli Road
Chowdepalli - 517 257
Chittoor District, Andhra Pradesh
Ph : 08581-256234, 256090;
Fax : 08581-256213
e-mail: vijayavani_printers@yahoo.com

***Cover Design***
**Akshara Creators**

***Copies available at***
**Visalandhra Book House,** Bank Street, Hyd. and its Branches in A.P., **Navodaya Book House,** Kachiguda, Hyd., **Navodaya Publishers,** Eluru Road, Vijayawada, **Telugu Book Shop,** Kachiguda, Hyd.,

Composed & Designed at **Akshara Creators,** Hyderguda, Hyderabad-029. Ph.:23244088.

Printed at **Vijayavani Printers**
Chowdepalle, Chittoor Dist.
Ph.: 08581-256234, 256090

**₹ 75**

# ఇవీ పరిచయాలు...


| | | | |
|---|---|---|---|
| 1. | సెక్రటరీ | - యద్దనపూడి సులోచనారాణి | ... 9 |
| 2. | గణపతి | - చిలకమర్తి లక్ష్మీనరసింహం | ... 15 |
| 3. | అంటరాని వసంతం | - జి. కళ్యాణరావు | ... 21 |
| 4. | కొలిమంటుకున్నది | - అల్లం రాజయ్య | ... 25 |
| 5. | పాకుడురాళ్లు | - రావూరి భరద్వాజ | ... 31 |
| 6. | బ్రతికిన కాలేజీ | - పాలగుమ్మి పద్మరాజు | ... 37 |
| 7. | స్వర్ణసీమకు స్వాగతం | - మహేంద్ర | ... 43 |
| 8. | విశాల నేత్రాలు | - పిలకా గణపతిశాస్త్రి | ... 49 |
| 9. | వెల్లువలో పూచికపుల్లలు | - భాస్కరభట్ల కృష్ణారావు | ... 55 |
| 10. | విరామం | - అంగర వేంకట కృష్ణారావు | ... 61 |
| 11. | వలసదేవర | - జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి | ... 67 |
| 12. | మాతృమందిరం | - బాలాంత్రపు వేంకటరావు | ... 73 |
| 13. | సిపాయి కూతురు | - కొవ్వలి లక్ష్మీనరసింహారావు | ... 79 |
| 14. | కొత్త ఇల్లు | - తాళ్లూరు నాగేశ్వరరావు | ... 83 |
| 15. | మోహనవంశి | - లత | ... 89 |
| 16. | ఊబిలో దున్న | - వినుకొండ నాగరాజు | ... 95 |
| 17. | రంగుల వల | - ఎమ్ (ముక్తవరం) పార్థసారథి | ... 99 |
| 18. | త్రిశంకుడి స్వర్గం | - మధురాంతకం రాజారాం | ... 105 |
| 19. | కౌసల్య | - పోలాప్రగడ సత్యన్నారాయణమూర్తి | ... 111 |
| 20. | గొడుగు | - పి. సత్యవతి | ... 115 |
| 21. | ఇదే దారి | - బలివాడ కాంతారావు | ... 119 |
| 22. | ఇల్లు కట్టి చూడు | - పురాణం సుబ్రహ్మణ్య శర్మ | ... 125 |
| 23. | సంసారవృక్షం | - ఆర్.ఎస్. సుదర్శనం | ... 129 |
| 24. | చీకటోళ్లు | - అర్నాద్ | ... 135 |
| 25. | పితృవనం | - కాటూరి విజయసారథి | ... 141 |
| 26. | అవతలి గట్టు | - అరవింద | ... 145 |
| 27. | మగువ మనసు | - ధనికొండ హనుమంతరావు | ... 151 |

# నా ఈ రచనలతో పాటు...

పఠనాపరంగా, ప్రయోగపరంగా, ఉద్యమస్ఫూర్తి వల్ల, సృజనాపరమైన కొత్త దృక్కోణం వల్ల, వస్తువు వల్ల, రచనాపరమైన నైపుణ్యంతో... ఇలా రకరకాలుగా ఎంతో ప్రాచుర్యం పొందిన ప్రసిద్ధ తెలుగు నవలలు ఎన్నో ఉన్నాయి. అలాంటి నవలల్లో కొన్నింటిని అమెరికాలో వెలువడే తెలుగునాడి మాసపత్రిక కోసం విమర్శనాత్మక పరిచయాలుగా నేను రాశాను. ఆ రచనల సంపుటే ఈ పుస్తకం. ఈ నవలల ఎంపిక ఎక్కువ భాగం తెలుగునాడి వారిది, కొంత నాది.


ఈ రచనల బాధ్యత నాకు అప్పగించింది వాసిరెడ్డి నవీన్. నవీన్, తెలుగునాడి పత్రిక ఈ రచనలకి పూనికైతే, ఇలా పుస్తకంగా రావటానికి కారణం మిత్రుడు, రచయిత నాయుని కృష్ణమూర్తి, విజయవాణి ప్రింటర్స్ యాజమాన్యం. పుస్తకం డిజైనింగ్‌తో సకాల సహకారం అందించిన వ్యక్తి 'అక్షర' సీత.

*

ఇంక శ్రీ రామడుగు రాధాకృష్ణమూర్తి... ఆయనకి మంచి పుస్తకమే జీవితం... దాని కోసం ఎన్ని మైళ్లయినా నడుస్తారు. ఎన్ని గంటలేనా శోధిస్తారు. దొరికిన మంచి పుస్తకాలనన్నింటినీ కొని, ఎంత కష్టానికేనా ఓర్చి లభ్యపరచుకుంటారు. ఎన్ని ఏళ్లయినా సరే భద్రంగా జాగ్రత్త చేస్తారు. చాలామంది రచయితల రచనలు వాళ్ల దగ్గర లేని సందర్భాలలో ఈయన దగ్గర జాగ్రత్తగా ఉండటం నాకు తెలుసు. చదవటం, చదివిన వాటిని గురించి పదిమందికి చెప్పటం, దాచటం, అవసరానికి అందివ్వటమే జీవితంగా బతుకుతున్న అరుదైన సాహితీమూర్తి. రాయటం మీద ఎంతమాత్రం మక్కువలేని సిసలైన సాహితీప్రియుడు.

ఈ నా రచనలకి కూడా దొరకని చాలా నవలలు నాకు ఇచ్చింది ఆయనే.

అలాంటి నిరాడంబర, మంచి వ్యక్తికి, పరోపకారికి ఈ పుస్తకాన్ని అంకితం ఇవ్వటం నాకెంతో సంతోషం.



శ్రీ రాముడుగు రాధాకృష్ణమూర్తికి...

\- రాజా




# సెక్రటరీ

## యద్దనపూడి సులోచనారాణి

ఆధునిక నవలా సాహిత్యంలో ఆరంభం నుంచి రెండు పోకడలు నడుస్తున్నాయి. కొంచెం వెనక్కి వెళ్ళి చూస్తే కొవ్వలి, జంపనా రచనలు, వాటికి భిన్నంగా విశ్వనాథ, కందుకూరి, చలం నవలలది ఓ కాలం. ఆ తరువాతి కాలంలో అత్యంత ప్రాచుర్యం పొందిన నవలల విషయం చెప్పుకోవాల్సివస్తే శ్రీమతి యద్దనపూడి సులోచనారాణిని కాదని ముందుకు వెళ్ళలేం. పైన చెప్పిన రెండు పోకడలలో నవలారచన చేసిన వారు పరస్పరం గౌరవించుకొన్న సందర్భాలు ఎన్నున్నాయో, విభేదించిన సందర్భాలు అంతకన్నా ఎక్కువే ఉన్నాయి. సులోచనారాణిగారు పాఠకులని కలలలోకంలోకి తోసేసి, పఠనా సమయాన్ని నిష్ప్రయోజనంగా మారుస్తుందన్నది ముఖ్యమైన ఆరోపణ.

నలభై ఏళ్ళకి పైగా నవలారాణి అన్న ప్రాచుర్యం పొందిన శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి తొలి నవల సెక్రటరీ. 1964లో జ్యోతి మాసపత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఇప్పటి ప్రచురణకర్తలు, ఎమెస్కో బుక్స్‌వారి ప్రకారం ఇది 78వ ముద్రణ. ఇంతగా పునర్ముద్రణ పొంది, లక్షలకొద్దీ పాఠకులని అలరించిన ఈ నవలలో ఉన్నదేమిటి?

ప్రధానంగా ఇది జయంతి అన్న యువతి కథ.

అందం, పరువం, పొగరుమోత్తనం, ఆత్మాభిమానం ఉన్న ఆడపిల్ల జయంతి.

హుందా, ఠీవి, డబ్బు, పదిమందిలో పలుకుబడి ఉండి, ఆడవాళ్ళని సమ్మోహన పరిచే రూపున్న నిండైన వ్యక్తి రాజ శేఖరం.

ఇదీ... ఈ నవలలోని నాయికా, నాయకుల గురించి ప్రచురణకర్తలు నవల అట్ట వెనుక ఇచ్చిన పరిచయం. వీరిద్దరి పరస్పర ఆకర్షణ, ప్రేమ, ద్వేషం, కోపం, పట్టుదలలతో నిండిన ప్రేమకథ సెక్రటరీ, 256 పేజీల నవల.

1964లో తొలిసారిగా ఈ నవల ప్రచురణ జరుగుతున్న రోజుల్లో నవలా పఠన అలవాటున్న ప్రతి కుటుంబానికి జయంతి, రాజశేఖరాలు వారిలో ఒకరైపోయారు. ఆ రెండు పాత్రల జీవితాల్లో మలుపులు, సంఘటనలు, తమ దగ్గరి వారి జీవితంలోనే, తమకి అతి దగ్గరగానే జరుగుతున్నట్టు తాదాత్మ్యం చెందారు. సెక్రటరీ నవల విజయం విషయంలో మరో అభిప్రాయానికి తావు లేకపోయింది.

జయంతి అన్న దిగువ మధ్యతరగతి అమ్మాయిని, ఆమె బామ్మ కష్టపడి పెంచి చదువు చెప్పిస్తుంది. చదువు పూర్తికాగానే, ఉద్యోగం చూసుకొని, ఆ వృద్ధురాలి శ్రమ తగ్గించాలన్న ఆతృత జయంతికి. 'ఆంధ్ర వనితావిహార్' అన్న సంస్థలో సెక్రటరీ ఉద్యోగం దొరగ్గానే జయంతికి ఎంతో ఆనందం కలుగుతుంది. నగరంలోని ప్రముఖులు, డబ్బు, హోదా ఉన్నవాళ్ళకి ఆ సంస్థతో పరిచయం ఉంటుందని, అలాంటి గొప్పవారి మధ్య తన లాంటి సామాన్యురాలు మెలగగలిగే అదృష్టం ఆ సెక్రటరీ ఉద్యోగమని ఎన్నెన్నో ఊహల్లో తేలిపోతుంది. కొద్దిరోజులకే జయంతి ఊహలన్నీ తప్పని తేటతెల్లమౌతుంది. ఆ వనితావిహార్ నిర్వహణలో ప్రముఖులైన స్త్రీల మధ్య భేదాభిప్రాయాలు, ఈర్ష్యాసూయలే కాక, జయంతికి భరింపశక్యం కాని పరిస్థితులు ఎదురవుతాయి. ఉద్యోగం లేకపోతే కష్టమని తెలిసి, మరో ఉద్యోగం దొరకటం అంత తేలిక కాదన్న అవగాహన ఉండీ, బామ్మ విషయంలో మళ్ళీ ఆమెని కష్టపెట్టాలి అన్న దిగులున్నా ఉద్యోగానికి రాజీనామా చేస్తుంది.

వదిలేసిన వనితావిహార్ ఉద్యోగానికి రాజశేఖరం దగ్గర సెక్రటరీ ఉద్యోగానికీ ఎంతో భేదం. అక్కడ అంతా అసౌకర్యం, అధికార ప్రదర్శన అయితే, రాజశేఖరం దగ్గర అన్నిరకాలా సౌకర్యం, క్రమశిక్షణతో కూడిన పని, గౌరవం, మర్యాద. జీతమూ ఎక్కువే. జయంతి అంతకుముందు కలలు కన్న సెక్రటరీ ఉద్యోగపు హుందా, గొప్ప తనం అన్నీ ఈ ఉద్యోగంలో ఉన్నాయి.

రోజులు బాగానే గడుస్తున్నాయి. అన్నీ బాగానే ఉన్నాయి, అనుకొంటున్న సమయంలో జయంతికి ఊహించని సమస్య ఎదురైంది. అది ఎక్కడో ఎవరి వల్లో

కాదు. రాజశేఖరం రూపంలోనే. ఓ పట్టాన అతనేమిటో, అతని పద్ధతేమిటో అర్థంకాక, రకరకాల ఊహలకి, భావనలకి లొంగి, ఆత్మాభిమానం చంపుకోకూడదనుకొని జయంతి ఈ ఉద్యోగానికీ రాజీనామా చేస్తుంది. రాజశేఖరం అంగీకరించడు. అలా అని తన మనసు విప్పి చెప్పడు.

అందం, హోదా, ఐశ్వర్యం ఉన్న మగవాడి ఆకర్షణలో ఓ దిగువ మధ్యతరగతి మగువ మనసు, ఎన్నిరకాల ఉద్విగ్నతకి లోనవ్వాలో అవన్నీ జయంతి అనుభ విస్తుంది. పైగా తను ఇష్టపడుతున్న అందాల రాజశేఖరం చుట్టూ రకరకాల స్త్రీలు. అందరితోటీ చనువుగా, గౌరవంగా మెలిగే అతని మనసు తెలుసుకోలేని ఆందోళన. దీనికితోడు అతని గురించి చెవిన పడే రకరకాల వార్తలు. వీటికితోడు ఓ కీలక సమయంలో రేఖా రాణిని, రాజశేఖరాన్ని ఎంతో సన్నిహితంగా చూసిన జయంతి తట్టుకోలేకపోతుంది. రాజశేఖరానికి దూరంగా వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంటుంది. పులి మీద పుట్రలా అదే సమయానికి జయంతికి అనారోగ్యం, బామ్మగారి నిస్సహాయస్థితి. ఎపెండిసైటిస్. అయాచితంగానే రాజశేఖర్ అన్నీ తానే అయి సాయపడతాడు. అంతే జయంతిని, బామ్మగారిని తనింటికే తీసుకొచ్చేస్తాడు. వాళ్ళల్లో తానూ ఒక్కడన్నట్టు మారిపోతాడు. అతను చూపించేది కేవలం జాలి అన్న న్యూనతకి లోనైన జయంతి ఆ ఇంటి నుంచి వెళ్ళి పోవాలనుకుంటుంది. అదే సమయంలో జయంతికి ఉన్న ఏకైక బంధువు బామ్మ గారు గుండెపోటుతో మరణిస్తుంది.

అంతా అయోమయం, దిక్కుతోచని స్థితి, సిగ్గు, అవమానం. ఆవేశంలో రాజ శేఖరం ఇంటి నుంచి వచ్చేస్తుంది జయంతి. అనుకోకుండా బెంగుళూరు వెళ్ళటం, అక్కడ అనూహ్య పరిస్థితుల్లో చిక్కుకొని, బయటపడి మద్రాసు డా॥ విజయలక్ష్మి ఇల్లు చేరటం జరుగుతుంది. ఏదో ఒడిదుడుకులు లేకుండా జీవితం గడుస్తోందిలే అనుకొన్న సమయంలో అక్కడికి రాజశేఖరం రావటం, అప్పటికే విజయలక్ష్మి తమ్ముడు ప్రసాద్‌తో జయంతి వివాహం అనుకోవటం, దెబ్బతిన్న రాజశేఖరం వెనక్కి వచ్చేసి, శాశ్వతంగా దూరంగా వెళ్ళిపోయే ప్రయత్నంలో ఆఖరియత్నంగా జయంతికి ఉత్తరం రాయటం, అప్పటికే మనసు మార్చుకొన్న జయంతి రాజశేఖరం దగ్గరకి వచ్చేయటం, ఆమె వచ్చి ఇద్దరూ ఒకటి అనుకొన్న తర్వాత రాజశేఖరం రాసిన ఉత్తరం వెనక్కి రావటం, అది చదివిన జయంతికి అన్ని సందేహాలు తీరి, రాజశేఖరం ప్రేమ తెలిసి చేరువవటం కథ. ఈ కథని రసవత్తరంగా నడపటానికి చాలా పాత్రలు, కొన్ని గత చరిత్రలూ ఉన్నాయి.

ఇదే కోవలో ఆశ, నిరాశలు, రాగద్వేషాలు నిండిన నాటకీయతతో ఎన్నో తెలుగు నవలలు ఉన్నాయి. కానీ సెక్రటరీ నవల విజయం యొక్క కీలకం ఏమిటి? అప్పటికీ, ఇప్పటికీ అంతగా చదివించగల శక్తి ఈ సెక్రటరీలో ఎక్కడుంది?

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి సున్నితమైన, ఆకర్షణీయమైన శైలి, తక్కువ వివరణలతో గట్టి ప్రభావాన్ని చూపే పాత్రల చిత్రీకరణ, సమకాలీనంగా ఎన్నుకొన్న పాత్రల వేషభాషలు, నాగరికతా ధోరణులు, ఇలా చాలాచాలా కారణాలు చెపుతారు. వాటిని కాదనలేం. కానీ వాటికన్నా ముఖ్యమైంది, ఇంకేమైనా ఉందా?

నవల ప్రారంభంలోనే జయంతి తన బామ్మ శ్రమని తగ్గించటానికి తనకి ఉద్యోగం దొరకటం ఎంతో ఆనందంగా భావిస్తున్న సందర్భంలో బామ్మతో జయంతి- “ఇహ మన కష్టాలు గట్టెక్కినట్టే, నువ్వు రోజూ చేసే పూజలు వృధా పోలేదు. దేవుడు మన మొర ఆలకించాడు,'' అంటుంది (పే. 7).

“ఆవిడ రోజూ పూజలు చేసి భగవంతుణ్ణి ప్రార్థిస్తున్న మాట నిజమే. కానీ అది జయంతికి ఉద్యోగం రావాలని కాదు. ఏదైనా మంచి సంబంధం కుదిరి పిల్ల అత్తవారింటికి వెళ్ళిపోయేలా చూడమని. (పే. 8)

పై కొద్ది వాక్యాలలో బామ్మ మనవరాలి పరస్పర భావనలు, ప్రేమ, లోకరీతి రివాజులు, సమకాలీన భావనలు అన్నీ అందరికీ తెలుస్తాయి. ఆ తెలిసే ప్రక్రియలో వారు, వారితో పాటు వారికి తెలిసినవారు ఒక రకమైన ఐక్యభావనకి లోనవుతారు. పాత్రలతో చదువరులు మమేకం అయ్యే జీవన వాస్తవికత ఈ చిన్ని చిన్ని మాటల్లో ఉంది.

అందుకే సెక్రటరీలో జయంతితో కొన్ని లక్షలమంది దిగువ మధ్యతరగతి యువతీ యువకులు ఐడెంటిఫై అయ్యారు.

ఇంక ఈ వయస్సులో, ఆ పరిస్థితుల్లో జయంతి ఊహలు, ఆశలు ఎలా ఉన్నాయంటే- 'మంచం మీద పడుకున్న జయంతికి ఎంతసేపటికీ నిద్ర రాలేదు. ఎంత బాగుందీ ప్రపంచం! సృష్టిలో కంటికి కనిపిస్తున్న ప్రతి వస్తువు సజీవశక్తితో, నూత్నానందంతో వెలిగిపోతున్నట్లుంది. ఆఖరికి మంచం పక్కన కిటికీలోంచి లోపలికి వస్తున్న వెన్నెల కూడా అర్థంకాని ఏదో భాషలో పలుకరించాలని ప్రయత్నం చేస్తోంది.' అప్పటిదాకా చూడనన్నా చూడని వనితావిహార్‌ని జయంతి ఓ సినిమా సెట్‌లా ఊహిస్తుంది. వాస్తవంతో సంబంధం ఉన్నా లేకపోయినా, మెజారిటీ యువత మనసు అలాగే ఉంటుందన్న భావనావేదికని సులోచనారాణి అద్భుతంగా నిర్మించింది. ఆ వేదిక ఆధారంగా సాగిన జయంతికి, రాజశేఖరం కనిపించిన క్షణం జయంతుడో, కంతుడో కన్పించినట్టయి దేవతారూపం తన ముందు నిలిచినట్టు కలల్లోకి జారిపోవటంలో ఆశ్చర్యం ఏముంటుంది?

రాజశేఖరాన్ని నవలలో పరిచయం చేసిన తీరు, అతన్ని జయంతి మొదటి సారి చూసినప్పుడు, 'పొడుగ్గా, తెల్లగా బాగా నిలువెత్తు మనిషి, నిగనిగలాడుతున్న నల్లటి జుట్టుతో, తెల్లటి బట్టలు...' అలాగే మరో సందర్భంలో ఉక్కుకడ్డీల్లాంటి అతని

చేతుల మధ్య... లాంటి ప్రయోగాలు ఉన్నాయి. ఎక్కడా అతను రాజ కుమారుడనో, హంసలాంటి కారున్నవాడనో వర్ణనలేదు. కానీ సెక్రటరీ నవల నుంచి శ్రీమతి సులోచనా రాణి కథానాయకుడి రూపానికి పాఠకుల మదిలో నెలకొన్న రూపం, ఆరడుగుల ఆజానుబాహుడు, అందగాడు, ఠీవీ, హుందా, దర్పాల ప్రతిరూపం, పొడవాటి హంస లాంటి కారువాడు.

ఈ రకం కథానాయకుడి ద్వారా శ్రీమతి సులోచనారాణి ఎన్నో లక్షలమంది యువతుల ఆశల్ని, హృదయాల్ని ఆకట్టుకొంది. ఆ కథానాయకుడిలో వారికి జీవితం, సంతోషం, ఓదార్పు, అదృష్టం, అన్నింటినీ మించి జీవనభద్రత కనిపించాయి. జయంతి లాంటి అమ్మాయిలందరూ దిగువ మధ్యతరగతి పేదరికానికి బలైనవారే. కట్టుకోవ డానికి మంచి ఖరీదైన చీర ఉండదు. చిన్నచిన్న సరదాలు తీరాలన్నా ఆర్థికంగా సరైన ధైర్యం ఉండదు. అలా అని పై తరగతి ఖరీదైన జీవితం తెలియనివారూ కాదు. దాని పట్ల ఆసక్తి, ఆశలేని వారూ కాదు. వీరి ఈ పరిస్థితి స్వయంకృతంకాదు. సాంఘికంగా ఇదో పరిస్థితి. ఓ చిత్రమైన పరిస్థితి. వీరికి ఆత్మాభిమానం ఎక్కువ. అందంతోటేకాక, వారి ప్రవర్తనతో, వ్యక్తిత్వంతో చాలామంది వీరికి ఆకర్షితులవుతారు. మంచితనం వీరి స్వభావం. ప్రేమ వీరి తత్వం. దోషరహితంగా కనపడే వీరితో పరిస్థితులు చెలగాటం ఎటువంటి పాఠకుడికైనా ఆకర్షణ ఉంటుంది. అందునా కథానాయకుడు కూడా ఉదారుడు, మంచివాడు, ప్రేమ కలవాడు.

ఈ రకం పాత్రచిత్రణ, నైతికత శ్రీమతి సులోచనారాణి గట్టి బలం. అందుకే ఎందరికో సులోచనారాణి పాత్రలు ఏకీకృత భావనని కలిగించాయి. ఇంచుమించు పాత్రలు, తాము ఒకటే అన్న భావన గట్టిగా పట్టుకుంటుంది.

కథావస్తువు, ముగింపు, చెప్పబడిన నవలాసారం అంత తేలిగ్గా అందరి జీవితాల్లో సంభవించేవి కాకయినా, వాటికి పునాదిగా శ్రీమతి సులోచనారాణి చిత్రించే జీవితంలో జీవన వాస్తవికత ఉంది. ఆ వాస్తవికతే ఆవిడ్ని నవలారాణిని చేసింది.

“మధ్య మధ్య ఆగి చేతులు తుడుచుకుంటూ, సవాలక్ష తప్పులతో ఆ ఇంగ్లీషు లో రిపోర్టు చదవకపోతే, హాయిగా తెలుగులో చదవకూడదూ...”

“తనకి ఎవరూ లేరు. బామ్మకి తప్ప ఈ ప్రపంచంలో తను ఎవరికీ అక్క ర్లేదు...”

“ఏం మనుషులు, ఏం ఉద్యోగం! నిముష నిముషానికీ తానెంత అల్పురాలో గుర్తు చెయ్యబడుతోంది.”

“ఛీ! మనిషి మరీ భోగభాగ్యాలు పొందకపోతే మానె, కనీసం వేళకి తినటానికి తిండి కూడా లేకపోతే, దానికోసం బాధపడటం ఎంత భయంకరం?”

ఇలాంటి అనుభవాలు చాలామంది జీవితాల్లో ఇవే రకం భావనలు, ఉద్వేగాలు కలిగిస్తాయి.

అయితే నవలని మరో వంద పేజీలు పెంచే అవకాశం ఉన్నా శ్రీమతి సులోచనా రాణి ఆ పని చెయ్యలేదు. నవల చివరలో రాజశేఖరం ఉత్తరం ద్వారా చెప్పిందంతా, సంఘటనారూపంలో రాస్తే నవల పెరుగుతుంది. అలాగే జయంతికి, రాజశేఖరానికి ఉన్న బంధుత్వం విషయం. పై రెండూ నాటకీయతకి అవకాశం ఉన్నవే కానీ రచయిత్రి వాటిలోని నాటకీయతకి ప్రాముఖ్యం ఇవ్వలేదు.

ఒక స్థాయి జీవితంలో మెజారిటీ జనం పొందే అనుభవాలు, అనుభూతుల మీదే శ్రీమతి సులోచనారాణి మొగ్గు ఎక్కువ. కొన్ని జీవితాల్లో కొంచెం ఆనందం కలగ్గానే, వెంటనే ఏదో కలత తలెత్తుతుంది. ఈ నవలలో జయంతికి చాలాసార్లు ఇదే జరుగుతుంది. కానీ ఆ కలతలకి చాలావరకు సరైన ఆర్థికస్థోమత లేకపోవటం, పై అంతస్థు జీవితం కావాలన్న ఆరాటం ఆ వ్యక్తులు పడటం, దీన్ని సులోచనారాణి గారు ఆర్థిక అంశంగా చెప్పక జీవన వాస్తవంగా చెప్తారు.

ధైర్యం-అధైర్యం, ప్రేమ-కోపం, పేదరికం-సంపద, శాంతి-అశాంతి, ఆశ-నిరాశ, ఇలాంటి సహజాతాలని పాత్రలలోకి నిండుగా చూపించగల ప్రత్యేక నేర్పు ఆవిడ సొంతం. అందుకే అప్పటికీ, ఇప్పటికీ సెక్రటరీ అలాగే ఉంది.

*డిసెంబర్, 2007*



# గణపతి

## చిలకమర్తి లక్ష్మీనరసింహం

తెలుగులో హాస్య నవలల శాతం చాలా తక్కువ. అందులో అధిక్షేపాత్మక నవలలు మరీ తక్కువ. గతంలో ఎన్నోసార్లు ముద్రింపబడిన శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారి *గణపతి* నవలని 2007 జనవరిలో విశాలాంధ్ర ప్రచురణాలయం వారు తిరిగి ప్రచురించారు. చిలకమర్తివారు 26.9.1867 న జన్మించి, 17.6.1946న రాజమండ్రిలో మరణించారు. వారి కంటికి రేచీకటి దోషం ఉండటం వల్ల, అప్పటికి కంటివైద్యం ఇప్పుడున్నంతగా అభివృద్ధి చెందకపోవడం వల్ల, ఆయన రేచీకటి 1911 నాటికి పూర్తి గుడ్డిగా పరిణమించింది. అంటే *గణపతి* నవలకి రమారమి వందేళ్ళ చరిత్ర ఉందని అర్థం చేసుకోవచ్చు.

*గణపతి* నవలలో మూడుతరాల వివరణ ఉంది. ఇంచుమించు ఏడు తరాల ప్రసక్తి ఉంది. ఇప్పటి తూర్పు గోదావరి జిల్లాలో శనీశ్వర క్షేత్రంగా ప్రఖ్యాతి వహించిన మందపల్లి కథాస్థలం. మందపల్లి నుంచి అటు అమలా పురం, ఇటు కాకినాడ వరకూ కథాప్రయాణం సాగించారు చిలకమర్తివారు. అలాగే అప్పటి బ్రాహ్మలకి సంపాదన మెరుగ్గా ఉంటుం దని పూనా, సతారాలకి వలస వెళ్ళటం *గణపతి* నవలలో ఉన్నాయి.

ఇంచుమించు తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలో చిలకమర్తివారు రచనలు చేశారు. ఆ కాలంలో చారిత్రక నవలలకు చిలకమర్తివారు పెట్టింది పేరు. శతకాలు, కథలు, ప్రహసనాలు, జీవితచరిత్రలు, స్వీయచరిత్ర, పాఠ్యగ్రంథాలు, నాటకాలు, నవలలూ... ఇలా అన్ని ప్రక్రియలకీ ఆయన రచనా వ్యాసంగం విస్తరించింది. అంతేకాక చిలకమర్తివారిది ఒక ప్రత్యేక పద్ధతి. ఎన్నో సన్మానాలు, సత్కారాలు పొందారు. సరస్వతి, మనోరమ మాసపత్రికలు, దేశమాత వారపత్రిక నడిపారు. ఆయన *గయోపాఖ్యానం* **(1890)** నాటకం, అందులోని పద్యాలు పొందిన ప్రశస్తి, ప్రాముఖ్యం ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. తెలుగునాట ఆనాటి నాటకాల గురించి ఇప్పటికీ చెప్పుకోవాల్సిన *కన్యాశుల్కం, పాండవోద్యోగ విజయాలు, వరవిక్రయం* శ్రేణిలో *గయోపాఖ్యానాన్ని* చెప్పుకోవాలి.

*భరతఖండంబు చక్కని పాడియావు*
*హిందువులు లేగదూడలై యేడ్చుచుండ*
*తెల్లవారను గడుసరి గొల్లవారు*
*పితుకుచున్నారు మూతులు బిగియగట్టి*

-బిపిన్ చంద్రపాల్ ఆంగ్లేయుల దౌర్జన్యాలనూ, కుటిల రాజనీతిజ్ఞతనూ, భారతీయులను గురిచేస్తున్న దోపిడీ విధానాలనూ తీవ్రంగా దుయ్యబడుతూ, రాజమహేంద్రవరంలో ఐదు రోజులపాటు ఇచ్చిన ఉపన్యాస సారాంశానికి చిలకమర్తి వారు ఇచ్చిన పద్యరూపమే ఇది. భారతీయతను పుణికి పుచ్చుకొంటూ ఆంగ్ల పాలకులపై నిప్పులురిమిన కలం ఆయనది. *భరతఖండంబె యొక గొప్ప బందిఖాన* అంటూ నాటి దేశ పరిస్థితులకెత్తిన వాస్తవికతా పతాక ఆయన గళం.

సాంఘిక పరిస్థితులే ఆయన రచనలకి నేపథ్యం. దురాచారాలని ప్రతిఘటించటమే చిలకమర్తివారి కార్యాచరణ. అభ్యుదయవాదం, దురాచార ఖండన, మూఢాచారాల వ్యతిరేకత ఆయన రచనలలో, మాటలలో వెలిబుచ్చినా, ఆయన చివరివరకూ గ్రాంథిక రచనకే కట్టుబడి ఉండటం ఓ వైరుధ్యం.

*గణపతి* నవలని లోతుగా చూస్తే, అంత తీవ్ర అభ్యంతర విషయం కాకపోయినా, కొన్నిచోట్ల ఈ వైరుధ్య లక్షణాలు కనబడ తాయి. గ్రామ వర్ణనలు, అప్పటి అక్కడి సాంఘిక పరిస్థితులు విపులం గా, స్పష్టంగా సహజత్వంతో వివరించిన చిలకమర్తివారు తాను మూడుతరాలకి ప్రతినిధులుగా ఎన్నుకొన్న పాపయ్య, గంగాధరం, గణపతుల గురించి గ్రామవాసులు అవలంబించిన ఉదాసీనవైఖరికి, గణపతి కుటుంబం వారిని వారు అంత ఓపిగ్గా భరించటానికి గల కారణాలను అంత విపులంగా, స్పష్టంగా చెప్పలేదు. అలాగే గణపతి ఉపాధ్యాయ అవతారం, అన్ని అవకతవకలు చేసినా, క్రూరంగా ప్రవర్తించినా గ్రామస్థులు భరించటం అంత లోతుగా చర్చించలేదు. పోతే

ఈ అంశాలని గట్టిగా పట్టించుకొనే ఆస్కారం లేకపోవటానికి *గణపతి* హాస్యరస ప్రధాన నవల. అధిక్షేపణాత్మకత కలది. అందువల్ల అతిశయోక్తులు, ఉత్ప్రేక్షలు, కప్పదాట్లు ఉండటం సహజం. సహజ త్వానికి, సాంఘిక సమస్యల విశ్లేషణకీ దన్నుగా నిలిచే చిలకమర్తి వారిలో ఒకింత వైవిధ్య లక్షణం ఉందని గుర్తింపు కోసమే ఈ అంశం. భావ విషయంలో ఆయన చూపించిన అభ్యుదయం, భాష విషయం లోనూ, నూతన కవిత్వ ప్రయోగాత్మక పట్ల చూపించలేదన్నదీ తెలిసున్న విషయమే.

*గణపతి* నవల విషయంగా ముందుగా చెప్పుకోవాల్సిలంది ఆ నవల ప్రశస్తి. తెలుగులో హాస్య నవల అనగానే *గణపతి* పేరు చెప్పనివారు అరుదు. అలాగే అధిక్షేపణ విషయానికొస్తే, కీ॥శే॥ విశ్వనాథ సత్యనారాయణగారి విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు కన్నా ముందుగా గుర్తొచ్చేది *గణపతి* నవలే.

*గణపతి* నవల ముఖ్యంగా బ్రాహ్మణ్యంతోటి, బ్రాహ్మణ జీవనరీతి తోటి ముడిపడిన నవల. ఈ నవల ఎత్తుగడ, ముగింపులలో ప్రత్యేకత ఉంది. విఘ్నేశ్వర స్తుతితో ఇంచుమించు పూర్వ కావ్యాలన్నీ ఆరంభమవుతాయి. అదే విధంగా ఈ నవల *గణపతి* స్తుతితోనే ఆరంభమవుతుంది. కానీ ఎంతో లౌక్యంగా, చమత్కారంగా, శుక్లాంబరధరం విష్ణుం... అన్న అత్యంత ప్రశస్థమైన విఘ్నేశ్వర దేవతాపరమైన స్తుతి శ్లోకానికి విపరీతార్థాన్ని చెప్పి, దాన్ని గణపతి పాత్రకి అన్వయించి, కథానాయకుడి పాత్రని పరిచయం చేస్తారు చిలకమర్తివారు. ఈ ఎత్తుగడలో చమత్కారం, అధిక్షేపణలతో పాటు, వాదనాపటిమ, సంప్రదాయ నిరసనా కూడా కనబడతాయి. చిలకమర్తి వారు దేన్ని అధిక్షేపించినా, దానికి వారు ఎన్నుకొన్న ఉపకరణాలు అంతకన్నా సంప్రదాయబద్ధమైనవి. అదే ఆయన పట్టు. అదే ఆయన లౌక్యం. శ్లోకంలోని చతుర్భుజం అన్న పదానికి గాడిద కాళ్ళు, అవే భుజాలు అని సమర్థించి... నిరంకుశః కవయః అన్న ఆర్యోక్తితో తప్పించుకొంటారు.

కథాపరంగా చూస్తే *గణపతి* నవలలో పెద్దగా కథ లేదు. ముఖ్యమైన మూడు పాత్రలున్నాయి. ఆ పాత్రల జీవితాన్ని వివరించటానికి సహకరించే ఉపపాత్రలు, స్థలా వివరాలు ఉన్నాయి. ప్రధాన పాత్ర గణపతి.

గణపతి అనాకారి. పెద్ద పొట్ట, వికృత రూపం, మరుగుజ్జు. అన్ని అవలక్షణాల ప్రతిరూపం గణపతి. మూర్ఖత్వానికి, మొరటుతనానికి నిర్వచనం. అతి తెలివితేటలు, అలసత్వం అతని ప్రత్యేకతలు. జిడ్డుతనానికి, మొద్దుతనానికి గణపతినే చెప్పుకోవాలి. ఇటువంటి కథానాయక పాత్రతో హాస్య నవలగా *గణపతి*ని తీర్చిదిద్దారు చిలకమర్తి వారు. గణపతికి ముందు ఆ వంశంలోని ఏడుతరాల ప్రసక్తి ఉన్నా, రచయిత ముఖ్యంగా మూడుతరాల కథని చెప్పటం జరిగింది.

గణపతి తాత పాపయ్య. మందపల్లి నివాసి. తద్దినాలకి, తదితర తంతులకి భోక్తగా వెళ్ళటం అతని వృత్తి. చిల్లర దొంగతనాలు ప్రవృత్తి. తిండి పుష్టి, యావ ఎక్కువ. తల్లి బ్రతికుండగా వివాహం కాలేదు. ఆమె మరణానంతరం సంపాదన కోసం, పెళ్ళి కోసం, తన వృత్తి బహుధా బావుంటుందని తలచి పూనాకి వెడతాడు. ఆంధ్ర ప్రాంతపు బ్రాహ్మల సంస్కృత ఉచ్చారణకి పూనాలో గౌరవం ఉంది. అందువల్ల ఇలా వలస వచ్చినవారికి సంభావనలు బాగానే ముట్టేవి. బ్రాహ్మణార్థం వల్ల సంపాదన బాగానే ఉన్నా, పాపయ్య సొమ్ము జాగ్రత్త చేసి వివాహం చేసుకోవాలన్న కోరిక తీరలేదు. దానికి కారణం అతని చిరుతిళ్ళ ఖర్చు. సంపాదన పెంచుకోవాలన్న పాపయ్య కక్కుర్తి ఏ స్థాయికి చేరిందంటే, బ్రాహ్మణార్థం కంటే శవాలని మోయటంలో సంపాదన ఎక్కువని ఆ వృత్తికి దిగాడు. అలా దిగజారి బాగా సంపాదించినా, పాపయ్యని దుర్వ్యసనాలు పట్టుకొని పాడుచేశాయి. చివరికి పాపయ్య అరవయ్యో ఏట పన్నెండేళ్ళ పిల్లతో వివాహమైంది. అప్పుడే పాపయ్య తిరిగి మందపల్లి వచ్చి కాపరం ఆరంభించాడు. పాపయ్య కొడుకు గంగాధరం.

గంగాధరం చిన్న వయసులోనే అతని తండ్రి పాపయ్య మరణించాడు. గంగాధరం తల్లి పిచ్చమ్మ మందపల్లిలో ఇల్లమ్మి అప్పటికీ ఈతి బాధలు తీరక ప్రక్కనే ఉన్న యేనుగుల మహలు గ్రామానికి మకాం మార్చింది. గంగాధరుడికి ఉపనయనం అయ్యాక, మాధూకరం, యాయవారం, బ్రాహ్మణార్థాలతో కుటుంబం గడుపుతూ వచ్చాడు. ఇతనికున్న అవకరం, బ్రాహ్మలు సాధారణంగా తినని తరవాణీ అన్నం, పచ్చి ఉల్లిపాయ అమిత ఇష్టంగా తినటం. ఇతని ఈ తిండి అలవాటు పదిమందికీ తెలిసి, అతని వృత్తిలోనే ఇబ్బందులు వచ్చినా గంగాధరం లెక్క చెయ్యలేదు. కానీ పరిస్థితులు అనుకూలించక చివరికి తల్లితో కలిసి తన మకాం కాకినాడకి మార్చాడు. అక్కడ అతనికి ఒక కొత్త వృత్తి దొరికింది. అందరిళ్ళకీ కావడితో నీళ్ళు మోయటం. సంపాదనతో పాటు అతనికి జూదం, స్త్రీలలోత్వం అబ్బాయి. శనిదానాలు పట్టటం, నీచకార్యాలకి సిద్ధపడటం వరకూ అతని బ్రతుకు దిగజారింది. ఎన్నో అరిష్టాలు గడిచి, చివరికి అతనికీ వివాహం జరిగింది. సింగమ్మకు పదమూడవ ఏట, గంగాధరం 53వ ఏట సంసారం మళ్ళీ మందపల్లిలో ఆరంభమైంది. వారి పుత్రుడే గణపతి.

గణపతికి తండ్రి తాతల తిండి పిచ్చి, అనాకారిత్వంతో పాటు మరిన్ని అవలక్షణాలూ ఉన్నాయి. గణపతికీ చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. తల్లి సింగమ్మ గణపతితో అన్నగారింట చేరింది.

మేనమామ ఇంటి పంచన, తల్లి గారాబం నీడన గణపతి చిన్నతనం నుంచీ చెయ్యని వెధవ పని లేదు. ఊరంతా అల్లరి. దొంగతనాలు, చుట్టలు కాల్చే వ్యసనం.

పెద్దయ్యాక అతనిలో మార్పులేదు సరికదా, అతని వికృత చేష్టలకు అంతే లేదు. అతనికి అంతగా చదువు రాలేదు. పైగా వితండవాదం, విచిత్రమైన కోరికలు. గుర్ర మెక్కి తిరగాలన్న సరదా ఏదో రకంగా తీరినా గణపతి సంతృప్తి చెందలేదు. గుర్రమెక్కి నిరంతరం తిరిగే అవకాశం లేదు కాబట్టి, ఆ స్థానే గాడిదనెక్కి తిరగాలని నిర్ణయించు కొంటాడు.

ఎక్కి తిరగటానికి గుర్రానికి, గాడిదకి పెద్ద తేడా లేదని, గాడిదే మరింత మేలన్న చిత్రమైన వాదనతో తన పనులని సమర్థించుకొంటాడు. వసుదేవుడు ఆపదలో గాడిద కాళ్ళు పట్టుకొన్నాడు గానీ, గుర్రం కాళ్ళు పట్టుకోలేదని, అందువల్ల గాడిదే గుర్రం కన్నా గొప్ప అని వాదిస్తాడు. అతని గాడిద సవారీ ఓ ప్రహసనం. ఇలాగే అతని జీవితమంతా మొండితనం, మూర్ఖత్వం, అతి తెలివితేటల విచిత్ర సమ్మేళనం. గణపతి జీవనయానంలో రకరకాల అవతారాలున్నాయి. తండ్రి, తల్లి చచ్చిపోయారని వారి దహనకార్యాలకి డబ్బు కావాలని అడుక్కోవటం, తద్దిన భోక్తగా కొన్నాళ్ళు, నాటకాలలో వేషాలు, వంట బ్రాహ్మడిగా కుదరటం... ఇలా ఎన్ని చేసినా, నిలకడ అతని స్వభావం కాదు. తప్పుడు దారి తొక్కందే అతని మనసు నిలవదు. అతని అన్ని అవతారాల్లోకి కొంచెం గౌరవమైంది మాస్టారి అవతారం. అప్పుడు కూడా అతని అకృత్యాలకి అంతులేదు. చింత బరికెలతో పిల్లల్ని బాది, భయపెట్టి నోరు మూయిం చటమే అతను చెప్పే చదువు. భయానికి దెబ్బలు తప్పించుకోవటానికి పిల్లలు లంచాలు తెచ్చి ఇవ్వటం, వాటి కోసం వారు అక్కడా ఇక్కడా దొంగతనాలు చెయ్యటం అతని చదువు మిగిల్చిన ఫలితం.

ఇటువంటి గణపతికి పెళ్ళి చేయాలన్నది అతని తల్లి కోరిక. ఎన్ని అడ్డదారులు దొక్కినా ఫలితం దక్కలేదు. చివరికి గణపతి తల్లిని బండబూతులు తిట్టటమే కాక, చావ చితకతన్నే స్థితికి చేరటం పరాకాష్ఠ.

గణపతి పెళ్ళి కూడా ఈ నవలలో ఓ ప్రహసనం. చివరికి చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు, గణపతి పెళ్ళి నేరం నుంచి పారిపోయి ఇప్పటివరకూ కనిపించక పోవటం ముగింపు.

పాపయ్య కన్నా గంగాధరం అవలక్షణాలు ఎక్కువ. వారిద్దరికన్నా గణపతి అవలక్షణాలు మరింత ఎక్కువ. బ్రాహ్మణ జీవితంలోని ఓ వర్గం, ముఖ్యంగా సంపా దనావకాశాలు క్షీణిస్తున్న వర్గంలో దిగజారుడుతనాన్ని చిలకమర్తివారు గణపతి నవలలో చూపించారు. శుచికి, పద్ధతికి, సత్కర్మలకి, మంచి అలవాట్లకి, ఆహార నియమాలకి పేరొందిన బ్రాహ్మణ జీవన విధానంలో చొరబడిన అలసత్వం, తిండి యావ, దుర్ల క్షణాలన్నింటినీ ఎద్దేవా చెయ్యటానికే ఈ మూడు పాత్రలనీ ఇలా తీర్చిదిద్దటం జరి

గిందనిపిస్తుంది. అటువంటి జీవన విధానం అంతిమ ఫలితం అన్ని రకాలుగా తుడిచి పెట్టుకుపోవటమే అన్నట్టు గణపతి నిష్క్రమణ ద్వారా చూపించటం జరిగింది.

హాస్యదృష్టి, అధిక్షేపణలతో పాటు ఈ నవలలో చిలకమర్తివారు తమకి నచ్చని అంశాలని పరోక్షంగా ఎత్తి చూపటం కనిపిస్తుంది. అలాగే నచ్చిన అంశాలని చెప్పటమూ కనిపిస్తుంది.

రెండవ ప్రకరణం ఆరంభంలో, "ఆహాహా! మన దేశమునందు జీవన చరిత్రములు లేని లోపమిప్పుడు కనబడుచున్నది." ఇప్పటికీ మనకి సరైన జీవిత రచనలు (బయోగ్రఫీ) లేని కొరత ఉంది. ఎందరెందరో మహానుభావుల చరిత్రలు కాలగర్భంలో కలిసిపోయాయి. అప్పటి రచనా విధానంలోని భావుకత్వాన్ని ఉద్దేశించి, వెన్నెలలు చందమామాలు, తామరపువ్వులు, కలువపువ్వులు, హంసలు లాంటి అతిశయోక్తులతో రచనా కాలక్షేపం చేస్తున్నారన్న విసురు ఉంది.

"హిందూదేశమున అనేక భాషలున్నను, నందులో ననేకములు సంస్కృతములే మాతృకత గ్రహియించినను నాంధ్రభాష వలె నవి సర్వ విషయముల సంస్కృతము ననుకరింపలేకపోయినవి. అక్షరమాల దగ్గర నుండి తెలుగు భాష సంస్కృత శబ్దములను స్వచ్ఛముగ నిర్దుష్టముగ నుచ్చరించగలరు."

ఇలా పలుచోట్ల సాహిత్య, భాషా, సాంఘిక విషయాల పట్ల తన నిక్కచ్చి అభిప్రాయాలను చిలకమర్తివారు తెలియజేశారు.

*గణపతి* నవలగా ఎంత ప్రశస్తి పొందిందో, ఆకాశవాణి విజయవాడ కేంద్రం ద్వారా శబ్ద నాటకంగా ఎన్నోసార్లు ప్రసారమై అంతకుమించిన ప్రాచుర్యం పొందింది. శ్రీరఘురామ చారుతులసీదళధామ... అన్న పద్యానికి గణపతి చారు, చారులో తులసీ దళాలు అని ఇచ్చిన వివరణ రేడియోలో విన్నప్పుడు శ్రోతలు కడుపు పగిలేలా నవ్వేవారు.

ఇప్పటి కాలానికి గ్రాంథికభాష, *గణపతి* నవల అంతగా ఆసక్తి కలిగించక పోయినా, అప్పటి జీవితాన్ని, ఆయా ప్రాంతాల విశేషాల్ని తెలుసుకోటానికైనా *గణపతి* తప్పక చదవదగ్గ నవల.

'వ్యాధి, మనోవ్యాధి, భయము పీడించేటప్పుడు మనుష్యులకి సాధారణంగా నిద్దుర పట్టదు,' లాంటి జీవిత సత్యాలెన్నో ఉన్నాయి గణపతిలో.

*జనవరి, 2008*




# అంటరాని వసంతం

## జి. కళ్యాణరావు

**జా**తి, కుల, వర్ణ వివక్షతలు ప్రపంచవ్యాప్తంగా ఎన్ని దారుణాలకి, ఎన్ని అమానుషాలకి దారితీశాయో చరిత్ర సాక్షీభూతం చేసింది. ఓ మనిషి మరో మనిషిని బానిసగా మార్చి, పశువు కన్నా హీనంగా హింసించి ఎన్నో దశాబ్దాలు కిరాతకాలకి పాల్పడిన సంగతి తెలుసు. జాత్యహంకారంతో లక్షలకొద్దీ జనాన్ని హతమార్చిన సంఘటనలు తెలుసు. వర్ణవివక్ష కారణంగా మానవత్వాన్ని మరిచిపోయిన సంఘటనలూ తెలుసు. అలాగే కుల ప్రాతిపదిక మీద ఓ వర్గం ఎదుర్కొన్న అనేకరకాల ఆక్రోశాల, బాధల, అన్యాయాల, తిరుగుబాటు వివరణల చిత్రం *అంటరాని వసంతం.*

*అంటరాని వసంతం* పడికట్టు నవల కాదు. రాసిన విధానం కూడా సామాన్యంగా నవలా పాఠకులకి పరిచయం ఉన్నది కాదు. ఎత్తుగడ, నడక, ముగింపులలో విలక్షణత ఉన్న నవల.

రూతు జ్ఞాపకంగా, రూబేను జీవితంగా ఆరంభమైన అంటరాని వసంతం నవల, తరతరాలని తడుముతుంది. సిన సుబ్బడు, ఎల్లన్న, ఎర్రెంకడు, మరో ఎల్లన్న, శివయ్య, రూబేను, ఇమ్మానుయేలు, జెస్సీ... ఇలా ఎందరెందరి జీవితాలనో కలుపుకు సాగిన ప్రవాహం అంటరాని వసంతం. ఈ ప్రవాహ వేగంలో కొన్ని మలుపులు, కొన్ని సుడిగుండాలు,

కొన్ని వేగచ్ఛాయలు పదేపదే కనిపిస్తాయి. స్వల్ప బేధంతో అవన్నీ ఒకటే అనిపిస్తూ, పునరుక్తి అనిపిస్తాయి. అంటరాని వసంతం ఒద్దికగా పేర్చిన పేర్పు కాదు. ఒక ఆవేశం, ఒక ఆక్రోశం, తరతరాల బాధ కలగలిసిన ప్రవాహం. ఈ ప్రవాహపు మూలజలం వివక్ష. తనూ మనిషినని మరిచిపోయి ఒకరు మరొకర్ని పెట్టిన హింస.

అంటరాని వసంతం ప్రత్యేకత పేరులోనే ఉంది. ప్రకృతిలోని వసంతం న్యాయానికి అందరిదీ. దాన్ని చూసి, అనుభవించి, పలకరించి, పరవశించే హక్కు అందరికీ ఉంది. అందరికీ అందుబాటులో ఉండేది ఆ వసంతం. కానీ ఈ అంటరాని వసంతం దృక్కోణం వేరు. అదే ఈ నవల ప్రత్యేకత. భౌతికస్థాయిని దాటిన ప్రత్యేకత ఇక్కడే ఉంది. జీవితం కళ. జీవితం పడే బాధ కళకు, కళాకరుడికీ కూడా తప్పదు.

జీవన అవసరాలకే నిత్యం యాతనపడే నిమ్నవర్గాలవారికి, కళ పట్ల ఆసక్తి, అభినివేశం ఉండటమే అబ్బురం. అటువంటిది దానికోసం ప్రాణాలనైనా లెక్క చెయ్యక పోవటం మరీ అద్భుతం. అంటరాని వసంతం నవలలో ప్రధానంగా ఈ అంశం కదులుతూ వారి జీవన నేపథ్యాన్ని ఆవిష్కరించింది. ఏడెనిమిది తరాల జీవితాన్ని చెప్పినా, వారి జీవనంతో పాటు ఈ అంశాన్ని జమిలిగా ముడిపెట్టడం జరిగింది. గంగ జాతర, ఉరుముల నృత్యం, పాటల అల్లిక, మాలాడిదిబ్బ చరిత్రకి అంటరాని వసంతంలో ప్రత్యేక స్థానం ఉంది.

రూబేనుతో కథ మొదలైనా, అంటరాని వసంతం నవల మొదటి భాగంలో సింహభాగం, రూబేను తాత ఎల్లన్న జీవితానిది. ఎల్లన్నది వెన్నెలదిన్నె. అతని తండ్రి ఎర్రెంకడు, తల్లి లింగాలు, అత్త భూదేవి. చిన్నతనంలోనే ఎల్లన్నకి పాట అన్నా, ఆట అన్నా మక్కువ. పాటని అల్లే నేర్పు చిన్నతనంలోనే సహజంగా అబ్బింది. ఎర్రగొల్లల నాటకం చూసినప్పుడే అత్త మీద వరసలు అల్లాడు. ఎర్రగొల్లలు వివక్షతతో చితక బాదినప్పుడు భయంతో పారిపోయి, పక్కలదిన్నెలో ఉరుముల నాట్యం చూసినప్పుడు ఎల్లన్నలో కళావేశం పెల్లుబికింది. ఉరుముల నాట్యానికి నాగన్న పెట్టింది పేరు. నాగన్నది కూడా ఎన్నెలదిన్నే. ఒకే ఊరు, ఒకే వర్గం, ఒకే ఉత్సాహం. నాగన్న ఎల్లన్నని తీర్చిదిద్దాడు. అతని గురువు ఉరుముల చంద్రప్ప ద్వారా అబ్బిన జీవనసారాన్నంతా అందించాడు.

కాలం ఎల్లన్నని పాట ఎల్లడు, ఆట ఎల్లడుగా వాళ్ళ వాళ్ళందరిలో ప్రసిద్ధుణ్ణి చేసింది. అతనికి సుభద్రతో వివాహం జరిగింది. శివయ్య పుట్టాడు. అయినా ఎల్లన్న స్థిరంగా నిలవలేదు. జీవితం అతన్ని స్థిరంగా నిలవనివ్వలేదు. పాటలు అల్లాడు. గొంతెత్తి పాడాడు. ఊళ్ళెన్నో తిరిగాడు. అతని పాటలు శశిరేఖ ద్వారా, సుభద్రకి చేరాయి. అవసానదశలో ఎల్లన్న కొడుకు చేతుల మీద ఇంటి కొచ్చాడు. ఎల్లన్నతోటే సుభద్ర బతుకు అంతమైపోయింది. శివన్న, శశిరేఖ కరువు దెబ్బతో వలస వెళ్ళారు. నానా బాధలు పడ్డారు. అక్కడా కులవివక్షతే. ఆ బాధ నుంచి విముక్తిగా శివయ్య

సిమోనుగా క్రిస్టియన్‌గా మారాడు. సిమోను కొడుకే రూబేను. రూబేను బోధకుడయ్యాడు. ఆ రూబేనునే రూతు అందమైన అంటరానివాడా అని పిలిచేది. వాళ్ళ మనవడు ఇమ్మాను యేలు. ఆ తర్వాత జెస్సీ... ఇలా *అంటరాని వసంతం* తరతరాల కథ. ఎన్నో వందల జీవితాల కథ.

జ్ఞాపకంగా ఆరంభమై, కవిత్వంలా, ఊహలా, వెన్నెల దృశ్యంలా, వెన్నెలపిట్ట ధ్వనిలా సాగిన రచనలో భావుకత, పొయెటిక్ ఎక్స్‌ప్రెషన్ చాలా సాంద్రంగా ఉన్నాయి. కథగా సాగిన వివరాల దగ్గర క్లుప్తత, కొన్నిచోట్ల మరీ వివరణ తక్కువగా ఉన్నట్టనిపిస్తుంది. దీనివల్ల కాబోలు *అంటరాని వసంతం* More A Song, Than A Story అనిపిస్తుంది.

కథావస్తువులో, ఎంచుకొన్న జీవితాల్లో, సంఘటనల్లో, వ్యక్తీకరణలో కేంద్రీకరణ ఉంది.

కొన్నిచోట్ల వ్యక్తి, విషయ వివరణలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. 'లింగాలు అట్టాంటి ఇట్టాంటి మనిషి కాదు. నిలబడితే చూరుకప్పు దాటేట్టు ఉంది. వాకిలి ఎత్తు లేపాలి.' 'మేనల్లుడు తన ముక్కు కొలుచుకు పుట్టాడు. ఆ చిన్న చేతివేళ్ళలో తన ముక్కు కొలుచుకొంది.'

అగ్రకులాల వాళ్ళే కాదు, ఊరూరు తిరిగి నాటకం ఆడే ఎర్రగొల్లలు మూకుమ్మడిగా పసివాడు ఎల్లన్నని తాటిమట్టతో బాదటం, ఆ పిల్లాడికి అంతవరకు అనుభవంలోకి రాని ఆ వివక్ష, వాడు పారిపోవటం... ఏటికి అడ్డం పడటం... కళ్ళముందు కదిలే భయానక దృశ్యం.

అలాగే అంటరానితనం గురించి చెప్పిన మరో సందర్భం.

*"... అతను రెండు నేరాలు చేశాడు. చేతిలో బైబిల్ ఉంది. కాళ్ళకు చెప్పులున్నాయి. ఊరిలో నడుస్తున్నాడు. ఊరిలో అంటరానివాడు నడవకూడదు. నడిచే అవకాశమే వస్తే చెప్పులు వేసుకోరాదు. తలపై గుడ్డ ఉండరాదు. చేతిలో గొడుగు ఉండకూడదు. దించిన తల ఎత్తకూడదు. పొరపాటున పక్కకి చూడకూడదు. ఆ సందర్భాలలో అగ్రకుల స్త్రీ బయటకు వస్తే ఆమె వాడి మొహం చూస్తే వీడు చచ్చినట్టే. అందుకే కొన్ని ఊళ్ళలో అదోరకం శబ్దం చేస్తూ నడవాలి. అట్టా శబ్దం చేస్తే కులస్త్రీలు బయటకు రారు. శబ్దం చేసినా నాలుగు వీధులు వినేలా చేయాలి. ఎక్కడో దొడ్లో పనుల్లో ఉండే కులస్త్రీ ఆ శబ్దం వినకపోతే, బయటకొస్తే ఆ తప్పు ఆమెది కాదు. శబ్దం చేసినా వాడి తప్పే అవుతుంది."*

పదిమంది మధ్య ఒకర్ని తక్కువగా చూస్తేనే చిన్నతనం, అవమానం. అలాంటిది బహిరంగంగా, ఓ పద్ధతిలో, ఓ నియమంలా అదే వాళ్ళ తలరాత, మారే అవకాశం లేదు అన్నట్టు సాగిన అణచివేత, వేదన అమానుషం. ఈ అమానుషచరిత్రని అంటరాని

వసంతం వివరిస్తుంది. మౌలికమైన ప్రశ్నల్ని ఎదుట నిలుపుతుంది. సాంఘికంగా, చారిత్రకంగా పదిమంది దృష్టికి రాని అంశాల్ని ఎత్తి చూపుతుంది. మాలమాదిగల జీవితాల్లోని సూక్ష్మాల్ని తెలుపుతుంది.

*"ఎట్టి మాలకి, మాదిగకి కొలిచే చాటలు కాపులింట గొడ్ల కొట్టాం చూరుల్లో వేరుగా ఉండేవి. మామూలుగా వాడుకొనే చాటల్లో సగం ఉండేవి. ఆ అలవాటే కూలిగింజలు రోజులకి పిచ్చుమానికలయ్యాయి. యాడాదిలో అట్టా వచ్చిన గింజ ఎన్ని రోజుల గ్రాసం. మాలామాదిగలు ఇవన్నీ ఎప్పుడూ లెక్కలు కట్టుకోలేదు. మేడి కింద మెడపట్టిన ఎద్దు ఎన్ని ఎకరాలు దున్నింది లెక్కట్టుకుందా ఎప్పుడన్నా. ఎన్ని గంటలు దాని మెడ మీద కాడె అట్టాగే ఉంది గుర్తెట్టుకుందా! పొదుగు పొంగి పాలిచ్చిన గేదె ఈరోజు ఇన్ని చెంబుల పాలిచ్చానని లెక్కేసుకొన్న పాపాన పోయిందా ఏ రోజైనా. బిడ్డ పరిగెత్తుకొచ్చి పొదుగు తాకితే తాగేది తన బిడ్డే కదా అని పాలన్నీ పొదుగులోకి తెచ్చుకొంటే, రొమ్ము సీకే పాలపళ్ళకు బదులు చేతివేళ్ళు అతి లాఘవంగా పాలను లాగుతుంటే కోపమొచ్చి జాడిచ్చి కాలితో తన్నిందా ఎప్పుడన్నా. వాటెడు గడ్డీ, తొట్టెడు కుడితీ చాలనే కదూ అనుకొంది."*

కరువుకాలంలో వీళ్ళు అనుభవించిన నరకం అంతా ఇంతా కాదు. ఉన్న చోటు నుంచి పారిపోవాల్సి వచ్చింది. కళ్ళెదురుగా ఎందరివో ఆకలి చావులు నిస్సహాయంగా చూడాల్సి వచ్చింది. నిర్లిప్తంగా తమ వాళ్ళనెందరినో గోతులు తవ్వి పూడ్చాల్సి వచ్చింది. పదివేల యుద్ధాలంత ఆ బీభత్సాన్ని అంటరాని వసంతం కొద్ది పేజీలలో మన ముందుంచింది. వలస జీవితంలో తప్పనిసరి పరిస్థితులెన్నో. కొత్తగా క్రైస్తవ మతం. మతం అవసరం మనిషికి ఏ రకంగా ఉందో తెలిపే సంఘటన...

*"మార్టిన్‌లు, శివయ్యలు అంటరానితనం పోగొట్టుకోవటానికి క్రీస్తును నమ్మారు. ఆకలి తీర్చుకోవటానికి నమ్మారు. అన్నింటి కన్నా ముందు మనుషుల వేట నుంచి తమని తాము రక్షించుకోవటానికి క్రీస్తుని నమ్మారు. చిన్నోడు మార్టిన్ అయినా, శివయ్య సీమోను అయినా అందుకే చేశారు."*

అదే మతాన్ని స్వార్థానికి వాడుకొన్న వాళ్ళ గురించీ వివరణ ఉంది.

కొన్ని తరాల మాలమాదిగల జీవితాల్లోని చీకటి కోణాల్ని తెలుసుకోవటానికి, అమానుష పరిస్థితుల్ని ఎదిరించిన వారి ధైర్యాన్ని, పోరాటాన్ని అర్థం చేసుకోవటానికి *అంటరాని వసంతం* మౌలికంగా తోడ్పడుతుంది.

*అంటరాని వసంతం* ఓ ప్రస్థానం... ఓ ప్రయాణం...

'తలెత్తుకు తిరగటానికి మడిచెక్క కావాలి,' అని మార్టిన్ అంటాడు . భూ అవసరం ఎంత కీలకమో ఇక్కడ సూక్ష్మంగా తెలుపుతుంది *అంటరాని వసంతం*.

*ఫిబ్రవరి, 2008*




# కొలిమంటుకున్నది

## అల్లం రాజయ్య

అవి తెలంగాణ ప్రాంతంలో, మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణ కొలిమంటుకున్న రోజులు.

విప్లవ కమ్యూనిస్టుల సారధ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉధృతంగా పోరాటం సాగుతున్న రోజులు. బెంగాల్‌లోని నక్సల్బరీ తరువాత, శ్రీకాకుళం తరువాత, తెలంగాణలో ఆ నిప్పురవ్వ రాజుకుంది. అప్పటి దాకా తమ పెత్తందారీతనాన్ని సాగించిన దొరలంతా ఉద్యమధాటికి తట్టుకోలేక పట్టణదారులు పట్టారు. వారి పొలాలన్నీ రైతులు దున్నుకోవటం మొదలుపెట్టారు. ఇది నాణానికి ఒకవైపు. మరోవైపు ఈ ఉద్యమాన్ని అణచడానికి ప్రభుత్వం తన శాయశక్తులా నిషేధాలను, నిర్బంధాలను ప్రయోగించింది. వందలమందిని అరెస్టు చేసింది. డజన్లకొద్దీ హతులయ్యారు.

**1971**లో ఆంధ్రదేశంలో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. మహాకవి శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, కె.వి. రమణారెడ్డి వంటి మహామహులంతా ఆ సంఘానికి నాయకత్వం వహించారు. ఆ ఊపులో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల నుంచి అనేకమంది కవులు,

రచయితలు ముందుకొచ్చారు. వాటిలో సింహభాగం కవిత్వానిదే అయినా కథ, నవలా ప్రక్రియల్లో కూడా ఈ భావజాలం ప్రవేశించింది. ఆ క్రమంలోదే అల్లం రాజయ్య తొలి నవల కొలిమంటుకున్నది. ఇది సృజన మాసపత్రికలో సీరియల్‌గా అచ్చయ్యింది.

కరీంనగర్ ప్రాంతానికి చెందిన అల్లం రాజయ్య అప్పటికే కొన్ని కథలు రాసి ఉన్నారు. దాదాపు 60 కథలు, అరడజను నవలలు రాశారు. 70వ దశకంలోని కల్లోల తెలంగాణ ప్రాంతాన్ని రూపుకట్టించడానికి తన నవలలో ప్రయత్నం చేశాడు.

అల్లం రాజయ్య కొలిమంటుకున్నది నవలలోని కథని విడిగా చూస్తే, చాలా సామాన్యమైనది అనిపిస్తుంది. రచనా కాలం 1974-79. కథాకాలం కూడా ఇంచు మించుగా అదే. కథా ప్రాంతం ఆదిలాబాద్-కరీంనగర్. జీవితం తెలంగాణలోని అట్టడుగు వ్యవసాయదారుల ఇక్కట్లు, నిస్సహాయ పరిస్థితులు.

నర్సింహం చిన్న చెల్క ఉన్న బక్క రైతు. గ్రామంలో పెద్దలు నర్సిగాడని, మరికొందరు నర్సయ్యని పిలుస్తారు. వ్యవసాయానికి ప్రాణం నీటి వసతి. బాయి నీళ్ళతో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న నర్సింహంకి ఊరికి కరెంటు రావటం ఆశ పుట్టించింది. కోమటాయన దగ్గర అప్పు చేసి నీళ్ళు తోడుకునే ఇంజన్ కొనుక్కొని బిగించాడు. కరెంటు వాళ్ళతో తంటాలు పడ్డాక, స్తంభాలు పాతి వైరు బిగించారు. ఇంక కనెక్షన్ ఇవ్వాలి. అది మిర్చి పంట మంచి అదను మీద ఉన్న సమయం. నీరు అందకపోతే పంట నాశనం అవుతుంది.

వసతులన్నీ ఉన్నా, ఆ ఊరి దొర ప్రతాపరెడ్డికి అదనంగా నీరు కావాలి. కరెంటు వాళ్ళతో కుమ్మక్కయి, తన అధికారానికి తిరుగులేదన్నట్టు, రాత్రికి రాత్రి నర్సింహం పొలంలోని స్తంభాలు, వైరు పీకించి తన వందల ఎకరాల పొలానికి అమర్చుకొన్నాడు.

విషయం గ్రహించిన నర్సింహం తిరగని వ్యక్తి లేడు, చెయ్యని ప్రయత్నం లేదు. చిన్నదొర ముకుందరెడ్డి దగ్గరకి, పట్వారి దగ్గరకి, పోలీసుల దగ్గరకి, కరెంటు వాళ్ళ దగ్గరకి, కాళ్ళల్లో సత్తువ నశించే వరకు, తిండీతిప్పలు లేకుండా తిరిగాడు. ఒక్కరూ అతనికి సాయం చేసినవారు లేరు. నీదే న్యాయం అన్నవారు లేరు. అందరికీ ప్రతాపరెడ్డి అంటే భయం. అతని డబ్బుకి, అధికారానికి లొంగినవారే. అన్యాయమని తెలిసినా ఏం చెయ్యలేని పరిస్థితి. మనసు కుతకుతలాడుతున్నా చివరికి ప్రతాపరెడ్డి దగ్గరకే వెళ్ళి... 'నీ బాంచెను' (బానిసను) అంటూ కాళ్ళావేళ్ళా పడ్డా ఆయన ఆగ్రహమే తప్ప అనుగ్రహం దక్కలేదు.

నర్సింహం ఎదుట మాట్లాడినందుకు, మరో రకంగా దెబ్బతీయాలని ఎంకమ్మని భయపెట్టి నర్సింహం ఆమెను బలాత్కారం చేశాడని తప్పుడు పంచాయితీ పెట్టి,

తప్పుగా 500 రూపాయలు జరిమానా కట్టమన్నారు. నర్సింహం కట్టనందుకు తన్నారు. అయినా దొర అక్కసు తీరలేదు. తనవాళ్ళతో ఇంజన్ దొంగతనం చేయించాడు. నర్సింహం పంట తగుల పెట్టించాడు. నర్సింహంని అన్ని రకాలుగా నాశనం చేశాడు. ఇంజన్ కోసం కోమటి దగ్గర తెచ్చిన మూడువేల అప్పు తప్పుడు వడ్డీ లెక్కలతో కలిపి నర్సింహంని భూమిలేని వాణ్ణి చేసింది. మోసంగా కోమటి కాజేసిన ఆ పొలాన్ని ప్రతాపరెడ్డి భయపెట్టి తనకి అనుకూలమైన ధర ఇచ్చి తన పొలంలో కలిపేసుకొన్నాడు. గ్రామం అంతా తన సొంతం. తన ఇష్టానికి, మాటకి ఎదురు ఉండకూడదు. ఎవరైనా తన అధికారానికి ఎదురు తిరిగితే వాడు నరకం అనుభవించాల్సిందే. దొరతనం పద్ధతి అది. ప్రతాపరెడ్డీ అంతే.

పొలం పోగొట్టుకొని, అన్ని రకాలుగా అన్యాయాల పాలైన నర్సింహం రైతు నుంచి కూలీగా మారాడు. అతను, అతని భార్య, కూతురు పట్టెడు తిండి కోసం ప్రతాపరెడ్డి పొలంలో ఒళ్ళు విరుచుకొని పనిచేస్తే, పాత పగని మనసులో పెట్టుకొని కూలీ ఇవ్వక, 'నీ దిక్కున్న చోట చెప్పుకో' అన్నాడు. అది చూసి నర్సింహంతోటి వాళ్ళు దొరకి ఎదురు తిరగలేక పోయినా, ఆ అన్యాయాన్ని నర్సింహం ఒక్కడిదిగా భావించ లేదు. తమలో తామే బాధపడ్డారు. దొరను అన్ని రకాలుగా తిట్టుకొన్నారు. పులి మీద పుట్రలా ఈ సంఘటన వెనకే, దొర కొట్టిన దెబ్బలకి రాయపోశడు చచ్చి పోయాడు. వాడు చేసిన తప్పల్లా ఆకలికి ఆగలేక నాలుగు గింజలు తినటమే. చంపిందే కాక, వాడు బాయిలో పడి చచ్చాడన్న అబద్ధం ఒకటి.

అది చూసిన ఊరి జనానికి సహనం చచ్చిపోయింది. ఉక్రోషం ఆవేశంగా మారింది. దొర గడి మీదకి దండెత్తారు. వీళ్ళకి చుట్టుపక్కల ఊళ్ళ వాళ్ళు, రైతు సంఘం వాళ్ళు తోడయ్యారు.

దొర గడి నాశనం చేశారు. అతని అధికారాన్ని బద్దలు కొట్టారు. ఎందరో చచ్చినా వాళ్ళు వెనకాడలేదు. ఆడ, మగ, చిన్నా, పెద్దా భేదం లేని ఉప్పెన అది. కొద్ది సేపైతే దొర నశించేవాడే. కానీ కబురందిన పోలీసులొచ్చారు. దొరకి అండగా నిలిచారు. అందిన వాళ్ళని అందినట్టు పోలీసు వేన్లోకి ఎక్కిం చారు.

నర్సింహం, బొత్తయ్య, చెంద్రయ్య, ఆనందం లాంటి కీలక వ్యక్తులు పోలీసులకి దొరక్క తప్పించుకున్నారని, వారి కొత్త శక్తికి జడిసి ప్రతాపరెడ్డి కుటుంబంతో సహా పట్టణానికి మకాం మార్చాడని నవల ముగుస్తుంది.

పేద వాళ్ళ మీద ధన, మాన, ప్రాణ దౌర్జన్యం, భూ కామందులు, దొరలు... ఇలా వేర్వేరు ప్రాంతాల కథలు 1979 నాటికే వచ్చాయి. కొలిమంటుకున్నది నవల ప్రచురణ కాలం నవంబర్ 1978 నుంచి జులై 1979. పుస్తకరూపంగా వచ్చింది

1979. కథగా ఇది స్వల్ప భేదాలతో ఇదివరకటిదే అనిపిస్తుంది. కానీ కథా వస్తువు రీత్యా కొత్తది.

నర్సింహం కథలోని బాధ పాఠకుల్ని 'అయ్యో పాపం' అనిపించి ఊరుకోదు. రాజులు పోయారు, దొరలు పోయారు. అయినా కొంతమంది జనం బతుకుల్లో కష్టాలు అలాగే ఉన్నాయి. అవి ఎందుకు మారటం లేదు? ఎన్నో రంగులు మారుతున్న వ్యవస్థ మూలాలు ఎక్కడున్నాయి? ఇలాంటి మౌలికమైన ప్రశ్నలు పుడతాయి. 'నర్సింహం లాంటి కష్టాలు మనం ఎరుగున్నవే... ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం. ప్రతాపరెడ్డిలా మోసాలు చేసేవాళ్ళు ఇప్పటికీ ఉన్నారు. పంచాయితీలలో న్యాయం అన్యాయంగా ఉందేమిటి...' ఇలాంటి భావనలన్నీ కథాపరంగా కలుగుతాయి.

కొలిమంటుకున్నది నవలలోని జనం భాష, వారి నిస్సహాయ ఆవేదనని రూపు కట్టించిన తీరు, పైన చెప్పిన భావాలకి ప్రాణం పోసి మన ముందు ప్రశ్నలవుతాయి. నవలలోనే సమాధానాలు వినిపిస్తాయి.

నర్సింహం పొలం పోగొట్టుకున్నప్పుడు భార్య అనే మాటలు, 'దొరకి కొత్తంగ కరంటచ్చిందని- కడుపునిండ బెడ్తడని- జుట్టుపెట్టోలె ఎగువడితివి- ఇంజన కగ్గితల్గి- ఇంజనంట దెత్తివి. అద్దయ్య- గ కరంటు మనది గాదు అంటె సెవున బెట్టకపోతివి. బక్కల పట్కొని సత్తపడుత మోట గొట్టుకొని ఇంత గడు కంబలన్న దాగేటోల్లం...' ఈ నాలుగు వాక్యాలు కొన్ని వందల జీవితాల, దశాబ్దాల జీవితాన్ని ప్రతిబింబి స్తాయి.

నాగరికత, నవీన ఆవిష్కరణలు ముందుగా ఎవ్వరికి మేలు చేస్తాయో చెబుతాయి. చరిత్ర ప్రకారం బానిసలు అంతరించారు. కానీ ఇంకా బానిసబతుకులున్నాయని తేటతెల్లంగా చూపిస్తుంది ఈ నవల.

అందుకే కొలిమంటుకున్నది నవలలోని కథలాంటి కథా వస్తువుని చూడాలి.

ఈ నవలకి చాలా ప్రత్యేకతలున్నాయి. ఆదిలాబాద్, కరీంనగర్ ప్రజల భాషని పూర్తిగా చూపించిన తొలి నవల. చదువుకోడానికేకాక శ్రవ్య నవలగా ప్రత్యేకత ఉన్న నవల. పత్రికల భాషకి, మాండలీకానికి మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టం చేసిన నవల. ఇంతకు ముందు అనుభవంలోకి రాని భావనల్ని రూపు కట్టించిన వర్ణనలున్నాయి. అసహాయులైన ప్రజలకి 'తిట్టు' ఎలాంటిదో చెప్పటం ఉంది. ఈ నవలని రాజయ్య తదితర రచయితలు కరీంనగర్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, రాత్రిపూట మీటింగులు పెట్టి మరీ వినిపించేవారు. ఈ నవల మరో ప్రత్యేకత ఏమిటంటే- మొత్తం కరీంనగర్ జిల్లా మాండలికంలో రాయబడిన నవల. దీని మీద అప్పట్లో మాండలిక రచనల ప్రయోజనం గురించి పెద్ద చర్చ సాగింది. తెలుగులో మాండలిక రచనలు విస్తృతంగా రావడానికి దోహదపడిన నవలగా కొలిమంటుకున్నది నవలకి ప్రత్యేక స్థానం ఉంది.

అల్లం రాజయ్య కొలిమంటుకున్నది నవల గురించి చెప్పిన మాటలు...

"ఎప్పుడైతే భూమి మొత్తం గ్రామంలోని అన్ని వ్యత్యాసాలకు తగువులకు మూలమని తేలిందో అప్పుడే దొరల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూమి పుట్టు పూర్వోత్తరాల గురించి ఆలోచించవలసి వచ్చింది. భూములను దొరలు పుట్టుకతోటే భుజానేసుక రాలేదు. తమ మనుగడ కోసం రైతులు ఎన్ని కష్టాలైనా ఎదుర్కొని సాగు యోగ్యంగాని భూములు సాగులోనికి తెస్తారు. అవి దొరలు ఆక్రమించుకుంటారు. కాలానుగతంగా దొరల భూ ఆక్రమణ పద్ధతులు మారుతూ ఉంటాయి. కాని ఆక్రమించుకోవడం మాత్రం తప్పనిసరి. ఎంతవరకు? 'కొలి మంటుకో'నంత వరకే- అలాగే దోపిడి సమాజంలో ప్రతి అభివృద్ధికరమైన అంశాన్ని దొరలే వాడుకుంటారు- మౌలికంగా ఉత్పత్తి సాధనాలు, వనరులు ఉత్పత్తి శ్రామికుని పరం కానంత వరకు ఈ పరిస్థితి కొనసాగుతుంది."

నవల చివరలో 'దూరానికి దగ్గరగా' అన్న మాటలో పెంచుకలపాడు చిన నరసింహారెడ్డి-


"నవలలో ఈనాటి ఆదిలాబాద్, కరీంనగర్ రైతాంగ పోరాటానికి ముందు పరిస్థితులు కనిపిస్తాయి. కథారంగం పల్లెపట్టు. సన్నకారు రైతు పెరడు, పెరడులోని మంచె, దొర తోట, పొలం, పొలంలోని కల్లం, చెరువుగట్టు, ఊళ్ళోని వీధులు, మాదిగ వాడ, బూలచ్చిమి, దొర గడి, గడిలోని దొర గది, మాలీపటేల్ బంగ్ల, పట్వారి ఇల్లు, షావుకారిల్లు, సన్నకారు రైతు ఇల్లు, నీరటి కాని గుడిసె, పట్నంలో పోలీస్‌ఠాణా, హోటల్ గుడిసె, కరెంటాఫీసు ఇవి కథా రంగస్థలాలు. ఇందులో ఉత్పత్తి సాధనాలు, వనరులు అరచేత పెట్టుకొని ఆడిస్తున్న దోపిడీవర్గం, ఈ వ్యవస్థలో దాని ప్రయోజనాల్ని సంరక్షించే పాలకవర్గం, సహకరించే దళారీవర్గం, దోపిడీకి, దుర్భరమైన పీడనకు గురౌతున్న పీడితవర్గం... ఇలా భిన్న తరగతులకు ప్రాతినిధ్యం వహించే పాత్రలున్నాయి. వీళ్ళల్లో దొరలు, ప్రభుత్వోద్యోగులు, గ్రామోద్యోగులు, షేకేదార్లు, కోమట్లు, పోలీసులు, సుంకరోల్లు ఉన్నారు. సన్నకారురైతులు, పాలేర్లు, నీరటికాల్లు, కయికిలికాల్లు ఉన్నారు. ఆడవాళ్ళున్నారు. ముసలాళ్ళున్నారు. పడుసోల్లున్నారు. పోరగాళ్ళున్నారు. మురికిబట్ట లుతికే మూగ సాకలోళ్ళున్నారు. గూడు సెదిరినోన్ని, గుండె సెదిరినోన్ని ఆదుకునే కల్లుగీసే గౌండ్లోల్లున్నారు. పోలీసోల్లనే అరెస్ట్ చేసిన సాదరిపల్లెలోని బాలసంతోలున్నారు. సెక్కముక్కోని సెక్కనాల ఇండ్లు గట్టిన సెక్కసేటు, చేతిలో రూపాయి పెడితే ఆఫీసు గదిలోకి పంపించే జవాను (కన్యాశుల్కంలోని అసిరిగాడు), కొంచెంసేపు ఆలస్యమైతే కొలు వుంచుకున్నోడు కోపగిస్తాడనే భయంతో ఎటూ తోచక చేసుకున్న పెళ్ళాన్ని నడివీధిలో కొట్టే అర్థబానిస దుడ్డెగాల్ల సెందిరిగాడు, 'పెండ్లాన్ని సేసుకున్నది- ఎటు పడితటు గొడ్డును గొట్టినట్టు కొట్టెటందుక్కాదురా? లమ్డికొడక- అది ఎద్దనుకున్నవ,

గొడ్డను కున్నవ- మనిషిరా!' అంటూ వయసిచ్చిన అధికారంతో వాణ్ణి నిలదీసి అడుగుతూ నీల్లు పుక్కిలించి ఊంచినట్టుగ నవ్వే గూని ముసలవ్వ- ఇలా ఎన్నెన్నో సజీవ పాత్రలు. వ్యవస్థ ఉక్కుపాదం కిందబడి నలిగి, మగవారి కష్టాల్లో కన్నీళ్ళలో పాలు పంచుకుంటూ కడుపులోని సొదను కడుపులోనే దాచుకుని మూగబాధ ననుభవిస్తున్న ఆడవాళ్ళ జీవితాల్లోని చీకటి కోణాల్ని, పోరాట క్రమంలో అంతర్లీనంగా వారి పాత్రను రచయిత పూసల్లో దారంలా పొదిగాడు.''

పైన ఉదహరించిన ఇద్దరి మాటలు ఈ నవల గురించి పూర్తి రూపాన్ని తెలియ జేస్తాయి.

ముప్ఫై అయిదేళ్ళ పైగా కథలు రాస్తున్న అల్లం రాజయ్య మనిషి లోపలి విధ్వంసం లాంటి పరిణతి చెందిన కథాస్థానం చేరాడు. రోజురోజుకి సమగ్రత, గాఢత సాధించిన రచయిత అల్లం రాజయ్య. దాదాపు 30 ఏళ్ళ తరువాత ఈ నవల ఇటీవలే అల్లం రాజయ్య మరికొన్ని నవలలతో కలిపి పునర్ముద్రింప బడింది.

*మార్చి, 2008*




# పాకుడురాళ్లు

## రావూరి భరద్వాజ

పాకుడురాళ్ళు దరిదాపు అర్ధశతాబ్దం క్రితం నవల. కథాకాలం, నేపథ్యం అప్పటి తెలుగు సినీరంగం. 824 పేజీల దీర్ఘనవల. నిడివిలో అతి పెద్ద తెలుగు నవలల్లో ఒకటి పాకుడురాళ్ళు. సినీరంగపు అతి పెద్ద నవలగానే కాక, ఆరంభించిన దగ్గర నుంచీ వదలకుండా చదవాలనిపించటం దీని ప్రత్యేకత. అప్పటికీ, ఇప్పటికీ రీడబిలిటీ (పఠనాసక్తి) పరంగా రచయితలకి ఇది ఒక పాఠ్యపుస్తకంలాంటిదని చెప్పుకోవచ్చు. ఈ నవల కృష్ణా పత్రికలో ధారావాహికంగా వెలువడినప్పుడు, కొంతమంది సినీ ప్రముఖులు ఈ నవలని నిషేధింప చూశారని వినికిడి. అప్పటి మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య ఈ నవలని అమితంగా ఇష్టపడటం, 1965లో పుస్తకంగా వెలువడినప్పుడు ముందుమాట రాయటం వల్ల వారి ప్రయత్నాలు ఫలించలేదంటారు.

స్థూలంగా చెప్పాలంటే మంగమ్మ ఉరఫ్ మంజరి అన్న నటి జీవన ప్రస్థానం ఈ నవల. గుంటూరు సంప్రదాయ నాటకరంగం దగ్గర ఆరంభమైన కథ, నవీన నాటకధోరణి, మద్రాసు సినీరంగం, ధన, కీర్తికాంక్షలు, ప్రలోభాలతో సాగి బొంబాయి హిందీ రంగపు విస్తృతి నుంచి

హాలీవుడ్‌కి, మార్లిన్ మన్రో జీవితం వరకూ సాగుతుందీ నవల. ఇన్ని రంగాలని, ఇన్ని అంశాలని స్పృశించినా, ఈ నవల కేంద్రబిందువు ఓ స్త్రీ మనసు. సంప్రదాయపు కట్టుబాట్లని దాటిన మంగమ్మ ఎదురీత.

బతుకులోని కష్టసుఖాలను, పేదరికాన్ని, అమిత భోగభాగ్యాలను ఆధారం చేసుకొని జీవన వాస్తవికతని హృదయంలాగా చేసుకొని నిజాయితీగా రచించిన నవల కలకాలం నిలుస్తుంది. దానికి ఉదాహరణ రావూరి భరద్వాజ పాకుడురాళ్ళు.

రావూరి భరద్వాజ అట్టడుగు జీవితాన్ని చూశారు. శారద (నటరాజన్) లాంటి గొప్ప రచయితలతోటి, భుజంగరావు లాంటి అద్భుత మిత్రులతోటి సన్నిహితంగా బతికారు. అంచెలంచెలుగా జీవితపు వివిధ దశల్ని గడిచి, రాష్ట్ర, కేంద్రస్థాయిలలో ఎందరో ప్రముఖులతో సన్నిహితంగా గడిపి, ఆకాశవాణి ఉద్యోగం నుంచి పదవీ విరమణ అనంతరం, ఇప్పటికీ ఎన్నో కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నారు. విశేషమేమిటంటే అప్పటి దుర్భర దినాల నుంచి ఇప్పటివరకూ వారు సాహితీ జీవితాన్ని వదల్లేదు. గతాన్ని మరువలేదు. వారికి అత్యంత ప్రేమాన్విత అయిన జీవన సహచరి గతించి ఏళ్ళు గడిచినా ప్రతి సంవత్సరం సాహితీ నివాళిగా ఆమెని స్మరిస్తూనే ఉన్నారు. ఇదంతా ఎందుకంటే, ఆయనకి ఉన్న అనురాగం, అనుబంధాల గురించి చెప్పటానికే. ప్రతి వ్యక్తికీ ఒక తత్త్వం ఉంటుంది. పరిస్థితులు, రోజులు మారినా ఆ తత్త్వపు మౌలికత మారదు. భరద్వాజగారి మౌలిక అనురాగప్రతిరూపం పాకుడురాళ్ళు.

పాకుడురాళ్ళు నవలలోని కథ చాలా సాదాసీదాగా మొదలై, ఆ తర్వాత ఎన్నో రకాల నాటకీయ మలుపులు తిరుగుతుంది. నాగమణి అన్న ఆవిడ ప్రాపకంలో ఉన్న మంగమ్మని నాటకాలలో వేషం వేయించడానికి పిలుస్తారు మాధవరావు, రామచంద్ర. అప్పటికి నాటకరంగ పరిస్థితి- వేసిన నాటకాలే వేస్తూ, పాత్రలు, పాత్రధారులు వారేగా నడుస్తోంది గుంటూరులో. అన్ని రకాలుగా సహకరించిన మంగమ్మ వారికి, వారి నాటక సమాజానికి తలలో నాలుకైంది. ఎన్నో ఊళ్ళలో, ఎన్నో నాటకాలు వేశారు. మంచి నటిగా మంగమ్మకి కూడా పేరు, గుర్తింపు లభించాయి. ఎంతో బాధే అయినా, ఆ సమాజాన్ని మూసేయక తప్పలేదు. మాధవరావు వాళ్ళిచ్చిన కొద్ది డబ్బుతో మంగమ్మ తిరిగి గుంటూరు చేరింది. ఏం చెయ్యాలో తోచని పరిస్థితి. పాత జీవితం గుర్తొచ్చింది. ద్వైధీభావం. ఆ జీవితం ఇష్టంలేదు. కొత్తగా ఏం చెయ్యాలో తెలియదు. నాగమణిని చూసి వద్దామని బయల్దేరిన మంగమ్మకి రాజామణి, వసంత కలిశారు. నాగమణి వ్యాపారం ప్రస్తుతం రాజామణి చేతుల్లో ఉంది. ఎంత కర్కోటకురాలైనా నాగమణి అంటే ఏదో మూల అభిమానం. కానీ రాజామణి ఆప్యాయత మంగమ్మని లొంగదీసింది. వసంతని చూస్తుంటే గతంలోని తనని తను చూసుకొంటున్నట్లనిపించింది మంగమ్మకి. విటుల రాకపోకలు పెరుగుతుండగా ఆ ఇంటి నుంచి వచ్చేసింది

మంగమ్మ. అలా వచ్చిన మంగమ్మకి చలపతి కలిశాడు. మద్రాసులో సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది రమ్మన్నాడు. రాజామణిని అడిగితే వెంటనే వెళ్ళమని ధైర్యం చెప్పడమే కాక, ఏదేనా తల్లకిందులైతే తన వద్దకి ఎప్పుడైనా రావచ్చనే భరోసా ఇచ్చి మరీ పంపింది. 'నేను ఉన్నాను. నీకు భయంలేదు,' అన్నమనిషి తోడులోని ధైర్యం ఆ క్షణాన మంగమ్మకి బాగా తెలిసొచ్చింది.

చలపతికి లొంగింది. ఆ తర్వాత అతని పనుపున మరికొంతమందికి లొంగింది. మద్రాసు సినీరంగపు మోహం, బాధ, కుత్సితం, అవమానం, నక్కలు, తోడేళ్ళతో సహవాసం అన్నీ అనుభవించింది. సినీరంగ ప్రవేశంతో మంగమ్మ మంజరి అయింది. అవకాశం దొరికితే చాలనుకొన్న మంగమ్మ అంచెలంచెలుగా ఎదిగి అగ్రనటి మంజరి అయింది. ఏ గుంటూరులో పదీ, పరకకి శరీరాన్ని అమ్మిందో, అదే గుంటూరులో వేలకొద్దీ జనం ఆమెని చూడడానికి తహతహలాడిన గ్లామర్‌తార అయింది. గుంటూరు నుంచి రాజామణిని, వసంతని మద్రాసు తీసుకొచ్చింది మంజరి.

తనెంతో హీన స్థితిలో ఉన్నప్పటి రాజామణి ఆదరణ మర్చిపోలేదు మంగమ్మ. అలాగే తనలాంటి వసంతని ప్రేమించకుండా ఉండలేకపోయింది. ఈ అను బంధమే, ఈ తెంపుకోలేని ప్రేమే మంజరి పాత్రలోని ప్రత్యేకత. ఈ జీవనానురాగ ప్రతిబింబమే పాకుడురాళ్ళు నవలని విశిష్టంగా నిలబెట్టిన అంశం.

రావూరి భరద్వాజ, అలనాటి మేటి రచయిత 'శారద' హోటల్‌లో రోజుకి పధ్నాలుగు గంటలు నికృష్టంగా కష్టపడటం గురించి, అప్పటి జీవితం గురించి చెబుతున్నప్పుడు, భరద్వాజగారి మాటల్లో ఒలికే ప్రేమ నాకు ఈ నవలలో చాలాచోట్ల మంజరి ప్రవర్తనలో ప్రతిబింబంలా కనిపించింది. మంచి-చెడ్డ, నీతి-అవినీతి, అవ మానం-గొప్ప లాంటి చాలా... చాలా వాటికి అతీతమైన ప్రేమ ప్రతి బతుకులోనూ ఉంటుంది. దాన్ని గుర్తించటం, పట్టుకోవటం, రచనలో ప్రతిబింబించటం చాలా గొప్ప విశేషం. లౌకికంగా కనబడుతూనే అలౌకికమైనది ఈ ప్రేమ.

పాకుడురాళ్ళు నవలలో మంజరి చేసే చాలా పనులు తార్కికమైనవి కావు. సాఫీగా జీవితం సాగే అన్ని అవకాశాలు ఉన్నా, వనరులు కూడినా మంజరి అలా ఉండదు. అనవసరం అనిపించే పట్టుదలలకి, పంతాలకి మంజరి ఉద్యమించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా బొంబాయిలో సముద్రతీరాన ఇల్లు, దాని కోసం తెగించి ఆవిడ చేసిన పనులు ఆమెకి ఉరితాడయ్యాయి. ఎందుకిలా? అంటే... అదే జీవితం... అదే అర్థంకాని మనసు తత్త్వం... ఈ తత్త్వాన్ని, సినీరంగపు నేపథ్యంలో ఒక కథగా కాక, రక్తమాంసాలు నిండిన జీవితంగా మలచటం వల్లే పాకుడురాళ్ళు ప్రత్యేక నవలైంది.

మద్రాసు అంతర్జాతీయ చలనచిత్రోత్సవం మంజరి ఆశల్ని దేశ సరిహద్దులు దాటించింది. విదేశాల ఆహ్వానం పొంది, అమెరికా తదితర దేశాలలో పర్యటించా

లనుకొంది. అది సాధించటం కోసం ఎన్నో పాట్లు పడింది. తనకి తనే ప్రచారం, తను పూనుకొన్నట్టు తెలియకుండా విదేశీ ప్రతినిధులతో పరిచయం, వారితో అన్ని రకాలుగా సంబంధం. చివరికి మంజరి అనుకొన్నది సాధించింది.

మార్లిన్ మన్రోతో కలిసి సన్నిహితంగా గడిపింది. ఆమె ఉద్వేగ, ఆశానిరాశల భావాలు తనలోనూ ఉన్నాయని గ్రహించింది. పెద్దగా చదువుకోని, బయటి ప్రపంచం అంతగా తెలియని మంగమ్మ, మంజరి రూపంలో ప్రాక్ పశ్చిమ సంస్కృతుల గురించి, కళారీతుల గురించి, దేశవిదేశీ సినీరంగ వ్యత్యాసాల గురించి, సారూప్యం గురించి ఉపన్యాసాలిచ్చింది. ఈ పాత్రనిలా సంభాళించడం అంత తేలిక కాదు.

కథ, పాత్ర పరిపక్వతల గమనం విడదీయలేనంతగా కలిసిపోవటం పాకుడు రాళ్ళు ప్రత్యేకతల్లో ఒకటి.

ఎన్ని సాధించినా మంజరికి ఏదో తపన... నిలవనీయని జ్వాల. ఆ జ్వాల ఆంతరంగికం. ఎన్నో తరాలు... ఎందరో ఒళ్ళమ్ముకున్న స్త్రీల మానసిక హింసల ప్రతిరూపం. అది కేవలం మంగమ్మ శరీరమే కాదు. శారీరకంగా, అంతకన్నా మానసికంగా స్త్రీ శరీరం పడిన బాధ పుట్టించిన జ్వాల... దానికి అంతు లేదు.

మంజరికి బొంబాయి సముద్ర తీరాన, తనతోటి వారందర్నీ మించి పోయేలా భవంతి నిర్మించాలనిపించింది. అదీ సాధించింది. కానీ నీలి చిత్రాలలోకి దిగక తప్పక, ఆ అవమానం తట్టుకోలేక, నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొంది.

పాకుడురాళ్ళు నవల ముగింపు ఇప్పుడు అంత కొత్తగా అనిపించకపోవచ్చు. కానీ అప్పటి కాలాన్ని గుర్తు పెట్టుకొంటే అది కొత్తదే. ఎందరో అగ్రశ్రేణి తారల ఆత్మహత్యలు, మార్లిన్ మన్రో జీవితం ప్రాచుర్యం పొందిన ఈ కాలం వేరు, అప్పుడు వేరు.

పాకుడురాళ్ళు కథ గురించి ఇదంతా చెప్పుకొంటే- కథనం, రచనావిధానం, ప్రణాళికల గురించి దీనికి పదింతలు చెప్పు కోవాలి. నవల ఆరంభమే ప్రత్యేకమైంది.

ఈ నవలలో కీలకమైన పాత్రలు ఎన్నో ఉన్నా, మాధవరావు పాత్ర ద్వారా నవల మొదలై మాధవరావుతోనే ముగుస్తుంది.

ఆరంభంలో మాధవరావు చెప్పిన కథలో... ఆనాటి నాటకరంగం పరిస్థితులు, మంగమ్మ (నటనా, నవలా) ప్రవేశం ఉంటాయి. నాటక రంగం నుంచే చాలామంది సినీరంగానికి వెళ్ళిన రోజులు. అదీకాక మాధవరావు లాంటి వ్యక్తులే నాటకరంగానికి ప్రాణవాయువు. అలాంటివాళ్ళే మంజరిలాంటి వాళ్ళకి ఆరంభం. అతి సహజంగా, ఎంతో సాదాసీదాగా మాధవరావుతోటే మొదలైంది నవల.

ఇంక ముగింపులో మాధవరావు మంజరి గురించి తన దృక్కోణం చెబుతాడు.

మంజరిలాంటి వాళ్ళ గురించి దగ్గరి వాళ్ళు చెప్పే మాటలు కొందరికి అతిగా అనిపించవచ్చు. కానీ సత్యదూరాలు కావు. వాళ్ళ జీవితాలు సాధారణమైనవి కాక పోవటమే, అలా అతిగా అనిపించడానికి కారణం. మంజరికి మాధవరావు అంటే ప్రత్యేక అభిమానం. ఏ రకం లౌక్యం, స్వార్థం, నటనాలేని నిజమైన అభిమానం. ఆయనతో మంగమ్మ మాట్లాడే మాటల్లో గొప్ప విషయాలేం లేకపోవచ్చు. కానీ వాటిని మించిన ఆప్యాయత ఉంది. "ఈ ప్రపంచం లో ప్రాణాలున్నంత కాలమూ, మనుషుల మధ్య సంబంధాలుంటాయన్న నమ్మకం నాకిప్పటికీ ఉంది. మిమ్మల్ని చూడాలని నేనెంత ఘోషిస్తున్నానో..." అంటుంది మంజరి మాధవరావుకి రాసిన ఉత్తరంలో. ఇక్కడ ఎంత జీవన సారం! చిన్నతనంలో మనతో కలిసి చదువుకొన్న స్నేహితులు అకస్మాత్తుగా గుర్తొస్తారు. ఎవరో ఎప్పుడో చేసిన మాట సాయం మరిచిపోలేం. ఎక్కడిదో, ఎవరిదో రూపం లీలగా కళ్ళ ముందు కదులుతుంది. ఆ గడిచిన సాన్నిహిత్యం కావాలని కోరుకోని మనుషులుంటారా?

పాకుడురాళ్ళు నవలా రచనా ప్రత్యేకతలు చాలా ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి కొన్ని ఉన్నాయి.

మనస్తత్వ చిత్రణ- మంజరి చలపతి, కళ్యాణి, రాజన్ లాంటి ముఖ్యపాత్రలే కాకుండా, రాజామణి, వసంత, శర్మ, తాయారులాంటి ఉపపాత్రలు కూడా ప్రత్యేకంగా కనిపిస్తాయి. దానికి కారణం, ఆ పాత్రల మనస్తత్వాన్ని వారివారి మాటల ద్వారా, చేతల ద్వారా మనముందు సజీవంగా కనబడేలా చెయ్యటమే.

నాటక సమాజం మూతపడగానే ఏం చెయ్యాలో తెలియని స్థితిలో గుంటూరు వచ్చిన మంగమ్మ లాడ్జ్‌లో ఉంటుంది. ఆ లాడ్జిలో సర్వర్‌ని కావాలనే ఉద్రేకపరిచి ఏడిపిస్తుంది. ఎందుకంటే అదోరకం తృప్తి. దానికి సంజాయిషీలు లేవు. అక్కడ భరద్వాజ గారి మాటలు-

"అతను వెళ్ళిపోయాక, మంగమ్మ మంచం మీదపడి, పొట్ట చెక్కలయ్యేలాగా నవ్వుకొంది. రాజామణి ఇంట్లో తనకు తటస్థపడ్డ మనిషిగానీ, ఈ సర్వర్‌గానీ, ఈ రాత్రి నిద్రపోతారన్న నమ్మకం ఆవిడకు లేదు. అలా వాళ్ళను బాధించి, వేధించి వదలాలన్న ఉద్దేశంతోనే తను అలా అన్నది. ఈ రాత్రల్లా వాళ్ళు తనను గురించి ఆలోచించి ఉంటారు. కలలు గంటూనే ఉంటారు. తనకోసం ఆరాటపడుతూ ఉంటారు. అందువల్ల తనకేం జరిగిందని కాదు; వాళ్ళు బాధపడితే తనకంతే చాలు..."

ఇలాంటి పాత్రే కుప్రిన్ నవల యమకూపంలో కూడా ఒకటి ఉంటుంది. యమకూపం ప్రధాన కథాస్థలం వేశ్యాగృహం. ఆ ఇంట్లో సుఖరోగాలున్న ఒకావిడ ఉంటుంది. వాటిని నయం చేసుకోకుండా విటులకి అంటించడంలో ఆవిడకో తృప్తి. ఇటువంటి నడవడి మంచిదా? చెడ్డదా? అన్నది కాదు ప్రశ్న. ఈ నవల ముందుమాటలో ఆలపాటి వెంకట్రామయ్య ఇలా అంటారు-

"రచయిత నిజాయితీ, బాధ్యత ఇలాంటి ఘట్టాలలోనే బైటపడుతుంది. సమకాలీన సమాజానికి కోపం వస్తుందని భయపడి, చేతులు ముడుచుకు కూచున్న రచయిత, సంఘం పట్ల తనకున్న బాధ్యతను విస్మరించాడన్నమాట. ఉత్తమ రచయిత లెవ్వరూ అలా చేయరు, చేయలేరు కూడాను. వీరేశలింగం పంతులుగారూ, గురజాడ అప్పారావుగారూ, గిడుగు రామమూర్తి పంతులుగారూ, త్రిపురనేని రామస్వామి చౌదరి గారూ, గుడిపాటి వెంకటాచలంగారూ- సమకాలీన సమాజాన్ని చూసి భయపడి ఉన్నట్లయితే, తెలుగుజాతి ఇప్పుడే స్థితిలో ఉండేదీ మనం ఊహించను కూడా లేము."

పాకుడురాళ్ళు నవలలోని ప్రత్యేకత పాత్రల తీరు. ఈ నవలలో ఇంచుమించు ఉదాత్తంగా, ఆదర్శవంతంగా ప్రవర్తించే పాత్ర ఏదీ లేదు. అన్ని పాత్రలూ రక్తమాంసాలతో, మనిషితనానికి ప్రతిబింబంలా ఉంటాయి. 'మనిషన్నాక మంచీ చెడూ రెండూ ఉంటాయి,' అనేవారట మహా రచయిత కీ॥శే॥ పాలగుమ్మి పద్మరాజు. పాకుడు రాళ్ళులో మనుషులూ అలాగే ఉంటారు.

ఎంత చెప్పినా, ఎంత కోట్ చేసినా ఇంకా మిగిలే ఉంటుంది. అలాంటి నవల పాకుడురాళ్ళు. ఈ నవలకి భరద్వాజ మాయాజలతారు అని పేరు పెట్టారట. ఆ పేరుని, రచయితే కాక అందరూ మరింతగా ఇష్టపడేలా, ఒక రకంగా చెప్పాలంటే ఎవరూ కాదనలేని విధంగా పాకుడురాళ్ళుగా మార్చినవారు శీలా వీర్రాజు.

నవలా, కథారచయితగా, ఆకాశాణిలో ప్రొడ్యూసర్‌గా, తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో చెప్పుకోదగిన కృషి చేసిన భరద్వాజగారు ఈ నవల ఒక్కదాని తోనే చిరంజీవి. హైదరాబాదు సాహితీ సభల్లో ఇప్పటికీ చురుగ్గా ఆయన కనబడు తూనే ఉన్నారు. తమ అనుభవాలు, అనుభూతులు పదిమందితో మనసు విప్పి పంచుకొంటూనే ఉన్నారు.

ఈ నవల ఇప్పటికి నాలుగు ముద్రణలు పొందింది. జె. కాటమయ్య ఈ నవల మీద **1994**లో పిహెచ్.డి. చేశారు. ఆకాశవాణిలో రెండుసార్లు నాటకంగా ప్రసారమైంది.

*ఏప్రిల్, 2008*




# బ్రతికిన కాలేజీ

## పాలగుమ్మి పద్మరాజు

అంతర్జాతీయ స్థాయిలో తెలుగుకథకు గుర్తింపు తెచ్చిన మహా కథకుడు ఆయన. తన ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యంతో ఎన్నో తెలుగు చలనచిత్రాలకి జీవబలాన్నిచ్చి అనూహ్య విజయాల్ని సాధించిన నిగర్వి. తెలుగునాట అద్భుత విజయంతో అనేక వేల ప్రదర్శనలు ఇచ్చిన కీ.శే. నాగభూషణం రక్తకన్నీరు రచనాకర్త ఆయన. కథ రాసినా, పాట రాసినా, పద్యం చెప్పినా, ఏ రచనా ప్రక్రియలోనైనా తనదైన ముద్ర ప్రస్ఫుటంగా ప్రతిబింబించిన ఆ గొప్ప రచయిత కీ.శే. పాలగుమ్మి పద్మరాజు. ఆయన రాసిన కొద్ది నవలల్లో ఒకటి *బ్రతికిన కాలేజీ.*

నలభై ఏళ్ళ క్రితం కొత్త పద్ధతిలో కొత్తరకంగా వెలుగు చూసిన ఎమ్.ఎన్. రావుగారి ఎమెస్కో పాకెట్ పుస్తకాల తొలివిడతలో ప్రచురించ బడిన నవల *బ్రతికిన కాలేజీ.* ఆ విడతలోనే విశ్వనాథ సత్యనారాయణగారి *దిండు కింద పోకచెక్క* నవలా ఉంది. *బతికిన కాలేజీ* తరువాత పునర్ము ద్రణలు పొందింది.

ఎమెస్కో పాకెట్ బుక్స్ నూతన ధోరణికి నిజంగా తగిన నవల *బ్రతికిన కాలేజీ.* రూపరేఖా విలాసాలలో కొత్తదనం ఎమెస్కో పాకెట్

బుక్స్‌వి అయితే, వస్తువులో, పోకడలో, దృక్పథంలో అంతకన్నా కొత్తది బ్రతికిన కాలేజీ.

బ్రతికిన కాలేజీ మొదట ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. బ్రతికిన కాలేజీ అంటే జంతు ప్రదర్శనశాల (జూ). ఆ కాలంలో మద్రాసు చూడడానికి వెళ్ళినవారు బతికిన కాలేజీని, చచ్చిన కాలేజీ (జీవం లేని వస్తువులుండే మ్యూజియం)ని సందర్శిస్తూ ఉండేవారు.

పద్మరాజుగారి సహజ రచనా పద్ధతికి భిన్నమైంది బ్రతికిన కాలేజీ. ఆ విషయం ఆయనే చెప్పుకొన్నారు. రచనలో తాత్త్వికత, జీవన సాంద్రతలకి ప్రాముఖ్యతనిచ్చే పద్మరాజుగారు అలతి అలతి కథాకథనాలతో రచించిన హాస్య నవల బ్రతికిన కాలేజీ.

ఈ నవల ప్రత్యేకతని గ్రహించటానికి, పద్మరాజుగారు ఈ పుస్తకానికి 'నా సంజాయిషీ' అని రాసిన ముందుమాట కీలకమైనది. అందులో...

"అసలు నేను సంజాయిషీ ఎందుకు చెప్పుకోవలసి వచ్చిందంటే- ఈ కథలో నేనవలంబించిన రచనాపద్ధతి నే నలవాటుగా వ్రాసే పద్ధతి కాదు.

"మన జాతి జీవనంలోనూ, సామాజిక జీవనంలోనూ హాస్యం పాలు తక్కువ. ఒక రకమైన హాస్యం, సంస్కృత నాటక సంప్రదాయంలో ఉన్నా, మన సాహిత్యంలో హాస్యరచనలని చెప్పుకోదగ్గవి ఇంచుమించు లేవనే చెప్పాలి. అంచేత ఒక కథని కులాసాగా చెప్పాలని బుద్ధి పుట్టింది. ప్రయత్నం చేశాను.

"హాస్యంలో ఎన్నో రకాలున్నాయి. ఒకటి వెకిలితనాన్ని ప్రదర్శించేది. మన సంస్కృత నాటకాలలో విదూషకులు మొదలు నేటి సినీమా విదూషకుల వరకు ఈ రకం హాస్యానికి ప్రతిరూపాలు. తమ వెకిలిచేష్టలతో మనల్ని నవ్వించడం ఒక్కటే ఈ పాత్రల ప్రయోజనం. ఒకవేళ మనం నవ్వకపోయినా ఆ పాత్రలు నవ్వుతాయి. అవి ఏడిచినా, బాధపడ్డా, ప్రమాదంలో చిక్కుపడ్డా- మనం నవ్వాలి. ఈ పాత్రల అనుభూతితో మనకి సంబంధంలేదు.

"మరొక రకం హాస్యం మనల్ని పొడిచేది. దీనికి సాంస్కృతికమైన ప్రయోజనం ఒకటుంది. రచయిత నమ్మిన కొన్ని సత్యాలను ప్రచారం చెయ్యడానికి ఇదొక శక్తిమంతమైన సాధనం. తన సిద్ధాంతాలకు, నమ్మకాలకు విరుద్ధమైన విషయాలకు కొందరు ప్రతినిధులను సృష్టిస్తాడు రచయిత. వాళ్ళని నిర్దాక్షిణ్యంగా, తోలుబొమ్మల్లా ఆడించి మనం ఈసడించుకొనేటట్టు చేస్తాడు. ఈ రకం హాస్యం, కొద్దిగా నవలల్లోనూ, ఎక్కువగా నేటి నాటకాలలోనూ కనబడుతుంది. దీన్ని వ్యంగ్య హాస్య మనొచ్చు.

"పై రెండు పద్ధతులలోనూ, వాస్తవికతను కొంతగానో, ఎక్కువగానో వికృతం చేసి చూపటం సంప్రదాయం. గయ్యాళి అత్తగారూ, దొంగ వ్యాపారస్థుడూ, రాజకీయ నాయకుడూ వాస్తవికంగా వెకిలివ్యక్తులు కారు. అయితే వాళ్ళలోని ఒక తత్వాన్ని

వెకిలిగా చూపడంవల్ల రచయిత ఒక చెడ్డ గుణాన్ని వెక్కిరిస్తున్నాడన్న సంతృప్తి రచయితకీ, చదువరికీ కలుగుతుంది.

"మన జాతీయసాహిత్యాలలో మచ్చుకైనా కనబడని ఒక రకం హాస్యముంది. ఆ హాస్యానికి నిర్దిష్టమైన స్పష్టమైన సామాజిక ప్రయోజనం ఏదీలేదు. కేవలం సాహిత్య ప్రయోజనమే ఉంది. అటువంటి హాస్య సంప్రదాయం ఒక్క ఆంగ్ల సాహిత్యంలోనే బలంగా ఉన్నట్టు కనబడుతుంది. డికెన్స్, జెరోమ్ కె. జెరోమ్, వోడ్‌హౌస్ నేను చెప్పిన హాస్యరచనా పద్ధతిలో నిష్ణాతులు. డికెన్స్ కూడా పూర్తిగా కాదు. ఈ హాస్యశిల్పం వోడ్‌హౌస్‌లో పరాకాష్ట నందుకుందని నా నమ్మకం. అతని పాత్రలలో అతనికయిష్టు లంటూ లేరు. అతి న్యాయవర్తనుడైన లార్డ్ మొదలుకొని, కన్నపు దొంగవరకూ అతనికి ఆప్తులే. చిత్రమేమంటే- వాళ్ళు మనకి కూడా ఆప్తులైపోతారు. ఆయన కథలు చదువు తుంటే, ఎవరి మీదా ఏవగింపుగాని, కోపంగాని కలగదు మనకి. 'మానవ లోకాన్ని ఇంచుమించు ఒక ఋషిలాగ చూస్తాడాయన,' అన్నాడొక విమర్శకుడు. సంఘటన ఎంత గంభీరమైనదైనా, ఎంత భయంకరమైనదైనా, ఎంత విషాదకరమైనదైనా మనకి ఆయన కలిగించే అనుభవం హాస్యమే. ఆయన వ్రాసిన ప్రతి వాక్యం నేను చెప్పినదానికి ఉదాహరణే.

"పెద్దల్నీ పిన్నల్నీ చండశాసనుల్నీ మెత్తని మనుషుల్నీ చంటివాళ్ళని చూసినట్లు చూస్తాడాయన. లోకానుభవంతో పండిపోయిన మనిషి. ఈ చిలిపి మానవ లోకాన్ని చిరునవ్వుతో, ఆప్యాయతతో చూసినట్టు.

వోడ్‌హౌస్‌లాగ వ్రాయగలగడం అసంభవమని తెలుసు. అయితే వ్రాయాలన్న అభిలాష చాలాకాలంగా బాధపెడుతోంది. వెనుకటికి ఒక భక్తుడు తన భగవానుడ్ని ఉద్దేశించి అన్నట్టు-

"అసాధ్యమైనది సాధించాలని పూనుకున్నాను. నా వైఫల్యాన్ని మీ కర్పిస్తున్నాను."

పద్మరాజుగారి ఈ ముందుమాటలోనే కాదు, ఆయన రచనంతటా ఇంత స్పష్టమైన దృష్టి మనకి కనిపిస్తుంది. తనేమిటో తనకు తెలిసిన రచయితలు అరుదు. అలాంటివారిలో పద్మరాజుగారిది అగ్రశ్రేణి.

ఆయన కథల్లో *గాలివాన*, పడవ ప్రయాణం కథలకి లభించినంత ప్రాచుర్యం కూలిజనం లాంటి మరెన్నో గొప్ప కథలకి లభించలేదు. ఆయన పద్యాలు (కవితలు), వ్యాసాలకీ అంత ప్రాచుర్యం లభించలేదు. ఒకస్థాయి దాటాక ఎక్కువ తక్కువలు అంతగా పట్టించుకోవలసినవి కావు. ఆయన చాలా మంచి రచనలు, ఆయన కొన్ని రచనల నీడనే ఉండిపోయాయయన్నదే బాధ. అలా నీడ చాటున ఉన్న రచనే *బ్రతికిన కాలేజీ.*

ముందుమాటలో ఆయన చెప్పినట్లుగానే తెలుగులో ఒక కొత్త పద్ధతికి కట్టుబడిన హాస్య విధాన రచన ఇది. వెకిలితనం, వ్యంగ్యం, అపహాస్యం, అహంకారం లేవు ఈ నవలలో. అంతేకాదు అన్నింటినీ భరించే సాత్వికత ఉన్న రచన ఇది.

కథాపరంగా చూస్తే చాలా సాదాసీదా కథ. 'పట్టు' అనబడే పట్టాభిరామారావు పెళ్ళిచూపులకి వస్తాడు. కళ్యాణి బదులు ఆమె చెల్లెలు రాధను చూస్తాడు. తొలిచూపు లోనే దిమ్మతిరిగి, మనసు చెదిరి ఆమెకి అర్పించేసుకుంటాడు. ఆ ఇంటాయన పేరు శంకరయ్య. పట్టు తండ్రి పేరు రామయ్య. పెళ్ళిచూపుల కీలక సమయంలో ఒకదాని బదులు మరోరకంగా మాట్లాడుకుని, దెబ్బలాడుకుని ఆ తతంగాన్ని రసాభాస చేసి ఎవరిదారిన వారు జారుకున్నారు.

పట్టు మాత్రం రాధని మరిచిపోలేకపోయాడు. అంతేకాదు తను చూట్టానికి వెళ్ళింది రాధనేనన్న భ్రమలో నానా శ్రమపడి పెళ్ళి స్థిరపరచటానికి కిందామీదా పడి సాధిస్తాడు. అంతా బావుంది అనుకుంటున్న పెళ్ళి సమయంలో పెళ్ళికూతురు కళ్యాణిని చూసి ఒక్క పరుగున పారిపోతాడు. పీటల మీద పెళ్ళి చెడిపోతుంది. ఈ ప్రేమకథ మరింత పీటముడి పడుతుంది.

ఆ తర్వాత విఫల ప్రేమతో పట్టు బాధ, అతని మిత్రుడు చింతా రంగప్రవేశం, పెళ్ళి చెడిపోయిన కళ్యాణి ఉద్యోగ ప్రయత్నం, ఆడదాని అస్వతంత్రతే ఈ అనర్థాలకి కారణం అని తన ప్రేమ నవలా పథక పరిజ్ఞానంతో తీర్మానించిన రాధ... మరో రామలింగయ్య... ఇలా రకరకాల పాత్రల సహజ గుణ వ్యక్తులతో కథ ముందుకు సాగుతుంది.

రాధ, పట్టుల ప్రేమ జయిస్తుందనీ, ప్రధాన ఉపపాత్ర మిస్టర్ చింతా తన వివాహ విముఖతని వదిలేసి కళ్యాణిని చేసుకోవటం ద్వారా ఈ జటిల సమస్య విడిపో తుందని పాఠకులకి తెలుస్తూనే ఉంటుంది. అంత స్పష్టంగా ముగింపు తెలుస్తున్నా, నవలని చదవకుండా ఆపలేకపోవటమే ప్రత్యేకత.

పాత్రల సహజ ప్రవర్తన, సంఘటనల్లో గొప్ప నాటకీయత, వాటి మీద పన్నీరు చిలికినట్టు హాస్యం, నవల ఆద్యంతం ఒక చక్కటి ప్రయాణం.

పద్మరాజుగారు ముందుమాటలో హాస్యరీతులు, హాస్యం ఎలా ఉండాలో చెప్పారు. ఈ నవల చదివితే మరో విషయం తెలుస్తుంది.

ఎటువంటి పరిస్థితిలోనైనా, ఎంతటి విషాదంలోనైనా నవల చదువుతుంటే మనకి తెలియకుండా మనం అప్రయత్నంగా నవ్వితే, అలా నవ్విన తర్వాత కూడా మనకి ఏ రకమైన లజ్జాభావం కలగకపోతే అది ఖచ్చితంగా నూరు శాతం ఆరోగ్యకరమైన హాస్యమే.

బ్రతికిన కాలేజీ మొత్తం ఆరోగ్యకరమైన హాస్యం. అలాగని కేవలం నవ్వుకోటానికి మాత్రమే పనికివచ్చే పరిధిలోని నవల కాదు బ్రతికిన కాలేజీ.

ఈ నవలలోని అతి చిన్న పాత్ర నుంచి ముఖ్య పాత్రల వరకూ ఏ పాత్రని చూసినా, వాటి వెనుక ఉన్న బ్రతుకు బలహీనతలు, బలాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఏ పాత్ర మీద, ఏ సంఘటన మీద, చివరికి ఏ ఒక్క సంభాషణ మీద పాఠకుడికి ఏవగింపు, అయిష్టం కలగవు. వాళ్ళ చుట్టూ ఉన్న పరిస్థితులు, వారి మనస్థితి ఆధారంగా పాఠకులే వకాల్తా పుచ్చుకొని సమర్థిస్తారు. ఈ రకం పాత్రచిత్రణ, కథావిధానం అనితరసాధ్యం అనిపిస్తాయి. మాటల్లో చెప్పటమే కాదు (ముందుమాటలో చెప్పినట్టుగా) బ్రతికిన కాలేజీని సాహిత్యంగా నిలబెట్టారు పద్మరాజు. చాలా కీలకమైన వస్తువుతో రచన చెయ్యటం ఎంత కష్టమో, అంతకు మించిన కష్టం ఇటువంటి రచన అనిపించక మానదు.

తెలుగులో హాస్య నవలలుగా పేరు పొందిన వాటిలో బ్రతికిన కాలేజీ ఇంత వరకు అంతగా చోటు చేసుకోకపోవటం దురదృష్టం. వెకిలితనం, కించపరచక పోవటం, వ్యంగ్యాన్ని ప్రయోజన దృష్టితో వాడుకోకపోవటం బ్రతికిన కాలేజీకి ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టాయి.

బ్రతికిన కాలేజీ నవల రచనా ప్రత్యేకతని తెలిపే సంఘటనలు, సంభాషణలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని...

పెళ్ళిచూపులలో గందరగోళం తర్వాత, ప్రేమపిచ్చిలో ఉన్న పట్టుకి దెయ్యం పట్టింది, మతి చలించిందన్న భ్రమతో వైద్యం చేయించాలని భూతవైద్యుణ్ణీ, తలగొరిగి నిమ్మకాయ మర్దనకి మంగలి రాముడ్ని పిలిపిస్తారు. పెళ్ళిళ్ళ పేరయ్య పట్టుని రక్షించాలని అతని మిత్రుడు చింతా దగ్గరకి వెళ్ళి హడావుడిగా పరిస్థితి చెపుతుంటాడు.

చింతాకి అప్పుడప్పుడు ఓ చిత్రమైన ట్రాన్స్‌లోకి వెళ్ళే అలవాటు. అప్పుడతని ప్రవర్తన గమ్మత్తుగా ఉంటుంది.

"అదికాదండీ! అతన్ని కాళ్ళూ చేతులూ కట్టేసి, నూతి చప్టా మీదికి లాక్కుపోయారు!" అంటూ గోలెట్టాడు పేరయ్య.

"చప్టా మీదికా? ఎందుకు?"

"క్షవరం చెయ్యడానికి."

"చెయ్యనివ్వండి. పాపం! తల మాసినట్టుంది. చాలా అవసరం. గడ్డం కూడా గీయించండి."

ఈ సంఘటనలో ఏ పాత్రా అతిగా ప్రవర్తించక, సహజంగానే ఉండటం ప్రత్యేకంగా గమనించదగ్గ విషయం.

ఇలాంటి సంఘటనలెన్నో ఉన్నాయి ఈ నవలలో. అవన్నీ ఆరోగ్యకరమైన ప్రత్యేక తరహా హాస్యాన్ని అందించడం ప్రత్యేకత.


ఈ నవలలో కథ ముగింపు ఏమిటో ముందుగానే గ్రహించటం అంత కష్టమైందేమీ కాదు. కానీ నవలని వదలకుండా చదువుతాం. కుతూహలం ఎక్కడా కుంటుపడదు. అదో ప్రత్యేకత అయితే కొన్ని సంఘటనల్లో కూడా అదే టెంపో పద్మరాజుగారు సాధించటం మరో విశేషం.

కళ్యాణి, రాధ స్వతంత్రంగా బతకాలన్న ఉద్వేగంలో భాగంగా నాట్య ప్రదర్శనలకి దిగుతారు. తొలి నాట్య ప్రదర్శన అది. అక్కడికి చింతా పట్టుని బలవంతంగా తీసుకొస్తాడు. ఆ ప్రదర్శనలో రాధ కనిపిస్తుందని పట్టుకి తెలియదు. కానీ పాఠకులకి తెలుసు. ప్రదర్శనకి చింతా సీట్ల పేచీవల్ల గట్టి అవాంతరం వస్తుంది. ప్రదర్శన జరుగుతుందని నవల చదువుతున్న వాళ్ళకి తెలుస్తుంది. కానీ వచ్చిన అవాంతరం ఎలా తొలగిపోతుందన్న కుతూహలం ఉంటుంది.

'దయ్యాలూ అప్పుడప్పుడు సబబుగానే మాట్లాడతాయట...' లాంటి పద్మరాజు మార్క్ ప్రత్యేక వాక్యాలెన్నో ఉన్న నవల *బ్రతికిన కాలేజీ.* కేవలం అటువంటి వాక్యాల కోసమైనా తప్పక పఠించాల్సిన నవల.

ఈ పంథాలోనే పద్మరాజుగారు రాసిన మరో నవల, *రెండవ అశోకుడి మూన్నాళ్ళ పాలన,* కూడా ఎమెస్కో పాకెట్ బుక్స్ ద్వారా ప్రచురితమై విశేష ప్రజాదరణ పొందింది.

*మే, 2008*




# స్వర్ణసీమకు స్వాగతం

## మహేంద్ర

స్వర్ణసీమకు స్వాగతం మధురాంతకం మహేంద్ర రాసిన ఏకైక నవల.

నవల అనగానే వందల పేజీలు ఉండటం సహజం. కానీ ఈ నవల 111 పేజీలు మాత్రమే. తెలుగులో చిన్న నవలలు తక్కువనే చెప్పాలి. చిన్న నవలలో ఎంతో ఎక్కువ జీవితాన్ని అందించిన నవలల్లో ప్రముఖంగా చెప్పుకోదగింది స్వర్ణసీమకు స్వాగతం. విలక్షణంగా, నూతనంగా కథను చెప్పిన తీరు ఈ నవల ప్రత్యేకత.

కుప్పం నుంచి పెద్దపర్తిగుంట ప్రయాణం ఈ నవలలో కథ. కొద్ది గంటల బస్సు ప్రయాణాన్ని నవలకు కథగా మలుచుకోవటం చాలా అరుదైన విషయం. చదవటం ఆరంభించిన దగ్గర్నుంచీ వదలకుండా చదివింపజెయ్యటం రచయిత ప్రతిభ.

నవీన్ రాసిన అంపశయ్య నవలలో కథాకాలం 24 గంటలు. మహేంద్ర రాసిన ఈ నవలలో కథాకాలం కేవలం అయిదారు గంటలు మాత్రమే. ఈ అల్పకాలంలోనే అనల్పమైన జీవన వాస్తవికతలను, వ్యక్తుల మనస్తత్వాన్ని అద్భుతమైన విశ్లేషణా శైలితో ఆయా పాత్రలను కళ్ళ

ముందు నిలబెట్టారు మహేంద్ర. ఇప్పుడు ఓ విశ్వవిద్యాలయంతో, ఓ ముఖ్యమంత్రి నియోజకవర్గంగా సుప్రసిద్ధమైన కుప్పం నిజానికి 1985 నాటికి ప్రసిద్ధమైన ఊరేమీ కాదు.

తిమ్మరాయప్ప, మల్లెసెండు, అప్పోజి, వసంతనాయునివారు, భాగ్యమ్మ, కోమలమ్మ, తిప్పయ్యగౌడు, అత్తినీరాలు, సుందరేశ వడియార్, జగదాంబ... ఈ ప్రయాణంలోని కొన్ని పాత్రలు. పొరుగుపల్లె క్రాసు, బిజిగానిపల్లె, చీకటిపల్లె ఈ ప్రయాణంలోని ఊళ్ళు. ఈ పేర్లు, ఈ ఊళ్ళు ఇదే ప్రాంతం కథో స్పష్టంగా చెపుతాయి. నీటికి కటకటలాడే రాయలసీమలోని కొన్ని గంటల బస్సు ప్రయాణాన్ని, అక్కడి జీవన విధానంతో మమేకం చేసి మహేంద్ర ఒక అద్భుత జీవిత వాస్తవికతని, తాత్వికతని అతి తక్కువ పేజీలలో మనముందు ఉంచాడు.

తిమ్మరాయప్ప వృద్ధుడు. బడుగు రైతు. నీటికి కటకటలాడే వ్యవసాయం చేసి చేసి అలిసి, ఇంకా ఆశ చావక తన పొలానికి బోరుబావి కోసం ఆత్రపడుతున్న మనిషి. బోరుబావి ప్రయత్నంలో, బేంకు అప్పుకోసం తిరగటంలో తప్పనిసరిగా డబ్బు ఖర్చుచేసే ఆ ముసలి ప్రాణం ఎందరికో ఎన్నో లంచాలు ముట్టచెప్పినా ఆ బక్క రైతు గొంతు ఎండుకుపోతున్నా, ఇరవైనాలుగు గంటలుగా ఆహారం లేకపోయినా, నవనాడులు బిగబట్టి తన ఊరు చేరుకోవాలనీ, ఇంటికి వెళ్ళాకే రెండు మెతుకులు తినాలనీ పెద్దపర్తి గుంట బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు.

పైన ఎండ నిప్పులు చెరుగుతోంది. ఒంటికి నిముషం పాటు ఎండ తగిలితే చాలు చమటలు ధారగా కారేలా ఉంది వేడి. అటువంటి సమయంలో జ్వరంతో ఉన్న పిల్లాడితో, చేతిలో పిల్లాడి పాలసీసా, పాత గుడ్డల సరంజామాతో అతి కష్టం మీద బస్టాండు కొచ్చింది సుభద్ర. అక్కడ బస్ జాడలేక, ఆ ఎండలో జ్వరం పిల్లాణ్ణి ఉంచ లేక పక్కనున్న టీ అంగడికి వచ్చి వేడి బండ మీదే సర్దుకు కూచుంది. టీ అతన్ని ఓ గ్లాసు నీళ్ళు ఇమ్మంటే, అసలే బేరాలు లేని అతను, 'అరగంటసేపు బోరింగు కొట్టినా ఒక గరిగ నీళ్ళు రావటంలే... వచ్చినాళ్ళందరికీ సలివేంద్రం పెట్టుకుంటే నేను యాపారం చేసి కడతేరినట్టే...' అన్నాడు ఘాటుగా. 'బిడ్డతల్లిని నీళ్ళియ్యన్నా,' అని జాలిగా అడిగినా అతను కరగ లేదు. సినిమాకి టిక్కెట్టు దొరక్క విసుగ్గా ఆ అంగడికి వచ్చిన వెంకటపతికి సుభద్ర రాజకుమారిలా కనిపించింది. అతను ఓ పెద్ద నోటు అంగడివాడికి ఇచ్చి సుభద్ర అవసరాలు తీర్చాడు. సుభద్ర కొంచెం తేరుకుని నవ్వింది. ఆ సుభద్ర పెద్దపర్తిగుంట బస్సు కోసం చూస్తోంది. సుభద్ర మీద క్షణాల్లో మోజు పెంచుకున్న వెంకటపతి ఎక్కాల్సిందీ ఆ బస్సే.

అలాగే బాగా తాగిన అత్తి నీరాలు, సంపంగి గౌడు, ఆ ప్రాంతంలో ఉన్న బంగారుగనుల మీద, సమాచారం సేకరించాలని వచ్చిన పత్రికా విలేఖరి రమణ మూర్తి, భాగ్యమ్మతో శృంగారం కోసం వచ్చిన అప్పోజి, అతని గురువు లీడరు, లీడరు శిష్యుడు తిప్పయ్యగౌడు, తిరుమల దర్శనం నుంచి వస్తున్న సీమేగౌడు, అప్పోజి ఎదురుచూస్తున్న భాగ్యమ్మకి ఇరువైపులా కుదురుకుపోయిన మల్లెసెండు, వెంకటస్వామి, గత వైభవం కరిగిపోయినా అభిజాత్యం కొంచెం మిగిలిపోయిన మాజీ జమీందారు వసంతనాయని వారు, వారి మంత్రిసముడు చాకలి లింగయ్య... ఇలా ఎందరెందరో ఎదురుచూస్తున్నదీ పెద్దపర్తిగుంట బస్సు కోసమే.

ఇంతకీ ఆ పెద్దపర్తిగుంట బస్సు ఎప్పుడు రావాలి, ఎప్పుడు వెళ్ళాలి అంటే, అది ఓ బ్రహ్మ రహస్యం లాంటిది. దానికి తగుమాత్రం వివరణ చెప్పాలంటే... అత్తినీరాలు భాషలో...

"ఆ సమయం చెప్పేదానికి లేదే! ఒక దినం పది గంటలకే కుప్పం ఎలబారేస్తాది. ఒక్కో దినం మద్దాన్నం రెండు గంటలకు కూడా పలమనేరులో బయల్దేరదు. ఒక్కో దినం సిత్తూర్లోనే కాలు పైకెత్తేస్తాది. సినుకు నేలబడిందంటే కుప్పమొచ్చినా సంగనపల్లి చేర్దానే నమ్మకం లేదు."

ఓ పాసింజరు బస్సులో ఈ రకం ప్రయాణం ఎన్ని రకాల నరకాల్ని చూపి స్తుందో చాలామందికి తెలియకపోవచ్చు. కానీ ఆ అనుభవం ఉన్నవాళ్ళకి మాత్రం అది సింహస్వప్నమే. దూరం కొద్ది మైళ్ళే, సమయానికి బస్ వచ్చి గమ్యం చేరితే పట్టేది గంట, గంటన్నరే. కానీ మధ్యాహ్నం నుంచి ఎదురుచూస్తున్న పెద్దపర్తిగుంట బస్సు సాయంత్రం ఐదు తర్వాత రావటం, అప్పటికీ ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక పోవటం, బయలుదేరినా ఎక్కడివరకు వెడుతుందో, ఎప్పటికి చేరుతుందో అగమ్య గోచరంగా ఉండటం... మహేంద్ర అద్భుతంగా దృశ్యీకరించటమే కాదు, మొత్తం ఈ వ్యవహారం వెనక ఉన్న ఆర్థిక, సాంఘిక, తాత్త్విక నేపథ్యాన్ని ప్రత్యేకించి చెప్పకుండానే కథనంలో ఒదిగిపోయేలా చేయటం ఈ నవల ప్రత్యేకత.

ఈ దేశంలోని చాలా పల్లెలు, చాలా పనులకి దగ్గరలో ఉన్న మండల, తాలుకా కేంద్రాలైన టౌన్ల మీద ఆధారపడ్డ యంత్రాంగంలో ఉన్నాయి. బేంకుకి, హాస్పిటల్‌కి, సంతలకి, ప్రత్యేక అవసరాలకి ఏదైనా వస్తువుల కొనుగోలుకి, సినిమాలాంటి వినోదాలకి, ఏదైనా పెద్ద ఊరు వెళ్ళాలంటే కూడలిగా బస్సు మారటానికి... ఒకటేమిటి ఇలా చాలావాటికి టౌన్లకి రావటం తప్పదు. పది పన్నెండు మైళ్ళ ప్రయాణం చేసి తమ పల్లె తిరిగి చేరుకోవటానికి ఒక రోజంతా యాతన పడటం **1985**లో మహేంద్ర ఈ నవల రాసేనాటికే కాదు ఇప్పటికీ తప్పటంలేదు. అప్పటికీ ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో

జరిగిన మార్పల్లా షేరింగ్ ఆటోలు, టిక్కీలు, వేన్లు లాంటివి వాడుకలోకి వచ్చాయి. వాటి శాతం అంత ఎక్కువేమీ కాదు. అందువల్ల ఈ ప్రయాణ నరకం లో పెద్ద మార్పు లేదు. కొందరు తప్పనిసరై ఈ ప్రయాణ బాధని భరిస్తారు. కొందరు అలవాటుగా, మరికొందరు తిమ్మరాయప్ప లాంటివారు జీవచ్ఛవంలా అనుభవిస్తారు.

సరైన రవాణా సౌకర్యం లేని పల్లె ప్రయాణానికి మహేంద్ర నవలని పరిమితం చెయ్యలేదు. ఈ ప్రయాణ నేపథ్యంలో జీవన రీతిని, మానవనైజాన్ని పట్టి చూపించాడు.

నరకంలాంటి ఈ ప్రయాణంలో కూడా కొందరు సంతోషం గా తమ కోర్కెలు తీర్చుకోటానికి ప్రయత్నించారు. కొందరు తమ మామూలు తత్వాన్నించి కొంతసేపైనా బెసికారు. కొందరు అప్పటికప్పుడే ఆశపడ్డారు. మరికొందరు నిరాశలో కూరుకు పోయారు. పరిస్థితుల్ని అనుకూలంగా మార్చుకోవటానికి ప్రయత్నించినవారు కొందరు. ఎంతమాత్రం ఎదురు తిరగలేక తలవంచుకు గడిపినవారు మరికొందరు.

తిమ్మరాయప్పకి బతుకు భారం మోసిమోసి, వాస్తవాలు తెలిసీ బతుకు ఇలా ఉందేమిటా అన్న దిగులు. ప్రయాణంలో ముందే నిస్త్రాణ. కొడుకుని వైద్యం కోసం తీసుకువచ్చిన సుభద్రకి పిల్లాడు కులాసాగా ఉంటే కులాసా, వెంకటపతి వేపు మొగ్గు చూపి కాస్తంత గాడి తప్పింది. మళ్ళీ పిల్లాడికి బాగా లేకపోవటం చూసిన ఆ తల్లి పశ్చాత్తాపపడింది. ఆడతనం కన్నా తల్లితనంలో బలం తెలిపే వాస్తవ చిత్రణ ఇది. భాగ్యమ్మ మీద మోజుతో వచ్చిన అప్పోజి ఆశానిరాశలు... భాగ్యమ్మ జీవితం, ఆవిడ దగ్గర చేరిన మగాళ్ళు... ఇదంతా కేవలం బస్ ప్రయాణంలా కాకుండా, జీవనయానం లా ఉండటం స్వర్ణసీమకు స్వాగతం ప్రత్యేకత.

వసంతనాయునివారు ఓ ప్రత్యేక వ్యక్తి. జమీందారీ వంశస్థుడు. ప్రస్తుతం జమీ లేదు, డబ్బు లేదు. ఆయనకి తన పూర్వీకుల వైభవ అభిజాత్యం తప్ప ఏమీ లేదు. ఆయనా ఈ బస్ ప్రయాణీకుడే. ఆయన ఓ బేగ్‌ని ప్రాణ సమానంగా చూసుకుంటు న్నాడు. ఆయనకి ఎంతో విశ్వాసపాత్రుడైన చాకలి లింగయ్యకి, ఆ బేగ్‌లో ఆయన ఆఖరి ఆస్తి పదిహేను సవరల బంగారం ఉందేమోనన్న సందేహం. చివరికి ఆయన బేగ్‌లో ఉన్నదేమిటో తెలిస్తే ఆశ్చర్యమే కాదు, దుఃఖం కూడా వస్తుంది. అందులో ఉన్నవి పాత చెప్పులు. ఆ సంగతి లింగయ్యకి తెలిశాక-

"రెండిటికీ ఉంగరాలు పోయినాయిరా లింగా! కొత్తవే. పారేద్దామంటే మనసు రాలే. ఎండలకాలం, కాలంతా ఆనెలు, దారంతా ముండ్లు, పుంతంతా గులక- అవి లేకపోతే అడుగు వెయ్యలేను. రేపు నారిగాడ్ని పిలసకరా కుట్టించాల," నాయని వారు క్రింద పడిన వాటిని రెంటినీ దీసి బ్యాగులో వేసుకుని నడవసాగారు. తన చెప్పులనైనా నాయనివారికిస్తే బావుండుననిపించింది. లింగయ్యకు, కానీ ఏం లాభం! అవి ఆయనకు

సరిపోవు. సరిపోయినా ఇంటికి వెళ్ళేలోపు అని ఆయన పాదాలను కరవడం ఖాయం, లింగయ్య తన చెప్పులను కూడా తీసి చంకలో ఇరికించుకుని నడవసాగాడు.

ఆస్తులు కరిగిపోయినా పెద్ద చిన్న అనుబంధం, గౌరవం, ఓ దగ్గరితనం చూపిస్తూ ఇదంతా రూపు మార్చుకుంటున్న తీరుని లీడరు, అతని శిష్యుడి సంబంధంలో చూపించటం మహేంద్ర నైపుణ్యం.

మంచి పేరు రావాలన్న స్వార్థంతోటే కావచ్చు జమీందారు, అన్నీ పోగొట్టుకొని దుర్భర జీవితాన్ని అనుభవించారు. అయినా ఆయనలో మంచితనం చావలేదు. కొందరు తమ స్వసుఖం కోసం, ఆనందం కోసం ఎన్నో దుర్మార్గాలు చేస్తారు. పల్లెలో ఇలాంటి రెండు రకాల వ్యక్తుల మధ్య వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనబడు తుంది.

వ్యక్తుల మధ్య, పరిస్థితుల మధ్య వ్యత్యాసం చూపించటం చాలామంది రచనల్లో కనబడతాయి. కానీ స్వర్ణభూమికి స్వాగతంలో తాత్విక విధానాన్ని ప్రశ్నించటం, సాంఘిక సంబంధ ఆలోచనారీతిని ఎత్తిచూపటం ప్రత్యేకత.

ఆ ప్రాంతం బంగారం గనుల గురించి అడిగిన పత్రికా విలేఖరి రమణమూర్తితో తిమ్మరాయప్ప-

"గెనిలో పని అంటే మిత్త్తవతో పోరినట్టే ఉండాది. పోయిన పండగ నెల్లో ఆ సొరంగాల్లో నేల అల్లుకోని మా వోళ్ళు ముగ్గురు ఒకేనాడు కాలమయిపోయిరి. ఆ గెన్లో పడే కష్టం బూమ్మీదనే పడితే రాజనాలు పండు. అయినా బంగారం మీద జనాల కెందుకింత ప్రేమో తెలవటం లేదు. అదేమన్నా కూట్లోకి వస్తాదా? కూర్లోకి వస్తాదా? సేతుల కష్టంతో వడ్లు పండించు రాగులు పండించు. తిండి జరగతాది. టెంకాయ సెట్లు బెట్టు, మామిడి తోపులు బెట్టు. మనుషులకు నీరు దొరకతాది. ఊరు వాడంతా పచ్చగ లచ్చిమి కళకళలాడతాది. ఒక గురుగింజంత బంగారం కోసం ఎకరాలు ఎకరాలుగా నీళ్ళు పెట్టేసినారు. నాకు తెలీక అడగతా సా. ఈడకొచ్చిన ప్రతి పెద్దమనిషి ఈడ బంగారం దొరకతాదా, ఈడ బంగారం దొరకతా ఉండాదా అని అడగతా ఉండాడే, ఎవురేగానీ ఇక్కడ తాగేదానికి నీళ్ళు దొరకతా ఉండదా అని అడగతా ఉండాడా? భూమండలానికి సొరంగం ఏసినట్టుగా యోజనాలు యోజనాలుగా తవ్వి కేజీఎఫ్‌కు ఎత్తుకోని బోతా ఉండారే? మంచినీళ్ళు తాగను సేదబావులు తవ్వాలని ఎవురైనా అనుకుంటా ఉండారా?

సంపదకోసం ప్రణాళికలు... ప్లాన్లు తప్ప... మెజారిటీ జనం కోసం... వారి బతుకు స్వర్ణసీమగా మారటం కోసం ఎవరి ఆలోచనేనా సాగుతోందా?

సరుకుల రవాణా కోసం, వ్యాపారం కోసం రోడ్లు వేస్తారు తప్ప జన సౌకర్యం కోసం రోడ్లు వేస్తున్నారా? జీవితావసరం అయినా మంచినీళ్ళ కోసం ఏం చేస్తున్నారు?


ఇన్ని నదులు, వనరులు ఉన్న ఈ భారతదేశంలో అన్నింటి కన్నా ముందు మంచి నీళ్ళు ముఖ్యం అన్న ఆలోచన సాగుతోందా?

మహేంద్ర దార్శనికత గొప్పది. 1985లో అతని ఊహ ఇప్పటికీ సాదృశమే.

ప్రఖ్యాత రచయిత కీ॥శే॥ మధురాంతకం రాజారాంగారి చిన్న కొడుకు, కథా రచయిత నరేంద్ర సోదరుడు మధురాంతకం మహేంద్ర పట్టుమని పాతిక కథలయినా రాయకుండానే, రెండవ నవల రాసే అవకాశం రాకుండానే 2002లో లివర్ వ్యాధితో హఠాత్తుగా ఈ లోకం నుంచి నిష్క్రమించడం తెలుగు సాహితీరంగ విషాదాల్లో ఒకటి.

చిన్నవయసులోనే మననీ, సాహితీ లోకాన్ని వదిలేసి మహేంద్ర వెళ్ళిపోవడం తెలుగు సాహిత్యానికి లోటే.

*జూన్, 2008*




# విశాల నేత్రాలు

## పిలకా గణపతిశాస్త్రి

**పం**తొమ్మిదివందల అరవై దశకం, తెలుగు వార, మాసపత్రికలకి బంగారు కాలం. అద్భుతమైన కథలు, మంచి వ్యాసాలు, చక్కటి బొమ్మలు, ఉగాది, దీపావళి ప్రత్యేక సంచికలు, సాహితీ వాతావరణం ఎంతో ఉత్తేజంగా ఉండేది. సాహిత్యానికి పరిమళం అద్దినట్టు ప్రత్యేక సంచికలకి ఆంధ్ర సచిత్ర వారపత్రికవారు, కునేగా మరికొళందు అత్తరు అద్దేవారు. నవలలు ధారావాహికలుగా ఆదరం పెంపొందించుకొంటున్న కాలం అది. ఆ కాలంలో ధారావాహికంగా ఆంధ్రపత్రికలో ప్రచురింపబడిందే విశాల నేత్రాలు నవల. రచన పిలకా గణపతిశాస్త్రిగారు, బొమ్మలు బాపు. ఆ నవల కోసం వారం వారం పాఠకులు ఎంతగా ఎదురుచూసేవారో, అంతగానూ 'ఆ వారం బాపు ఏ బొమ్మ వేసుంటారో' అని ఎదురుచూసేవారు.

ఈ బాపుగారి బొమ్మలకి అంత ప్రాచుర్యం లభించటమే కాదు, రచనలకి బొమ్మల ఆవశ్యకతని ప్రత్యేకంగా నిరూపించిన నవల విశాల నేత్రాలు. మాటలలో పిలకా గణపతిశాస్త్రిగారు కూర్చిన అనేక రకాల వర్ణనల్ని, సౌందర్య వివరాల్ని అద్భుతంగా బాపుగారు చిత్రీకరించి ప్రాణప్రతిష్ట చేశారు.

వైష్ణవభక్తికి, సంప్రదాయానికి సంబంధించిన వస్తువు విశాలనేత్రాలు నవలది. కథాకాలం క్రీ.శ. పదకొండో శతాబ్దం. కథకి నాయికా నాయకులు హేమసుందరి, రంగనాయకులు. కానీ కథకి ఆయువుపట్టు శ్రీమద్రామానుజ యతీంద్రులు. హేమసుందరి విశాలనేత్రాల సోయగంతో ఆరంభమైన నవల ఎంతో రసవత్తరంగా శ్రీ రంగనాథుని విశాల నేత్రాల సౌందర్యం వరకు నడిచి, ఎంతో గాఢమైన విషయాన్ని సుబోధకం చేస్తుంది.

రంగనాయకుడిది నిచుళాపురం. కాంచీపురాధిపతుల పాలనలో ఉన్న ప్రాంతం. అతని తండ్రి వెంకట నాయకుడు, తల్లి లక్ష్మీదేవమ్మ. తండ్రి ఊరి పొలిమేరల్లో నివాసం ఉంటూ, వ్యవసాయం మీద గౌరవంగా బతకటమే కాదు, పరిసరాల్లో ఉత్తముడని పేరు పొందాడు. రంగనాయకుని సోదరులు తండ్రికి చేదోడువాదోడుగా ఉన్నారు. సంతానం అందరిలోకి గారాబు పుత్రుడవటం వల్ల రంగనాయకుని ధోరణి వేరుగా మారింది. అతనికి సాముగరిడీలంటే అమిత అభిమానం. వాటివల్ల అతని శరీరం దృఢంగా, తీరుగా రూపుదిద్దుకొంది. సహజంగా అందగాడైన అతనికి ఈ తీరైన దేహం మరింత అందాన్నిచ్చింది.

నిచుళాపురంలో పేరెన్నికగన్న వేశ్య శృంగారమంజరి. ఆమెకు ఇద్దరు కుమార్తెలు- మాణిక్యవల్లి, హేమసుందరి. ఇద్దరూ అమిత సౌందర్యవంతులే అయినా, హేమ సుందరి అందానికి ఆమె అతి విశాల నేత్రాలు అదనపు ఆకర్షణ. నిచుళాపురం లోనే కాదు, చుట్టుపక్కల ఎక్కడా మెతో సరిపోల్చదగిన సౌందర్యవతి లేదు. అటువంటి రంగనాయకుడు, హేమసుందరి పరస్పరం గాఢంగా ప్రేమించుకున్నారు.

హేమసుందరిని ఏ మహరాజు స్థాయి మగాడికో అప్పజెప్పి విపరీతంగా ధనం సంపాదించాలన్నది శృంగారమంజరి తహతహ. సంప్రదాయ కుటుంబంలో పద్ధతిగా రంగనాయకునికి పెళ్ళి చెయ్యాలని తల్లిదండ్రుల ఉద్దేశం.

ఈ మనస్థితుల్ని ప్రతిబింబించేటట్టు నవల ఆరంభమౌతుంది. నిశరాత్రి సమయంలో, కావలివారి కన్నుగప్పి శృంగారమంజరి భవన ఆవరణలో చొరబడ తాడు రంగనాయకుడు. హేమసుందరి గదికి దగ్గరలోని చెట్టు ఎక్కి గుబురులో దాక్కొం టాడు. అతని రాక తెలిసి హేమసుందరి గవాక్షం దగ్గరికి రాగానే, అమిత తమకంతో అక్కడికి చెట్టు మీంచి గెంతుతాడు రంగనాయకుడు. గాలిలో వేళ్ళాడు తున్నట్టు ఒక్కక్షణం దొరికిన సమయంలో ఆమె విశాలనేత్రాలని ముద్దాడతాడు. ఈలోగా కావలి వారి కంటబడటంతో నానా రభసా అవుతుంది. వారందరిని తన్ని బైట పడతాడు. చీకటి వల్ల, ఒంటికి రాసుకున్న నల్లటి రంగు వల్ల వారెవరికీ రంగ నాయకుడు ఆనవాలు తెలియకపోయినా, ఈ వ్యవహారాన్ని ఆరా తియ్యటానికి ఈ సంఘటన మూల కారణ మౌతుంది. ఇంతటి సాహసంలోనూ రంగనాయకునికి హేమసుందరి విశాల నయనాల

పట్ల ఉన్న ఆరాధన అద్వితీయం అనిపిస్తుంది. అతనికి ఊహలో, కోరికలో, ప్రేమలో... అన్నింటా ఆ విశాల నేత్రాలే.

మాణిక్యవల్లి ఉంపుడుగాడు, ధనవంతుడు తిరుమలరెడ్డి కన్ను హేమసుందరి మీద ఉంది. ఆమెను ఎలాగైనా పొందాలన్నది అతని కాంక్ష. అంత సాహసంగా వచ్చింది మామూలు దొంగ కాదని, హేమసుందరి గురించే అని అతని అనుమానం. తిరుమల రెడ్డి మోజు హేమసుందరి మీద ఉందని గ్రహించి ఈసుతో రగిలిపోతున్న మాణిక్యవల్లి వేశ్యాజాణతనంతో చెల్లెలి దగ్గర నుంచి వచ్చింది రంగనాయకుడేనన్న రహస్యం గ్రహించి తిరుమలరెడ్డికి చేరవేసింది. తిరుమలరెడ్డి హేమసుందరి ప్రేమ వ్యవహారం తెలిసి మనసు మార్చుకుంటాడని ఆశించింది. కానీ తిరుమలరెడ్డి తన పనివాడు, బలిష్టుడు అయిన సింహాచలంతో దొంగదెబ్బ తీయించి రంగనాయకుని ఒళ్ళు హూనం చేయించాడు. దైవికమేమో, వీరి ఎవ్వరి ఆలోచనలు వారనుకున్న ఫలితాన్నివ్వలేదు సరికదా, రంగనాయకుడు హేమసుందరి ఓ పథకం ప్రకారం నిచుళాపురం వదలి పారిపోవటానికి దోహదపడ్డాయి.

ఎంతో చాకచక్యంగా, ఎవరికీ దొరకకుండా వీరిద్దరూ ఇరవై ఐదు కోసుల దూరం ప్రయాణం చేసి, కావేరి దాటి, ఆవలవేపు నున్న శ్రీరంగం సురక్షితంగా చేరారు. అక్కడ ఓ చక్కటి భవంతి అద్దెకు తీసుకుని హేమసుందరితో కలిసి నివాసం ఏర్పాటు చేసు కున్నాడు రంగనాయకుడు. ఇద్దరూ ఎందుకేనా మంచిదని ధనుర్దాసు, హేమాంబ అని కొత్త పేర్లు పెట్టుకున్నారు (పదేళ్ళ క్రితం ధనుర్దాసు అన్న పేరుతో దూరదర్శన్ వారు ఈ కథని చిత్రీకరించి ప్రసారం చేశారు).

ఇంతవరకు ఒక దొంగ, ఒక వేశ్యాపుత్రికల మోహగాథగా నడుస్తున్నట్టు కనబడే విశాల నేత్రాలు నవలలోని గాఢత ఇక్కడ నుంచే ఆరంభమవుతుంది. రక్తి భక్తిగా, భక్తి ముక్తిగా రూపాంతరం చెందే చక్కటి గమనం ఇక్కడ నుంచే మొదలు.

అడ్డంకులన్నీ అధిగమించి శ్రీరంగం క్షేమంగా చేరటం, దైవం రంగనాథుని కృపేనని భావించిన రంగనాయకుడు ఓ విచిత్రమైన మొక్కు మొక్కుకున్నాడు. హేమ సుందరి నేత్రాలంత విశాల బంగారునేత్రాలు, ఆమె పెట్టుకునేంత బంగారు బొట్టు చేయించి స్వామికి సమర్పిస్తాననుకున్నాడు. అది విన్న హేమసుందరి ముక్కున వేలు వేసుకుంది. మొక్కే విచిత్రమైతే, చేయించిన వాటిని హేమసుందరి కొలతలతో సరిపోయాయో లేదో పెట్టి పరీక్షించటం మరో చోద్యం. ఇలా తన మీద ఉంచి మలినమైన వాటిని స్వామికి సమర్పించటం తప్పు కాదూ? అని ప్రశ్నించింది హేమసుందరి. ఆ ప్రశ్నతో కొంత అనుమానం కలిగినా, 'కొలతలు తీసుకోవటం తప్పేం కాదులే,' అని సరిపెట్టుకున్నాడు రంగనాయకుడు. హేమసుందరితో కలిసి రంగనాథునికి ఎంతో భక్తిప్రపత్తులతో వాటిని సమర్పించి, తమ గోత్రనామాలతో జరిగిన అర్చననే వివాహంగా

భావించి, అమితానందంతో దేవళం నుంచి తిరుగు ప్రయాణం అయ్యాడు రంగ నాయకుడు.

అసలే అమితానందంగా ఉంది. దానికితోడు ఆరోజు హేమసుందరి సౌందర్యం, అలంకరణ కన్ను చెదరగొడుతున్నాయి. చిరు ఎండ ఆమె మీద పడి బంగారం మెరుపులు చిందిస్తోంది. ఎండకి కందుతున్న ఆమెని సంరక్షించేందుకు పట్టు గొడుగుతో రంగనాయకుడు ఆరాటపడుతున్నాడు. ఆమె సిగ్గుపడుతూ వారిస్తోంది. ఈ సుందర దృశ్యాన్ని శ్రీరంగవాసులందరూ మైమరచి చూస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన శ్రీమద్రామానుజ యతి రంగనాయకుని చూశారు. ప్రసన్న దృక్కులతో ఒకటికి రెండుసార్లు రంగనాయకుని వీక్షించారు.

ఆయన చూపులే ఆశ్చర్యమైతే, ఆ తర్వాత రామానుజ మఠం నుంచి అంతేవాసి దాశరథి రంగనాయకుని ఇంటికి వచ్చి స్వామి రమ్మంటున్నారని చెప్పటం అత్యంత ఆశ్చర్యం.

స్వామి ఎందుకు రమ్మన్నారో తెలియక హేమసుందరి, రంగనాయకులు కంగారుపడ్డారు. రాచబాటలో వారి ప్రవర్తనకి కినుక వహించి మందలించటానికి అయి ఉంటుందని మఠానికి వెళ్ళటం ఆరోజుకి తప్పించుకున్నాడు రంగనాయకుడు.

అంతేకాక, అప్పటికే ఊరిలో వీరి సమాచారం చాలామందికి తెలిసిందని, తామిద్దరూ భార్యాభర్తలు కాకపోవటమేకాక, హేమసుందరి వేశ్యాంగన అని స్వామికి తెలిసి, వెంటనే ఆమెని వదిలెయ్యమని ఆదేశిస్తారని రంగనాయకుడు చాలా ఆందోళన పడ్డాడు. మరునాడు మళ్ళీ దాశరథి వస్తాడని, మద్యపానశాలలో తాగుతూ చాలాసేపు గడిపి, ఎంతో ఆలస్యంగా ఇల్లు చేరాడు. దాశరథి అప్పటికీ వేచి ఉండటం వల్ల తప్పనిసరిగా మఠానికి వెళ్ళాడు.

రంగనాయకుడు ఊహించినదొకటీ, జరిగింది మరొకటి.

రామానుజులవారు ఎంతో ప్రేమగా రంగనాయకుని పలకరించారు. ఎవరూ సమర్పించని విశేష కానుకలు విశాలనేత్రాలు, బొట్టు రంగనాథస్వామికి అతను సమర్పించినందుకు అభినందించారు. రంగనాయకుడు ఆ కనులను, బొట్టును ముందు హేమసుందరికి అలంకరించి కొలతలు చూసిన వైనం చెప్పి, తన అపరాధాన్ని క్షమించమని వేడుకొన్నాడు.

'ఎవరు మొక్కుకున్న పద్ధతిలో వారు రంగనాథస్వామిని సేవిస్తారు. అందులో దోషమేమీ లేదని,' రామానుజులవారు చెప్పటంతో, రంగనాయకుడికి కొండంత భారం దిగిపోయినట్లైంది. ఆ తరువాతి సంభాషణలో హేమసుందరి విశాల నయనాల గురించి మక్కువగా, అంతటి సొగసైన నేత్రాలు వేరెవరికీ ఉండవన్నాడు.

దానికి స్వామి, 'ఇంతకు మునుపు నీవు ఎన్నడూ కనివిని ఎరుగనంతటి పెద్ద కన్నులున్నాయి సుమా! కావాలనుకుంటే అవి నీకొకసారి చూపించగలను, ఏమం టావు?' అన్నారు.

'ఎవరి కన్నులై ఉంటాయా?' అన్న మీమాంసలో పడ్డా, వెంటనే తన అవసరం గుర్తొచ్చి, ఆలయంలో సాముగరిడీల ప్రదర్శన కొలువు కోసం ధర్మాధికారి చుట్టూ తను తిరగటం వివరించాడు. యతీంద్రులు మరోసారి ప్రయత్నం చెయ్యమన్నాడు. విషయం సాముగరిడీల మీదకి మళ్ళింది. యతీంద్రులకి వాటి విషయంగా ఉన్న పరిజ్ఞానం రంగనాయకుని ఆశ్చర్యపరిచింది.

రంగనాయకుడు సెలవు తీసుకొని వచ్చేముందు ఆశ్రమానికి తప్పనిసరిగా వస్తుండమని చెప్పారు యతీంద్రులు. వచ్చి రంగనాయకుడి సాముగరిడీ విద్యని ప్రదర్శించమన్నారు.

రామానుజుల శిష్యులకి అంతా విచిత్రంగా ఉంది. ఎవరి పట్లా అంతగా కని పించని యతీంద్రుల కృపాకటాక్షం రంగనాయకుడి లాంటి వ్యక్తికి దక్కటం కొంత అసూయ కలిగించింది.

ఆ తర్వాత రంగనాయకుడికి ఆలయ కొలువు దొరికింది. జీవనాసరాలకి, తనూ హేమ కలిసి ఆ నగరాన కాలక్షేపం జరపటానికి అప్పుడు ఆ కొలువు, జీతం తప్పనిసరి. ఇదంతా యతీంద్రుల దయగానే భావించాడు రంగనాయకుడు. ఆ తర్వాత వారి ద్వారా శ్రీరంగనాథుని అద్భుత విశాల నయనాల అపూర్వ దర్శనం సాక్షాత్కరించింది.

మఠానికి అతని రాకపోకలు పెరిగాయి. తాగుడులాంటి దురభ్యాసాలు అదు గంటిపోయాయి. చివరికి యతీంద్రుల సమక్షంలో అతనికి లభించిన అనిర్వచనీయ అనుభూతి, హేమసుందరి సాంగత్యాన్నే మించిపోయింది. అస్తమానం మఠానికి వెళ్ళి పోతూ తనని అలక్ష్యం చేస్తున్నాడని హేమసుందరి రంగనాయకుడితో ఘర్షణపడింది. చివరికి మరో దారిలేక మఠానికి వెళ్ళి యతీంద్రులకి విన్నవించుకొంది.

అతను చోరుడు, తాగుబోతు. ఆమె వేశ్య. వీరు తరచుగా పవిత్ర మఠానికి రావటం, రామానుజులవారు వారిని మిక్కిలిగా ఆదరించటం సనాతన ధర్మపరా యణులైన భక్తులకి కోప కారణమైంది. సంపన్నమైన భక్తుల రాక తగ్గటంతో, మఠం ఆదాయం బాగా క్షీణించి, అన్న ప్రసాదాలకే లోటు వచ్చింది. యతీంద్రులకి శిష్యులకి మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయి.

రంగనాయకుడా? మఠమా? అన్న పరిస్థితిని యతీంద్రులకి తీసుకొచ్చారు భక్తులు. ఆయన రంగనాయకుని కాక, మఠాన్నే వదిలెయ్యటం అందరికీ అచ్చెరు వైంది. చివరికి తనవారి కోరిక మన్నించి, రంగనాయకుడు హేమసుందరిల పూర్వ జన్మ సుకృతం వివరించి యతీంద్రులు తిరిగి మఠానికి రావటం, రంగనాయకుడు

మఠం కోశాధికారిగా బాధ్యత స్వీకరించటం, దానికి అందరూ సంతోషించటం నవల ముగింపు.

ఎంతో లలితమైన కథావస్తువుతో, ఆ కాలానికి తగినట్టు ప్రత్యేక రచనతో పిలకా గణపతిశాస్త్రిగారి విశాల నేత్రాలు తీర్చిదిద్దటమే కాదు, ఎందరెందరో పాఠకుల చేత విడవకుండా చదివించగలిగారు.

ఒక వేశ్య, మరొక చోరుడు ఆధారంగా విశాలనేత్రాలన్న ప్రత్యేక విషయంతో మోహం, ప్రేమ, ఆరాధన, చివరికి గొప్ప ఏకాగ్రత దైవానుగ్రహాన్ని ఎలా సమకూర్చి పెట్టిందో, వారిని విశిష్ట వ్యక్తులుగా ఎలా తీర్చిదిద్దిందో అద్భుతంగా చిత్రించారు.

'అతిలోకమైన ప్రేమానుబంధం వల్లనే వారిద్దరికీ అనాయాసంగా అష్టాక్షరీ మంత్రోపదేశం లభించింది. మల్లవిద్యపై అనితర సాధారణమైన ఏకాగ్రత కూడా అతనికెంతో తోడ్పడింది,' అని యతీంద్రులు అనటం ఈ నవలలో కీలకాంశం. ఇది ఎక్కువ, ఆ పని తక్కువ అన్న బేధం కాదు. నమ్మటం, నిస్వార్థంగా మమేకం అవటం, చెదరని ఏకాగ్రత, సాధనకి కీలకం అన్నది సందేశం.


వైష్ణవభక్తి సముపార్జనకి, ప్రేమ...రక్తి మార్గాలు నిషిద్ధం కావని, దైవకృపకి ఏదీ అనుచితం కాదని చిత్రించటం విశాలనేత్రాలు ప్రత్యేకతల్లో ఒకటి.

రచనాపరంగా పిలకా గణపతిశాస్త్రిగారు కొన్ని ప్రత్యేక పద్ధతులు అవలంబించారు. పాఠకులకి తిరిగి చెప్పాలనుకున్న అంశాలను, అంతకుముందే జరిగి పోయినా తిరిగి ప్రస్తావించారు. అలాగే నవలలోని వర్ణనలు, చాలాచోట్ల వాతావరణ విశదీకరణకే కాక, పాత్రల మనస్థితిని తెలిపేలా తదనుగుణంగా తీర్చిదిద్దారు.

1911లో తూర్పు గోదావరి జిల్లాలో పుట్టిన పిలకా గణపతిశాస్త్రి సంస్కృతాంధ్ర, ఆంగ్ల భాషలు క్షుణ్ణంగా చదివారు. కొంతకాలం ఉపాధ్యాయవృత్తిలో ఉండి ఆ తర్వాత మద్రాసు నుండి వెలువడే *ఆంధ్రశిల్పి* పత్రికకు సంపాదకులుగాను, అనం తరం ఆంధ్రపత్రికలోను, ఆ తర్వాత ఆంధ్రప్రభలోను సహాయ సంపాదకులు గాను పని చేశారు. వీరిదే మరో ప్రముఖమైన నవల కాశ్మీర పట్టమహిషి. మహాభారత వచన రచనతో గణపతిశాస్త్రిగారు ఆంధ్రదేశమంతా సుపరిచితులైనారు.

అప్పటికీ, ఇప్పటికీ హాయిగా చదువుకోగలిగిన నవల విశాల నేత్రాలు.

*జులై, 2008*




# వెల్లువలో పూచిక పుల్లలు

## భాస్కరభట్ల కృష్ణారావు

**భా**స్కరభట్ల కృష్ణారావుగారి వెల్లువలో పూచిక పుల్లలు నవల 1960 నాటిది. అప్పటికి అస్తిత్వవాదం ఆధారంగా తెలుగులో వచ్చిన రచనలు చాలా కొద్ది అనే చెప్పుకోవాలి. వాటన్నింటిలో ఎంతో ప్రసిద్ధి పొందిన నవల ఇది. అస్తిత్వవాద లక్ష్యలక్షణాలు ఈనాడు చాలామందికి తెలుసు. కానీ 1960 నాటికి ఈ వాదం గురించి తెలిసినవారు తక్కువ. ఈ వాదం గురించి తెలియనివారికి ఈ నవల సుబోధకంగా ఉండేలా త్రిపుర నేని గోపీచంద్ చక్కటి పరిచయం- అస్తిత్వవాద వివరణ పొందుపరిచారు. గోపీచంద్‌గారి మాటల్లోని ముఖ్యమైన ఒకటి రెండు విషయాలని చూద్దాం.

అస్తిత్వవాదులకి మనిషి ముఖ్యం. మనిషిని అర్థం చేసుకోవాలంటే ఏ మనిషికి ఆ మనిషినే పరిశీలిం చాలి. ఏ ఇద్దరినీ కూడగట్టుకొని వారికి సరిపోయే సిద్ధాంతాన్ని సృష్టించలేం. ఎప్పుడైతే పదిమందికీ సరిపోయే సిద్ధాంత నిర్వచనకు పూనుకొన్నామో అప్పుడే మనిషిలో ఉన్న ప్రత్యేకత దెబ్బతింటుంది. ప్రత్యేకత దెబ్బతింటే, సృజనాత్మకత దెబ్బతింటుంది. సృజనాత్మకత కోల్పోయిన మనిషి, మనిషి కాదు. యంత్రం.

సాహిత్యరంగంలో ఇదొక విశిష్టమైన వినూత్న విధానం. ఇది సాంప్రదాయం సృష్టించిన తెరల పొరలను తొలగించి, చదువరులను జీవితానికి సన్నిహితుల్ని చేస్తుంది. అంతేకాదు అస్తిత్వవాద పద్ధతిలో రచన మనుషులని చాలా స్వాభావికంగా, నిజానికి దగ్గరగా చూపించగలుగుతుంది.

వేల్లువలో పూచికపుల్లలు నవల ప్రధానంగా మధు పాత్రపరంగా సాగుతుంది. మధు పరిస్థితుల ప్రభావానికి తలొగ్గి జీవన ప్రవాహంలో కొట్టుకుపోయే తత్వం గలవాడు.

కిశోర్ అన్న కుర్రవాడికి ప్రైవేటు చెప్పటానికి మాజీ జాగీర్దార్ ఉమా మహేశ్వర రావు గారింటికి మధు వెళ్ళటంతో నవల ఆరంభమవుతుంది. నళిని, కుసుమల్ని అప్పుడే ఏకకాలంలో చూస్తాడు. నళిని వయసులో కొంచెం పెద్దది. కుసుమకి వదిన. ఇద్దరి పట్లా ఆ యువ హృదయంలో ఆకర్షణ కలుగుతుంది. ఇద్దరిలో ఎవరి ఆకర్షణ బలీయ మైందో అర్థంకాదు. ఈ సందర్భంలోనే కాదు, మధుది సహజంగా ఎటూ తేల్చుకోలేని తత్వం. అలా అని ఎటో ఒకవేపు తనంతగా తాను మొగ్గు చూపించే రకమూ కాదు. ఇరువేపులా సమభావంతో తర్కించుకొంటాడు. ఈ ధోరణిని కృష్ణారావుగారు విభిన్న మైన వర్ణనతో ఈ సంఘటనలో చాలా నేర్పుగా పొందుపరిచారు.

'పెద్దమ్మాయి చూపులు మన హృదయాన్ని పెల్లగించివేస్తే, చిన్నమ్మాయి శరీరం మన దృష్టుల్ని ఆకర్షిస్తుంది. పెద్దమ్మాయి హృదయమైతే, చిన్న మ్మాయి శరీరం. హృదయం మోసగిస్తుంది. శరీరం మన చెప్పుచేతల్లో ఉంటుంది.' ఈ వర్ణన మధు భావాల రూపంగా సాగినా, ఆ భావాల వెనుక అతని పరిస్థితి, మనస్థితి ముడిపడి ఉన్నాయి. పెద్దమ్మాయి నళిని డాబూదర్పం కన్నా, చిన్నమ్మాయి కుసుమ సాదాసీదా తనం అతనికి అనుకూలంగా, అనురాగానికి వీలుగా మారాయి.

పెద్దమ్మాయి చొరవ వల్లే కొద్దిరోజుల తర్వాత వారిద్దరితో కలిసి సినిమాకి వెళ్ళేడు మధు. సినిమా హాలు దగ్గర కలిసిన తన ముస్లిం స్నేహితుడు సలీంతో నళిని ఒక బాక్స్‌లో, కుసుమ మధు మరొక బాక్స్‌లో కూచున్నారు. కుసుమతో ఏకాంతం, యవ్వనోద్రేకం. ఆమెని దగ్గరకి తీసుకొన్నాడు. ఆమె అభ్యంతర పెట్టలేదు సరికదా, అతనిచేతిలో ఉన్న తన చేతిని చూస్తూ, 'మన పాణిగ్రహణం అయిపోయింది. జీవి తాంతం విడువకూడదు,' అంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వదలనని ప్రమాణం చేశాడు మధు. ఈ పరిణామ మంతా ఎంత త్వరతగతిన సాగిందో అంతకన్నా తొందరగా కుసుమ, మధు దూరం అయ్యారు. కారణం చాలా చిన్నదిగానే కనిపిస్తుంది. కానీ వారి మనస్తత్వ రీత్యా చాలా బలమైంది. కుసుమ ఒంటరిగా ఉన్న సమయంలో ఒకసారి మధు గట్టిగా కౌగలించుకొన్నాడు. ఆ తమకంలో చెమటకి ఆమె బొట్టు చెరిగిపోయింది. గాజులన్నీ ఒక్కటి కూడా మిగలకుండా పగిలిపోయాయి.

అది వాళ్ళిద్దరికీ అపశకునంలా మనసుల్లో నాటుకుపోయింది. కుసుమ దిగులు పడిపోయి ఇదంతా వైధవ్యసూచన అని తనలోకి తనే ముడుచుకుపోయింది.

తన తల్లి వితంతువు. ఈ అపశకున సూచన ప్రకారం కుసుమకి వైధవ్యం వస్తే, ఆమె తన తల్లిలాగే తయారవుతుంది. ఊహామాత్రంగానేనా అది ఇష్టంలేని విషయం మధుకి. అందుకే అసంకల్పంగానే మధు కుసుమకి పూర్తిగా దూరం అయి పోయాడు. తన దురదృష్టానికి తానే నిందించుకొన్నాడు. చాలా యాంత్రికంగా తయారయ్యాడు. ఉత్సాహపరంగా అసలే అంతంత మాత్రం. ఈ సంఘటనతో మరీ స్తబ్ధుగా తయారయ్యాడు.

మధు తల్లి వరలక్ష్మి పరాయి రాష్ట్రం స్త్రీ. మధు తండ్రికి భార్య చనిపోతే రెండో భార్యగా ఆమెని మలయాళ దేశం నుంచి కొని తెచ్చుకొన్నాడు. అతనిది నలభై దాటిన వయసు. ఆమెకి పదహారు. ఆమెకి పాతిక ఏళ్ళు వచ్చేటప్పటికి మధు తండ్రి మరణిం చాడు. ఆమెకి నా అన్న దిక్కెవరూ లేరు. మధుది పసి వయసు. భర్త ద్వారా సంక్రమించిన పొలాన్ని, వ్యవ సాయాన్ని కాపాడుకోవాలి. రామచంద్రాపురం కరణం రంగనాయకులు. వ్యవహారదక్షత కలవాడు. అవస రార్థం తప్పనిసరై వరలక్ష్మి అతనికి లొంగిపోయిందో, రంగనాయకులే లొంగదీసుకొన్నాడో సరిగా తెలియదు. ఊళ్ళో మాటల వల్ల వారిద్దరి సంబంధం గురించి ఉత్తరోత్తరా మధుకి తెలిసింది. చెడిపోయిన తల్లిగా వరలక్ష్మి అతని మనసులో ముద్రపడిపోయింది. వర్ణ సంకరం, వంశ సంప్ర దాయం నాశనం, ఇలా రకరకాల మధు కోపానికి ఆమె కేంద్రం అయింది. ఒక్కోసారి తల్లి పట్ల సానుభూతి కలుగుతుంది. జీవితంలో ఆమె కూడా దెబ్బతిన్న మనిషేనన్న జాలీ కలుగుతుంది. మళ్ళీ వెంటనే కోపం. తన జీవితం ఆవిడవల్లే శూన్యంగా తయా రయ్యిందన్న ద్వేషం. ఈ ద్వైదీ భావమే మధు జీవితంలో అన్ని అంశాలకి పాకింది. తన తల్లి లానే కుసుమ తయారైతే అన్న చిన్న అనుమానంతో ఆమెకి దూరమైపోయాడు.

పరిస్థితులు వేరుగా ఉంటే ఏమయ్యేదో? కానీ ఆ తర్వాత సంఘటనలన్నీ మధు జీవితానికి కుసుమని దూరం చేశాయి.

ఇంక కుసుమ. కుసుమ జాగీర్దార్ ఉమామహేశ్వరరావుగారి కూతురు. అయినా ఆమె నళినంత తీవిగా, దర్పంగా ఉండదు. దానికి కారణం ఆమె ఉమా మహేశ్వరరావుగారి కూతురే అయినా, ఆయన భార్యకి పుట్టినపిల్ల కాదు. ఉమా మహేశ్వరరావుగారు ఓ బ్రాహ్మణ వితంతువుని లేవదీసుకువచ్చి తోటలో వేరే కాపురం పెట్టాడు. కుసుమ ఆమె కూతురు. కుసుమకి మూడో ఏటే తల్లి చనిపోయింది. ఆమెకి జ్ఞానం తెలిసేటప్పటికే ఉమామహేశ్వరరావు వ్యసన పరుడు. కిశోర్ తల్లి, కుసుమ

పెద్దమ్మ చనిపోయాక, అప్పటికే ఆ ఇంటిపెత్తనం కైవసం చేసుకొన్న రాములమ్మగారే కిశోర్, కుసుమల పెంపక భారం తీసుకొంది. కుసుమ, నళిని ఇంచుమించు ఒక ఈడు వారవటం వల్ల అప్పచెల్లెళ్ళులా కలిసిపోయారు. నళిని, రాములమ్మగారి దగ్గర తప్ప వేరెవరి దగ్గర కుసుమకి ప్రేమాభిమానాలు దక్కలేదు.

ఉమామహేశ్వరరావుగారి మకాం వేరే ఇంటికి మారటం, జాగీర్లు రద్దవటం, ఆర్థిక లావాదేవీలు పూర్తిగా రాములమ్మగారి చేతిలో ఉండటం, తన పుట్టుక తాలూకు న్యూనత కుసుమని బాధించటంవల్ల ఆమె బలహీన మనస్కురాలైంది. అసలే అంతంత మాత్రమైన కుసుమ మనసు వైధవ్య అపశకునంతో పూర్తిగా బలహీనమైంది. మధుకి పూర్తిగా దూరంగా మెలగ సాగింది. వైధవ్య భయం ఆమెని పూర్తిగా కమ్ముకొంది. తల్లిలాగే తన జీవితం మారుతుందేమో నన్న అలజడి. మధు మీద చావని మమకారం.

రాములమ్మగారి మరణంతో పరిస్థితుల్లో, మధు జీవితంలో అనుకోని మార్పులొచ్చాయి. మేనమామ కుటుంబభారం తన మీదపడి, నళిని బెంబేలు పడింది. ఆమె మాతృవియోగ దుఃఖాన్ని మరిపించాలని మధు అవలంబించిన కొత్త పద్ధతి, ఆ విపరీత దుఃఖ సమయంలో వారిద్దరి ఆకస్మిక శరీర కలయికకి, ఆ తర్వాత వివాహానికి దారి తీసింది.

ఏ ఇంటికి ట్యూషన్ మాస్టరిగా వచ్చాడో ఆ ఇంటికే అల్లుడయ్యాడు మధు. జీవితం ఎన్ని ఒడిదుడుకులు పాలవుతుందో, ఆర్థికంగా ఎలా గడుస్తుందో అనుకొన్న మధుకి ఒక్కసారిగా అదృష్టం పట్టినట్టయింది. ఆర్థికంగా బెంగలేదు. బాధ్యతలన్నీ నళిని చూసుకుంటోంది. అంతేగాక నిండైన అనురాగం భార్య రూపంలో లభిస్తోంది.

ఎంతో బావుందనుకొన్న నళిని, మధుల జీవితం లో తొలి అలజడి కుసుమ. వీరి వివాహం తర్వాత మానసిక రుగ్మతతో, ఇంచుమించు పిచ్చిదానిలా మారిపోయింది. ఏ ఉత్సాహం లేదు. ఏ ఆసక్తీ లేదు. కొద్దిరోజులు అలాగే ఉంటే కుసుమ పూర్తిగా పిచ్చిదవుతుందని, మధుని కుసుమలో తిరిగి ఆసక్తి, అనురక్తి జనించేలా ప్రయత్నించమంది నళిని. ఆ ప్రయత్నంలో కుసుమ మధుల మధ్య ఎటువంటి సంబంధం ఏర్పడ్డా తనకి అభ్యంతరం లేదంది.

కుసుమ విషయంలో మధు చేసిన ప్రయత్నం వికటించింది. ఆమె పరిస్థితి మరింతగా దిగజారింది. ఆప్యాయంగా దగ్గరకెళ్ళిన మధుని కుసుమ, 'పెళ్ళికాని నన్ను బలవంతంగా చెరచు,' అని అరిచి కొట్టింది. కుసుమ ఆ మాటలో ఎన్నో అర్థాలు.

నళిని గర్భం దాల్చిందన్న వార్త మధుకి కొంత ఊరట. మగపిల్లవాడు పుట్టాడు. తిరిగి కొంత సంతోషం. ఉమామహేశ్వరరావుగారి మరణం, నళినికి బాధ. ఆ ఇంటిలోనే ఏదో దోషం ఉందని నళిని కొత్త ఇల్లు కట్టించటం ఆరంభించింది. అదే

సమయంలో నళిని మళ్ళా గర్భవతైంది. అలసటైనా, అతి తొందరగా కొత్త ఇల్లు పూర్తి చేసుకొని అందులోకి మారిపోవాలని తీవ్రంగా ప్రయత్నించింది. ఆ ఇల్లు పూర్తవకుండానే నళినిది 'ఫాల్స్ ప్రెగ్నెన్సీ' అని అర్జంటుగా ఆపరేషన్ చేయటం, ఆమె ఆకస్మికంగా మరణించటం మధుని పూర్తిగా కృంగదీశాయి.

తల్లితో, తన పాత జీవితంతో సంబంధంలేని స్థితి. అన్నీ చూసుకొంటూ ఆప్యాయమూర్తిలా అతనికి అండగా నిలిచిన నళిని లేదు. పూర్తిగా పిచ్చిదైన కుసుమ. పసిపిల్లాడు. చెయ్యి దాటిపోతున్న కిశోర్. డబ్బు కాజెయ్యడానికి ఏ అవకాశం దొరుకుతుందా అని చూసే రామచంద్రయ్య. ఒక్కసారిగా తన చుట్టూ అంధకారం ఆవరించినట్టు ఉంది మధుకి.

ఏం చెయ్యాలో అతనికి తోచలేదు. ఏం చెయ్య లేడు. పరిస్థితులకి తలవొంచి నిస్సహాయంగా వాటి ప్రభావ ప్రవాహంలో పూచికపుల్లలా కొట్టుకుపోవటమే.

ఈ నవల ముగింపు పూర్తి విషాదం. ఏమాత్రం ఆశకి, ఓదార్పుకి స్థైర్యానికి చోటు లేకుండా కృష్ణా రావు ఈ నవలని ముగించారు.

జీవితంలో ఇంతటి విషాదం ఉందని చెప్పటాని కేనా ఈ నవల. విషాదం ఉందని చెప్పటంతో పాటు, దాన్ని యధాతథంగా ఏ ముసుగులూ లేకుండా చూపించాలన్నది ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుంది. జీవితంలోని ఓ విషాదాన్ని ఎన్నుకొని దానికి రచయిత కృతకంగా మంచిని, ఆశని, జీవనానురక్తిని జోడించే అలవాటుకు భిన్నంగా రచన సాగించాలన్న విభిన్న కోణంలోని రచన వెల్లువలో పూచికపుల్లలు.

విషాదాన్ని గాఢంగా, లోతుగా ప్రదర్శించటం వల్ల ఏదేనా ప్రయోజనం ఉందా? అటువంటి విషాదాన్నే అనుభవించేవారికి, విషాదమే గొప్ప ఓదార్పు. చాలా మంది విరహ విషాదంలో దేవదాసులాంటి ఉదంతాలతో ఓదార్పు పొందిన సంఘటనలున్నాయి. విరహం, విషాదం నిండిన పాటలు పదేపదే వింటూ తాదాత్మ్యం పొందే వాళ్ళు ఎందరో ఉన్నారు.

అదీకాక 1960 దశకం ప్రాంతంలో యువతని ఓ రకం నిర్లిప్తత కమ్ముకొంది. తమ చుట్టూ ఉన్న పరిస్థితుల్ని విశ్లేషించుకోగలిగిన సామర్థ్యం చాలామందికి లేదు. జీవితం ఇలా ఉందే, ఎలా అన్న దిగులే ఎక్కువమందికి.

కృష్ణారావుగారు ఆ పరిస్థితిని మధు భావాలుగా కొంతవరకూ చూపించారు. ఆరోజుల్లో సున్నిత మనస్కుల్ని విషాదం పట్టుకొన్నంత గాఢంగా సంతోషం అలుముకోలేదు.

వెల్లువలో పూచికపుల్లలు ఓ చిన్న ప్రయోగం. కొత్త కోణంలో విభిన్న మనస్తత్వాల్ని, పాతకొత్త విలువల సంఘర్షణల్ని సూక్ష్మంగా, సున్నితంగా అందించింది.

వివాహేతర సంబంధాలు, కుసుమ విషయంలో నళిని మధుకి అందించిన స్వేచ్ఛ, రామచంద్రయ్య లాంటి వ్యక్తిలోని బంధుప్రీతి, ఉమా మహేశ్వరరావులాంటి విషయ లోలుడిలో సున్ని తత్వం- ఇలా ఎన్నోరకాలుగా ప్రతిబింబించి నవల ఇది.

ఈ నవల చదవటం గోపీచంద్‌గారు అన్నట్టు అంత తేలిక కాదు. అడుగడుగునా తర్కవితర్కాలుగా కనబడే ఈ రచనా విధానం అంతుబట్టడానికి ఓర్పు, శ్రద్ధ అవసరం. ఆ కారణంగానేమో విశిష్టమైన నవలే అయినా విశిష్టతకి తగినంత ప్రాచుర్యం పొందలేదు. గతంలో కొందరికే అపురూపమైన ఈ నవల మరెందరికో ఇప్పుడు కూడా నచ్చే ప్రత్యేకత ఉంది.

*ఆగస్ట్, 2008*




# విరామం

## అంగర వేంకట కృష్ణారావు

విరామం నవల విశిష్టత కథావస్తువులోనే ఉంది. రెండవ ప్రపంచయుద్ధం మీద మనదేశపు నవలలే తక్కువ. 1939-45 నాటి రెండవ ప్రపంచయుద్ధ నేపథ్యంగా తెలుగులో వచ్చిన నవల విరామం ఒక్కటేనని విజ్ఞుల అభిప్రాయం. మరే నవలేనా ఈ నేపథ్యంలో తెలుగులో ఉందో లేదో పరిశోధకులు తేల్చాలి.

ఆనాటి ఆ యుద్ధ బీభత్సాన్ని, ముఖ్యంగా మనదేశపు క్లిష్ట ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్ని వివరించటానికి, ఎన్ని వందల పేజీలైనా సరిపోక పోవచ్చు. కానీ కీ॥శే॥ అంగర వేంకటకృష్ణారావు కేవలం 120 పేజీల విరామం నవల ద్వారా ఆ పని చెయ్యగలిగారు.

ఈ నవలలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం, కథ కన్నా కథలోని ప్రజకి, పరిస్థితులకి రచయిత ఇచ్చిన ప్రాధాన్యత. అది వేంకట కృష్ణారావుగారు పూనుకొని చేసిన పని కాకపోవచ్చు. ఆయన స్వయంగా పాల్గొన్న ఆ యుద్ధం, ఆ వాతావరణంలో బతికిన ఆయన ఆవేదన, తన చుట్టూ కనబడుతున్న వ్యక్తులపట్ల సంవేదనా ఆయన్ని ఆరకంగా ఉద్వేగ పరిచింది. ఎన్నో సంఘటనలు, ఎన్నో వాతావరణాలు, మరెన్నో జీవితాలు ఈ నవల.

పద్మానది మీది లాంచి ప్రయాణంతో ప్రారంభమైన ఈ నవలలో అదే ప్రయాణంలో తారసపడిన పద్మ అన్న యువతి ఒక ప్రధానపాత్ర. ఆమె ప్రియుడు కమల్ మరో పాత్ర.

హవల్దార్ రావ్ మిలటరీ పోస్టింగ్ మీద తూర్పు బెంగాల్‌లోని అగర్తలా వెళ్ళాలి. అందుకు అతను పద్మానది మీద లాంచీలో ప్రయాణం చేసి చాంద్‌పూర్‌ఘాట్ చేరి అక్కడ్నుంచి రైలు ఎక్కాలి. పద్మ కొమిల్లా వెళ్ళాలి. ఆమెని దింపటానికి కమల్ వచ్చాడు. వీరు ముగ్గురూ కలిసి కొద్ది గంటలు లాంచి ప్రయాణం, ఆ తర్వాత లక్షమ్‌కు రైలు ప్రయాణం చేశారు. ఆ యుద్ధ సమయం వారి మధ్య ఒక విచిత్రమైన దగ్గరతనాన్ని కల్పించింది. వారి మధ్య నడిచిన సంభాషణ చాలా చిత్రం. పొడిపొడి మాటలు, కొద్దిపాటి చనువు, చిన్నచిన్న వేళాకోళాలు, మంచి మనసుల ఉద్దేశాలు... ఇవన్నీ వేంకట కృష్ణారావు చాలా సమర్థవంతంగా, సహజంగా చిత్రీకరించారు. మొత్తం విరామం నవల హృదయాన్ని ఈ ఆరంభ దృశ్యం చిత్రీకరించగలిగింది. లక్షమ్ దగ్గర పద్మ, కమల్ ఆగిపోయారు. రావు అఖౌరా స్టేషన్ చేరాడు.

అఖౌరా చిన్ని స్టేషన్. సిక్స్ ఇండియన్ హెవీ యాకాక్ వర్క్‌షాప్‌కి వెళ్ళాలి రావు. మిలిటరీ వారినే అడిగినా ఆ చిరునామా ఎవరూ చెప్పలేకపోయారు.

చిన్ని స్టేషన్, వర్షం... చాంద్‌పూర్ ఘాట్‌లో తిన్న తిండి... ఆకలి... ఆ సమయంలో దాస్ కలిశాడు రావుకి. టీ కావాలంటే ఊళ్ళోకి తీసుకెళ్ళి 'గొంతి' గుడిసెలో టీ, బన్ ఇప్పించాడు. ముక్కు మూసుకొని తాగేలా ఉందా టీ. బలవంతంగా బన్ కొరికాడు. ఆకలి అలాంటిది. గొంతితో ఆ ఆకలి కూడా తీర్చుకోవచ్చు అని సూచించాడు దాసు. రావుకి మనస్కరించలేదు. అయిదు రూపాయలిచ్చి వచ్చేశాడు. తన దగ్గర ఉండక, విశ్రాంతీ తీసుకోక ఎందుకు ఆ డబ్బిచ్చినట్టని చూసింది గొంతి. ఒకరితో ఒకరు తమ భావాలు చెప్పుకోలేదు. భాష రాదు. కానీ చూపులే పరస్పర భావ పంపిణీ. పరవాలేదన్నట్టు రావు చూసిన చూపు గొంతికి అర్థమైంది. దాసు అక్కడే ఆగిపోయాడు.

నానా యాతనా పడితేనేగానీ అతను గమ్యం చేరలేకపోయాడు. కుండపోత వర్షం, అడవి దారి. ఎంతమాత్రం పరిచయం లేని ప్రదేశం, మనుషులు. రోజుల తరబడి తిండి లేదు కదా, కనీసం టీ కూడా దొరకని పరిస్థితి. చివరికి గమ్యం చేరిన రావుకి అంతవరకు అసలు తన వర్క్‌షాప్ ఆరంభమే కాలేదని తెలుస్తుంది. తనే ముందు వచ్చాడన్నమాట. మిగిలిన సిబ్బంది వచ్చాక వర్క్‌షాప్ ఏర్పరుచుకుని పని ఆరంభించాలి.

రావు ఆర్.హెచ్.క్యూలో ఉంటున్నాడు. అది చిట్టడివిలో ఉంది. వెదురుపొద లెక్కువ. పులులూ, ఎలుగుబంట్లు ఉన్నాయి. క్యాంప్ వదిలి రెండు ఫర్లాంగులు వెళ్ళటం ప్రమాదం. చుట్టుపక్కల చిన్నచిన్న గ్రామాలున్నాయి.

పచ్చని గుట్టలు, లెక్కలేనన్ని చెరువులు, చెట్లచేమల మధ్య ప్రశాంతంగా, అతి సామాన్యంగా బ్రతుకు వెళ్ళబుచ్చే వీళ్ళ ఉనికి మీదకి, వేలల్లో నానా దేశాల మిలిటరీ వాళ్ళు వచ్చిపడ్డారు. తినటానికి తిండి లేకపోయినా, బతుకొక యాతనైనా లేని సంతోషం తెచ్చుకొని నిస్సహాయంగా బతుకుతున్నారు. వాళ్ళల్లో చాలామంది ముస్లిములు.

యూనిట్‌కి దగ్గర్లో ఉన్న ఊరు షిరాజ్‌పూర్. ఆ ఊరి పెద్ద అబ్దుల్. అతనికి నలుగురు భార్యలు. వాళ్ళకి పెద్దగా ఘోషా లేకపోయినా, చుట్టూ మిలిటరీ వాళ్ళ సంచారం వల్ల వయసులో ఉన్న స్త్రీలు ఒంటరిగా బైట మెసిలేవారు కారు. రావ్‌కి అబ్దుల్ కుటుంబంతో చనువు ఏర్పడింది.

ఆ యుద్ధ సమయంలో ఎవరితో కొంచెం ఎక్కువ పరి చయం సాగితే వారే ఆప్తులు. ఆ గ్రామానికి చెందిన ఒక పశువులు కాసే కుర్రాడు, తరచుగా వీళ్ళ దగ్గరికి వచ్చి పాటలు పాడేవాడు. సిగరెట్లు వీళ్ళని అడిగి కాల్చటం వాడికి సరదా. సిగరెట్టు ఇస్తాం, ఇంకో పాట పాడు అని వాడితో సరదా గా గడిపేవారు రావు వాళ్ళు. ఒకరోజు అలాగే ఆ కుర్రాడు పాటలు పాడి రోజూ కన్నా కొంచెం ఆలస్యంగా గ్రామం వేపు వెళ్ళబోతుంటే చిరుత పులి వాతపడి క్షణాల్లో మరణించటం రావు గుండెల్ని కదిలించింది. యుద్ధంలో ఎన్నో మరణాలు చూసినా, నిష్కారణంగా ఆ పసి ప్రాణం అలా పోవటం చాలారోజులు తరచుగా గుర్తొచ్చి రావుని బాధ పెట్టింది.

యుద్ధ సయమంలో ఎవరు ఎప్పుడు ఎలా కలుస్తారో, ఎప్పుడు ఎలా విడిపోతారో చెప్పలేం. రావ్‌కి అనుకోకుండా దాసు అగర్తలాలో కలిశాడు. ఆ కలయిక వీళ్ళ యూనిట్‌లో కేంటీన్ పెట్టేవరకూ వచ్చింది. ఆ కాలంలో మిలిటరీలో అధికారంలో ఉండేది ఎక్కువగా తెల్లవాళ్ళే. దాసు క్రమేపీ అధికారులను మంచి చేసుకొన్నాడు. అలా వారికి దగ్గరవటం కోసం అతను ఎన్నో పనులు చేశాడు. ఆకలికి లొంగిపోయే ఆడవాళ్ళని ముగ్గులోకి లాగి తెల్లవాళ్ళకి తార్చటం వరకు అతని జిత్తులు కొనసాగాయి. అతని ఆ చేష్టలు అక్కడితో ఆగలేదు. అబ్దుల్లా ఆఖరి భార్య పంతొమ్మిదేళ్ళ సల్మాని కూడా బలి తీసుకొన్నాయి. ఓ రాత్రి కనిపించకుండా పోయిన భార్య సల్మా గురించి అబ్దుల్లా మూగగా రోదించాడు. సల్మాని ఏ పులో చంపేసి ఉంటుందని తుప్పల్లో దొరికిన ఆమె రక్తసిక్త చీరని బట్టి అందరూ అనుకొన్నారు. అబ్దుల్లా కూడా అలాగే అనుకొన్నాడు. నిజానికి దాసు ప్రోద్బలంతో ఆకలి మంటల్ని ఆర్పుకోవటానికి సల్మా వ్యభిచారిగా మారి ముప్పై మైళ్ళ దూరంలోని బ్రహ్మం బరియా ఊళ్ళోని వేశ్యావాటికకి చేరింది.

ఈ విషయంలో తప్పంతా దాసుదే అనిపించినా, నిజానికి దోషం యుద్ధం సృష్టించిన బీభత్సానిది. ప్రశాంతంగా, నిర్మలంగా బతికే అబ్దుల్లాలాంటి ఎన్నో సంసారాలు రకరకాలుగా మారి నాశనం అయ్యాయి. యుద్ధంలో జరిగే సైనిక నష్టం, ఆస్తినష్టం కనిపించినట్టుగా, ఇలాంటి నాశనం చాలామంది దృష్టికి అంత తేలిగ్గా రాదు.

విరామం నవల, రచయిత కృష్ణారావుగారి ప్రత్యేకత అదే. నవలలోని ఈ సందర్భంలో దాసు గురించి ఆయన ప్రస్తావించలేదు. కానీ బ్రహ్మం బరియా వాతావరణపు దైన్యాన్ని ఎంతో లోతుగా చాలా తక్కువ వివరాలతో తెలిపారు.

మిగిలిన చాలా దేశాలతో పోల్చి చూస్తే భారతదేశానికి ప్రపంచయుద్ధాల తాకిడి తక్కువే. ఈ తక్కువస్థాయి తాకిడికే పరిస్థితి ఇలా ఉంటే, ప్రపంచ యుద్ధాలలో బాగా నలిగిన దేశాలలోని ప్రజల పరిస్థితి మరెంత భయంకరమో ఊహామాత్రంగా చదువరుల మనసులో మెదిలేలా చేసి, మానవత్వం విలువని గుర్తు చేస్తుంది విరామం నవల. ఒకపక్క తెల్ల మిలిటరీ అధికారుల జులుం, మన ప్రజల బాధ, ఎందుకు ఎవరి ప్రయోజనం కోసం యుద్ధం చేస్తున్నామో తెలియని భారత సైనికుల నిర్లిప్తత... ఇవన్నీ పరోక్షంగా విరామం అద్భుతంగా తెలియజేస్తుంది. జపాను బాంబర్లంటే ఎంత భయంగా ఉండేదో, కేవలం ఒక్క వాక్యంలో చాలా నేర్పుగా తెలిపారు కృష్ణారావుగారు.

సాధారణంగా చాలామందికి తాము పనిచేస్తున్న శాఖ పట్ల అభిమానం ఉంటుంది. వీలున్నంతవరకూ ఆ శాఖ లోపాలను సమర్థించటానికి ప్రయత్నిస్తారు. కానీ నిజాయితీకి కట్టుబడ్డ రచయిత ఆ పని చెయ్యడు. కృష్ణారావు ఎక్కడా విరామం నవలలో మిలిటరీ వారి అకృత్యాలని అణుమాత్రమేనా సమర్థించక పోవటం గొప్ప విశేషం. దేశ ప్రజలందరూ ఆకలితో అల్లాడు తుంటే, ఇండియన్ ఆర్మీ సప్లైకోర్ వాళ్ళు దేశమంతా గాలించి అన్ని సరుకుల్నీ మిలిటరీ గోడౌన్లలో ఎలా నింపేవారో, వాటిలో చాలావరకు నల్లబజారుకి ఎలా చేరేవో వివరించారు. నల్లబజారు వ్యాపారానికి యుద్ధం ఎంత సహాయ కారో తెలియజేశారు. అంతేకాదు, ఆ జాడ్యాన్ని వ్యాపారులు ఇప్పటికీ వదలకుండా ఎలా పోషిస్తున్నారో నిశితంగా తెలిపారు.

వీళ్ళ యూనిట్‌కి కందిపప్పు సప్లై కానందుకు రావు ఒకసారి మిలిటరీ రేషన్ షాప్‌కి వెళ్ళాల్సి వచ్చింది. ఆ రేషన్ కార్యక్రమం లోనే ఆ గోడౌన్ కీలకస్థానంలో కమల్ కనిపించాడు రావుకి. కనిపించటమే కాదు, ఆ స్థావరంలో అతని పేరు కమల్ కాదు. ప్రసన్నకుమార్ రాయ్. ఎవర్నో పట్టుకొని ఆ ఉద్యోగంలో చేరి తల దాచుకొన్నాడు. అతని దొంగ బతుకుకి కారణం, అతను చేసిన హత్య. అతని ప్రియురాలు పద్మని ఫిష్ పూల్ అన్న మిలిటరీ అధికారి, మరో ఇద్దరితో కలిసి మానభంగం చేశాడు. దానితో పద్మ కలకత్తా వదిలి పారిపోయింది. ఈ చర్యకి తట్టుకోలేని కమల్ ఆ ఫిష్‌పూల్‌ని తాగుడు మత్తులో ఉండగా పీకనొక్కి చంపేశాడు. ఆ తర్వాత ఢాకా పారిపోయి మిలిటరీలో చేరాడు.

కొందరికి హత్యలు వృత్తి. మనిషిని చంపుతుంటే వాళ్ళ నెత్తురు వేడెక్కదు. మామూలుగానే ఉంటుంది. అలాంటి హత్యనే 'కోల్డు బ్లడెడ్ మర్డర్' అంటారు. కమల్

చేసిన హత్య అలాంటిది కాదు. పద్మని నిండు హృదయంతో ప్రేమించాడు. ఆమెకి జరిగిన అవమానాన్ని సహించలేకపోయాడు.

మళ్ళీ కమల్‌తో కలవాలని, ఇద్దరూ కలిసి కొమిల్లా వెళ్ళి పద్మని కలవాలని, అనుకొన్న రావు ఆశ తీరలేదు. వాళ్ళ ట్రూప్‌కి బదిలీ కాగితం వచ్చింది. మరో మజిలీ. దారిలో ఎన్నో బీభత్సాలు చూశాడు. జీవితమంతా కలవరపెట్టే దారుణాలు. కొమిల్లా వెళ్ళినా పద్మని కలుసుకోవటం కుదరలేదు. యుద్ధ తీవ్రత. అనిశ్చిత పరిస్థితులు. రోజూ ఎన్నో దారుణాలు. తల్లి చాటునా, తండ్రి చాటునా బతికే స్త్రీలు బలవంతంగా వేశ్యలవటం, చుట్టూ ఆకలి...

"ఆకలి మనిషిని వెర్రెత్తిస్తుంది. దొంగతనం చేయిస్తుంది. జారత్వానికి దింపుతుంది. హత్యలు చేయిస్తుంది. ఋషులచే తిట్లు తిట్టిస్తుంది. కుక్కమాంసం తినిపిస్తుంది."

ఇలాంటి పరిస్థితుల్లోనూ స్వార్థం, స్వలాభం చూసుకొనేవాళ్ళు చాలామందే. రకరకాల వ్యక్తులతో ఆ యుద్ధయానం సాగుతోంది.

'సైనిక జీవితంలో ఓ విశేషం ఉంది. కాలూ చెయ్యీ బాగున్న సైనికులు శ్రమించటానికి ఇష్టపడతారు. యంత్రాలు తయారుచెయ్యాలి. నడపాలి. బాగు చెయ్యాలి. ఈ చైతన్యం తరువాతి తరాల జీవితాల్ని ఎంతో బాగు చేసింది. ముఖ్యంగా ఇంగ్లండులో లేబర్ పార్టీ గట్టెక్కడానికి ఈ చైతన్యమే కారణం.'

ఆ తర్వాత రావ్ అనారోగ్యంతో మిలిటరీ హాస్పిటల్ చేరాల్సి వచ్చింది. కరీం అన్నే ప్రచ్ఛన్నరూపంలో కమల్ కలిశాడు. పద్మ జాడ తెలియలేదు.

చివరికి యుద్ధం ముగిశాక చిట్టగాంగ్‌లో రావ్ పనిచేస్తున్న సమయంలో పద్మ చెల్లెలు ఉమ తారసపడింది. వాళ్ళ కుటుంబం ఎంతగా చితికిపోయిందో చెప్పింది. మానభంగంతో గర్భవతైన పద్మ పిచ్చిదైంది. ఏడోనెలలో మృతశిశువును శస్త్రచికిత్స ద్వారా తీశారు. తండ్రి మరణించాడు. ఉమే ధైర్యంగా కుటుంబాన్ని నడుపుతోంది.

రావ్ చెయ్యగలిగినదంతా చేశాడు. ఉమని ప్రేమిస్తున్న లహరితో ఆమె వివాహం స్థిరపరిచాడు. పద్మ పరిస్థితి కమల్‌కి తెలియజేశాడు. అతను పద్మని వదలడన్న విశ్వాసం, కమల్ రాగానే పద్మ కూడా కోలుకుంటుందన్న ఆశ. పద్మ వాళ్ళ పెదనాన్న సేన్ కొంచెం స్థితిమంతుడు. ఆయన కూడా వాళ్ళ ఆలనాపాలనా చూస్తానన్నాడు.

అదే సమయంలో మళ్ళీ రావ్‌కి కలకత్తా బదిలీ అయింది. వాళ్ళతో విడిపోక తప్పలేదు. ఎందుకో ఈసారి మళ్ళీ వాళ్ళని కలుస్తానన్న ఆశ కలగలేదు రావ్‌కి.

యుద్ధ వాతావరణమే అంత.

విరామం నవల విలక్షణత్వం కీ॥శే॥ అంగర వేంకటకృష్ణారావు మాటల్లో చెప్పాలంటే...

*"ఒక పెద్ద యుద్ధం మానవ జీవితపు బాటలో ఒక మలుపు దిద్దుతుంది. ఈ రెండో ప్రపంచ మహాయుద్ధం మానవుడి మనుగడలో కాళరాత్రి లాంటిది. తెల్లవారితే కొత్త మలుపు కాదు, కొత్త యుగమే ఆరంభమౌతుంది.*

*"సీతని రావణాసురు డెత్తుకుపోయాడు. అప్పుడొక యుద్ధ మైంది. అతిరథులు, మహారథులు సమక్షంలో, నిండు కొలువులో అంటరాని స్థితిలో ఉన్న ద్రౌపదిని నిలబెట్టి వివస్త్రని చేసేరు. ఆ కారణంగా ఒక మహాయుద్ధం జరిగింది. తరువాత ఎన్నో యుద్ధాలు జరిగేయి. ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ముందు కూడా జరగొచ్చు. యుద్ధం జరుగుతున్నప్పుడే మానవుడు ఘోరాలు చూసి జడుస్తాడు. మరి యుద్ధం వద్దు బాబో అనుకొంటాడు. యుద్ధం ముగిసిపోగానే కుక్కతోక తిరిగి వంకర. మానవ జీవితం ఒక ఎడతెగని యుద్ధం. శాంతి ఒక విరామం లాంటిది. నాటకంలో రంగానికీ, రంగానికీ మధ్య కిందికి జారే తెరలాంటిది. ఆ స్వల్ప విరామంలో కూడా తెర వెనుక తతంగం జరుగుతూంటుంది. అది ప్రేక్షకులకి తెలీదు. నాటకం నడిపించే వాళ్ళకి తెలుస్తుంది."*

ఇంతటి లోతైన దృష్టి అంగర వేంకటకృష్ణారావుగారిది.

విశాఖపట్నంలో జన్మించిన కృష్ణారావు ప్రసిద్ధ రచయిత మొసలికంటి సంజీవ రావు మేనల్లుడు. చిట్టివలస జూట్‌మిల్‌లో కొన్నాళ్ళపాటు ఉద్యోగం చేసి, రెండవ ప్రపంచ యుద్ధంలో బర్మా సెక్టర్‌లో హవల్దార్ ఉద్యోగం చేశారు. యుద్ధానంతరం 1948లో డీమోబిలైజేషన్ అయ్యాక అప్పటి నుండి రిటైర్‌మెంట్ వరకు విశాఖపట్నంలోని బ్రూక్ బాండ్ టీ కంపెనీలో ఉద్యోగం చేశారు. సుమారు 300 కథలు, నాలుగు నవలలు రాసినప్పటికీ అన్నిటికంటే ముఖ్యమైనది రెండవ ప్రపంచ యుద్ధరంగంలో పొందిన అనుభవాల కలబోతతో తనకు సహజంగా ఉన్న మానవ ప్రేమను జోడించి వ్రాసిన నవల ఈ విరామం. 'రచన పరమార్థం రచనే కాని రాజకీయ సిద్దాంతం కాదు' అనే దృఢ విశ్వాసంతో విశాఖ సాహితి పేరిట ఏప్రిల్ 1971లో స్థాపించిన సంస్థకు 1974 వరకు అధ్యక్షత వహించారు. నేటికీ ఆ సంస్థ కొనసాగుతూనే ఉంది.

సెప్టెంబర్, *2008*



# వలస దేవర

## జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

ఆటా వారి 1998 నవలల పోటీలో మొదటి బహుమతి పొందిన నవల జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి వలసదేవర.

పోటీల వల్ల ప్రత్యేక గుర్తింపుతో, కొంత ప్రాచుర్యంతో నవల పాఠకులకి చేరే సౌలభ్యం ఉంది. పోటీలో బహుమతి కోసం రచయితలు విభిన్నత కోసం, రచన ప్రత్యేకంగా కనపడడం కోసం పూనుకొని ప్రయత్నించడం అసామాన్యమేం కాదు.

వలసదేవరలో విభిన్నత ప్రధాన పాత్ర పుంగనూరు జెవాన్. తనని తానే పరిచయం చేసుకొంటూ ముందుకొస్తాడు. ఈ జెవాన్ అమాయకుడా? తెలివైనవాడా? సాధువా? మొరటువాడా? మానసిక స్వాస్థ్యం ఉన్నవాడా? పిచ్చివాడా? నిజాయితీపరుడా? మోసగాడా? నిజమే పలుకు తానని చెపుతూ, అబద్ధాలాడేవాడా? తనవరకూ ఒక నీతి, సామాజికంగా మరొక నీతి అనే ద్వంద ప్రవృత్తి కలవాడా? ఇలా ఎన్నో పరస్పర విరుద్ధ ప్రశ్నలకి, ఖచ్చితంగా సమాధానం చెప్పుకోలేని విచిత్ర వ్యక్తి పుంగనూరు జెవాన్. పై అన్నీ కలగలిసిన పాత్ర జెవాన్, అలాగే ఏ ఒక్కటీ కాదు జెవాన్. ఈ పాత్ర నిజ జీవితపు నకలుగా కాక, హృదయస్పందనల రూపంగా

కాక, మేధోపర సృజనలా తోస్తుంది. ఏది ఏమైనా పుంగనూరు జెవాన్ కొత్తగా, విచిత్రంగా కనిపిస్తాడు.

ఆ ఊరి పేరు ముష్టూరు. ముష్టూరమ్మ ఆ గ్రామ దేవత. ఆ ఊళ్ళో ఒంటరి జెవాన్. బంధువులు లేని ఒంటరే అయినా, ఊరు ఊరంతా అతనివాళ్ళే. అందర్నీ వరసలు పెట్టి పిలుస్తాడు. అందరి ఇళ్ళల్లోకి చొరవగా వెళ్ళిపోతాడు. ఎప్పుడు ఆకలేస్తే అప్పుడు ఆ ఇంటి వాళ్ళ దగ్గర తింటాడు. అందరూ జెవాన్‌కి అన్నంపెట్టి ఆదరించేవాళ్ళే. కానీ అందరికన్నా ఎక్కువగా ఆ ఊరి పెద్ద శీనయ్య జెవాన్‌ని ఇష్టంగా చూస్తాడు. అలాగే జెవాన్‌కీ శీనయ్య అంటే గురువు, దైవం, తండ్రీ అన్నీ. వాళ్ళ కుటుంబమే తన కుటుంబం.

శీనయ్య నిస్వార్ధంగా ఊరికి, ఊరి ప్రజలకి తరతమ భేదాలు లేకుండా మంచి చేసే మనిషి. ఆ పెద్దమనిషిని పెద్దప్ప అని అందరూ వ్యవహరిస్తారు. ఆ వ్యవహర్తవల్లే పరిణామం చెందిన ముష్టూరుకి పెద్దప్పగారి పల్లె అన్న పేరు వచ్చింది.

పెద్దప్ప కొడుకు ఎర్రమరెడ్డి. ఎర్రమరెడ్డి కొడుకు వీరమరెడ్డి. మూడు తరాలు ఈ ముగ్గురి కాలంలో ముష్టూరులో వచ్చిన మార్పులు జెవాన్ ద్వారా చెప్పాడు రచయిత. ఊళ్ళో మార్పులే కాదు మనుషుల్లో మార్పులే కాదు, సామాజిక విధానంలో వచ్చిన మార్పులు, తద్వారా మానవ సంబంధాలలో వచ్చిన తేడా కూడా చెప్పటం జరిగింది.

పెద్దప్పని రాజకీయాల్లోకి ఆహ్వానిస్తే ఆయన ఊరు మంచి కోసం ఒప్పుకొన్నాడు. ముష్టూరు ఉన్న వాయిల్పాడు సమితి ప్రెసిడెంట్ అయ్యాడు. సమాజ ప్రగతికి అన్ని రకాలుగా కృషిచేసి ముష్టూరు అభివృద్ధికి తోడ్పడ్డాడు. ఊళ్ళో మతబేధం లేకుండా, కులబేధం లేకుండా ఆయన కాలం గడిచింది. ఆయన గతించాక, ఆయన కొడుకు ఎర్రమరెడ్డి రాజకీయాల్లోకి వచ్చాడు. ఆయన ఎమ్మెల్యే అయ్యాడు. ఊళ్ళో మతబేధాలు వచ్చాయి. రాజకీయంగానే సర్దుబాటు చేశాడు. ఎర్రమరెడ్డికి లభించిన ప్రాపకం అతన్ని రాజకీయంగా స్థిరపరిచింది. హైదరాబాదు అతని నివాసం, ముష్టూరు అతని వలసస్థలం అయింది. అతని కొడుకు వీరమరెడ్డి కాలం మరో రకం.

ముష్టూరు అడివి ప్రాంతం నుంచి దొంగ కలప రవాణాలాంటి వ్యాపారాలు అతనికి తెలిసే జరిగాయి. ఊళ్ళోనూ, పదిమందిలోనూ ప్రాపకం కోసం అతని రాజకీయం వేరే విధంగా సాగింది. వ్యాపారం, రాజకీయంతో వర్ణబేధాలు తలెత్తాయి. దళితులు వేరువేరు వర్గాలుగా విడిపోయారు. ఊరుని విడగొట్టారు. దీనికి వీరమరెడ్డి బాధపడలేదు. సంతోషించనూ లేదు. తన వ్యవహారం తను చూసుకొన్నాడు.

తరతరానికి జరిగిన దిగజారుడుతనాన్ని ముష్టూరు ఆధారంగా చూపించిన నవల వలసదేవర. మనుషుల ప్రవర్తనలో, నీతినిజాయితీల్లో వచ్చే మార్పుల్ని, మానసిక-శారీరక వ్యభిచార రంగుల్ని చిత్రించింది.

తనకి రోజు గడవటం ఓ సమస్య అవుతుందనిగానీ, తల దాచుకోవడానికి గూడు ఇబ్బంది వస్తుందనిగానీ ఏనాడు ఊహించని జెవాన్ బతుకు ఎంతగానో క్షీణించింది. పిలిచి అన్నం పెట్టేవారు లేరు సరికదా, అడిగినా, అడుక్కున్నా తిండి పెట్టేవారు కరువయ్యారు. అతని గుడిసెని ఆక్రమించి వెళ్ళగొట్టారు. ముష్టూరమ్మ గుడిలో తల దాచుకొంటే ఆకతాయి పిల్లలు బాధించారు.

ముష్టూరమ్మ గుడికి ధూపదీప నైవేద్యాలు లేవు. గబ్బిలాల కంపు. ఆ దేవత దిక్కులేనిదైంది. ఊరి సంస్కృతి, సంప్రదాయపు గుర్తులైన కొండలు, బండలు, దేవతలు ముక్కలై నూతన వ్యాపారసరళికి బలి అయ్యాయి.

వైరివాడిగానో, బలాదూర్‌వాడిగానో ఆ ఊరిలో ఆనందంగా గడిపిన జెవాన్ పూర్తి విషాదంలో కూరుకుపోయాడు. అతని జీవితం పరమ దారుణంగా దిగ జారింది.

'దిగజారింది జెవాన్ జీవితమే కాదు, ముష్టూరు దిగజారింది. మానవత్వం దిగజారింది,' అన్న అన్వయం మెజారిటీ పాఠకులు చేసుకొనేలా నేర్పు చూపించాడు జొన్నవిత్తుల.

259 పేజీల ఈ నవలలో 150 పేజీల వరకు సామాన్య పాఠకులకు కథ అంత తేలిగ్గా అర్థం కాదు. ముక్కలు ముక్కలుగా దర్శనమిచ్చిన సంఘటనలు, పాత్రలు ఆ తర్వాత ముడిపడతాయి. అంతవరకూ పుంగనూరు జెవానే, ఈ నవలగా తోస్తాడు. కథ కన్నా కథనానికి ప్రాముఖ్యత ఇచ్చిన నవల వలసదేవర. పుంగనూరు జెవాన్ పాత్రే దీనికి మూలం.

నోబుల్ బహుమతి గ్రహీత సాల్‌బెల్లో పాత్ర హెర్జాగ్ ఒకటి ఉంది. ఎంతో మేధావి అయిన ప్రొఫెసర్ హెర్జాగ్ తన ఉద్వేగాల్ని, ఆక్రోశాల్ని, చిన్న చిన్న సంతోషాల్ని ఉత్తరాలు రాసి వెలిబుచ్చుతాడు. ఆ ఉత్తరాలు ప్రత్యేకంగా ఒకర్నే ఉద్దేశించినవి కావు. ఒకే విషయానికి సంబంధించినవి కావు. వాటిలో కొన్ని నిర్దిష్ట చిరునామాలకి పోస్ట్ చేసినవి. కొన్ని పిచ్చి కాయితాల మీద వ్రాసి వదిలేసినవి. హెర్జాగ్‌ని కూడా పిచ్చివాడనలేం. మేధావి అనలేం. కల్పన, నిజం కలగలిసిన పాత్ర.

పుంగనూరు జెవాన్ పాత్రకి, హెర్జాగ్‌కి సామ్యం తేవటం కాదుగాని, పరిచిత పాఠకులకి ఆ పాత్ర గుర్తు వస్తుంది.

నవలా రచన మాండలికంలో సాగి, ప్రాంతీయతని పట్టు గొమ్మగా చేసుకొంటే చాలామంది పాస్‌మార్కులు వేస్తున్న సాహితీకాలం ఇది. దానికితోడు కొంత విభిన్నత, మరికాస్త ఉద్యమధోరణి కలిస్తే మరో అన్ని మార్కులు వచ్చేస్తాయి.

బహుముఖమైన జొన్నవిత్తుల నేర్పు మరొకటి ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాలో పుట్టిన ఈయన చిత్తూరు జిల్లా మాండలీకాన్ని కేవలం సంభాషణలకే పరిమితం చెయ్యకుండా, మొత్తం నవలకి విస్తరించి నెగ్గుకు రావటం అద్భుతం. వలస ప్రభావం అందామా!

వలసదేవరలోని పుంగనూరు జెవాన్ తీరుతెన్నుల్ని, భాషని తెలిపే కొన్ని తునకలు.

★ ★ ★

'పుంగనూరు జెవాన్'

*ప్రతిమాట తెలివితో చెప్పేవాడు! ప్రతి పనీ తెలివిగా చేసేవాడు! అందరికీ తెలివైన సలహాలిచ్చేవాడు! ఇన్ని మాటలెందుకు ఈ 'తెలివి' పుంగనూరు జెవాన్ సేద్యం చేసే మడికయ్య!*

*అంత తెలివిమీరినవాడు ఎవరనా అంత విచిత్రంగా చూస్తున్నావు?*

*ఊరికే బిత్తరపోకు... మనమే...*

*మనం పుంగనూరు జెవాన్!*

*మనం చేసేది జెవాన్ పనీకాదు- మనది పుంగనూరూ కాదు.*

*ఊరుకాని ఊరు! పేరుకాని పేరు!*

*అయినా సరే మనం బాధపడేది లేదు. అందరికీ వాళ్ళకంటూ ఒక పేరుంటుంది! ఒక ఊరుంటుంది! మనలాగా ఊరూ పేరూ కూడా లేని పెద్దమనిషి ఎవరైనా ఉంటారా?*

*ఉండరు.*

*కానీ మనం ఉన్నాం. అందుకే మనం పెద్దమనుషులందరికీ...*

*పెద్ద... పెద్దమనిషిగా... పేరు సంపాదించుకున్నాం.*

*మన సహాయం లేకుండా బతికిన మనిషి ఈ చుట్టుపక్కల ఎక్కడా లేడు. ఒక పుట్టుక అయినా... ఒక పెళ్ళి అయినా... ఒక చావు అయినా... మనకి తెలియకుండా జరగదు! మనం లేకుండా జరగదు!*

*మనలాంటి పెద్దమనిషి కథ తెలుసుకొంటే మీరూ పెద్దమనుషులైపోతారు. అందుకే... జాగ్రత్తగా వినండి.*

*ఈ కథని మనం పుంగనూరు జెవాన్ అయిన తరువాత నించీ మొదలు పెడదాం. ఎందుకంటే అంతకుముందు మన పేరు ఏమిటో పాపం, మనకి కూడా తెలియదు.*

నేను పుట్టిన రెండేళ్ళకి ఈ ముష్టూరు పుట్టింది.
ఈ మాట ఎవరూ ఒప్పుకోరు!

★ ★ ★

పెద్దప్ప...? సంపాదించి పల్లెకు పెట్టేవాడు!
ఎర్రమరెడ్డి...? సంపాదించి దాచి పెట్టుకుంటున్నాడు!
వీరమరెడ్డి...? సంపాదించకుండానే దోచి పెట్టుకుంటున్నాడు!
పల్లెని అమ్ముకుని తింటున్నాడు! అడవితల్లిని అమ్ముకుని తింటున్నాడు.
సినిమాబొమ్మని చూడటానికి బుద్ధి పుట్టలేదు.
సగంలోనే లేచి బయటికి వచ్చేశాను.

★ ★ ★

"నీయమ్మ బిత్తలి నాకొడకా మా మాటలన్నీ ఆ రెడ్లకీ బంట్రోతులకీ ఎగేసేదాని కంట్రా నక్కమాదిరి వచ్చి కూర్చున్నావు? లెయ్‌రా తప్పుడు నాకొడకా," అన్నాడు.

నాకు మండిపోయింది. "అయ్యో మన దిగువపల్లె సన్న మనుషులు అగచాట్లు పడతా ఉన్నారే... పాపం ఎట్లాగున్నారో చూసిపోదామని వచ్చిన నామీదకే తిరగబడతా వంట్రా రంపు నాయాలా," అంటూ రాజన్న చెంప మీద సత్తువ అంతా ఉప యోగించి ఒక్క గుద్దు గుద్దాను. నా చేతుల్లో ఇంకా అంత బలం ఉందని అప్పటివరకూ నాకు తెలియలేదు. ఆ ఒక్క గుద్దుకే పోయి జనాల మధ్యలో పడ్డాడు.

అంత చావునాయాలికి నాతో ఎందుకు? ఏ యెల్లగాడి తోనో పెట్టుకోవాలిగానీ!

"ఇక్కడి మాట అక్కడా అక్కడి కథ ఇక్కడా చెప్పేది తప్ప నాకు వేరే పంగలేదనుకున్నావంట్రా? నాకు అంతా ఒక్క టేరా! నీ మాదిరిగా తేడాలు చూపించి పని జరుపుకునే గబ్బు నా కొడుకుని అనుకున్నావంట్రా?..." అంటూ నేను రేగిపోతూ ఉంటే...

రాజన్న పక్కనున్న మనుషులంతా, "మనుషులంతా ఒక్కటే అనుకొనే ఆ తిక్క నాయలితో మనకేంట్రా..." అనీ, "పల్లె సల్లగా ఉంటే సంబరపడే ఆ పిచ్చినాయాలు నీకేమి అన్యాయం చేసినాడురా," అని సర్ది చెబుతూ ఉంటే...


ఆ పొగరుబోతుకి బుద్ధి చెబుతూ ఉంటే...
నేను అడవిరాజులా...
సింహంలా ముందుకి నడిచాను.

★ ★ ★

వలసదేవరలో ముష్టూరుకు చెందిన ఊశమ్మ, ఉలిగన్న, రెడ్డి కాదరన్న, సిద్ధమ్మ, రెడ్డప్ప, పీరన్న ప్రసాదు, సుందరి ఇలా జీవం, జవం ఉన్న చాలా పాత్రలున్నాయి.

బహుముఖ ప్రజ్ఞాశీలి అయిన సాహితీవేత్త జొన్నవిత్తుల రామకృష్ణశర్మగారి నాలుగో సంతానం జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూక కొపల్లెలో పుట్టిన శ్రీరామచంద్రమూర్తి హైస్కూలు స్థాయిలోనే చదువు నిలిపివేసి జీవితాన్ని చదవడం ప్రారంభించారు. అది సాహిత్యానికి, రచనకి దారి తీసింది. అరడజనుకు పైగా కథలు అచ్చయ్యాయి. వాటిలో వంజె కథకి అప్పాజోస్యుల, విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి బహుమతి లభించింది. నివాసం చిత్తూరు జిల్లా పాపిరెడ్డిగారి పల్లె.

*అక్టోబర్, 2008*



# మాతృమందిరము

## బాలాంత్రపు వేంకటరావు

**మం**చు పెందెరలపై మంటరేగినది
*కంచు మేడలలోన గంట మ్రోగినది*
*లేదురా నిదురలో లేదురా సుగతి*
*చూడరా కనువిచ్చి చూడరా జగతి*

అంటూ తెలుగుజాతికి మేలుకొలుపు పాడిన ఆధునికయుగ వైతాళికులు వేంకట పార్వతీశ్వర కవులు. ఓలేటి పార్వతీశము, బాలాంత్రపు వేంకటరావు- ఇవి రెండు పేర్లే అయినా దాదాపు మూడు దశాబ్దాల పాటు తమ రచనా పాండిత్యంతో వేంకట పార్వతీశ్వర కవులుగా భాసించిన చరిత్ర వీరిది. 1911లో ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయాన్ని స్థాపించి, ప్రసిద్ధ కావ్యరచనలతో పాటు, నూతన సాహిత్య ప్రక్రియ అయిన నవలలను సైతం రచించారు. కొన్ని అనువాదాలు చేశారు. వారి ప్రశస్తమైన స్వతంత్ర రచన ఈ మాతృ మందిరము. గాంధీయుగ వైభవాన్ని 1920 నాటికే అద్భుతంగా జోస్యం చెబుతూ గ్రాంధికశైలిలో రచించిన నవల ఇది.

మాతృ మందిరము నవల తొలికూర్పు 1918. నాలుగవ కూర్పు 1959. ఎమెస్కో పాకెట్ బుక్స్ వారి తొలి ముద్రణ సెప్టెంబరు 1969. దీనిని బట్టి ఈ నవల ప్రాచీనత, ప్రాచుర్యాలని అర్థం చేసుకోవచ్చు.

మాతృ మందిరము నవల గ్రాంథిక శైలిలోనిది. అయినా చదువుకోవడానికి ఇబ్బందేం ఉండదు. ఈ తరం పాఠకులైనా సరే కొంచెం ఓపిగ్గా చదివితే ఈ నవల లోని ఎన్నో సొగసులు ఆకట్టుకొంటాయి.

మాతృ మందిరము ప్రబోధానందస్వామి ఆశ్రమంలోని దేవి మందిరం. ఒక రకంగా మాతృదేశ ప్రతీక. సంస్కరణాభిలాష, ఆదర్శ సహజీవనం, ధర్మరక్షణ, సత్‌వర్తన దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతాయన్న బలమైన నమ్మకం మాతృ మందిరము.

ఈ నవలలోని కథలో ఎన్నెన్నో పాత్రలు, ప్రదేశాలున్నాయి. మరెన్నో మలుపులు, చమత్కారాలు ఉన్నాయి. 1918 అంటే, తెలుగు నవలారచనలోని తొలిదశ నాటి ఈ నవలలో శైలీ, శిల్పాల గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. నవలారచనలోని మెళకువలు, నేర్పు అంతగా అభివృద్ధి చెందిన కాలం కాకపోయినా, వేంకట పార్వతీశ్వర కవులు నవల నడిపిన తీరు ఆశ్చర్యం కలగిస్తుంది.

కథని పూసగుచ్చినట్టు వరుసగా చెప్పేయటం తేలిక. కానీ మాతృ మందిరము లో కావాలనే ఈ వరుసని ఛేదించటం జరిగింది. నవలలో సగం వరకు ప్రతి ఛాప్టర్ లోనూ కొత్త పాత్రల పరిచయం, కొత్త ప్రదేశాలలో కథాగమనం ఉంటుంది. రచయిత నైపుణ్యం, సంయమనం ఏమాత్రం దెబ్బతిన్నా ఈ పద్ధతిలో నవల ఎంతో గందరగోళంగా తయారవుతుంది. కానీ మాతృ మందిరము వేంకట పార్వతీశ్వర కవులు అవలంబించిన ఈ క్లిష్ట పద్ధతి వల్ల మంచి కథాసక్తిని సాధించటం విశేషం.

ప్రబోధానందస్వామి, కళ్యాణానందుడు, ఆనందాదేవి, సదానందాదేవి, ముత్యాలు, రంగదాసు, వేంకటేశ్వరరావు, రాజరత్నము, భారతీరావు, గౌరీశాస్త్రి, సరస్వతి, దామోదరరావు, అనసూయ, మధుమతి... ఇలా ఈ నవలలో ఎన్నో పాత్ర లున్నాయి. ఎక్కువ పాత్రలుండటమేకాదు, వాటిలోని వైవిధ్యం, కథలో వాటి ప్రాముఖ్యం తగ్గకపోవటం విశేషం.

సరస్వతి గౌరీశాస్త్రిగారి అమ్మాయి. చిన్నతనం నుంచీ వారింట్లోనే పెరిగిన మేనల్లుడు పరబ్రహ్మానికిచ్చి వివాహం చేశారు. అతను ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. భర్త గురించిన దిగులు సరస్వతికి.

సరస్వతికి స్నేహితురాలు సత్యవతి. బాల వితంతువు. ఆమెకి తిరిగి వివాహం చెయ్యాలన్న నిశ్చయం కల ఆదర్శవ్యక్తి ఆమె అన్నగారు భారతీరావు.

వేంకటేశ్వరరావు ధనవంతుడు. భావుకుడు, శృంగార ప్రియుడు. అతని భార్య అనసూయ. వారిది అన్యోన్య దాంపత్యం. అతని స్నేహితుడు దామోదరరావు. అతని ద్వారా పెద్దాపురానికి చెందిన వేశ్య రాజరత్నంతో పరిచయం అవుతుంది వెంకటేశ్వర రావుకి. ఆఖరికి అంతటి అనురాగవతియైన అనసూయని గర్భవతిగా ఉన్న సమయంలో వదిలేసి, వ్యసనాలకి బానిసై పరమ దరిద్రుడిగా మారతాడు.

రంగడు దొంగ. దొంగతనం తప్పు కాదని అతని విశ్వాసం. రంగడిది ఓ విచిత్ర తత్వం. ఎవరేనా కష్టంలో ఉంటే చూడలేడు. అందుకు అతను ఎవరిని తన్నటాని కైనా, ఎటువంటి దొంగతనానికైనా వెనుకాడడు. డబ్బున్నవారిని దండించయినా డబ్బు తెచ్చి కష్టాలలో ఉన్నవారిని ఆదుకొంటాడు.

భీమన్న కూడా దొంగే. వాళ్ళది దొంగల వంశం. దొంగతనం అతని కులవృత్తి. దొంగతనం తప్పు కాదు, కులవృత్తి అని నమ్మినా అతని వల్ల ఓ స్త్రీ మరణిం చిందన్న బాధ. దానికితోడు ఓ విషసర్పం అతనిని కాటు వేయడంవల్ల నానా బాధకి లోనయ్యాడు. అతన్ని స్వామి రక్షించాడు.

అప్పన్న ఛండాలుడు. అతి దీన స్థితిలో ఉన్న అతనికి రంగడు పది బంగారపు కాసులు వేంకటేశ్వరరావు దగ్గర దొంగిలించి ఇచ్చాడు. అవి తీసుకోవటానికి అప్పన్న ముందు అంగీకరించలేదు. రంగడు బలవంతంగా ఇస్తాడు. ఆ ధనంతో అతను పశు వుల వ్యాపారిగా స్థిరపడతాడు. అతని కూతురు ముత్యాలు. ఆమెకి రంగడంటే అనురాగం.

చంచలరావు, భారతీరావు స్నేహితుడు. విధవా వివాహం, వేశ్యా వివాహం అతనికి ఇష్టమైన విషయాలు. బాల్య వితంతువు సత్యవతిని దక్కించుకోవాలని తొందర పడి భంగపడతాడు.

గోపాలరావు మధుశాలని నడుపుతుంటాడు. అందులో మద్యాన్ని అందరికీ అందించే అమిత సౌందర్యవతి మధుమతి. ఆమెని చూసిన చంచలరావుకి గతమంతా గుర్తొస్తుంది. మధుమతి చంచలరావు వదిలి వచ్చిన ధర్మపత్ని.

ఇలా రకరకాల పాత్రల విచిత్ర కథలతో వేరువేరుగా సాగిన కథ చివరికి మాతృ మందిరంలో ముగుస్తుంది.

ముగింపులో చిత్రవిచిత్రంగా అందరూ కలిసి శుభం జరగటం సహజమే. కానీ ఈ నవలలో విశేషం, అన్ని పాత్రలకి సజావైన పరిణామం.

మద్యపాన నిషేధం, హరిజనోద్ధరణ, వర్ణాంతర వివాహదీక్ష, స్త్రీ జనోద్ధరణ... ఇవన్నీ గాంధీ మహాత్ముని ఆదర్శాలు. వీటన్నింటినీ ఈ నవల అంతకుముందే ప్రతిపా దించటం విశేషం.

ఈ నవల రచనా విధానంలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన అంశం ఒకటుంది. ప్రతి ఛాప్టర్ ఓ కవితతో ఆరంభమవుతుంది. ఆ కవిత అక్కడి కథాంశాన్ని సూచించటం విశేషం. ఉదాహరణకి 9వ ఛాప్టర్ ఆరంభం-

*జలధరంబులయందు జలములేగాక*
*పిడుగు లేమిటికిఁ గర్పింపఁగాఁబడెనొ?*
*ఫణిఫణంబున విషపటలమే గాక*
*మాణిక్య మేటి కమర్పఁగాఁబడెనొ?*
*అంబుధిలో బడబాగ్ని యేమిటికొ?*
*కర్ణమంబున జెంగలువ యెందులకో?*

దీనికి, "దరిద్రుఁడనైన నా హృదయమున కీ దయ యేల కలుగవలయును? కఠినవర్తనుఁడనైన నాకింతటి కనికరమేల యుండవలయును? ఆ యెండకు నీ వెన్నెలకును సంఘటన మెట్లు కలిగినది? ఈ విరూప సంఘటనము చేతనే నేనధర్మ మార్గమున వంబోయి యధః పతితుఁడనై పోయితిని. ఏమి? నేను దయచేత నిర్దయుఁడనై పోయితినా? కనికరము చేతఁ గజనవర్తనుఁడ నైపోయితినా? కాదు కాదు," సంబంధం.

మాతృ మందిరము నవలలో అద్భుతమైన వర్ణనలు, సంవాదాలు ఎన్నో ఉన్నాయి. మిణుగురు పురుగు, చుక్క సంవాదం చదువుతుంటే వేంకట పార్వతీశ్వర కవులు అప్పటికే ఎంత ఆధునిక రచనని సాధించారో అర్థమవుతుంది.

నవలా రచనలో రచయిత తన గొంతుతో కొన్ని విషయాలను చెప్పటం కొత్త విషయం కాదు. ఓ రకంగా అది మంచి పద్ధతి కాదు. కానీ ఈ నవలలో రచయితలు తామే కల్పించుకొని సూటిగా చెప్పి చిత్రమైన నైపుణ్యాన్ని చూపించారు.

*"ఓ రమణీమణులారా! మీ జీవనములు ధన్యములు. మీ మైత్రి ధన్యమైనది. మీ ప్రేమార్ద్ర హృదయములు ధన్యతమము లైనవి! దుర్భరంబగు నీ దుఃఖజీవన వనంబున నమృత ఫలంబులు మీ చేతులకే లభియింపఁగలవు! దుస్తరంబగు నీ దుఃఖసంసార సముద్రమున నానంద తరంగములు మీ కన్నులకే యగపడు గలఁవు? మీవంటి కుమారీమణులం గాంచుట చేతనే భారతమాత రత్న గర్భయని పేరుమోయు చున్నది. పుణ్యమూర్తులగు మిమ్ముఁబోలిన రమణీ మణులింకను నవతరించి ప్రాతస్మరణీయంబులగు భారతవర్ష సతీమణుల చరిత్రములను బెంపొందించెదరుగాక!"*

ఈ నవలలో వర్ణనలలో ఓ ప్రత్యేకత ఉంది. వర్ణనలలోని చమత్కారం గొప్పది.

దేవదాసు సినిమాలోని పాటలో- *బాధే సౌఖ్యమనే భావన రానీవోయి...* అన్న వ్యక్తీకరణ ఉంది. దీనికన్నా ఎంతో పూర్వపు మాతృమందిరములో ఇదే భావన ఉండటం విశేషం.

"దుఃఖమును గూడ సుఖముగనే భావింప నలవాటుపడిన సరస్వతి కూడ దుఃఖమునకు లోఁబడిపోయెను."

కేవలం కథేకాక అనుబంధంగా ఎంతో సమాచారాన్ని ప్రత్యేకంగా ఈ నవలలో పొందుపరిచారు.

"తొల్లి శ్రీరామచంద్రుఁడీ సరోవరమున! గ్రుంకులిడి సీతా వియోగ దుఃఖమును మఱచి కార్యదీక్షా తత్పరుఁడయ్యెను. పాండవాగ్రజుఁడా పవిత్ర జల స్నానానంతరము నందే భారతవర్షమునకుఁ బట్టభద్రుడయ్యెను. అశోకుఁ డశోకుఁడయ్యెను. విక్రమార్కుఁడు సాహసాంకుడయ్యెను. శాలివాహనుఁడు శకకర్త యయ్యెను. రాజరాజనరేంద్రుఁడా యమృతస్నానము వలననే పంచమ వేదమగు భారతేతిహాసమునకుఁ గృతికర్త యయ్యెను. శ్రీకృష్ణదేవరాయలా పావన సరోవరావగాహన మహాత్మ్యము చేతనే- ఆ మాతృదేవతా ప్రసన్న కటాక్ష ప్రభావము చేతనే- రాజచక్రవర్తియై, కవిరాజ చక్రవర్తియై, లక్ష్మీసరస్వతులఁ దన యింటి లీలాసాల భంజికలుగాఁ జేసికొనఁ గలిగెను."

అలానే ఈ నవలలో ఎన్నో స్తుతులు, స్తోత్రాలు ఉన్నాయి.

"యాదేవీ సర్వభూతేషు మాతృ రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యైనమోనమః॥
యాదేవీ సర్వభూతేషు పితృరూపేణ సంస్థతా ॥నమ॥
యాదేవీ సర్వభూతేషు భాతృరూపేణ సంస్థితా॥ ॥నమ॥
యాదేవీ సర్వభూతేషు బంధురూపేణ సంస్థితా॥ ॥నమ॥

వేశ్యల పుట్టుపూర్వోత్తరాలను చాలా సంగ్రహంగా, నేర్పుగా చెప్పారు.

ఆనం: తల్లీ! ఆర్య సంఘమున మీరు దేవీపరిచారికలై పుణ్య యువతీ మణు లుగఁ బరిగణింపబడుచుంటిరి. శుభ కార్యములయందు శోభన దేవతలుగ భావింపఁబడుచుంటిరి. అట్టి నిత్యసువాసినులగు మీరు క్రమక్రమముగ నజ్ఞా-నవశంబున నీచవృత్తుల నాశ్రయించి పూర్వో న్నృత్యమును బోగొట్టుకొంటిరి. ఆ కారణము చేతనే దేవతామూర్తులై యున్న మీరు తుట్ట తుదకు రాక్షసీ మూర్తులైపోయిరి. మీ పుణ్యచరిత్రములు పాపభూయిష్టములై పోయినవి. సంఘకల్పమునకు వేరు పురుగులైపోయితిరి. ధనలోభముచే ధర్మమును విడిచితిరి. కులవృత్తిని విడిచితిరి. గుణమును విడిచితిరి. గౌరవమును విడిచితిరి. అన్నియును విడిచి యాత్మద్రోహము నకుఁ బాలైపోయితిరి, తుదకు మీకు మిగిలినదేమున్నది?

రాజ: ఏమున్నది? దుఃఖము మిగిలినది. పాపము మిగిలినది. పరితాపము మిగిలినది!

*ఆనం: ఇప్పటికి బోధపడినదా?*

*రాజ: తల్లీ!* అనుభవమైనది. వ్యభిచారమే కులవృత్తియనుకొని సంచరించుట జ్ఞానముగల మానవస్వభావము కాదని యనుభవమైనది! ఆ పరితాప జ్వాలలచే నా సర్వాంగములును దహించుకొని పోవుచున్నవి. *తల్లీ!* నన్నుద్ధరింపుము.

ఎన్నో విషయాల్ని, ఎంతో జీవితాన్ని, కాలగమనంలోని ముఖ్యఘట్టాల్ని, జీవన పరిణామాల్ని ఆవిష్కరించిన నవల మాతృ మందిరము. నవలలో కథకే కాదు, మరెన్నో కథేతర విషయాలకు ప్రాముఖ్యత ఉంటుందని నిరూపించిన చారిత్రక సత్యం మాతృ మందిరము నవల.

*నవంబర్, 2008*




# సిపాయి కూతురు

## కొవ్వలి లక్ష్మీనరసింహారావు

**సి**పాయి కూతురుఅన్న పేరుని బట్టే అర్థమవుతుంది జానపద నవల అని. జానపద నవలలకి ఉత్కంఠే ప్రధాన రసం. పాత్రల ద్వారా, సంఘటనల ద్వారా, కథలో కొత్త మలుపుల ద్వారా పాఠకులలో ఆసక్తిని పెంచటం. జానపద వచన రచనకి ప్రాణం. ఆ ప్రతిభ విషయంలో కీ.శే. కొవ్వలి లక్ష్మీనరసింహారావు ప్రసిద్ధులు. కొవ్వలి లక్ష్మీనరసింహరావు, జంపన చంద్రశేఖరరావు కొన్ని దశాబ్దాల పాటు తెలుగు పాఠకులకి పుంఖానుపుంఖాలుగా తమ నవలలని అందివ్వటమేకాక, కొన్నివేల మందికి పుస్తక పఠనం అలవాటుచేసి గొప్ప సేవ చేశారు. కొవ్వలి, జంపన అన్న పేర్లతో వారి నవలలు అమ్ముడైనంతగా వేరెవరి నవలలు అమ్ముడు కాలేదు. కాశీమజిలీ కథలు, బేతాళ కథలుపూర్తి జానపదమైతే, కొవ్వలి, జంపన ఎన్నెన్నో సాంఘిక నవలలతో పాఠకులని ఆకట్టుకోవటమే కాక, వారు సర్వస్వం మరిచిపోయి ఆ నవలల్ని చదివేలా తమ శక్తిని చూపించారు. పాపులర్ నవలా సాహిత్యానికి తెలుగులో వీరిద్దరు తొలి పంక్తి రచయితలు. ఆ తర్వాత డిటెక్టివ్ సాహిత్యం (పాకెట్ బుక్స్ అనేవారు) 1950, 60, 70 దశకాల్లో తెలుగులో విస్తృతంగా చెలామణి అయింది. ప్రతినెలా కొన్నివేల కాపీలు ప్రచురణ, కొన్ని లక్షల రూపాయలు వ్యాపారం జరిగింది. అటువంటి సమయంలో కూడా కొవ్వలి పాకెట్ బుక్స్ రూపంలో

భయంకర్ అన్న కలం పేరుతో ఎన్నో నవలలు రాశారు. ఒక్కో నవల పది, పదిహేను భాగాలుగా నెలకొక్కటి చొప్పున సీరియల్‌గా వెలువడేవి. డిటెక్టివ్ సాహిత్యం అనబడే ఈ పాకెట్ బుక్స్ ద్వారా తెలుగులో నవలలు చదివేవారి సంఖ్య ఎంతగానో పెరిగింది. పై వర్గం వారేకాక, కింద తరగతివారు, అంటే ఉదాహరణకి హోటల్ కార్మికుల్లాంటి వాళ్ళు పుస్తకాలు తెగ చదివేవారు. తెలుగు నవలా రచయితలు, ప్రచురణకర్తలు, పాఠకులు ఈ విషయంలో కొవ్వలి లాంటివారికి కృతజ్ఞులే.

సిపాయి కూతురు నవలలోని కథ అతి సామాన్యమైన జానపద కథే.

పన్నా అందమైన పడుచు. చురుకు, ధైర్యం, తెగువ, లావణ్యం, తెలివి, ప్రేమాభిమానాలు కలగలిసిన వ్యక్తి. ఆమె తండ్రి జయసింగు సికిందర్ కోటలో సిపాయి. అతని ఒక్కగానొక్క కూతురు పన్నా. తల్లిలేని పిల్ల. ఆమె చిన్నతనం నుంచీ తానే తల్లీ, తండ్రి అయి గారాబంగా పెంచాడు.

పన్నా తల్లివేపు వారి ద్వారా అరణంగా లభించిన గుర్రం కళ్యాణి. ఆ గుర్రమంటే పన్నాకి ప్రాణం. ఆ గుర్రాన్ని తమ ఇంటికి చెందిన ఓ వ్యక్తిలా చూసుకుంటోంది పన్నా.

తండ్రికి కోటకి అన్నం పట్టుకెళ్ళిన సందర్భంలో పన్నా సికిందర్ రాజ్యపు యువరాజు సుందర్‌కుమార్‌ని చూసింది. ఓ కొత్త గుర్రాన్ని మచ్చిక చేసుకుంటూ అతను పడుతున్న తంటాలు చూసి నవ్వు ఆపుకోలేకపోయింది పన్నా. ఆమె అలా నవ్వటం సుందర్‌కుమార్ దృష్టిలో పడింది. ఒకరి గురించి ఒకరు వాకబు చేశారు. తను అలా నవ్వటం తప్పు అనిపించింది పన్నాకి. అదే విషయం తండ్రితో చెప్పింది. ఈ తప్పుకి యువరాజు శిక్షిస్తారా అని అడిగింది.

యువరాజు ఈమధ్యే మేనమామల ఇంటి నుంచి వచ్చాడని, ఆయన మన స్తత్వం ఎలాంటిదో తెలియదని జయసింగు యువరాజు ప్రస్తావనతో పాటు క్రూరుడైన విక్రమసేనుడు ప్రవర్తన సికిందర్ రాజ్య పరిస్థితులను గురించి కూడా మాట్లాడాడు.

రాజా గణపతిసింహుడు ఆది నుంచీ ఆధ్యాత్మిక చింత గలవాడు. ఆధ్యాత్మిక చింతనకూ రాచకార్య నిర్వహణకూ బద్ధ వైరమే అయినప్పటికీ, అతడు ఇంతకాలం, విధిలేక, తామరాకు మీది నీటిబిందువు లాగ, ఐహిక విషయాలతో ఎక్కువ సంబంధం పెట్టుకోకుండానే గడుపుతూ వచ్చాడు. ఆ ప్రకారం మన కథాకాలానికి అయిదు సంవత్సరాల క్రితం వరకూ జరిగింది. ఇంతలో పట్టమహిషి రమాదేవి కాలధర్మం చెందటం తో, మహారాజు తనకంతవరకు ప్రపంచంతో ఉన్న సంబంధాన్ని శాశ్వతంగా తెగతెంపులు చేసుకున్నాడు.

కులదీపకుడు, వంశాంకురం, ఏకైక పుత్రుడు అయిన సుందర్‌కుమార్ తల్లి పోయేటప్పటికి పన్నెండేళ్ళవాడు. మాతృ వియోగం వల్ల ఆ బిడ్డ బేజారైపోకుండా సాకడానికి మేనమామలు యువరాజును తమ నగరం తీసుకుపోయారు. ఈ అయిదేళ్ళు యువరాజు అక్కడే పెరిగి, పదిహేడేళ్ళ యువకుడయ్యాడు.

యువరాజు పద్దెనిమిదేళ్ళు దాటి, ప్రాజ్ఞుడయ్యేవరకూ రాజ్యభారము నంతటినీ మంత్రి అయిన విక్రమసేనుడు సర్వాధికారిగా ఉండి నిర్వహించడానికీ, యువరాజు

ప్రాజ్ఞుడైన తక్షణం సింహాసనం అతని స్వాధీనం చేయడానికి ఒక వీలునామా వ్రాసి, మహారాజు నాటి నుంచీ నరుల కళ్ళకయినా కనుపించకుండా కోటకు కొంత దూరంలో ఉన్న ఒక తోటలోని ప్రత్యేక మందిరంలో ప్రశాంత జీవితాన్ని గడుపు తున్నాడు. యువరాజు ఇంకొక్క సంవత్సరంలో పద్దెనిమిదేళ్ళు దాటి ప్రాజ్ఞుడు కాగలడనీ, మహా రాజు వ్రాసి ఉంచిన వీలునామా ప్రకారం అతడప్పుడు సర్వ రాజ్యభారాలు వహించవలసి ఉంటుందనీ, ఆ గడువులోపల అతడు సర్వ రాజకార్యములతోను పరిచయం కలిగి ఉండడం మంచిదనీ ఆలోచించి, మేనమామలు యువరాజును ఒక సంవత్సరం ముందుగానే నిజ రాజధానికి పంపించారు.

యువరాజుకి కొద్ది రోజుల్లోనే పరిస్థితి అర్థమైంది. విక్రమసేనుడు మంత్రిపదవే కాక, సర్వసేనాని పదవిని చేపట్టి రాజ్యాన్ని పూర్తిగా తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. కోశాధిపతి మాధవసేనుడు అతనికి ఆంతరంగికుడు. యువరాజు ప్రయత్నించినా ఏ విషయంలోనూ అతన్ని జోక్యం చేసుకోనీకుండా విక్రమసేనుడు మొండిగా ప్రవర్తిస్తు న్నాడు. ఈ పరిస్థితులన్నీ తండ్రి దగ్గరికి వెళ్ళి వివరించాడు సుందర్‌కుమార్.

గాఢమైన వేదాంతధోరణి, బైటి ప్రపంచాన్ని పట్టించుకోని మతిభ్రమణమో, మొత్తానికి రాజు గణపతిసింహుడు యువరాజు మాటల్ని పట్టించుకోలేదు. యువరాజుకి ఏం చెయ్యాలో తోచని పరిస్థితి. కళ్యాణిని అధిరోహించి గుర్రం స్వారీ నేర్చుకుంటున్న పన్నాని చూసిన సందర్భంలో ఆ పిల్ల అంటే అతనికి ఇష్టం ఏర్పడింది.

ఇంక పన్నా పరిస్థితి. తల్లి మరణ సమయంలో తండ్రి కామోజీ దగ్గర చేసిన అప్పు తీర్చలేని స్థితి. కామోజీకి పన్నా మీద కన్ను. అతని అసభ్య ప్రవర్తన తట్టుకోలేక కొంత బాకీగా ప్రాణసమానమైన కళ్యాణిని అప్పగించాడు. విక్రమసేనుడు క్రౌర్యం వల్ల జయసింగు ఉద్యోగం పోయింది. ఈ అలుసుతో కామోజీ పన్నా ఒక్క రాత్రి శరీరం అప్పగిస్తే చాలు బోల్డంత డబ్బు అని పరమ నీచంగా మాట్లాడాడు. కోపం ఆపుకోలేక పన్నా తన చేతిలో కత్తి విసిరింది. అది తగిలి కామోజీ మరణించటం హత్యా నేరం పన్నా మీదకి రావటం జరిగింది. చేసేదిలేక పన్నా, జయసింగు పారిపోయారు. దారిలో యాదృచ్ఛికంగా కళ్యాణి తారసపడటం, దానిమీద పన్నాని ఎక్కించి తరుము కొస్తున్న సైనికుల బారి నుంచి రక్షించటానికి, పన్నాని గుర్రంతో సహా కొల్లేటిలోకి నెట్టేశాడు జయసింగు. సైనికులకు చిక్కిన జయసింగు బతుకు చెరసాల పాలైంది.

కళ్యాణి భీకరమైన కొల్లేరు దాటి, కొనప్రాణంతో ఉన్న పన్నాని ఆమె తాత గారింటికి చేర్చింది. అక్కడ కొద్దిరోజులుండి కోలుకున్న పన్నా జీవితం అనుకోని మలుపులు తిరిగింది.

ఆడ పన్నా మగవేషం ధరించి మల్లుదొరగా మారింది. సికిందర్ రాజ్యంలో అష్టకష్టాలు పడుతూ తింటానికి తిండి కరువైన ఎందరో పేదలకి ప్రత్యక్ష దైవం అయింది. ఆ ప్రాంతం ప్రజలు ఆమెకి ఒక గుహలో ఆశ్రయం కల్పించి అహర్నిశలు కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారు.

పన్నాకి రెండు ధ్యేయాలు. తండ్రిని రక్షించుకోవాలి, సికిందర్ రాజ్య ప్రజల కష్టాలు కడతేర్చాలి. ఆ తర్వాత కథలో రకరకాల మార్పులు. విక్రమసేనుడికి పక్కలో బల్లెమైంది పన్నా. ఆమెను పట్టుకోవడానికి వచ్చిన యువరాజు సుందర్‌కుమార్ పన్నాయే మల్లు అని గ్రహించి, ఆమె బతికి ఉన్నందుకు ఎంతగానో సంతోషించి తన ఆనందాన్ని వ్యక్తం చేస్తాడు. వీరిద్దరూ కలిసి విక్రమసేనుడ్ని అంతమొందించి సికిందర్ రాజ్యాన్ని ప్రజాను కూలంగా మారుస్తారు.

సిపాయి కూతురు నవలలో విశేషం ఏమిటంటే కథ అందరూ ఊహించ గలిగిందే. ఓ పేద కన్య, ఆ దేశపు రాజకుమారుణ్ణి ప్రేమించి పెళ్ళాడటం ఎన్నో జానపద కథల్లో ఉన్నదే. విక్రమసేనుడి లాంటి క్రూరుడి ఆగడాలు, కథానాయకుడు అతన్ని జయించి రాజ్యాదికారానికి రావటం జానపద కథల్లో మామూలే.

కానీ ఇటువంటి అతి సామాన్య కథని కొవ్వలి వదలకుండా చదివేలా రాసిన తీరు గొప్పది. పాత్రలకి పేర్లు పెట్టటం దగ్గర్నుంచీ, గుర్రంతో నాటకీయతని సాధించటం తో పాటు, సాత్వికమైన యువరాజు, తెగువరి అయిన పన్నా పాత్రల వైవిధ్యం... ఇలా చాలా రకాలుగా కొవ్వలి తనదైన ముద్ర చూపించారు.

నవలలో ఎక్కువ గందరగోళం ఉండదు. సంఘటన తర్వాత సంఘటన క్రమ పద్ధతిలో ఉండి కథని ఒకే ప్రవాహంలా నడిపాయి. దీర్ఘమైన వర్ణనలు లేవు. చిన్నచిన్న మాటల్తో, సంభాషణలతో పన్నా యువరాజుల ప్రేమకథ సాగుతుంది.

రాజా గణపతిసింహుడు పాత్రకు కథాపరంగా అంత విలువ లేదు. కానీ ఆ పాత్రకి గాఢమైన ఆధ్యాత్మికత జోడించి, ఆసక్తికరమైన విషయాలను చెప్పటం ఒక నేర్పు.

'మహారాజులు ఆడి తప్పకూడదు, సికిందర్ రాజులు ఆడి తప్పరు,' అన్న నీతితో సిపాయి కూతురు నవల చివరి భాగం సాగుతుంది. ఒక రకంగా క్లైమాక్స్‌కి ఆధారం ఈ నీతి సూత్రమే. రాజులే కాదు, ఏ పాలకులైనా ఆడి తప్పితే ఆ పాలన వల్ల ప్రజలకి ఎంత ఇబ్బందో చాలా సున్నితంగా కొవ్వలి సూచించిన విధానం కూడా విశేషమైంది.

ఇటువంటి నవలల వల్ల పాండిత్యం పెరగకపోవచ్చు. కానీ పుస్తకాలు చదివే అలవాటు ఎందరికో అబ్బుతుంది. సాంఘికపరమైన నీతి అర్థమవుతుంది. సత్ కాలక్షేపం జరుగుతుంది.

సిపాయి కూతురు నవలని **1968** జులై నెలలో ఎమెస్కో పాకెట్ బుక్స్ వారు పునః ప్రచురించారు.

ఇప్పటి ప్రఖ్యాత నటుడు కైకాల సత్యనారాయణ కథానాయకుడుగా తొలిసారి నటించగా చలన చిత్రంగా నిర్మించారు.

సిపాయి కూతురే కాదు కొవ్వలి ఎన్నోనవలలు ఎప్పటికీ ఆసక్తిగా చదువు కోవటానికి వీలుగానే ఉంటాయి.

*డిసెంబర్, 2008*




# కొత్త ఇల్లు

## తాళ్లూరు నాగేశ్వరరావు

1968లో ఆంధ్రప్రభ వారపత్రిక వారి ఉగాది నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన నవల కొత్త ఇల్లు. 1934లో పుట్టిన తాళ్ళూరు నాగేశ్వ్రరావు 1949 నుంచీ రచనలు చేశారు. 17 నవలలు, 500 పైగా కథలు, ఇంకా రేడియోకి నాటకాలు, వ్యాసాలు... ఇలా ఎన్నెన్నో రచనలు చేసిన రచయిత. ఆ రోజుల్లో ఆయనంత విరివిగా రచనలు చేసినవారు చాలా తక్కువ. చిన్న ఊహ, చిన్న కబురు, ఇలా దేన్నైనా అలవోకగా, అతి త్వరగా కథగా రాసేయటం తాళ్ళూరు వారి అలవాటు. సాదాసీదాగా కథ చెప్పేయటం, పెద్దగా వివరాలలోకి వెళ్ళకపోవటం ఈయన తీరు.

కానీ ఈ కొత్త ఇల్లు నవలలో ఆయన అనుసరించిన పద్ధతి వేరు. చిన్నచిన్న వివరాలతో సహా, విపులమైన వర్ణనల మధ్య చక్కటి పలుకు బడులను పొదిగి రచించిన నవల కొత్త ఇల్లు. నవలలోని కథ అంత పెద్దది కాదు. ఒక కుటుంబం కథ. మరీ ఎక్కువ పాత్రలు, సంఘటనలు, మలుపులు లేవు. కానీ వస్తుపరంగా విస్తృతి ఉంది. మూడు తరాల వ్యక్తులు న్నారు. వారి నమ్మకాలు, అనుబంధాలు, విభేదాలు ఈ నవలకి ఆయువు పట్టు.

ధర్మయ్య సంప్రదాయానికి, మంచితనానికి ఆ పల్లెటూళ్ళో పెట్టింది పేరు. తరతరాలుగా వచ్చిన మండువా ఇల్లంటే ఆయనకి ప్రాణం. 'తాతలనాటి నుంచి వచ్చే పేరు ప్రతిష్టలకి, సంప్రదాయాలకి పట్టుకొమ్మ ఇల్లు. సత్సంప్రదాయాలను పోషిస్తూ, సంసార కల్లోలం నుంచి ఎప్పటికప్పుడు కుటుంబానికి శాంతినీ, రక్షణనూ కల్పించే పవిత్ర దేవాలయం ఇల్లు,' అనేది ఆయన విశ్వాసం. ఆ పాత ఇంటికి, తనకి అబేధం అని ఆయన నమ్మకం. ఆయనకి అన్నిరకాలుగా ఆలోచనల్లో, నమ్మకాల్లో, చేతల్లో సహధర్మచారిణి సుందరమ్మ. భర్తకి నీడ ఆవిడ. ఆవిడకంటూ ఆవిడకి వేరే జీవితం లేదు. అక్కర్లేదు.

ధర్మయ్యగారి కొడుకు రఘురామయ్య. అతని భార్య సుభద్ర. వారికి దుర్గా ప్రసాద్, వసంతలక్ష్మి సంతానం.

రఘురామయ్య చెల్లెలు అన్నపూర్ణ. ఆవిడ కూతురు సుమతి. అన్నపూర్ణ వైధవ్యం వల్ల, భర్త పోయిన సమయంలో ఏర్పడిన మతిభ్రమణం వల్ల, నిత్యం ఏదో పనిచేసే యంత్రంలా మారింది. ఆవిడ ఆ ఇంట్లో ఏం జరిగినా పట్టించుకోదు. తల్లికి పూర్తిగా వ్యతిరేకం సుమతి. ఏ విషయాన్నైనా నిర్భయంగా మాట్లాడే రకం. రఘురామయ్య కొడుకు దుర్గాప్రసాద్ కూడా ఇదే రకం.

రఘురామయ్య, ఆయన భార్య సుభద్రమ్మ పద్ధతి వేరు. వారి ఆశలు వేరు. పెద్దాయన ధర్మయ్యగారిని ఎదిరించక పోయినా, వాళ్ళు చెయ్యాలనుకున్న పనులు వాళ్ళు చేసుకుంటారు.

ధర్మయ్య, సుందరమ్మ, అన్నపూర్ణలను వదిలేస్తే ఇంటి విషయంలో మిగిలిన వాళ్ళ అభిప్రాయం వేరు.

'ఎండ నుంచి, వాన నుంచి రక్షణ కల్పించేది ఇల్లుగానీ, అవి లేకపోయాక చెట్టు నీడకు, దానికీ తేడా ఏమిటి?' ఇదీ దుర్గాప్రసాద్ వాదన.

*గతం గతమే! వర్తమానం వర్తమానమే! భవిష్యత్తు భవిష్యత్తే! గతాన్ని గతందృష్టితో ఆరాధిస్తూ వర్తమానాన్నీ, భవిష్య త్తునూ విస్మరిస్తే ఎట్లా? తాతముత్తాతల కాలానికీ, ఆ సంప్రదాయాలకూ, భావాలకూ ఇప్పుడు పూజలూ, భజనలూ చేస్తే యేంలాభం? కాలం మారింది. సాంఘికవ్యవస్థ కొత్త చైతన్యంతో రూపొందుతోంది. సంప్రదాయాలూ, ఆచారాలూ, ఆలోచనలూ మారడం సహజం. శిధిలావస్థలో ఉన్న నిర్జీవ సాంప్రదాయాలనూ, ఆచారాలనూ నిలబెట్టు కోవాలనే నిష్ఫలమైన తహతహతో అందర్నీ దులిపి దుమ్మెత్తి పోయడం వల్ల గొంతునొప్పే తప్ప చైతన్యస్రవంతి నిల్చిపోతుందా? అబ్బాయి పెద్ద చదువు చదువుతున్నాడు. తన వ్యాపారమూ, ఆర్థిక పరిస్థితి, సాంఘికమైన హోదా కొమ్మలూ, రెమ్మలూ వలె వృద్ధి అవుతున్నాయి. ఊళ్ళో తను పై ఎత్తుగా*

*కనబడాలంటే మంచి ఇల్లు కూడా అవసరమే! ఇంటిని చూసి ఇంటి యజమానికి గౌరవాన్ని ఇచ్చే ఈ కాలంలో ఆధునిక వసతులు గల ఓ అందమైన మేడ ఉండటం అన్నివిధాలా శ్రేష్టమే.*

- ఇది రఘురామయ్య అభిప్రాయం.

'నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకూ ఈ ఇల్లు పడగొట్టటం జరగదు, కొత్త ఇల్లు కట్టడం అంతకన్నా పడదు. మీరంతా ఏకమై ఏకటాకీన నామీద దండెత్తి వచ్చినా ఇక్కడగానీ, ఆ ఖాళీస్థలంలోగానీ కొత్త ఇల్లు కట్టేందుకు ఒప్పుకోను. ఈ విషయంలో ఇక మీరు నోరు కదపవద్దు, నన్ను రెచ్చగొట్టవద్దు...' అని ఖచ్చితంగా చెప్పేశారు ధర్మయ్యగారు.

ఏమైనా కొత్తఇల్లు కట్టాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు రఘురామయ్య.

ఆ కుటుంబంలో రకరకాల అభిప్రాయబేధాలు వచ్చినా, అన్నింటిలోకి మౌలికమైన విషయం ఇల్లు అయింది. దాని ఆధారంగా, ప్రతీకాత్మకంగా, మిగిలిన పాత్రలని చాలా నేర్పుగా, పకడ్బందీగా తీర్చిదిద్దారు తాళ్ళూరు నాగేశ్వర్రావు.

ధర్మయ్య, సుందరమ్మలు పాతతరంవారు. రఘురామయ్య, సుభద్రమ్మ సంధికాలంవారు. దుర్గాప్రసాద్, వసంతలక్ష్మి, సుమతి కొత్తతరం.

ఇలా మూడుతరాల వారి కథని, వారివారి మనస్తత్వానికి అనుగుణంగా గాలివాటుగా కాక, సహేతుకంగా నాగేశ్వర్రావుగారు నడిపిన తీరు ఈ నవలలోని ప్రత్యేకత. ఆయన పూనుకుని ఇలా చేశారా? లేక పల్లె జీవితం పట్ల, ఆ కాలంనాటి కట్టుబాట్లు, కొత్త ఆలోచనల పట్ల ఆయనకి ఏర్పడిన లోతైన అనుభవం వల్ల అలా రాయగలిగారో చెప్పలేం. ఏమైనా ఆ సమయాన్ని, అక్కడి జీవితాన్ని అద్దంలా చూపించిన నవల కొత్త ఇల్లు.

సంప్రదాయానికి, పరోపకారానికి, ధర్మబుద్ధికి ధర్మయ్య సజీవ రూపం. ఆయన ముందుతరం వారు ఆయనకిచ్చిన సంపద అది. ఆ పద్ధతిలో ఆస్తి కరిగిపోయినా, పొలాలు తరిగి పోయినా ఆయనకి ఇబ్బంది లేదు.

కానీ రఘురామయ్య పద్ధతి వేరు. డబ్బు సంపాదించాలి. ప్రయోజనంలేని దాన ధర్మాలకి వెళ్ళగూడదు. మారుతున్న కాలానికి, రాజకీయాలకి అనుగుణంగా మారాలి. అన్ని అవకాశాలను అందుకోవాలి. లాభపడటం కోసం మౌనంగా ఉన్నా, అబద్ధాలు ఆడినా లౌక్యంగా ప్రవర్తించినా తప్పులేదు. అందుకే అతను కో-ఆపరేటివ్ సేల్స్ సొసైటీ ప్రెసిడెంట్ అయ్యాడు. రేషన్ సరుకుల్ని బ్లాకులో అమ్మి, డైరెక్టర్లందరికీ కొద్దికొద్దిగా డబ్బు పంచి, ఊళ్ళో కుర్రకారుకి చందాలిచ్చి తనవేపు తిప్పుకుని, అన్నిరకాలుగా డబ్బు పోగేశాడు. చివరికి మేనకోడలు సుమతి పోషణ విషయంలో కూడా తప్పుడు లెక్కలు చెప్పి కొంత డబ్బు వెనకేశాడు. ఎన్ని చేసినా అతనిలో ఉన్న ఒకే ఒక సుగుణం తండ్రిని

ఎదిరించకపోవటం. ఆయన మర్యాదని ఎదుటి వాళ్ళ ముందు కాపాడటం. పాతతరానికి కొత్త తరానికి మధ్య నలిగిన రఘు రామయ్య పిల్లల్ని ఏనాడూ గట్టిగా కట్టడి చెయ్యలేదు.

దుర్గాప్రసాద్ ముస్లిం అమ్మాయి షెరీన్‌ని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. వైధవ్యాన్ని, యవ్వనభారాన్ని మోసిమోసి విసిగిపోయిన వసంతలక్ష్మి తెగింపు తెచ్చుకుని, రఘురామయ్య శత్రువర్గంలోని బుచ్చయ్యగారి కొడుకు భాస్కర్రావుతో వెళ్ళిపోయి మంగళగిరిలో పెళ్ళి చేసుకుంది. రఘురామయ్యకి మేనకోడలు సుమతి అంటే ప్రేమ లేకపోలేదు. ఆమె ఆస్తి విషయంలో కక్కుర్తి పడ్డా, గారాబంగానే పెంచాడు. అటువంటి సుమతి ఇల్లు వదిలి వెళ్ళిపోయి పరాయి కులస్థుడైన రాజబాబుని పెళ్ళి చేసుకుంది.

ధర్మయ్యగారంత ఛాందసుడు కాకపోయినా రఘురామయ్య వాళ్ళ వివాహాలను, పరమత, పరకుల సంబంధాలను ఆమోదించలేకపోయాడు. కూతురు వసంతలక్ష్మి మళ్ళీ పెళ్ళి చేసుకోవటం సబబే అనిపించినా, బుచ్చయ్య కుటుంబాన్ని సమ్మతించ లేకపోయాడు.

ఇన్ని గొడవల్లోనూ కొత్త ఇల్లు పూర్తయింది. కానీ ఒకప్పటి శాంతి నిలయం లాంటి వాళ్ళ నివాసం అశాంతి నిలయంగా మారింది.

*'నువ్వు నా మాట పెడచెవిని బెట్టి కొత్త కొంపకు పునాదిరాయి వేశావు. అప్పటి నుంచీ ఈ ఇంటికి శని చుట్టుకుంది. అన్నీ అష్టావక్రంగా జరుగుతున్నాయి. రెక్కలొచ్చిన పక్షులు రికామీగా ఎగిరిపోతున్నాయి. రెక్కలు చచ్చుబడ్డవాళ్ళు చవటదద్దమ్మలై చతికిలబడుతున్నారు. ఆశపాతకం కొద్దీ నువ్వు అభ్రచ్ఛాయలో అగ్గలమీద పోతున్నావు. ఎటొచ్చీ నువ్వొక్కడివే ఆ కొత్త ఇంట్లో కులకవలసి ఉంది,' అంటూ ధర్మయ్య చీటికీ మాటికీ పోటకత్తితో ఎత్తి పొడుస్తున్నాడు.*

*మంచాన పడ్డాక కూడా ధర్మయ్య సాధింపు తగ్గలేదు. 'ఏ దుర్ముహూర్తాన కొత్త ఇల్లు మొదలుపెట్టావో, అన్నీ అరిష్టాలే! ఇంటి పరువుప్రతిష్టలు కూలి పోతున్నాయి. ఒకతె కులంకాని వాణ్ణి, మరొకతె రెండో పెళ్ళీ, వాడేమన్నా సాయిబుల పిల్లను... ఇట్లా నా హయాములోనే కుటుంబంలోని మనుషులు పెడదారులు తొక్కి, ఇంటితనాన్నీ, సంప్రదాయాన్నీ సర్వనాశనం చేశారు. భగవంతునికి నాపైన పిసరంత కరుణా కలగలేదు. ఇది చాలదన్నట్టు నాకీ పక్షవాతాన్ని కూడా అంటగట్టాడు. ఈ మంచంలోనే కొడుకు చేసే అపసవ్యపు పనుల్నీ, మన సంతానపు విరగబాటుల్నీ చూస్తూ, కుమిలి కృశించిపోవాలని నా నుదుట భగవంతుడు వ్రాశాడు. ప్రారబ్ధ కర్మం! వదిలించుకుందామన్నా వదులుతుందా?'*

ధర్మయ్య తిట్టితిట్టి చివరికి చచ్చిపోయాడు. కొత్త ఇంటికి పనులు ఆరంభమైన నాటి నుంచే ఈయనకు అనారోగ్యం మొదలై, ఇల్లు పూర్తయ్యేనాటికి మరణించటం నాగేశ్రావుగారు ప్రతీకాత్మకంగా చెప్పారు.

రఘురామయ్యకి గుండెపోటు రావటం, అదే సమయంలో అక్కడ ఉన్న డాక్టర్ కొడుకు దుర్గాప్రసాద్ ఆయన్ని ప్రాణగండంనుంచి రక్షించటం, తన చేతలకి బాధ పడ్డ రఘురామయ్య కొత్త ఇంటిని కొడుకుకు హాస్పిటల్‌గా ఇవ్వటం, దుర్గాప్రసాద్ దాన్ని తాతయ్య ధర్మయ్య జ్ఞాపకార్థం ఉచిత వైద్యశాలగా మలచటం ముగింపు.

నవల కొంత నాటకీయంగా ముగిసినా, ఓ ప్రణాళిక ప్రకారం నాగేశ్వర్రావుగారు రచన చెయ్యటం స్పష్టంగా కనిపిస్తుంది.

ముందుమాటలో ప్రఖ్యాత రచయిత హితశ్రీగారు కూడా నాగేశ్వర్రావుగారి ప్రణాళికను వివరించారు.

> *తరం తరవాత తరం కొద్దోగొప్పో అభ్యుదయం వైపు పురోగమిస్తుందని శ్రీ నాగేశ్వరరావు ఈ నవలలో ప్రతిపాదిస్తున్నారు. సమాజ చరిత్ర పరిశీలిస్తే ఈ ప్రతిపాదన ఒక వైజ్ఞానిక సత్యంగా గోచరిస్తుంది. ఈ ఊహ మనసులో మెదలగానే చిమ్మచీకటిలో మెరుపు మెరిసినట్లవుతుంది. మానవ సమాజం భవిష్యత్తులో కొండంత ఆశ కలుగుతుంది. ప్రతి యువకుడికీ వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లుంటుంది. ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుంది.*
>
> *గ్రామాల్లో ధర్మయ్యలాంటి ఆదర్శ వ్యక్తులు క్రమంగా కరువైపోతున్నారు. ఆయన అభిప్రాయాలు కొన్ని నేటి కాలానికి సరిపడవు. కాని అంతమాత్రాన ఆయనని అభ్యుదయ నిరోధకుడనలేము. జీవితంలో కొన్ని విలువల్ని ఏర్పరచు కొని, వాటికి అంకితమైపోయిన పరమ నైష్ఠికుడు ధర్మయ్య. రెండు నాలుకలు లేవు. ధర్మచ్యుతి సహించలేని పాతకాలపు మనిషి. బీదాబిక్కీ, గొడ్డూగోదా ఒక కంట కనిపెడుతూ ఊరికి తలలో నాలుకగా మసలుకొన్న ఆదర్శజీవి. పాపపు సొమ్ముతో రఘురామయ్య కొత్త ఇల్లు కట్టి గృహప్రవేశం చేసే లోపల ధర్మయ్య పక్షవాతంతో పడిపోవటం రచయిత ఊహాబలానికి, రచనా చాతుర్యానికీ ఒక మచ్చుతునక.*
>
> *కొత్త ఇల్లు నిర్మాణం నవలలోని ఒక తీర్చిదిద్దిన సొగసు. ఇసుక, రాళ్ళు నిర్మాణ స్థలానికి చేరవేయటంతో మొదలై దశలవారీగా ఈ కట్టడం వర్ణన నవల మొదటి నుంచి చివరదాకా సాగుతుంది. 'ఇల్లు కట్టిచూడు, పెళ్ళి చేసిచూడు' అన్నారు. ఇల్లు కట్టడంలోనే ఎన్నో సాధకబాధకాలు, ఒక కొత్త సమాజం నిర్మిం చాలంటే మరెన్ని సమస్యలు. ఈ సంకేతంతో, రచయిత రెండు విషయాల్ని రైలుపట్టాల్లాగా నడిపిన తీరు ఆహ్లాదకరం. స్వంతానికి కట్టుకున్న ఇల్లు పేద*

*ప్రజలకి ఉచితవైద్యం కోసం హాస్పిటల్ భవనంగా ఉపయుక్తం కావటంలో రచయిత తాను దర్శించి ప్రతిభావంతంగా ప్రదర్శించిన నూతన సమాజ స్వరూపం దృగ్గోచరమౌతుంది.*

కొత్త ఇల్లు నవలలో ముఖ్యంగా చెప్పదగిన విషయం, మాటతీరుకి-మనస్తత్వ చిత్రణకి తాళ్ళూరు నాగేశ్వర్రావుగారు ఇచ్చిన ప్రాముఖ్యత. అవి రెండే ఈ నవలను ప్రత్యేకంగా నిలబెట్టాయి అని చెప్పుకోవచ్చు.

చావడి ముందు మెల్లా, మెరాబాలో కొబ్బరిచెట్లు, చౌడు వేసి, ఉప్పురికి, బెతికలు రాలిన గోడలు, దూలాలు, ద్వారబంధాలూ, తలుపులూ కమ్ముీలూ, పట్టెలూ, మొకరాలూ, ఒడ్డెలూ... అంటూ ఇచ్చిన వివరాలు, జాలిపేగుల గుండె, సేరిమాగాణి, ఇంటితనం, అత్తారబత్తం, అలస భావం... లాంటి పదాలు ఈ నవలలో ఎన్నెన్నో.

'మండిగానికి పెట్టిన కుంకుమబొట్టులా స్త్రీని భావించేవాళ్ళు', 'కొల్లేటి పంట కూటికే చాలదన్నట్టు వ్యవసాయ తిప్పలు', 'మెరుపు దీపమవుతదా, మేగం గొడుగవు తదా?' అని గవర్నమెంటు ఆస్పత్రిని, 'ఆ ఇంట్లో కాలం మరీ క్షయరోగి చిరునవ్వులా కనబడుతోంద'ని వయసులో ఉన్న వసంతలక్ష్మి స్థితిని, చక్కటి పలుకుబళ్ళతో నాగేశ్వర్రావుగారు తీర్చిదిద్దారు.

ఆనాటి జీవితాన్ని, ఎప్పటికి ఉండే తరాల అంతరాలను తెలుసుకోవటానికి ఉపయోగపడే నవల కొత్త ఇల్లు. విరివిగా రాసే రచయితల అరుదైన రచనల్లో ఒకటి కొత్త ఇల్లు నవల.

*జనవరి, 2009*




# మోహనవంశి

లత

1960 దశకంలో శ్రీమతి లత (తెన్నేటి హేమలతాదేవి) అంత ప్రాచుర్యం ఉన్న రచయిత్రి మరొకరు ఎవరు? అని ప్రశ్నించుకొంటే సమాధానం అంత తేలిక కాదు.

ప్రతివారం ఊహాగానం, తరచుగా వెలువడే విలక్షణ నవలలు, ఇతర రచనలతో ఆమె తెలుగుదేశాన్ని, పాఠకుల్ని కదిపి, కుదిపి ఆశ్చర్యచకితుల్ని చేసింది.

మోహనవంశి దరిదాపు ముప్ఫై ఎనిమిదేళ్ళ క్రితం రచన. ఇప్పటికీ ప్రాచుర్యం తగ్గని రచన.

మోహనవంశిని నవల అనాలా? పౌరాణిక రచన అనాలా? ఊహాగానంలా భావాల పరంపర అనాలా?

ఎవరి అనుభూతిని బట్టి వారే నిర్ణయించుకోవాలి. ఒక పడికట్టుకి లొంగే రచన కాదు మోహనవంశి.

కానీ లతే స్వయంగా దీనిని నవలే అని పేర్కొనటం, ప్రచురణ కర్తలు అలాగే వర్గీకరించటంతో దీనిని నవలగానే పరిగణిస్తున్నాం.

మోహనవంశిలో కల్పిత కథ ఏం లేదు. కానీ లతకే సొంతమైన కాల్పనికత చాలా ఉంది. భారత భాగవతాల్లోని పాత్రలే ఉన్నాయి మోహనవంశిలో. కానీ వాటిలో కొన్ని పాత్రలు ఈ యుగపు భావాల్ని, చర్యల్ని మన ముందు ఉంచుతాయి. అందరూ భగవానుడని నమ్మిన కృష్ణపరమాత్మను లత మనిషే భగవంతుడైన పురుషుడంటుంది. శరీరం లతది, ఆత్మ రాధది అంటుంది. తన నివేదన రాధగా మారిన తనదే అంటుంది. మనందరిలో ఎంతోకొంత రాధాతత్వం ఉంటుందంటుంది. వెరసి మోహనవంశి మామూలు కోవకి చెందిన నవల కాదు. లతే చెప్పినట్టు ఆమె ఇతర నవలలాంటిది కానీ, ఇతర రచనలలాంటిది కానీ కాదు.

ఆత్మగతమైన రాధామాధవ ప్రణయంలో లత సశరీరంగా పలవరించిన ఉద్విగ్న భావాల మాలిక మోహనవంశి.

అంతకుముందు వరకూ తన ఏ నవలకీ తొలి పలుకులు వ్రాయని లత తను ఎందుకు, ఎలా మోహనవంశి నవల రాసిందో ముందుమాటగా చెప్పటం విశేషం.

సాంఘికంగా ఏ నిబంధననీ, ఏ ధర్మాన్ని పాటించని కృష్ణుడు తత్వవేత్త అవటం, భగవంతుడిగా నిలవటం తనకి చిత్రం అనిపించిందనీ. ఆ చిత్రమైన ఆకర్షణ, తనని లొంగదీసుకుని, ఆ ఘనశ్యామసుందరుని ఆరాధనలో నిమగ్నం చేసిందని ఆ ఆరాధన నుంచి జనించిందే మోహనవంశి అని చెప్పుకుంది.

'నా ఆశలకి, ఆశయాలకి, ఆత్మానందానికి అధిపతి నా వంశి. శరీరంతో అతనికి దగ్గరవటం అసంభవం కనుక ఆత్మతో అతని పాదాల దగ్గర వాలే మరో ప్రయత్నం మోహనవంశి. ఇది నేను రాధగా వ్రాశాను.'

'బ్రతకమని నాకు నిర్ణయించిన కాలంలో ఇరవై ఎనిమిది సంవత్సరాలు గడిచి పోయినై. ఏమి జరిగింది? ఏం మిగుల్చుకోగలిగాను? అని మొన్నటివరకు బాధ పడ్డాను. ఇక ఇప్పుడా బాధలేదు. నా చైతన్య అంతర్యాలు మోహనవంశిలో నిలిచే ఉంటాయి. మరుక్షణంలో పిలుపు వచ్చినా సర్దుకోవాల్సింది ఏంలేదు.'

ఒక రచయితకి ఇంతటి ఉద్వేగాన్ని, ఇంతటి సంతృప్తిని ఏ రచనేనా ఇవ్వటం గొప్ప విశేషం. ఆ విశేషపు ప్రతిరూపం మోహనవంశి.

భాగవతం ఆధారంగా సాగిన మినీ భారతగాథ మోహనవంశి. మోహనవంశిలో కృష్ణుని బాల్యం మొదలు, కిశోరప్రాయంలోని మోహనతత్వంతో పాటు, యమునా తీర విహారాలు, యశోదానందుల అపూర్వ పుత్రప్రేమ, చిత్రవిచిత్రమైన రేపల్లె స్వేచ్ఛా జీవనం ఉన్నాయి. గొల్లభామల విరహం, రాధ ప్రత్యేకత, బలరామకృష్ణుల అన్యోన్యం... ఇలా అన్ని ముఖ్య విషయాలను లత జాగ్రత్తగా పొందుపరిచింది. ఈ నవలలో కృష్ణుడి

మధురానగర ప్రయాణం, కంస సంహారం, సుభద్రార్జునుల ప్రణయం, ద్రౌపదీ జీవనతత్వం, సత్యవతీ భీష్మచరిత్ర, వ్యాస మహర్షి కీలక కార్యాచరణ, కుంతీ జీవనం, కర్ణతత్వం, భారతయుద్ధం, గీతాసారంతో పాటు పలు కీలక అంశాల వివరణా, చర్చా ఉన్నాయి. గీతాసారమే మోహనవంశి అని, రాధే కృష్ణుడి వంశీ అని, అర్జునుడు కృష్ణుడి వంశీగానంలోని ధ్వని, శృతి అన్న ప్రతి పాదనలు ఉన్నాయి.

ఇవన్నీ ఉన్నా ప్రధానంగా మోహనవంశి రాధామాధవ ప్రణయ తత్వం, దాని కాధారంగా సాగే తాత్విక చర్చ. భారత భాగవతాలలోని కృష్ణ ప్రాధాన్యతని ఎక్కడా వదలలేదు లత.

నాటకీయ సంఘటనల మీద, కథ మీద ఆధారపడకుండా లత మోహనవంశి రచన సాగించటం విశేషం. విలక్షణ ప్రణయాల్ని, ఉద్రేకపరిచే సంభాషణలని నవలల్లో నింపటంలో ఆరితేరిన చెయ్యి శ్రీమతి లతది. అలాంటిది ఈ మోహనవంశిలో ఆ అవకాశం నిండుగా ఉన్నా వాటి జోలికి అసలు వెళ్ళనే లేదు.

అయినా మోహనవంశి ఆరంభిస్తే వదలకుండా చదవాలనిపిస్తుంది. ప్రతివారు ఎక్కడో అక్కడ వెనక్కి వెళ్ళి మరోసారి చదువుకోవాలనిపించే తత్వం, రసం మోహనవంశిలో ఉన్నాయి.

ఆ కాలంలో యువతీయువకులకి అర్థం అయినా కాకపోయినా మోహనవంశి నవలని ఆరాధించారు. పెద్దలు ఆ నవలలోని ఉద్విగ్నతకి ఆశ్చర్యపోయారు. లత కల్పనా చాతుర్యం సాహితీవేత్తలని అబ్బురపరిచింది.

మోహనవంశి అన్న పద కూర్పు లతకి మారుపేరైంది. మోహనవంశి నవల మామూలు నవలలాంటిది కాదన్న ప్రాచుర్యాన్ని పొందింది.

మోహనవంశికి ప్రత్యేక గౌరవాన్ని కలిగించిన అంశాలలో ముఖ్యమైంది, ఈ నవల తాలూకు రచనా విధానం, లత పదవిన్యాసం, శైలి, నవల ఎత్తుగడ, ముగింపు.

గొల్ల పడుచుల శృంగార సంభాషణతో అలతిగా ప్రారంభమైన నవల క్రమేపీ గాఢత సంతరించుకుని చివరికి భారత యుద్ధంలో గీతాసారమైన తాత్వికచర్చతోటి, కృష్ణుడి విశ్వ తత్వంతోటి ముగుస్తుంది.

'కృష్ణచరిత ఎందరో వ్రాశారు. కానీ నేను లతగా కాక రాధనై మోహనవంశి రాశాను. భగవంతుడు మనిషిగా పుట్టడం వ్రాశారు. కానీ నేను మనిషే భగవంతుడైతే ఎలా ఉంటుందో వ్రాశాను,' అని అంటుంది లత.

మోహనవంశిలో చాలా భాగం రాధా దృక్పథమే. మిగిలింది ఒక స్త్రీకి, లేదా స్త్రీత్వానికి (రాధకి) సర్వం తానే అయిన పురుష ప్రణయం లభిస్తే అందులో దైవత్వం ఎలా ఉంటుందో చూపించిన భావన.

కృష్ణగాథ నడుస్తూనే ఉంటుంది. మధ్యలో చాలా లౌక్యంగా ఈనాటి ధర్మాధర్మాల, తత్వాల చర్చ సాగుతుంది. దీనికి శ్రీమతి లత ఎంచుకున్న భూమిక ఆర్య, ద్రావిడ జీవన విధానం.

'వక్షు నదీప్రాంతంలో ఉన్న ఉత్తర కురుదేశాన్ని దేవభూమి అంటారని, ఆ దేశంలో దేవతలుంటారని, అది భూలోకస్వర్గమని, అక్కడ సుఖసంతోషాలు, జీవన విధానం వేరని,' నందుడి ద్వారా లత చెప్పించింది. అక్కడ ఆర్యులు స్వేచ్ఛాజీవులని, ప్రణయజీవనంలో ఏ నిబంధనలు లేని స్వేచ్ఛాజీవన లోకం అని వర్ణించింది. అంతేకాక అక్కడ ప్రజాతంత్ర పాలన ఉందని, మధురలోలాగ నిరంకుశ పాలన లేదని, ఎప్పటికేనా కృష్ణుడు ప్రజాతంత్ర పాలన, దేవతలలాంటి స్వేచ్ఛా ప్రణయ సమాజాన్ని నెలకొల్పు తాడని సూచించింది.

వ్యక్తిగత ఆస్తి లేకపోవటం, పిల్లలకి తల్లే తప్ప తండ్రి అన్న వ్యవస్థ లేని జీవనం, స్త్రీ ఎవరి ఆస్తి కాకపోవటం, నగ్నత్వం ఒక అద్భుత అలంకారం అవటం- ఇవన్నీ మోహనవంశిలో శ్రీమతి లత ఊహాచిత్రాలు.

ఇలాంటివన్నీ ఉన్నా మోహనవంశిలోని మూల ప్రాతిపదిక దెబ్బ తినకుండా చాలా నేర్పుగా లత రచనను సాగించారు.

ప్రేమకి, ప్రణయానికి, తల్లితనానికి, తండ్రీబిడ్డల దగ్గరతనానికి, విధివంచితుల కరుణామయ జీవితాలకి ప్రతిబింబాలనిపించే రసగుళికల్లాంటి వాక్చిత్రాల కోసమేనా మోహనవంశిని చదవాలి.

ఒకే పద్ధతిగా, ఒకే భావానికి నిబద్ధులుగా మోహనవంశిని విశ్లేషిస్తే, లోతుగా చీల్చి చెండాడితే ఈ రచనలోని రసం పూర్తిగా చిన్నాభిన్నమై ఏం మిగలదు. అలా కాకుండా శ్రీమతి లతలాగే మనం ఉద్విగ్నంగా మోహనవంశితో ప్రయాణిస్తే, కొంత తాదాత్మ్యం, మరెంతో పులకింత సొంతమవుతాయి.

లతని తెలిసున్నవారికి మరింత మోహనంగా ఉంటుంది మోహనవంశి. ఆవిడ వ్యక్తిగత విలక్షణత మోహనవంశిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఆవిడ మాటతీరు లాగే ఉంటాయి ఇందులో చాలా వాక్యాలు.

ఇంక ఆమె మోహనవంశిలో చూపించిన రచనాప్రతిభ, శైలీ విన్యాసాలు, పదాల రసమయ కూర్పు ఎత్తి చూపాలంటే పేరాలు, పేరాలు కోట్ చెయ్యాలి.

'మంచుతెరల మాటున పొద్దు - మనసు పొరల మాటున హద్దు.'

'మగనాలులకు మనకీ వెర్రి - పసిపిండె వగరులో ఇంతటి తీపి.' (కృష్ణుడి గురించి గొల్లెతల మోహం)

'రాధా నువ్వెందుకింత తొందరగా పుట్టావు - నీవు వస్తావని తెలిసి స్వాగతం ఇవ్వటానికి ముందుగానే పుట్టాను.' (రాధా మాధవ సంభాషణ)

'అమ్మా నువ్వు నా ఆరాధ్యజననివి' (కృష్ణుడు మధురకి వెడుతూ యశోదని ఓదారుస్తూ).

రాధా వియోగం కృష్ణుడిని బాధపెట్టినట్లు మరేదీ బాధించ లేదు. 'నేను త్వరలోనే వస్తాను. నన్ను ఆశీర్వదించు,' అంటూ రాధకి నమస్కరించాడు కృష్ణుడు. (ప్రియుడు ప్రేయసికి నమస్కరించటం)

'నువ్వెంత పూజనీయురాలవో నాకు తెలిసినట్లు ఎవరికీ తెలియదు. ప్రపంచంలో ఏ ఒకరికీ తలవంచని కృష్ణుడు రాధ ముందు అవనత శిరస్కుడైపోయాడు. అది అతనికి గర్వకారణం కూడా,' అని రాధ రెండు చేతులూ తన గుండెలకి అదుము కుని- 'ఈ స్పర్శ యొక్క చల్లని జ్ఞాపకాలలో సర్వజగతినీ జయిస్తాడు నీ వంశీ,' అన్నాడు కృష్ణుడు.

'రాధా స్పర్శ, సర్వజగతినీ జయించటం' అన్న భావనని ఒక మూలసూత్రంలా మోహనవంశి నవల ఆసాంతం పరిచింది లత.

'ప్రపంచంలో కృష్ణుడు శాంతి కావాలనుకుంటే ఇక్కడే దొరుకుతుంది,' అన్నాడు కృష్ణుడు రాధ గుండెల మీద తల ఉంచి.

'సృష్టిలో వికసిస్తున్న ప్రతి చిన్న వికాసానికీ కూడా స్త్రీయే కారణం. శాంతికి, సౌభాగ్యానికీ కారణం స్త్రీ.'

'తమ భార్యలు కృష్ణుడిని ఆరాధిస్తున్నారని తెలిసి కూడా పురుషులు అసూయ పడటంలేదు.'

'స్త్రీత్వానికి హద్దులు ఏర్పరచి మగవాడు తన జీవితంలోని సగం మాధుర్యాన్ని కోల్పోతున్నాడు.'

ఇలాంటి భావాలతో స్త్రీకి, స్త్రీత్వానికి నూతన విలక్షణతని అగ్నిజ్వాలలా వ్యాపింప జేసిన లత మోహనవంశిని ఆడ, మగ అందరూ వ్యామోహపడి మరీ చదివారు.

'గీతాసారం వంశీగానం' అన్న భావనని సమర్థించుకోవటానికి లత మోహన వంశిలో చేసిన తాత్విక చర్చలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా నవల చివరలో కృష్ణా ర్జునుల సంభాషణ రూపంలో...

'జీవించటమంటే ఏమిటి?' 'బ్రతుక్కి ప్రయోజనం', 'మరణం సంగతి?', 'ఆత్మార్పణం అంటే ఏమిటి?', 'ఎవడు దుష్టుడు, ఎవడు మంచివాడు?', 'భగవంతు డంటే ఏమిటి?' 'విశ్వమంటే అర్థం?', 'కాలం అంటే ఏమిటి? అంతులేని ఈ కాలవాహిని ఎంతకాలం ఇలా ప్రవహిస్తుంది? దీనికి అంతం ఎక్కడ?'

‘కాలస్వరూపుడూ, విశ్వరూపుడూ అయిన భగవానుని ఎలా దర్శించవచ్చు?’, ‘భగవంతుని రూపకల్పన చేయవచ్చా?’ ‘మాయ అంటే ఏమిటి?’

ఇలా క్లిష్ట ప్రశ్నలు సమాధానాల రూపంలో తాత్వికతని మృదువుగా, సరళంగా అందించారు శ్రీమతి లత.

ఈ తరంవారి కన్నా ముందే లత స్త్రీని శారీరకంగా, మానసికంగా అత్యున్నత స్థానంలో నిలిపినందుకేనా మోహనవంశి నవల పదికాలాలు బతికుంటుంది.

*ఫిబ్రవరి, 2009*




# ఊబిలో దున్న

## వినుకొండ నాగరాజు

ఊబిలో దున్న నవల ప్రత్యేకత, అది రాసిన విలక్షణ పద్ధతిలో ఉంది. ఈ నవల అచ్చయిన (1970 మార్చి) సమయానికే కాక, ఇప్పటి సాధారణ నవలా రచనా పద్ధతికి పూర్తి భిన్నమైంది కీ॥శే॥ వినుకొండ నాగరాజు *ఊబిలో దున్న*.

సాధారణంగా 172 పేజీల నవలకి అవసరమైనంత కథ *ఊబిలో దున్న*లో లేదు. స్థూలంగా చూస్తే ఊబిలో చిక్కుకుపోయిన ఓ దున్న పోతుని రాఘవులు ఊబిలోంచి బైటికి తీసే ప్రయత్నం, వివరణ కథ. అంతే కాక ఈ నవలలో రాఘవులు ఊహలో మెదిలే కొన్ని పాత్రలు రాఘవయ్య, దున్నపోతు తప్ప వేరే పాత్రలు లేవు. కొర్రాజు గుండం ఊబి, ఆ పరిసరాల అడివి ముఖ్య కథాస్థలం. కథ మొత్తం ఓ ఆరేడుగంటల సమయంలో జరుగుతుంది. ఇన్ని రకాలుగా విలక్షణ రచనా ధోరణితో సాగిన నవల *ఊబిలో దున్న*.

ఊబిలో చిక్కుకున్న ఒక దున్నపోతుని వెలికితీసే ప్రయత్నమే అయితే ఈ నవలకి ఇంత ప్రాచుర్యం, ప్రత్యేక గుర్తింపు లభించి ఉండేవి కావు.

రచయిత ఈ నవల ముందుమాటలోనే ఇది కేవలం రాఘవయ్య, దున్నపోతుల సూటి కథ కాదన్న విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పారు.

దాంతోపాటే తనకి ఏవేవి అయిష్టమో, ఏవేవి ఈ వ్యవస్థలో తనకి అసహ్యామో చెప్పి, ఈ తరం వారందరూ ఒక కొత్త ఒత్తిడిలో నిస్సహాయంగా నలిగిపోతున్నారని, ఒకరకం స్తబ్ధత, నిరుత్సాహం కమ్ముకున్నాయని, క్రమశిక్షణ లేదని... ఇలా అనేకరకాల నిర్వేదం ప్రకటించారు. సమకాలీన యువతరం పడుతున్న బాధలకు సానుభూతి అని, ఇది సామ్యవాద సాహితికి చెందిందని చెప్పారు. అంతేకాదు, ఈ నవలకి **1974**లో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రకటించిన బహుమతిని తిరస్కరించి, అందరి దృష్టిని ఊబిలో దున్న మీదకి మళ్ళించారు. పై రెండు చర్యలతో ఈ వ్యవస్థలోని సాంఘిక, సాహితీ అంశాల మీద తన నిరసనను తెలియజేశారు నాగరాజు.

కానీ ఊబిలో దున్న నవల మాత్రం ఆయన నిరసనకే పరిమితం అవలేదు. ఈ నవలలో ప్రధాన పాత్ర-

రాఘవరావు - బి.ఎ.

రాఘవులు - రైతు

రాఘవయ్య - సమితి ప్రెసిడెంట్, పరిషత్ ప్రెసిడెంట్

రాఘవయ్యగారు - పార్టీలవాళ్ళు, మంత్రులు పిల్చే తీరు

రాఘవరావు - దొరవారు (చేతకానివాళ్ళు, సహాయాలు కోరేవాళ్ళు పిల్చే తీరు)

రాఘవబాబు - కీర్తిమంతుడు, ధర్మరాజు (ముఖస్తుతి చేసేవాళ్ళు)

ఇలా పలురకాలుగా అనేక స్థాయిలలో అనేక ఉద్వేగాల్లో భావావేశాల్లో ఈ నవల మొత్తం అంతా రాఘవయ్య కనిపిస్తాడు.

ఊబిలో దున్నలో ఉన్న స్థూల కథని చూద్దాం.

కొర్రాజు గుండం ప్రాంతంలో, కాలవవార ఊబి. చౌడుతో నిండిన ఓ గుంటలో ఓ దున్నపోతు నిలువులోతు కూరుకుపోయింది. ఒక కాలి కింద గట్టిగా ఉన్న రాయి వల్ల కడ ప్రాణాలతో మిగిలింది. అటువంటి దున్నపోతుని రాఘవులు చూశాడు. దాని పరిస్థితి అర్థమైంది. అది అలాగే ఉంటే ఆరోజుతో దాని ప్రాణాలు పోతాయి. మరో ప్రాణిపట్ల జాలి, తన వ్యక్తిగతమైన భావోద్వేగంతో రాఘవులు ఓ నిర్ణయానికి వచ్చాడు. ఎలాగేనా ఆ దున్నని ఊబిలోంచి వెలికితీసి కాపాడాలి. అది ఊరి పొలిమేరల్లోని అడివి ప్రాంతం. ఆరోజు పండుగ. సాయంగా ఎవర్ని పిలిచినా అంత తేలిగ్గా వచ్చే అవకాశం లేదు. దున్నపోతు ప్రాణాలు పొద్దుకూకే లోపలే నిలబెట్టాలి. ఊళ్ళోకి వెళ్ళి వేరే ప్రయత్నాలు చెయ్యటం కన్నా, తానొక్కడే ధైర్యం చేయాలనుకొన్నాడు. తనని తానే ఉత్సాహపరుచుకున్నాడు. ఉద్వేగపరుచుకున్నాడు. ఆ బృహత్కార్యానికి పూనుకున్నాడు.

ఆ ఊబి తీరుని, లోతుని పరీక్షించటం, దున్న కూరుకుపోయి ఉన్న స్థితిని, దాని దైన్యాన్ని అర్థం చేసుకోవడం, ఆ ఊబిలోంచి దాన్ని వెలికి తీసుకురావటానికి అంచెలంచెలుగా కార్యక్రమాన్ని చేపట్టటం... ఇవన్నీ నాగరాజు వివరంగా, ప్రతిభా వంతంగా చిత్రీకరించారు. ఈ మొత్తం వ్యవహారంలో రాఘవులు ఉత్సాహ నిరుత్సా హాలు, కోపతాపాలు, ఆశ నిరాశలతో పాటు, దున్నపోతు హావభావాలు, స్పందనలు, దాని సహజ నైజం, ఆ పరిస్థితిలో దాని చర్యలు... ఇలా ఎన్నెన్ని అంశాలనో చాలా నిశితంగా నాగరాజు పట్టుకోగలిగారు. ఈ విషయంగా, మంచి పరిశోధన చేసినట్టుం

టుంది ఈ నవల. గ్రామీణ ప్రాంతీయులకి, ఈ నవలలో వివరించిన ప్రాంతంలోని రైతులకే కూడా అంత సులభంగా అవగాహనకాని చాలా మార్మిక విషయాలను నాగరాజుగారు వివరించటం విశేషం.

ముష్టిబడెతలు, కుంకుడుదుంగ, గొలిగి కంప నరకటం, తాడుగా ఉపయోగించ టానికి అవసరమైన తీగల్ని నరకటం, నరికిన ప్రాంతం నుంచి ఊబికి దగ్గరగా పడేలా వాలుచూసి తొయ్యటం, దిగబడే ఊబిలో ఆధారంగా నడవటానికి బడితెల్ని పాతుతూ నడవటం, కంపని బడితెకి బడితెకి మధ్య దడిలా తొక్కటం, దున్నపోతుకి బాధ తగ్గి కొంతేనా శక్తి వచ్చేలా, దాని పుండుకి సంరక్షణ, కండువాని తడిపి ఆ పుండు మీద, దాని శరీరం మీద కప్పి ఉపశమనం కలిగించటం, పచ్చి తాటాకు దొన్నెతో కాలవలోంచి నీళ్ళు తెచ్చి దానికి తాగించటం, లేత గడ్డి కోసుకువచ్చి దానికి వెయ్యటం, బిర్రబిగిసి పోయిన నాలుకని స్వాధీనంలోకి తెచ్చుకొని, అది నీళ్ళు తాగి, ఆ గడ్డి తింటే తనకి తనే 'శభాష్' అనుకోవటం... ఇలా ఆరేడు గంటల ఆ ఒంటరి పోరుని నాగరాజు చిత్రిం చటం ఎంత విశేషమో, అసలు ఇలాంటి సంఘటన నవలగా రాయాలని స్ఫురించటం అంతకన్నా విశేషం.

అన్నీ సవ్యంగా జరుగుతున్నాయి అనుకొంటున్న సమయంలో పొరపాటుగా కాలు వేసిన రాఘవులు అదే ఊబిలో కూరుకుపోతాడు. ప్రాణాలు పోయినట్టే అయిపోతాడు. భయంతో విలవిలలాడతాడు. దీనికి కారణమైన ఆ దున్నపోతుని, తన మూర్ఖత్వాన్ని తిట్టుకుంటాడు. వేరే ఆసరా లేక చేతికందిన ఆ దున్నపోతు కాలినే పట్టుకుని విశ్వ ప్రయత్నంతో దాని మీదకి ఎగబాకి మరోవేపు దూకి ప్రాణాలు కాపాడు కుంటాడు. ఈ సమయంలో రాఘవులులోని పరస్పర విరుద్ధ భావాలు వివరించిన తీరు విశేషమైంది.

అంత జరిగినా రాఘవులు తన ప్రయత్నం మానలేదు. పొద్దు కొంచమే మిగిలింది. తనలోనే కాదు, దున్నపోతులో కూడా ఓపిక అడుగంటింది. అయినా పట్టు వదలక ఊబిని తోడి దున్న చుట్టూ ఖాళీ ఏర్పరచి దాని కాళ్ళని స్వాధీనంలోకి తెచ్చాడు రాఘవరావు. ఇంక మిగిలింది దున్న ముందు, కుడివేపు ఉన్న ఊబిలోకి కాక, వెనక్కి గెంతి, కాలవగట్టు ఎక్కాలి. తప్పనిసరై అస్సలు ఓపికలేని ఆ దున్నని కావాలనే పూనుకొని హింసిస్తాడు రాఘవులు. ఆ హింస మంచి ఫలితం కోసం. ఈ కథని ఎమెస్కో పుస్తకం రూపంలో 172 పేజీలు రాశాడు నాగరాజు. ఇది సామన్యమైన శ్రమ కాదు. 142 నుంచి 172 అంటే ముప్పై పేజీలు ఈ నవలకి పతాక సన్నివేశం.

ఇన్ని కారణాల వల్ల ఇది విలక్షణ రచన.

ఆ పల్లెలోని రైసుమిల్లు ఓనరైన రైతు కొడుకు రాఘవేంద్రరావు. పట్టభద్రుడు. రాజధానిలో ఉద్యోగప్రయత్నంలో విసిగి, పస్తులు లాంటి అగచాట్లు పడి, ఓడి పల్లెకి తిరిగి వచ్చాడు. వచ్చే ముందు డిగ్రీని చింపేశాడు. ఉద్యోగం చెయ్యకూడదని నిర్ణ యించుకొన్నాడు. ఉద్యోగం చేయటం గొర్రెతీరు. స్వయంకృషితో నాయకత్వ లక్షణాలు అలవరచుకొని ఫలితాలు సాధించటం తక్షణ అవసరం అనుకున్నాడు. సహకార పద్ధతిని అమలులోకి తెచ్చాడు. సమిష్టి వ్యవసాయం అక్కడి వారికి అలవాటు చేసి, పాలేర్లకి

లాభాలు పంచి భూస్వాముల్ని చేసి, వాళ్ళని స్వయం ప్రతిపత్తిగల రైతులుగా మార్చాడు. అలా అందరికీ దగ్గరై సమితి, పరిషత్ ప్రెసిడెంట్ అయ్యాడు. ఇంకా చాలాచాలా చేసి పల్లెని, దేశాన్ని, మొత్తం లోకాన్ని మంచి మార్పు వేపు నడిపించాలనుకున్నాడు. అటువంటి సమయంలో జరిగిందీ దున్నపోతు ఉదంతం.

దున్నపోతు ప్రజాస్వామ్య ప్రతీక అని, ఊబి రాజకీయ ప్రతీక అని, ఇది మొత్తం ప్రతీకాత్మక కథ అని ఈ నవలకి మెప్పు లభించింది.

అంతేకాదు, ఇది చైతన్య స్రవంతి ప్రయోగమని కొందరు, కాదని మరికొందరు నిరూపణల దాకా వెళ్ళారు. నాగరాజు తన నవలలని లేండ్‌స్కేప్ నవలలన్నారు. ఇవన్నీ పాక్షికంగా నిజాలు.

ఈ నవల ప్రధానపాత్ర రాఘవులు ఆదర్శపాత్ర కాదు. సామాన్యుడు అంటారు నాగరాజు ముందుమాటలో. నవలలో అదే రాఘవుల్ని నాయక లక్షణాలతో చిత్రిస్తారు. 'ఈ నవల ద్వారా చేయ సంకల్పించిన ప్రభావం యువతరాన్ని జూలు దుపులుకుని గర్జించమని కాదు,' అంటారు. కానీ యువత ప్రస్తుత పరిస్థితుల్లో స్తబ్దంగా ఉంది, అది చాలా ప్రమాదకరం అంటారు.

ఇలా పరస్పర విరుద్ధ భావాల ప్రవాహం ఈ నవలలో చాలాచోట్ల కనిపిస్తుంది.

అయితే *ఊబిలో* దున్న మనకి అందించేదేమిటి? ఓ మధుర అనుభూతి కాదు. పాఠకులకి జీవితాంతం గుర్తుందిపోయేంత కథా కాదు.

ఓ ఉద్వేగ ఉపన్యాసంలా ఉంటుందీ నవల. చదువుతున్నంతసేపు అబ్బుర పరుస్తుంది. ఇందులోని విలక్షణత, నవల రాయటంలోని మెళకువ, రచయిత భిన్నమైన తెలివితేటలు, ప్రాంతీయ వివరాలు, అద్భుతమైన కొన్ని వ్యక్తీకరణలు మనల్ని పట్టుకొంటాయి. తెరచాటున ఇంకా ఏదో ఉందనిపిస్తూ మురిపిస్తుంది.

'అడివి కాలుతున్న వాసన వేసింది. పచ్చదనం ఉడుకుతూ మండు తున్న వాసన.'

'బహు భిన్న సంపుటి.'

'చచ్చిపోతానేమో అని తలుచుకున్నప్పుడు అతని గుండెను మంచుముక్కల్లో పెట్టినంత బాధ అనిపించింది శరీరానికి.'

ఇలాంటి ఎన్నో వ్యక్తీకరణలు *ఊబిలో* దున్నలో ఉన్నాయి. మనం అంగీ కరించినా, అంగీకరించకపోయినా మరిచిపోలేని మరెన్నో ప్రతిపాదనలున్నాయి.

నాగరాజు సాధారణంగా గలగలా చాలా ఉద్వేగంగా మాట్లాడేవారు. చాలా గట్టి పట్టుదల, మొండితనంతో కూడిన తెగువ ఆయన మాటల్లో ఉండేది. *ఊబిలో* దున్న కూడా అలాంటిదే.

మార్చి, *2009*



# రంగుల వల

## ఎమ్ (ముక్తవరం) పార్థసారథి

రంగులవల నవల 1970 మేలో ఎమెస్కో పాకెట్‌బుక్‌గా వెలువడింది. అంతకన్నా ముందు ఆంధ్రప్రభ వారపత్రిక సౌమ్య ఉగాది నవలల పోటీలో ప్రథమ బహుమతి పొంది, ధారావాహికంగా ప్రచురింపబడింది.

నవలలపోటీలో బహుమతి పొందటం ఒక విశేషమైతే, రంగులవల నవలా వస్తువు, రచనా విధానం ఆనాటి పద్ధతికి భిన్నంగా ఉండటం మరో విశేషం. అప్పటి పత్రికలలో సీరియల్ నవలలు ఎంతో ప్రాచుర్యం ఉన్న రచయితలు రాసిన ప్రేమ కథలు. సిండరెల్లా తరహా ఊహాచిత్రాలు. అంతఃపురాల్లాంటి జమీందారీ సంస్థానాలు లేకపోతే పేద యువతిని ప్రేమించే ఆరడుగుల ధనవంతుడైన హీరో. ఆ రకమైన నవలాధోరణికి పూర్తిగా భిన్నం *రంగులవల.*

*రంగులవల* రాసిన ఎమ్ (ముక్తవరం) పార్థసారథి (కలం పేరు-పినాకి) అప్పటికి కొత్త తరం రచయిత. *రంగులవల*తో మంచి గుర్తింపు పొందారు.

*రంగులవల* నవలలో ప్రేమ గొడవలు లేవు. కలలు లేవు. ఊహా ప్రపంచం లేదు. అతి సహజమైన, నిఖార్సయిన దిగువ మధ్యతరగతి సంసార జీవితం *రంగుల వల.*

సీతాపతి, తులసి భార్యాభర్తలు. ఇద్దరివీ చిన్న ఉద్యోగాలు. పెళ్ళయి రెండేళ్ళయింది. చిన్న ఇంట్లో కాపురం. నగర జీవితంలో అటువంటి సంసారాల వాళ్ళకి సాధారణంగా అన్ని ఇబ్బందులకన్నా, అద్దె ఇంటి ఇరుకు, ఇంటి వాళ్ళు పెట్టే ఆంక్షలు ఎక్కువ బాధపెట్టే కాలం. రాత్రింబగళ్ళు వాహనాల చప్పుళ్ళు, దోమలు, నల్లులు. ఇలాంటి అనేక ఇబ్బందుల నిలయం వాళ్ళు అద్దెకుంటున్న ఇల్లు.

మరో పెద్ద ఇల్లు అద్దెకు చూసుకున్నారు. మొత్తం ఇల్లు 150 రూపాయలకి అద్దెకు తీసుకున్నారు. రెండు పోర్షన్లు వీళ్ళే ఒక్కొక్కటి అరవై రూపాయలకి అద్దెకిచ్చి మూడో పోర్షన్‌లో వీళ్ళ కాపురం. భార్యాభర్తలకిద్దరికీ ఇదెంతో సంతోషంగా ఉంది. గొప్ప విజయంలా ఉంది. తులసికి ఏనుగెక్కినంత సంబరంగా ఉంది. కొత్త ఇంటి గురించి ఎన్నెన్నో ఊహలు. తెల్లారితే కొత్త ఇంటికి మారుతున్నారు. అదీ రంగుల వల నవల ఆరంభం.

ఓ మార్పు వల్ల జీవితం మొత్తం హాయిగా మారిపోతుందన్న మధ్యతరగతి వారి భ్రమ తొలగిపోవటానికి ఎంతోసేపు అఖ్ఖర్లేదు. సీతాపతి, తులసిలకి అదే జరిగింది. సీతాపతికి తల్లిదండ్రులని తమ దగ్గరికి పిలుచుకోవాలన్న కోరిక. పాత ఇల్లు చిన్నదవటం వల్ల అది కుదరలేదు. కొత్త ఇంటికి మారగానే వాళ్ళని రమ్మని రాశాడు. తులసికీ సమ్మతమే. చాకిరీ పెరుగుతుందని తెలిసినా సిద్ధపడింది. కొత్త ఇంటి సౌఖ్యంతో ఆ ఇబ్బందుల్ని అధిగమించవచ్చనుకుంది.

కొత్త ఇంటికి దగ్గర నుంచే బస్సులు బయలుదేరుతాయి. హాయిగా రోజూ ఆఫీసుకి దర్జాగా సీట్లో కూచుని వెళ్లొచ్చని, నిలువు చాకిరీ తప్పుతుందని అనుకుంది. కానీ మొదటిరోజే ఆశాభంగం. అక్కడ్నించి ఆఫీసులకి బయలుదేరే వారి సంఖ్యా ఎక్కువే. చాంతాడంత క్యూ ఉంది. నానా హైరానాపడి ఆఫీసుకి వెళ్ళేటప్పటికి లేటయింది. ఊహించుకున్నది ఒకటి, జరిగింది మరొకటి. మనసంతా చిరాగ్గా అయిపోయింది. ఇలాంటి ఊహించని చికాకులు ఆ తర్వాత చాలా చుట్టుముట్టాయి.

అత్తగారి కళ్ళ ఆపరేషన్, మావగారు అర్ధంతరంగా ఊరు వెళ్ళిపోవటం, ఆయన అలా వెళ్ళటం తులసిదే తప్పన్నట్టు భర్త ప్రవర్తన, పక్కింటివాళ్ళతో అత్తగారి అనవసర సోది వల్ల పేచీలు... ఇలా చాలా విషయాలు ఇబ్బందుల్ని సృష్టించాయి.

తల్లిదండ్రుల దగ్గరున్న చెల్లెలు పాపని సిటీకి పిలిచి తన దగ్గరుంచుకుని ప్రయోజకురాలిని చేసి, ఉద్యోగస్తురాలిగా తీర్చిదిద్దాలని తులసి కోరిక. భర్తతో చెప్పి పాపని పిలిపించుకుంది. పాప వచ్చిన సరదా కూడా ఎక్కువ రోజులు నిలవలేదు. ఆ అమ్మాయి ప్రవర్తన, కుదరని సయోధ్య నానా అవస్థలు పడేలా చేసింది.

ఇంక ఇంట్లోని రెండు పోర్షన్స్ అద్దెకివ్వటం కూడా అలాగే మారింది. ఓ పోర్షన్‌లో ఉన్న స్టూడెంట్స్ దగ్గరికి పుస్తకాల కోసం వెళ్ళే పాప ప్రవర్తన నచ్చక వాళ్ళని ఖాళీ

చేయించారు. ఆ తర్వాత సీతాపతి తన స్నేహితుడు గోవిందరావుని తీసుకొచ్చాడు అద్దెకి. గోవిందరావు భార్య పురిటికి పుట్టింటికి వెళ్ళింది. సీతాపతి స్నేహితుడు కదా అన్ని రకాలుగా బావుంటుందనుకుంది తులసి.

భార్యాభర్తలు ఉద్యోగస్తులైతే ఉండే సమస్యలు వేరు. దానికితోడు వారిద్దరే కాక, ఇద్దరివేపు బంధువులుంటే ఇంక పరిస్థితి మరింత జటిలం.

పాప ఒకపూట వంట చేసి పనిలో సాయపడాలనుకుంది. తులసిది మరో అభిప్రాయం. కంటి ఆపరేషన్ అయి ఇంటికి వచ్చిన తులసి అత్తగారిది మరో ఉద్దేశం. ఈలోగా తులసికి గర్భస్రావం అయింది. మనిషి మరీ బలహీనపడింది.

కోడలి పరిస్థితికి జాలి చూపిస్తూనే అత్తగారు ఈ చాకిరీ అంతా నెత్తిన పడిందని విసుక్కోవటం ఆరంభించింది. చిన్న విషయాలే పెద్దవై భేదాభిప్రాయాలతో ఇంటి పరిస్థితంతా చికాగ్గా మారిపోయింది.

కోపం వచ్చిన అత్తగారు తన మరో కొడుకు దగ్గరికి ప్రయాణమైంది. తనదేం తప్పులేదని భావించిన తులసి బిగిసిపోయింది. అటు తల్లికి చెప్పలేని సీతాపతి తులసికే నచ్చచెప్పబోయాడు. తులసి వినలేదు. చివరికి తప్పనిసరై తల్లిని పంపించేశాడు.

భార్యాభర్తలిద్దరూ ఆఫీసుకి వెళ్ళినప్పుడు పాప ఒక్కతే ఇంట్లో ఉంటోంది. అదే సమయంలో గోవిందరావు ఇంటి పట్టునే ఉంటున్నాడని అనుమానం వచ్చింది తులసికి. పరోక్షంగా చెల్లెల్ని మందలించినా పాప ప్రవర్తనలో మార్పు రాలేదు. విషయం భర్తతో చెప్పనూలేక, తనంతగా తానే నిర్ణయించుకోనూ లేక తులసి మథన పడింది.

అనారోగ్యం, అనుకోని ఖర్చులు... భార్యాభర్తలిద్దరూ అన్ని అడ్వాన్సులూ తీసుకున్నా ఆర్థిక ఇబ్బందులు. చాలీచాలని ఆ జీవితాన్ని మెరుగుపరుచుకోవాలని సీతాపతి డిగ్రీ చదువు, తులసి టైపు ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్. ఆఫీసు, ఇంటి చాకిరీలకి ఈ చదువుల శ్రమ అదనం.

పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం వస్తే చేరింది తులసి. ట్రైనింగ్. ఆఫీసు మార్పు, పనితీరులో మార్పు. కేష్ కౌంటర్లో పనిచేసేటప్పుడు డబ్బు షార్ట్ కావటం. ఒకటికాదు, రకరకాల సమస్యలు. వీటన్నింటికన్నా మిన్నగా పాప సమస్య తులసిని కలవరపరిచింది. ఓరోజు తులసి ఇంటికి వచ్చేటప్పటికి ఎవ్వరూ లేరు. ఇల్లు తాళం వేసే ఉంది. ఆరోజు గోవిందరావు, సీతాపతి ఆఫీసులు మానేసిన విషయం తులసికి తెలియదు. వాళ్ళిద్దరితో కలిసి, చేతిలో కొత్త చీరతో గలగలలాడుతూ ఇంటికి వచ్చిన చెల్లెల్ని చూసి తులసికి తల తిరిగిపోయింది.

పాపని, సీతాపతిని విడివిడిగా ఎంత నిలదీసినా నిజం బైటికి రాలేదు. ఏవేవో చెప్పారు. అవన్నీ అబద్ధాలని తెలుస్తూనే ఉన్నాయి. నిజం చెప్పలేదు సరికదా, మర్నాడు

పాప ఒక్క మాటేనా చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్ళిపోయింది. ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. ఏమైందో తెలియదు. బాధ్యత నెత్తి మీద వేసుకుని చెల్లెల్ని అలా తీసుకురావటం తప్పేమో అని కుమిలిపోయింది తులసి.

ఈ గొడవలో తులసే బాధపడింది. కానీ పాప, సీతాపతి, గోవిందరావు ఎవరూ ఎంతమాత్రం బాధపడలేదు.

అక్కగారు తనమీద అనుమానపడి రాద్ధాంతం చేసిందని నిష్ఠూరాలాడి పాప ఇల్లు వదిలి హాస్టల్‌కి వెళ్ళిపోయింది. గోవిందరావు ఇప్పించిన ఉద్యోగంలో చేరింది. సీతాపతి, తులసి తల్లిదండ్రులు అందరూ తులసిదే తొందరపాటన్నారు.

తులసికి ఒక్కసారిగా తన జీవితమంతా అయోమయం అనిపించింది. తన తప్పేమిటో అర్థంకాలేదు. చెల్లెలి జీవితానికి ఓ దారి చూపించాలనుకుంది. తప్ప టడుగు వేస్తుందేమోనని మందలించింది. భర్తకే కాక, అతని తల్లిదండ్రులకి, బంధువులకి చేదోడు కావాలనుకుంది. తన గురించి తనవరకే ఏనాడూ ఏ క్షణం ఆలోచించలేదు. కానీ జీవితం చివరికి ఇలా నిస్సారంగా, ఏ ఉత్సాహం లేని రొటీన్‌గా మారింది.

తులసి, సీతాపతి జీవితాల్లో మరిన్ని మార్పులొచ్చాయి. జబ్బుతో వీళ్ళ దగ్గరికి వచ్చిన మావగారు కొన్నాళ్ళ బాధ, వైద్యం తర్వాత చనిపోయాడు. సీతాపతి తల్లి తిరిగి వీళ్ళ దగ్గరికి వచ్చేసింది. తులసి చెల్లెలు హాస్టల్‌లో గట్టి చెడు పేరే మూటకట్టుకుని చివరికి ఎవరో ముస్లిం కుర్రాడితో బొంబాయి వెళ్ళిపోయింది.

సీతాపతి, తులసి కూడా తమ తప్పు లేమిటి అని విశ్లేషించుకున్నారు. ఏ వ్యక్తిదీ తప్పు లేకపోవటం ఉండదు. పూర్తిగా తప్పులూ ఉండవు. ముఖ్యంగా ఇటువంటి జీవితాల్లో ఇటువంటి నగర ఆర్థిక వలల మధ్య.

★ ★ ★

రచయిత పార్థసారథి చెప్పినట్లు ఈ నవలకి కథగా ముగింపులేదు. జీవితంలోని ఒక మజిలీని సూచించటం వరకే. రచయిత ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ పని కథారచనా కాలానికి చాలా విలక్షణమైంది.

ఈ నవలలో మరో ముఖ్య ఘట్టం పదాల పొదుపు. నవలాంతం సీతాపతి, తులసి క్లుప్త భావనలతో ఉంటుంది.

*ఎంత విచిత్రంగా తన సమస్యలూ, తులసి సమస్యలూ వేరైనాయి. బహుశా అందువల్లే ఒకరి నొకరు ఊరడించుకోరు. ఎందుకిలా మనసులో 'ప్రేమ' చచ్చిపోతున్నది? తనకు 'విడుదల' కావాలి.*

*ఈ సమస్యల నుంచి, ఈ గొడవ లన్నీ మరిచి మళ్ళీ కొత్తగా బ్రతకటం ప్రారంభించగలిగితే ఎంత బావుండును?*

గోవిందరావును ఇంట్లో తెచ్చి పెట్టటం వల్ల చాలా నష్టాలే వచ్చాయి గాని తనకేమీ ఒరగలేదు. అనవ సరంగా ఇంటి వ్యవహారాలను రచ్చ కెక్కించి నట్టయింది. గోవిందరావు స్కాండ్రల్...

తాము ఇల్లు మారకపోతే బావుం డేదేమో! ఈ గొడవలేమీ ఉండేవి కావు.

తను తండ్రిని మళ్ళీ రమ్మనకపోతే,

తల్లిని ఇక్కడే ఉండిపొమ్మనకపోతే,

అసలు తను తులసిని పెళ్ళి చేసుకోకపోతే,

లేదా- తులసిని ఉద్యోగం చెయ్యవద్దని చెబితే...

తను ఇంతకన్నా సుఖంగా గడపగలిగేవాడా?

ఇది సీతాపతి భావన.

★ ★ ★

పాప వెళ్ళిపోయింది.

పాప జ్ఞాపకంతో తులసి కళ్ళు కన్నీటి చలమలయ్యాయి. శశిరేఖ చెప్పింది- పాప ఎవరో ముస్లింతో బొంబాయి లేచిపోయిందిట. లేచిపోయిందనటం తప్పు. స్వేచ్ఛగా బ్రతుకుతున్న మనిషి. అతనితో బొంబాయి వెళ్ళిపోయింది. అక్కడికి వెళ్ళి మతం మార్చుకుని అతణ్ణి పెళ్ళాడుతుందట. 'పాపా, నీ తురక పేరేమిటి?' తనకేవేవో కోరికలూ, ఆశయాలూ ఉన్నాయంది. అక్కడికి వెళితే అవన్నీ నెరవేరతాయని వెళ్ళిందిట. తన కొక్కమాట చెప్పలేదు. ఇంటికైనా రాయలేదు. సిగ్గు పడిందా? వాళ్ళను బాధపెట్టదలుచుకోలేదా? కాని, తనింకా బ్రతికే ఉంది. తనకీ విషయం తెలిసీ, వాళ్ళకు చెప్పకుండా ఎలా ఉండగలదు? ఎవరికీ తనేమీ కాకపోయినా, వాళ్ళందరూ ఇంకా తనవాళ్ళు. లబోదిబో మని ఏడుస్తూ అమ్మానాన్నా వచ్చారు. తనను చూచి ఏడిచారు. కోపంతో తిట్టారు. శపించారు. తన మూలంగానే పాప ఈ పని చేసిందన్నారు. మొగుడు రాయిలాగా, దేవుడులాగా అన్నీ గమనించాడే కాని, ఒక్క మాట మాట్లాడలేదు. తనది తప్పు కాదనలేదు, ఔననలేదు. తనకు తెలుసు, ఎవరిందుకు కారణమో! పాపా, ఎక్కడున్నావే, ఎలా ఉన్నావే, ఒక్క ముక్క రాసెయ్యకూడదూ!

ఏం చెయ్యను? ఎలాగైనా తప్పు నాదే. క్షమించు.

ఈ ఉద్యోగం నాకెందుకు? ఏం సుఖం మిగులుతున్నది? జీవితం మీద పట్టు సడలిపోతున్నది. మరెక్కడి నుంచో ఉచ్చు బిగుసుకుంటు న్నది. నిద్ర రానివ్వని అలసట, అసంతృప్తి నా బ్రతుకులోనే చిరునవ్వును చెరిపి వేస్తున్నది.

ఇది తులసి స్థితి.

★ ★ ★

రంగులవల నవలా కాలానికీ, ఇప్పటికీ ఈ రకం జీవితాల్లో కొన్ని మార్పులొచ్చాయి. సమస్యల రంగు మారింది.


అప్పుడు ఫేన్, గ్యాస్‌స్టవ్ కనీస అవసరాలైతే, ఈనాడు టి.వి., ఫ్రిజ్, డి.వి.డి., ఒక వెహికల్ ఇవన్నీ సంసారపు కనీస అవసరాలనిపిస్తున్నాయి. జీవితపు పరుగులో వేగం పెరిగింది. అలసటా పెరిగింది. విశ్రాంతి తగ్గింది. మౌలికంగా సమస్య ఏమిటన్న విశ్లేషణ నుంచి పక్కదారి పట్టించే భ్రమలు పెరుగుతున్నాయి. అన్నీ బాగానే ఉన్నట్టు, అందరి ప్రవర్తన సరైనదే అన్నట్టు ఎవరికివారు వాదించగలుగుతున్నారు.

కానీ భార్యాభర్తలు కష్టసుఖాల్లో కూడా నమ్మకంగా కాలం గడపగలిగే ఒదుగు కరువవుతోంది. పరస్పర సర్దుబాటు తగ్గిపోతోంది. ఆప్యాయత, ఆదరణల కన్నా హక్కు అన్న భావన ముందు నడుస్తోంది.

రంగులవల సమస్య అప్పటిదే కాదు, ఇప్పటిది కూడా.

అందుకే ఈ నవల విలక్షణంగా నిలబడగలుగుతుంది. భార్యాభర్తల మధ్య జరిగే ఎన్నెన్నో అతి సున్నిత విషయాలు తెలుసుకోటానికేనా రంగులవలని తప్పనిసరిగా చదవాలి.

*ఏప్రిల్, 2009*



# త్రిశంకుడి స్వర్గం

## మధురాంతకం రాజారాం

మధురాంతకం రాజారాంగారు ప్రఖ్యాత కథారచయిత. ఎన్నో కథలు రాసినా, ఆయన రాసిన నవలలు రెండు (నేను ఎరిగినంతవరకూ). ఇది ఆయన తొలి నవల. 1969లో తొలి ప్రచురణ.

వ్యక్తిగా, సాహితీకారుడిగా రాజారాంగారు రెండు తరాల సాహితీ పరుల మధ్య సంధ్యలాంటి వారు. క్లాసికల్ రచనాతీరుకి, ఆధునిక పోకడలకి మధ్య నిలిచిన పర్వత సములు.

త్రిశంకుడి స్వర్గం నవల కూడా దీనికి అనుగుణంగానే ఉంటుంది. నవలా వస్తువు, రచనాశైలీ ఒకదానితో ఒకటి మెలి వేసుకుని చిత్రమైన రసబంధంలా ఉంటాయి. ఏ బస్సులోనో, రైల్లోనో చదివేయగలిగిన నవల కాదు.

ఇందులోని ప్రధాన పాత్ర ఒక డాక్టరు. ఆయనకి రెండు పేర్లు. ఇద్దరు భార్యలు. అంతేకాదు, ఆయన మనిషి వేరు, మనసు వేరు. బయటికి కనపడే తీరు వేరు, లోలోపల వేరు. ఇలాంటి వ్యక్తి మానసిక

లోకాన్ని, బయటి ప్రపంచంతో అను సంధానం చేస్తూ ఓ వ్యాఖ్యగా సాగిన నవలారచన అంత తేలిక కాదు.

ఆ కాలంనాటి సామాన్య వ్యక్తులు, నిత్య వ్యవహారంలో వారి మాటతీరు, ఆలోచనా ధోరణి ఈ నవలా రచనకి ముఖ్య ఇంధనాలు. ఉత్సాహపరిచే సాహస కృత్యాలు కానీ, గిలిగింతలు పెట్టే ప్రేమబంధాలు కానీ ఎక్కడా లేవు. అంతేకాక ప్రధాన పాత్రతో నవల ఆరంభం కాలేదు. ముఖ్యపాత్రల కథ ఓ ధారలా కాకుండా అక్కడక్కడ అద్దినట్టు కనిపిస్తుంది. ఇంత క్లిష్టంగా రచనా తీరుని రాజారాంగారు ఎన్నుకోవటానికి కారణం ఆయన ఈ నవల ద్వారా వెలికి తీసుకురావాలనుకున్న వస్తు ప్రాధాన్యత.

డాక్టరు విజయరత్నంగారు భూతగృహంలాంటి ఓ పెద్ద ఇంట్లో ఉంటూ ప్రాక్టీసు చేస్తున్నారు. పగలంతా రోగుల సందడి విపరీతంగా ఉండే ఆ ఇంట్లో రాత్రి మాత్రం ప్రేతకళే. విజయరత్నంగారు, పరాంకుశం, నౌకరు వీరాసామి మాత్రమే ఆ ఇంట్లోని జనాభా. విజయరత్నంగారు మంచి డాక్టరని ఊరందరికీ తెలుసు. కానీ ఆయన గురించి మాత్రం తెలిసున్నది చాలా తక్కువ.

ఆయనకి బంధువులు, స్నేహితులు ఇంచుమించు లేరనే చెప్పాలి. భార్య మరకతం, ఇద్దరు మగపిల్లలు మరో ఇద్దరు ఆడపిల్లలతో కలిసి నగరంలో ఉంటోంది. వాళ్ళు ఈయన్ని అడిగే అవసరం లేకుండానే ఎప్పటికప్పుడు డబ్బు పంపుతారు. డాక్టరుగారు ఎవరితోటీ, చివరికి వైద్యానికి వచ్చే రోగులతో కూడా ఎక్కువ మాట్లాడడు. హస్తవాసి మంచిదని పేరు పొందటం వల్ల రోగులకి కానీ, సంపాదనకి కానీ లోటు లేదు. రూపాయి చేత పడితేనే ఆయన వైద్యం చేస్తాడు. తన డబ్బులో ఒక్క దమ్మిడీ కూడా ఎవరికీ సాయం చేసే రకం కాదు.

అలాంటి డాక్టరుగారిని శేఖరం తన రూమ్మేటు, సహోద్యోగి అయిన రంగ సాయికి జ్వరం తీవ్రంగా ఉంటే పిలుచుకు వచ్చాడు. ముందుగానే ఫీజు తీసుకుని కానీ రాలేదు డాక్టరుగారు. వచ్చిం తర్వాత రంగసాయిని చూశాక, జబ్బు తీవ్రంగా ఉందని తీసుకెళ్ళి తన హాస్పిటల్లోనే ఉంచుకున్నాడు. ఖర్చు ఎంతవుతుందోనని శేఖరానికి కంగారు. కానీ విజయరత్నంగారు అదేం పట్టించుకోకుండా రంగసాయికి జమీందారీ వైద్యం కొనసాగించాడు. రంగసాయితో శేఖరం పరిచయం నాలుగు నెలలే. ఆఫీసులో కొత్తగా చేరటానికి వచ్చి రూము దొరకకపోతే తన రూములో ఉంచుకున్నాడు. కొన్ని చిరు ప్రయత్నాల తర్వాత చెయ్యగలిగిందేమీ లేదని తెలిసి, రంగసాయిని విజయరత్నంగారి దగ్గరే వదిలేశాడు శేఖరం.

చావుబతుకుల్లోంచి గట్టెక్కి పదిరోజులకి కోలుకున్నాడు రంగసాయి. డాక్టరు గారు రంగసాయికి రెండు నెలలు సిక్‌లీవ్ రికమండ్ చేసి తన దగ్గరే ఉంచు కున్నారు. రెండు నెలలు ఆఫీసు మానేయాల్సినంత అవసరం లేదని, శేఖరానికే కాక, రంగసాయికీ అనిపించినా డాక్టరుగారు ఒప్పుకోలేదు. డాక్టరుగారి ఈ ప్రవర్తన వీరిద్దరికే కాక, ఆయన్ని ఎన్నో సంవత్సరాలుగా దగ్గరగా చూస్తున్న వీరాసామికీ వింతగానే తోచింది. ఎవరికీ పైసా ఖర్చు చెయ్యని డాక్టరుగారు రంగసాయికి వలసిన పళ్ళు, పాలకి విపరీతంగా ఖర్చు చెయ్యటం, రోగులందరికీ ఓ యంత్రంలా వైద్యం చేసే విజయరత్నంగారు రంగసాయిని ఇరవై నాలుగు గంటలు కనిపెట్టుకోవటం అందరికీ చిత్రమే. ఆ ఇంట్లోనే ఏ పనీపాట చెయ్యకుండా అధికారం చెలాయించే పరాంకుశం ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు.

ఓ వారం గడిచేటప్పటికి ఆ భూతగృహంలో, పిశాచపు నీడల్లా సంచరించే వ్యక్తుల మధ్య ఉండలేక, ఎవరికీ ఒక్క మాటేనా చెప్పకుండా రంగసాయి పారిపోయి వచ్చి ఆఫీసులో చేరిపోయాడు. ఏది ఏమైనా, ప్రాణమే పోయినా తిరిగి ఆ డాక్టరు గారి ముఖం కూడా చూడకూడదనుకున్నాడు. కానీ రంగసాయికి ఓ చిక్కొచ్చింది. డాక్టరుగారి దగ్గర ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తెస్తేగానీ ఉద్యోగంలో చేరటానికి వీలులేదన్నాడు ఆఫీసరు. తప్పనిసరై శేఖరాన్ని బతిమాలి పంపించాడు రంగసాయి. మర్నాడు శేఖరం వెళ్ళేటప్పటికి డాక్టరుగారు బాగా క్రుంగిపోయినట్టు కనిపించారు. ఎంతో జబ్బుపడ్డవాడిలా మారిపోయారు.

రంగసాయికి ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ దక్కి ఉద్యోగంలో చేరినా, శేఖరాన్ని విజయరత్నంగారు వదల్లేదు. వారిద్దరి పరిచయం విచిత్రమైన సాన్నిహిత్యంగా మారింది. రోజూ ఇద్దరూ కలిసి వ్యాహ్యాళికి వెళ్ళి కబుర్లు చెప్పుకోవటం అలవాటైంది.

చాలారోజులు అలా గడిచిపోయాయి. డాక్టరుగారి తీరులో రోజురోజుకి మార్పు వస్తోంది. ఆయన జీవితంలో ఏదో మిస్టరీ ఉందని శేఖరం అనుమానం. అయినా సూటిగా ఆయన్ని అడిగి తెలుసుకోలేని జంకు. డాక్టరుగారు కూడా నిత్యం ఏవేవో విషయాలు శేఖరంతో ప్రస్తావించినా ఏదో చెప్పబోయి మరేదో చెపుతున్నట్టు, స్పష్టత లేని ఓ తెరచాటు.

మధ్యమధ్యలో వీరాసామి వచ్చి శేఖరాన్ని కలుస్తున్నాడు. చూచాయగా కొన్ని విషయాలు తెలుస్తున్నాయి. రానురాను డాక్టరుగారికి వైద్యం మీద శ్రద్ధ తగ్గింది. ఆయన మీద ఆయనకి అలసత్వం ఎక్కువైంది. భార్య మరకతానికి డబ్బు పంపించటం మానేస్తే, ఆవిడ పిల్లల్తో వచ్చి హడావిడి చేసింది. డాక్టరుగారి మీద పరాంకుశం ఒత్తిడి పెరిగింది.

పరిస్థితులు ఇలా ఉండగా, ఒకరోజు డాక్టరుగారి నుదుటి మీద బలంగా దెబ్బ తగిలింది. రెండంగుళాల మేర తల చీరుకుపోయింది. అది ప్రమాదమో, ఎవరేనా కావాలని చేశారో తెలియదు. అదృష్టవశాత్తు డాక్టరుగారు కోలుకోవటం శేఖరానికి, వీరాసామికి సంతోషం కలిగించింది.

ఆయన కోలుకుని ఇంటికి వచ్చాక పరిస్థితి మరింత జటిలమైంది. ఆయన పిచ్చిపిచ్చి ప్రవర్తన వల్ల మతి చలించిందేమోనన్న అనుమానం కూడా కొందరికి వచ్చింది. ఆయన ప్రాక్టీసు మానేశాడు. అందర్నీ పనిలోంచి మానిపించేశాడు. ఇంట్లో సామానంతా అమ్మేసి, అందులో సగం డబ్బు వీరాసామికి ఇచ్చాడు. అకస్మాత్తుగా అంత ఇంటినీ పాడు పెట్టినట్టు వదిలేసి వెళ్ళిపోయాడు.

ఇలాంటిదేదో జరుగుతుందని అనుమానించిన శేఖరం ఆఖరి క్షణంలో, డాక్టరుగారు ఎక్కిన రైలు కదిలిపోతున్న సమయంలో ఆయన్ని కలుసు కోగలిగాడు. అంతకాలం శేఖరంతో ముఖత చెప్పలేని తన కథనంతా అక్షరబద్ధం చేసిన కవరు అతనికి అందజేశారు డాక్టరుగారు. శేఖరం కనబడటం వల్ల సంతోషించారు. లేకపోతే ఆ కవరు మర్నాడు పోస్టులో పంపుదామనుకున్నానని చెప్పారు.

ఆ కవరులో డాక్టరు విజయరత్నంగారి కథ ఉంది. అసలు పేరు విజయరత్నం కాదు కోదండం. మరకతం అతని భార్య కాదు. ఆ పిల్లలు అతని పిల్లలు కారు. అసలు డాక్టరు విజయ రత్నంగారు మరకతం భర్త. ఆయన మరణించాక, పరాంకుశం, మరకతం వల్ల కోదండం విజయరత్నం అయ్యాడు. ఆయన దగ్గర కాంపౌండర్‌గా పని చెయ్యటం వల్ల అతనికి వైద్యం అబ్బింది. మరకతంతో సంబంధం ఏర్పడింది.

బతుకుతెరువు కోసం భార్య రాజేశ్వరిని వదిలేసి వచ్చిన కోదండం జీవితం తిరిగిన మలుపులివి. ఇదేకాక, ఇంకా ఇలాంటివి కోదండం జీవితంలో చాలా ఉన్నాయి. కొన్ని స్వయంకృతాలు. కొన్ని మీద కొచ్చిపడినవి.

ఇలాంటి వింతలు, మలుపులు చాలా ఉంటాయి నవలల్లో. కానీ త్రిశంకుడి స్వర్గం ప్రత్యేకత ఈ పాత్ర అంతర్మథన స్థాయి.

*పొద్దు గూట్లో పడుతుండగానే అన్నం ఆకులో పడుతుండేది. అన్నాల పని పూర్తి కాగానే భజన మందిరంలోకి చేరుకునేవాళ్ళం. చిన్న హార్మోనియం పెట్టె ఒకటుండేది. దాన్ని తెరిస్తే సన్నగా నాదం వినవచ్చేది. ఇక చూసుకో బాబూ! నిద్రొచ్చేదాకా భజనలే! ఆ బతుకొక పాటలా ఉండేది. సిద్దేశ్వరుడి గుడి గోపురంలో నివసించే పావురాళ్ళకూ, మాకూ బ్రతికే వైనంలో పెద్ద తేడా ఉండేది కాదు. ఆ బతుకు తియ్యటి మామిడిపండు.*

ఇలాంటి జీవితం కోదండంది. అతనికి ఇష్టమైనది అది. కానీ జీవితంలో అతను చేరిన స్థితి ఇలా ఉంది.

*బావి తవ్వితే భూతం బయటపడిందని సామెత. బయటపడటానికి అదంతకు ముందు నుంచి అక్కడ ఉండి ఉండాలి. నాలో ఈ కసి ఎన్నాళ్ళ నుంచి ఉంది? అసలిది నాలో ఎలా పుట్టింది? బతకాలన్న కక్కుర్తి మనిషిచేత ఎలాంటి పనైనా చేయిస్తుంది. నేను డాక్టరుగా పని చేయడానికి కూడా తెగించానంటే అందుకదే కారణం. కానీ నౌకరు కూడా ఒక మానవుడే! ఆత్మాభిమానం మానవుడికి నైసర్గికంగా అబ్బిన గుణం. ఈ అభిమానానికి దెబ్బ తగలకుండా నన్నొక సాటిమనిషిగానే చూసుకున్న డాక్టరుగారు గతించారు. నా ఆత్మాభిమానాన్ని అరికాలితో రాచి, నన్ను తన కనుచూపుల్లో మరబొమ్మలా ఆడించుకున్న మరకతం బతికే ఉంది. చేయరాని పని అని లేదు. చేయకూడని పని అని లేదు. ఏ పని చెబితే ఆ పని చేసేవాడే నౌకరు అన్న ధీమాతో వ్యవహరించింది. ఆ ధీమా ఆవిడ కెక్కడి నుంచి వచ్చింది? సంపద మూలంగా వచ్చింది. ఆ సంపద కాస్తా హరించుకుపోతే తనకూ, నాకూ స్థాయీభేదం సమసిపోతుంది. బికారి మరకతం కోదండాన్ని అప్పుడెలా శాసిస్తుంది?*

*అమాయకురాలు, అసహాయురాలు అయిన కట్టుకున్న భార్య జీవితంలో నిప్పులు చెరిగి వచ్చి, నోటికి రుచీ, శరీరానికి సుఖమూ దొరకగానే అంతరాత్మ నోటికి తాళం వేసి, జంతు సదృశంగా బతకగలిగిన నేను, మనుషులలో మణిపూసలాంటి మహనీయుడి మంచితనాన్ని ఏనాడూ ఎంచి చూడక, చివరికాయన చనిపోతే ఒక కన్నీటిచుక్క అయినా విడువక దిమ్మరాయిలా కూచున్న మరకతం తిన తిండి లేక, కట్టుగుడ్డ లేక, తలదాచుకోవడానికి ఆశ్రయం లేక అల్లల్లాడిపోవడాన్ని చూడడం కోసం బతికే ఉన్నాను. బతికి ఉంటాను. చూసి సంతోషిస్తాను.*

అకృత్యాలని ఎవరికి వారు ఎంతగా సమర్థించుకున్నా చివరికి మిగిలేది అలజడి, అశాంతే అని పరోక్షంగా చెప్పిన తీరు, మానసికలోకపు విశ్లేషణ ఈ నవల ప్రత్యేకత.

కథారచనే ఎక్కువగా చేసిన మధురాంతకం రాజారంగారు ఈ వస్తువు కథలో ఇమడటం కష్టమనే నవల రాసినట్లుంది.

ఈ నవలలో ఇంకా చాలా పాత్రలూ, సంఘటనలూ, విశ్లేషణలూ ఉన్నాయి. వాటి ద్వారా రాజారాంగారు లోకరీతిని ప్రస్ఫుటం చేశారు.

*భయాన్ని మించిన దుఃఖమూ, ధైర్యాన్ని మించిన సుఖమూ ఎక్కడున్నాయి?*

*బాహాటంగా ధర్మపన్నాలు వల్లిస్తుంటాను. మానవసేవకు మించిన ధర్మం లేదంటాను. కొంపలు కూల్చేస్తుంటాను. లోలోపల గోతులు తవ్వేస్తుంటాను.*

*డబ్బు వల్ల కలిగే సుఖాలెన్ని ఉన్నాయో, పోగొట్టుకునే సుఖాలు కూడా అన్నే ఉన్నాయని లోకులకి తెలియదు.*

*ఒళ్ళు కాలి బొబ్బలెక్కి ఆ బాధతో అలమటిస్తున్న వాడు, అగ్గి వలన కలిగే లోక కళ్యాణాన్ని ఊహించగలడా?*

ఇలా చాలాచోట్ల రాజారాంగారు పాత్రల సంభాషణ ద్వారా కథని కాక జీవన రీతిని కళ్ళకు కట్టించారు. నిర్ద్వందమైన నిజాయితీలో ఉన్న సుఖానికి, రెండు జీవితాలుగా బతికే వ్యక్తుల నికృష్టతకి మధ్య నున్న సంఘర్షణని విశ్లేషించారు. త్రిశంకుడి స్వర్గం అన్న పేరుకి తగినట్టు అటూ ఇటూ కాని ఓ జీవన చిత్రాన్ని కోదండం ద్వారా చూపించారు. అధర్మ మార్గచిత్రణ ద్వారా, ధర్మం విలువ తెలిపారు.

రచనా వైచిత్రి, విలక్షణ మానసిక లోకాల చిత్రణ నిండుగా ఉన్న నవల *త్రిశంకుడి స్వర్గం.*

*జనవరి, 2010*




# కౌసల్య

## పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

కౌసల్య నవల అనగానే పోలాప్రగడ సత్యన్నారాయణగారు, పోలాప్రగడ సత్యన్నారాయణగారు అనగానే కౌసల్య నవల స్ఫురిస్తాయి. పరస్పరం లభించిన ప్రాచుర్యం అలాంటిది. ఆంధ్రప్రభ నిర్వహించిన నవలల పోటీలో బహుమతి లభించటం, ధారావాహికంగా వెలువడుతుండగా విశేష పాఠక ఆదరణ లభించడంతో పాటు, తల్లిదండ్రులు సినిమాగా వచ్చినప్పుడు ఎంతో విజయం సాధించటం కొంతవరకు ఈ ప్రాచుర్యానికి కారణాలు. పలు భారతీయ భాషల్లోకి అనువాదం కావటం, టి.వి. సీరియల్‌గా టెలికాస్ట్ కావటం జరిగింది.

కౌసల్య భారత స్వాతంత్ర్య పోరాటం నాటి ఓ గ్రామీణ, ఉమ్మడి కుటుంబ కథ. వెంకట్రామయ్య, అచ్యుతరామయ్య అన్నదమ్ములు. పెద్దవాడైన అచ్యుతరామయ్యకి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ముగ్గురిలో ఆనందం చిన్నవాడు. అతన్ని కని, అచ్యుతరామయ్య భార్య చనిపోయింది. కాలక్రమేణా చాలా మార్పులు జరిగాయి. వెంకట్రామయ్య వివాహం, రామచంద్రపురానికి చెందిన రావుసాహెబ్ పెరుమాళ్లయ్యగారి అమ్మాయి కౌసల్యతో 1939లో జరిగింది. పెళ్లయిన ఏడాదిన్నర కాలానికి

కాని వాళ్లకి సంతానం కాలేదు. ఆలోపు వారిద్దరి మధ్య అనురాగం, ఆకర్షణ మరింత గాఢమయ్యాయి.

వెంకట్రామయ్యగారు పరోపకారి. కుటుంబం అన్నా, తోటివారన్నా ఎంతో ఆప్యాయత, సంఘసేవతో పాటు దేశభక్తి ఆయన నరనరానా ఉంది.

కౌసల్య, వెంకట్రామయ్యల సంసార జీవితం ఆరంభమే నాటకీయంగా మారింది. తొలిరాత్రి ముచ్చట తీరిన మర్నాడే, బులుసు సాంబమూర్తిగారి పిలుపున కాకినాడలో తలపెట్టిన సత్యాగ్రహంలో పాల్గొనటానికి బయలుదేరి వెళ్లాడు వెంక ట్రామయ్య. గర్భాదానం పెళ్లికొడుకు అలా వెళ్లటం ఎవరికీ నచ్చలేదు. అప్పుడు అరెస్ట్ అయి ఆరునెలలు జైలుజీవితం గడిపాడు. ఆయన రాకకోసం ఎంతగానో ఎదురు చూసింది చైసల్య. జైలు నుంచి విడుదలై కాకినాడ నుంచి పుల్లేటికుర్రు వస్తుండగా ఆయన చూపించిన అనురాగానికి మురిసిపోయింది. కొద్ది నెలలు సంతోషంగా గడిచాయి. కౌసల్య గర్భవతి అయింది.

అది క్విట్ ఇండియా పోరాట సమయం. కౌసల్య వద్దన్నా వినకుండా వెంక ట్రామయ్య ఎన్నో సభల్లో ముందు వరసన నిలిచాడు. తిరిగి అరెస్ట్ అయ్యాడు. ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగి, ఆవేశంగా కౌసల్య ఆ ఇంటి నుంచి పుట్టింటికి వచ్చేసింది.

మూడేళ్ల తర్వాత జైలు నుంచి వచ్చాడు వెంకట్రామయ్య. అప్పటికి ఇరు కుటుంబాలు పూర్తిగా దూరమైపోయాయి. తమకి పుట్టిన బిడ్డకి 'తిలక్' అని పేరు పెట్టింది కౌసల్య. బాలాగంగాధర్ తిలక్ అంటే వెంకట్రామయ్యకి ఎంతో ఇష్టం.

కౌసల్య తండ్రి మరణించాడు. వెంకట్రామయ్య అన్నగారు అచ్యుతరామయ్య కూడా గతించాడు. కౌసల్యకి కొడుకే సర్వస్వం. వెంకట్రామయ్యకి తల్లీతండ్రి లేని అన్నగారి పిల్లలే కుటుంబం. అలా దరిదాపు ఇరవై ఏళ్లు గడిచాయి.

వెంకట్రామయ్య వ్యవసాయం చూసుకుంటూ అన్నగారి పిల్లల మంచిచెడ్డలకే తనని అంకితం చేసుకున్నాడు. అన్నగారి కూతురు విశాలాక్షి భర్త సూర్యనారాయణ. ఆమె, తమ్ముడు ముకుందం భార్య సరోజ వరద ప్రమాదంలో ఒకేసారి మరణించటం ఆ కుటుంబానికి పెద్ద దెబ్బ. విశాలాక్షి కూతురు జానకికి తాతయ్య వెంకట్రామయ్య అంటే ఎంతో ప్రేమ, గౌరవం. అన్నీ బాగానే ఉన్నా, వెంకట్రామయ్యను కౌసల్య జ్ఞాపకాలు బాధిస్తూనే ఉన్నాయి. కొడుకు ఉన్నాడని తెలుసు. ఆ కొడుక్కి ఈ తండ్రి ఉన్నాడని తెలుసో తెలియదో అనుకోవటం ఆయన వంతైంది.

ఉమ్మడి కుటుంబం భారమేకాక, పేదసాదల పట్ల మంచి మనసుతో వెంక ట్రామయ్య ఆర్థికపరంగా జాగ్రత్తకి అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆ సంవత్సరం పంట నష్టంవల్ల బాగా ఇబ్బంది ఎదురైంది. పిల్లల కాలేజీ చదువుకే కష్టపడాల్సి వచ్చింది. ఆనందం పెళ్లి తలపెట్టారు. రాజకీయాల్లోనే కాక, ఆర్థికంగా కూడా తమకన్నా పై మెట్టు మీద ఉన్న మాధవరావుగారి పెంపుడు కూతురు జ్యోతిని చూడటానికి వెళ్లారు.

ఆ పిల్ల కన్నా పేదపిల్ల, అంతగా అందం లేకపోయినా, గుణవంతురాలు, నెమ్మదస్తు రాలైన అన్నపూర్ణతో సంబంధం ఖాయం చేశారు వెంకట్రామయ్య. అధిక అభిమానం, అభిజాత్యం కౌసల్య రూపంలో ఆయనకి తారసిల్లి జీవితాన్ని సంక్షోభ పరచిన అనుభవం ఆయన మరిచిపోలేదు. అందుకే ఆస్తికి, అందానికి, అంతస్తుకి ప్రాధాన్యత ఇవ్వలేదు. అన్నపూర్ణతో ఆనందం జీవితం బావుంటుందని విశ్వసించారు. ఆనందం, అన్నపూర్ణల వివాహం జరిగింది. కానీ, వెంకట్రామయ్య ఊహించింది వేరు, జరిగింది వేరు.

అసూయాద్వేషాలతో ఆయన అలా చేశారని విశాలాక్షి, ఆనందం, ముకుందం ఆయన్ని అనరాని మాటలన్నారు. ఆయనకి దక్కని సంసార సుఖం వేరొకరికి దక్కడం ఇష్టంలేక, కావాలనే ఆ దరిద్రపు సంబంధం కుదిర్చాడని, అందం, ఆస్తి ఉన్న జ్యోతిని దురుద్దేశంతోటే వద్దన్నాడని నిందలేశారు. ఎంతగానో అవమానించారు. ఆ కుటుంబమే సర్వస్వం, వాళ్లే తనవాళ్లు అనుకున్న వెంకట్రామయ్య గాయపడిన హృదయంతో కట్టుబట్టలతో ఇల్లు వదిలి వచ్చేశాడు.

వెంకట్రామయ్య కథ రకరకాల మలుపులు తిరిగి చివరికి కౌసల్యను, కొడుకు తిలక్‌ను చేరుకోవటంతో ఈ నవల సుఖాంతం అవుతుంది. ప్రధానంగా స్థూల కథ ఇదే అయినా, జానకి, ముకుందం, ఆనందం, అన్నపూర్ణ, జ్యోతి, తిలక్ పాత్రల ఆధారంగా మరికొంత ముఖ్యమైన కథా సాగింది.

**1964** ఆంధ్రప్రభ నవలల పోటీలో బహుమతి పొందిన నవల కౌసల్య. ఆ సమయానికి ఓ రెండు మూడేళ్లు అటూఇటూగా ఓ దశాబ్దన్నర కాలం కాల్పనిక పత్రికలకి నవలా సాహిత్యమే వ్యాపార ప్రాణవాయువు అయింది. సీరియల్స్‌గా వచ్చే నవలలు, వారపత్రిక ఇంటికి రాగానే, ముందుగా చదవటానికి కుటుంబంలోని వ్యక్తు లందరూ పోటీపడేవారు. స్త్రీ పాఠకుల సంఖ్య గణనీయంగా పెరిగిన కారణంగా కుటుంబంలోని పెద్దా చిన్నా అందరి అభిరుచికి తగినట్టుగా వారపత్రికలు వ్యాపార ధోరణిని పెంపొందించుకున్నాయి. అందులో భాగంగానే, తమకి అనుకూలమైన నవలలు ఏడాదికి సరిపడా ఎంపిక చేసుకోవటానికి వీలు కలిగించే ఉగాది, దీపావళి నవలల పోటీలు నిర్వహించేవారు. ఈ పోటీలలో బహుమతి పొందే నవలలు, మామూలు నవలలకన్నా కొంత ప్రత్యేకంగా ఉండేవి. పోటీలో బహుమతి పొందిందంటే, ఏదో ప్రత్యేకత ఉండేలా చూసే చిత్తశుద్ధి న్యాయనిర్ణేతలకి ఉండేది.

సామాజికంగా ప్రాధాన్యత గల వస్తువులు, నవలకి కేంద్రంగా స్వీకరించే పద్ధతి నుంచి, వైయక్తిక సమస్యల వేపు పూర్తిగా మొగ్గు చూపించే తీరుకి వారపత్రికల నవలలు మారుతున్న కాలంలో కౌసల్య సరిహద్దులాంటి నవల.

కౌసల్య నవలలో కథ పూర్తిగా కుటుంబాథలాగే అనిపించినా, ఆ పరిధిని దాటిన సంఘటనలు, నేపథ్యం చాలా ఉంది. రుచికరమైన మిఠాయికి అదనపు రుచి కూర్చేలా, జీడిపప్పు పొదిగినట్టుంటుంది ఈ నవలలో కథ.

ఆసక్తికరంగా చదవించటం, ఏమాత్రం గందరగోళం లేకుండా సాఫీగా కథనం సాగటం, చిన్నచిన్న మాటలతో అందరూ మాట్లాడుకునే రీతిలోనే సాదాసీదాగా పాత్రలు మాట్లాడటం లాంటి పలు కారణాల వల్ల కౌసల్యకి చాలా మంచి ప్రాచుర్యం లభించింది. కథలో, పాత్రల తీరులో ఉన్న గాఢమైన నాటకీయత పాఠకులకి పదికాలాల పాటు గుర్తుండిపోవటానికి దోహదపడింది.

ఒక నవలని సినిమాగా మార్చేటప్పుడు దృశ్య ప్రాధాన్యతకి ప్రయత్నించటం జరుగుతుంది. ఓ సినిమాలా చక్కగా అమరిన దృశ్యాలకి, మరికొంత వర్ణన, విపులీకరణ కూర్చినట్టు, అంటే కళ్లకు కట్టినట్టు పోలాప్రగడ కౌసల్య నవలని సాగించారు.

ఉమ్మడి కుటుంబంలోని కోపతాపాలు, ప్రేమాభిమానాలు, పట్టుదల, పశ్చాత్తాపాలు, త్యాగాలు చిత్రించిన నవలలు చాలా ఉన్నాయి. కానీ కౌసల్యని వాటి నుంచి ప్రత్యేకించి చూపిన కొన్ని విషయాలు ఉన్నాయి.

జాతీయస్ఫూర్తి, స్వాతంత్ర్య పోరాటాల నేపథ్యంతో తీర్చిదిద్దిన వెంకట్రామయ్య పాత్ర వాటిలో ముందుగా చెప్పుకోవాలి. వ్యక్తిస్థాయి కన్నా ఎత్తుగా, సమిష్టి స్థాయిలో ఉన్న ఈ పాత్ర కౌసల్యలో ప్రత్యేకమైనది. అలాగే కౌసల్య పాత్ర. కుటుంబ ధర్మాచరణకి నిబద్ధురాలే. అదే సమయంలో స్వాభిమానవతి. స్త్రీగా, భార్యగా తనకి తగిన విలువ ఉండాలన్న అభిజాత్యం కలది. వీరిద్దరు తమ నమ్మికల కోసం జీవనం సాగించటానికి చాలా ఇబ్బందుల్ని, ఎంతో మానసిక ఒంటరితనాన్ని భరించారు. అలాగే ఆనాటి కాలంలో మెజారిటీ జనం నమ్మిన, అంగీకరించిన ధర్మాచరణ కౌసల్యలోని మహాబలమైన విషయం. దానికి బద్ధులై ఉంటూనే, మారుతున్న కాలం విలువల ప్రభావానికి ఎదురీదిన రకరకాల పాత్రలు కౌసల్య నవలకి ఓ ప్రత్యేక బలం కూర్చాయి. కౌసల్య నవల ఒక చిత్రమైన కలగలుపు. ఆ కలగలుపు చాలామందికి ఎంతగానో నచ్చింది.

ఒక కుటుంబం కథలాగే సాగుతూ, రాజకీయ, సామాజిక, జాతీయ అంశాలకి విలువనివ్వటం, ఆ కాలపు విలువలు చూపించే ప్రభావాన్ని పలు కోణాలలో కళ్ల ముందుంచటం, సామాన్య పాఠకులకి కూడా క్లిష్ట విషయాలు సుబోధకంగా సాగటం కౌసల్య నవలని ప్రత్యేకంగా నిలిపాయి.

'ఒక్క క్షణం' అన్న ముందుమాటలో పోలాప్రగడ చెప్పినట్టు- 'జీవిత దర్పణమైన చక్కని కళా సమర్పణ,'లాగే కౌసల్యని తీర్చిదిద్దారు.

పల్లె జీవితం పడికట్లు, స్వాతంత్ర్య పోరాట ఉద్వేగం, భార్యాభర్తల అనుబంధం, పట్టుదలలు, తరాల అంతరంతో పాటు ఆలోచనాతీరులోని భేదం- ఇలా పలు విషయాల చక్కటి చిత్రమాలికగా రూపొందిన నవల కౌసల్య. ఆనాటి తెలుగువారి జీవితాన్ని ఈతరం వారు చూడదలుచుకుంటే చక్కటి ఉపకరణ ఈ నవల.

*ఏప్రిల్, 2010*




# గొడుగు

## పి. సత్యవతి

**పి.** సత్యవతిగారి గొడుగు నవల 1980 మార్చిలో ఎమెస్కో పాకెట్ బుక్‌గా తొలిసారి ప్రచు రించబడింది. ఇంటింటా గ్రంథాలయం పథకానికి వీలుగా, ఎమెస్కోవారు ఆ రోజుల్లో నెలనెలా మూడు పుస్తకాలు వెలువ రించేవారు. అలా వచ్చిన నవలల్లో ప్రాచుర్యం పొందిన నవల గొడుగు.

ట్రయాంగ్యులర్ లవ్‌స్టోరీల మీద చాలా నవల లున్నాయి. గొడుగు త్రిముఖ ప్రేమ కథే అయినా, దానికన్నా గాఢంగా స్త్రీ-పురుష సంబం ధాలకి, కుటుంబ జీవన విధాన విశ్లేషణకి, ఆ రోజుల్లో సాధారణంగా స్త్రీలు రచనల్లో చర్చించటానికి చొరవ చూపించని అంశాలను తరచి తరచి చర్చించటానికి శ్రీమతి సత్యవతిగారు పూనుకోవటం గొప్ప విషయం. అలాగే కేవలం స్త్రీ హృదయం మాత్రమే పట్టుకోగలిగిన ఎన్నో సున్నితమైన ఉద్వేగాలు నిండుగా ఉన్న నవల గొడుగు.

మధుమతి రావుగారి భార్య. కృష్ణమూర్తి ప్రియురాలు.

సామాన్య కుటుంబంలో పుట్టిన మధుమతిని మేనత్త ఆదిలక్ష్మమ్మ పెంచుకుంటా నంది. బాగా ఆస్థిపరురాలు, సంతానంలేని విధవరాలు అయిన ఆవిడ మాటని మధుమతి తల్లీతండ్రీ కాదనలేకపోయారు.

ఎనిమిదో క్లాసు పరీక్షలు రాసిన మధుమతి మేనత్తతో గుంటూరు సంతోషంగా ప్రయాణమైంది. అత్తయ్య ఎన్నో కొత్త బట్టలు కుట్టిస్తుంది. పెద్ద స్కూల్లో చేర్పిస్తుంది.

మధుమతి కలలన్నీ నెరవేరాయి. మేనత్తకి సినిమాలంటే ఇష్టం. నవీనంగా ఉండటమంటే ఇష్టం. చదువు, క్రమశిక్షణల కన్నా జీవితాన్ని సుఖంగా గడపటమంటే ఇష్టం. ఈ లక్షణాలన్నీ మధుమతికీ వంటబట్టాయి. క్రమేపీ వయసు అందం, అలంకరణల మెరుపు మధుమతిని ఆకర్షణీయంగా తయారు చేశాయి.

యవ్వనపు మధురకాలం. ఎదురింట్లో అద్దెకి ఉంటూ చదువుకుంటున్న కృష్ణమూర్తి కళ్ళల్లో మధుమతి పడింది. వదలకుండా చూడటం సాగించాడు. మధుమతికి ఎర్రగా బుర్రగా ఉన్న కృష్ణమూర్తి నచ్చాడు. దొంగచూపులు, పలకరింపు, చిరునవ్వులుగా, ఆ తర్వాత పరిచయం ప్రేమలేఖల ప్రణయంగా మారింది.

మధుమతికి కృష్ణమూర్తిని పెళ్ళి చేసుకోవాలనిపించింది. మేనత్తకి, మధుమతి తల్లితండ్రులకి కూడా మధుమతి పెళ్ళి చేసేస్తేనే మంచిదనిపించింది. కానీ కృష్ణమూర్తికి ఇచ్చి కాదు. డబ్బు, హోదా, అంతస్తు ఉన్న రావుగిరికి ఇచ్చి.

పెద్దలని కాదని, కృష్ణమూర్తితో లేచిపోవటానికి సిద్ధపడింది మధుమతి. పారిపోతున్న కృష్ణమూర్తి, మధుమతిల ఆటలు సాగనివ్వకుండా అడ్డుపడి, నయానా భయానా నచ్చచెప్పి రావుగారికిచ్చి పెళ్ళి చేసింది మేనత్త ఆదిలక్ష్మి.

మేనత్త కన్నా ధనవంతుడు రావుగారు. విజయ వాడలో కొత్తగా వ్యాపారం ప్రారంభించాడాయన. విలాస వంతమైన జీవితం, నగలు, చీరలు, కార్లు, పెద్ద ఇల్లు. ఏ లోటూ అనిపించకుండా కొన్నాళ్ళు గడిచింది మధుమతి కొత్త సంసార జీవితం. ఓ పాప పుట్టింది. రావుగారికి మొదటి నుంచీ వ్యాపార విషయంలో ఆసక్తి ఎక్కువ. రానురాను అది వ్యామోహస్థాయి దాటింది. కొత్త హోటలు పెట్టే పనిలో పడ్డారు. ఆ పట్టణంలో పెద్ద హోటల్‌గా దాన్ని తీర్చిదిద్దాలన్న నిరంతర రంధి.

రానురాను వీరిద్దరి మధ్య సంసారం మొక్కుబడిగా తయారయింది. గతంలోని ఆసక్తీ లేదు, ఉద్వేగమూ లేదు. మధుమతిలా భావుకుడు కాదు రావుగారు. చతురోక్తులుగానీ, ప్రేమ సంభాషణలుగానీ, భార్య అందాల్ని పరికించి చూడటం గానీ ఆయనకి అలవాటులేని పనులు.

ఇంత అందమైన తనకి తగిన గుర్తింపు భర్త దగ్గర నుంచి లభించటం లేదన్న దుగ్ధ మధుమతికి ఉంది. సరిగ్గా అటువంటి సమయంలో, పదేళ్ళ తర్వాత కృష్ణమూర్తి, భార్య శ్యామసుందరితో కలిసి బట్టలషాపులో తారసిల్లాడు. దగ్గరికి వచ్చి పలకరించాడు.

అంతే, ఆ తర్వాత కృష్ణమూర్తి మధుమతిని వదల్లేదు. రావుగారితో పరిచయం, చనువు. ఆయన ద్వారా వాళ్ళ పక్కింటికే అద్దెకు రావటం, మధుమతికి గతాన్ని గట్టిగా గుర్తు చెయ్యటం, ఆమె లేకుండా బతుకు నిస్సారమని పదేపదే చెప్పటం, చివరికి ఆమె లేందే చచ్చిపోతానన్న భావన కలిగించటం చేశాడు. మధుమతి కరిగిపోయింది.

'మధూ... దేవతా,' అని పలవరించే కృష్ణమూర్తికి లొంగిపోయింది. పెళ్ళికి ముందే తనని కృష్ణమూర్తికి శారీరకంగా అర్పించుకున్న మధుమతికి ఈ కలయిక తప్పనిపించలేదు సరికదా, రెట్టింపు ఉద్విగ్నంగా ఉంది.

రకరకాలుగా కలుసుకోవటం ప్రారంభించారు. గుంటూరు ఏదో పని ఉందని చెప్పి మధుమతి కృష్ణమూర్తితో సముద్రతీర విహారాలు చేసింది. రాత్రిళ్ళు యధేచ్ఛగా అతనితో గడిపింది.

త్రిముఖంగా సాగే ఇటువంటి సంబంధాలు ఏఏ దారికి మళ్ళుతాయో ఆ దారికే వీళ్ళ సంబంధం చేరింది. అలకలు, కోపాలు, ఎక్కువ తక్కువ భావనలు, మధుమతికి కృష్ణమూర్తి భార్య మీద అసూయ, భర్త పట్ల పెరిగిన విముఖత్వం... చుట్టూ ఉన్న పది మంది వీరి గురించి చెవులు కొరుక్కోవటం ఆరంభమైంది. పంతానికి పోయి మరింత తెగించి, పనిమనుషుల రాయబారాలతో కృష్ణమూర్తిని రావుగారు లేని సమయంలో ఇంటికే పిలిపించుకోవటం మొదలెట్టింది మధుమతి.

ఈ రకరకాల పరిణామాలతో మధుమతి జీవితం అతలాకుతలం అయింది. నిరంతర సంఘర్షణ ఆవిడ కొత్త జీవితం అయింది.

శ్యామసుందరికి వీళ్ళ గురించి తెలిసి మధుమతితో మాట్లాడ్డం మానేసింది. రావుగారికి కూడా తెలిసిందేమోనన్న అనుమానం మధుమతికి వచ్చినా, తెలిస్తే తెలియనీలే అన్నంత మొండిగా తయారయింది.

సుఖం తగ్గి పూర్తిగా అలజడి కమ్ముకున్న ఈ స్థితిలో సత్యవతిగారు ఈ నవలని నడిపిన చివరి భాగం ప్రత్యేకించి చెప్పుకోదగినది.

మధుమతి బాల్యం నుంచి, ఈ సమస్య చివరి వరకూ ఆమె భావోద్వేగాలనే కాక, ఇంచుమించు మిగిలిన అన్ని పాత్రల తీరుతెన్నుల్ని మధుమతి మేనత్త ఆదిలక్ష్మిగారి జీవితం, డాక్టరుగారితో ఆవిడ శారీరక సంబంధం, మధుమతి తండ్రికి మరో అమ్మాయితో సంబంధం, మేరీ, రాజమ్మగారు, శ్యామసుందరి- ఇలా అందరూ నైతికానైతికాల మధ్య రక్తమాంసాలు, జవసత్వాలు ఉన్న వ్యక్తుల్లాగే ప్రవర్తించిన తీరుని సత్యవతిగారు సున్నితంగా, నిశితంగా ప్రదర్శించటం గొడుగు నవలకి వెన్నెముకలాంటి బలాన్నిచ్చింది.

'సమస్య ఎలా పరిష్కారమవుతుందో?' అనుకున్న సమయంలో రావుగారు కృష్ణమూర్తిని తన పలుకుబడితో బొంబాయి ట్రాన్స్‌ఫర్ చేయించారు. శ్యామసుందరి విదేశాలకి అంతకుముందే పై చదువుకోసం వెళ్ళిపోయింది.

కృష్ణమూర్తి బదిలీకి తానే కారణమని రావుగారు చెప్పటమే కాదు, మొత్తం సమస్యను, ఆయనదైన పరిష్కారాన్ని అరటిపండు వొలిచి అందించినట్టు మధుమతి ముందుంచారు.

ముక్కోణపు ప్రేమ నవలలో చాలామంది ప్రేమల్ని, త్యాగాల్నీ చూపిస్తారు. నాటకీయ ధోరణిలో రకరకాలుగా ముగిస్తారు.

కానీ గొడుగు నవల అలాంటిది కాదు. మౌలికమైన కొన్ని భావోద్వేగాల్ని పరోక్షంగా ప్రశ్నించి, విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందని ముప్ఫై ఏళ్ళ క్రితమే తెలియజెప్పిన నవల.

కాలానుగుణంగా కొన్ని సమస్యలు వాటంతట అవే సమసిపోతాయి. కానీ గొడుగు నవలలోని మౌలికమైన సమస్య మానవ జీవితం ఉన్నంతవరకూ ఉండే సమస్య.

స్త్రీ పురుష ఆకర్షణ, శారీక వాంఛా ఎవరూ కాదనలేని సత్యం. నైతికా నైతికాలను, మంచిచెడ్డల్ని చర్చించుకున్నాక అవి ఏర్పడవు. అకస్మాత్తుగా దూకే జలపాతంలాంటి ఉద్వేగం అది. అలాగే భావుకత. 'దేవతా... నా దేవుడు,' అని ఆడా, మగా అనుకోవటం, వెన్నెలలో మైమరిచిపోవటం... మధురమైన సంగీతం లాంటి పిలుపులు... ఆ పిలుపులో తన్మయత్వం కలిగి అదే ప్రేమ స్వరూపం అనుకోవటం... ఇవన్నీ కూడా స్త్రీ పురుష సంబంధాలలో కొద్దికాలమే మురిపిస్తాయి. ఆ మురిపం కలకాలం ఉండదని, స్త్రీ పురుషులిద్దరూ గుర్తించాలి. జీవితమంతా పరుచుకుని అలానే ఉండిపోయే ప్రేమలో ఎంత శాతం భ్రమ ఉందన్న విషయం మరిచిపోకూడదు.

ఏ రకం సంబంధంలోనైనా సుఖాన్ని, బాధ మించిపోకూడదన్నది సత్యం. ఇటువంటి జీవన సూక్ష్మలనెన్నింటినో అతి సహజంగా స్పృశించిన నవల గొడుగు.

కృష్ణమూర్తి, మధుమతిలా ఇటువంటి శారీరక సంబంధాల్ని చాలారోజుల తర్వాత పునరుద్ధరించకునే సందర్భంలో చిత్రమైన సంభాషణలు చోటు చేసుకుంటాయి. సత్యవతిగారు అంటువంటి సంభాషణలను అద్భుతంగా రాశారు.

తమని తాము సమర్థించుకునే చిత్రమైన తీరు ఉంటుంది.

ఇటువంటి సహజసిద్ధమైన మాటలు, ప్రవర్తన గొడుగు నవల ప్రత్యేకత. ఎక్కడా ఎంతమాత్రం ఎక్కువగా చెప్పకుండా రాజమ్మగారిలాంటి విభిన్న పాత్రని చిత్రించటం మరో ప్రత్యేకత. ఎప్పటికీ చదువుకో తగిన మంచి నవల గొడుగు.

*మే, 2010*




# ఇదే దారి

## బలివాడ కాంతారావు

వేలకొద్దీ మనస్తత్వాలని ఎరిగిన కాంతారావుగారు వివిధ వస్తువులతో ఎన్నో నవలలు రాశారు. వీరి నవలల్లో *దగాపడిన తమ్ముడు, గోడ మీది బొమ్మ* విస్తృత ప్రచారం పొందాయి. కానీ **1967**లో వచ్చిన ఇదే దారి నవల విలక్షణమైంది, గాఢమైంది. దేశం, కాలం, ప్రాంతం అన్న భేదం లేకుండా మనిషికి ఏది అవసరం, ఏ దారిన నడిస్తే జీవన సాఫల్యం దక్కుతుంది అన్న మౌలిక తాత్వికతని విశ్లేషిస్తూ సాగిన రచన ఇది.

కేశవ్ తండ్రి రఘురామయ్య సంగీతజ్ఞుడు. అతని గానాన్ని వినాలని ఆ ప్రాంతపు జమీందారు భూపతి కోరినా, తన కళని అమ్ముకోలేదు. ఎప్పుడూ ఆ రసావేశంలో మునిగి తేలే అతన్ని గ్రామస్తులు పిచ్చివాడిగా జమకట్టారు. ఆర్జన పట్ల ఆసక్తి లేని అతన్ని దరిద్రం కబళించింది. అతని భార్య ఛాయమ్మ, కొడుకు కేశవ్‌ను, కూతురు స్వర్ణను తీసుకుని తమ్ముడు శ్రీకంఠం ఇంటికి రాజపురం చేరింది. రాజపురం కేశవ్‌కి చిన్నతనం నుంచి బాగా పరిచయం ఉన్న ఊరే. రెండేళ్ళ క్రితం తాతగారి మరణ సమయం లో కేశవ్ ఆయన దగ్గరే ఉన్నాడు. ఆయనకి జ్యోతిష్యం పిచ్చి. చనిపోతూ

దగ్గరున్న కేశవ్ గడ్డం పట్టుకుని, 'మీనలగ్నంలో పుట్టావు. పదింట కుజుడున్నాడు. నీవు గొప్పవాడివౌతావు...' అని జోస్యం చెప్పాడు.

తండ్రి మరణంతో తిరిగి అక్కడికి చేరిన కేశవ్ మనసులో, 'తాతయ్య తను గొప్పవాడినవుతానని చెప్పాడు. ఏం చేస్తే... ఏ దారిన పోతే మనిషి గొప్పవాడవుతాడు...?' ఆ పసి మనసులో అలా అన్వేషణ ప్రారంభమైంది.

సంతానం లేని మేనత్త కాళింది- కేశవ్, స్వర్ణల చేత బోల్డు ఇంటిపని చేయించేది. ఛాయమ్మ మనోవ్యధతో మంచం పట్టింది. ఎప్పుడు ఆ ఇంటి వాతావరణం నుంచి తప్పించుకుందామా అని ఆలోచించే కేశవ్‌కి చెరువుగట్టున, పొలంగట్టునా ఆటలు అలవాటయ్యాయి.

కేశవ్ మేనమామ శ్రీకంఠం కవి. భూపతిగారి సంస్థానంలో ఆయన ప్రాపున అతని జీవితం బాగుంది. డబ్బుకి లోటు లేదు. అతనే కేశవ్‌ని ఓసారి చెరువుగట్టున చూసి, అతన్ని మంచిమార్గాన పెట్టాలని ప్రయత్నించాడు. ఆ కృషి ముందుకి సాగితే ఎలా ఉండేదో, కానీ శ్రీకంఠం జీవితమే అకస్మాత్తుగా మారిపోయింది.

జమీందారు భూపతిగారి ఆస్థానంలో నర్తకి రాజితం. ఆమెకి జమీందారుకి శారీరకంగా లొంగటం ఇష్టం లేకపోయింది. ధనం ఇచ్చే సుఖం కన్నా, మనసు పొందే హాయి పట్ల మొగ్గు చూపింది. శ్రీకంఠం గీతికలకి, తను నాట్యరూపం కావాలనుకుంది. అతనితో జీవితమే సర్వస్వం అనుకుంది. సమస్త భోగాలను కాదని తనతో రావటానికి సిద్ధపడిన రాజితమే తన కవితా జీవితం అనుకున్నాడు శ్రీకంఠం. అందుకే భూపతిగారి ఆస్థానం వదిలేశాడు. ఇది చాలదన్నట్టు వీరు రాజపురం వస్తుండగా పుంతల్లో ఓ పసిగుడ్డు దొరికింది. తల్లి కాకపోయినా తల్లి మనసుతో ఆ బిడ్డని అక్కున చేర్చుకుంది రాజితం.

చిన్నపల్లెలో వేరు కాపురం. పైగా వేశ్యాకులానికి చెందిన రాజితం మీద పల్లెటూరి ప్రజ అదనపు అసూయ. ఇంట్లో కాళింది బాధ. ఆశ్రయం పోయిన కవిగా ఆర్థిక ఇబ్బందులు. అయినా కొంతకాలం రాజితం, శ్రీకంఠం ధైర్యంగా, చాలా ఇష్టంగా గడపారు. ఆ పరిస్థితుల్లోనే కేశవ్, స్వర్ణ రాజితానికి మాలిమి అయ్యారు.

ఏదోరకంగా గడుస్తోంది, ఫరవాలేదు అనుకున్న సమయంలో స్వర్ణ ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయింది. చెల్లెల్ని రక్షించే ప్రయత్నంలో మనసు చెడి పిచ్చివాడిలా మారిపోయాడు కేశవ్.

అంచెలస్వామి భూపతి సంస్థానంలో పేరు పొందిన వైద్యుడు. రాజితం సలహా మేరకు అతన్ని బతిమాలి పిలుచుకొచ్చాడు శ్రీకంఠం. కేశవ్ జాడ్యం తగ్గడానికి చాలా సమయం పడుతుందని, అదీకాక అదే వాతావరణంలో ఉంటే కేశవ్‌కి తగ్గదని చెప్పి, ఆ పిల్లవాణ్ణి తనతో తీసుకెళ్ళిపోయాడు అంచెలస్వామి.

కేశవ్ ముఖతేజస్సు అంచెలస్వామిని ఆకర్షించింది. అందుకే కూడా తీసుకొచ్చి వైద్యం చేసి, రకరకాల నూతన ప్రయోగాలతో కేశవ్‌ని తీర్చిదిద్దాడు. వైద్యంలో తనంతవాడిని చేశాడు. కేశవ్‌కి యుక్తవయస్సు వచ్చింది. అయినా అంచెలస్వామి అతన్ని మేనమామ ఇంటికి పంపలేదు. కేశవ్‌కే మనసు ఆగక, గురువుకి నచ్చజెప్పి వచ్చాడు. అప్పటికే శ్రీకంఠం పూర్తిగా కృంగిపోయాడు.

అంచెల స్వామి చెప్పినట్టు ఏమాత్రం ఆశ లేని మేనమామకి కేశవ్ చేసిన వైద్యం ఫలించలేదు. అతని దగ్గరికి వచ్చే రోగే లేకుండాపోయాడు. ఇంతకాలం పడిన శ్రమ వృథా అనిపించటమే కాక, డబ్బు ఇబ్బంది. రోజురోజుకి క్షీణిస్తున్న రాజితం.

ఆ సమయంలో అంచెలస్వామి మళ్ళీ వచ్చాడు. భూపతిగారి మనవడికి తీవ్ర అనారోగ్యం. కేశవ్‌తో వైద్యం చేయించి, అతని దశని పూర్తిగా మార్చేస్తానన్నాడు అంచెలస్వామి. కానీ గురుదక్షిణగా ఒక నిబంధన పెట్టాడు.

కేశవ్ సరేనన్నాడు. అంచెలస్వామి కేశవ్‌ని వెంటబెట్టుకు వెళ్ళి తను అన్నట్టుగానే కార్యం సాధించాడు. భూపతిగారి మనవడికి ప్రాణదానం చేసిన వైద్యుడిగా కేశవ్ పేరు మారుమోగింది. పొంగిపోయిన జమీందారుగారు ఏం కావాలో కోరుకో మన్నాడు. కేశవ్ మణులూ మాన్యాలూ కోరలేదు. స్వర్ణ పడి చనిపోయిన రాజపురం చెరువు కావాలన్నాడు. తన చెల్లెల్ని మింగేసిన ఆ చెరువుని నామరూపాలు లేకుండా చెయ్యాలన్నది అతని కసి.

రాజపురం వచ్చిన కేశవ్ జీవితం ఓ వెలుగు వెలిగింది. బారులు తీరిన రోగులు. రెండు చేతులా ఆదాయం. కేశవ్ కసి పట్టుదలలని అదుపు చేసి రాజితం ఆ రాబడితో ఆ చెరువు చుట్టూ ఉన్న పొలాలు కొనేసింది. సంపదకి లోటు లేని పరిస్థితికి చేరాడు.

అప్పుడు వచ్చాడు అంచెలస్వామి. తన గురుదక్షిణ అన్నాడు. అది భయంకర మైన గురుదక్షిణ. కేశవ్ హత్య చెయ్యాలి. అదీ అతను అపురూపంగా భావించే రాజితాన్ని.

జమీందార్‌ని రాజితం కాదన్నందుకు అంచెలస్వామికి సంతోషమే. కానీ ఎంతో ప్రతిభ, సంపద ఉన్న తనని కాదని శ్రీకంఠంతో వెళ్ళిందన్న కక్ష. ఆ కక్షతోటే కేశవ్‌ని చేరదీసి ఇంత గ్రంథం నడిపాడు. మందు పేరు మీద విషం ఇచ్చి రాజితాన్ని చంపమని, అదే తన గురుదక్షిణనని చెప్పాడు. అంతేకాదు, కేశవ్ అలా చెయ్యకపోతే అతని వైద్యం వికటిస్తుందని, గురుద్రోహి అవుతాడని భయపెట్టాడు.

ప్రత్యక్ష నరకం లాంటి క్షోభ ననుభవించి, చివరికి కేశవ్ రాజితం కూతురు పారిజాతం ద్వారా ఆ విషం రాజితంకి పంపించాడు. అంతే, ఆ తెల్లారే రాజితం మరణించింది. కేశవ్ విలవిల్లాడిపోయాడు. తిరిగి పిచ్చివాడిలా అతని పరిస్థితి

తయారయింది. మహాపాపం చేశానన్న బాధ. గురుదక్షిణ చెల్లించక తప్పదు. అందుకే అలా చేశానని సరిపెట్టుకోవాలని ఎంతో తాపత్రయపడ్డాడు.

చివరికి అదొక్కటే దారని, తన పాపానికి ప్రాయశ్చిత్తమని భావించి పారిజాతాన్ని గుళ్ళో పెళ్ళి చేసుకున్నాడు.

కేశవ్ మనఃస్థితి చిత్రవిచిత్రంగా తయారయింది. తప్పని తెలిసే అమాయకు రాలైన పారిజాతాన్ని రకరకాలుగా బాధపెట్టాడు. తన జీవితం వ్యర్థమనిపించింది. చెల్లెలు మరణించిన చెరువులోనే తన జీవితం అంతం చేసుకోవాలనుకున్నాడు. ఆ చెరువును చూడగానే కసి పెరిగింది. ఎంత ఖర్చయినా ఆ చెరువును పూడిపి స్తానని ఊరంతటికీ ఎదురు తిరిగి ఓడిపోయాడు. ఊరు ఊరంతా పిచ్చివాడంది. తండ్రి పిచ్చే వీడికీ అన్నారు.

అంచెలస్వామి చనిపోతూ తన ఆస్థినంతా విల్లు రాసి కేశవ్ దగ్గరకి పంపిం చాడు. అది మరింత పాపభారంగా తోచింది కేశవ్‌కి. ఇలాంటి తీవ్ర సంఘర్షణలో తనకింక ఈ సంసారం వద్దని, ఓ ఉత్తరం పారిజాతం పేర రాసి ఇల్లు వదిలి పారి పోయాడు కేశవ్.

నేను పాపిని. ఈ పాపం తుడిచిపెట్టుకోవడం ఈ సంసారంలో ఉండి సాధ్యం కాదు. ఎందుకు జీవించాలి? జీవించి సాధించాల్సినదేమిటి? అలా సాధించటానికి ఏ దారిలో పోవాలి? ఈ ప్రశ్నలకు జవాబుల కోసం అడవుల్లో తపస్సు చేసుకుంటాను. ఈ జన్మ తపస్సుకి చాలదు. నీ దారి నువ్వు చూసుకోవచ్చు.

అదీ ఆ ఉత్తరం.

కేశవ్ అడవులే కాదు... ఎన్నెన్నో క్షేత్రాలు, గుళ్ళు, గోపురాలు తిరిగాడు. తపస్సు చెయ్యాలని ప్రయత్నించాడు. గురువుల్ని ఆశ్రయించాడు. ఆశ్రమవాసం చేశాడు. సర్వసంగ పరిత్యాగ ప్రయత్నం చేశాడు. ఏదీ అతని మనసుకి నిశ్చలత కూర్చలేదు. ఆరోగ్యం క్షీణించింది. రెండు కళ్ళల్లో పూలు వేశాయి. గుడ్డితనం వచ్చింది. ఇదంతా ప్రాయశ్చిత్తం అనుకున్నా మనశ్శాంతి లభించలేదు. మధ్యమధ్యలో పారిజాతం, గర్భవతి గా ఉన్న పారిజాతాన్ని తను వదిలేసి రావటం గుర్తొచ్చింది. అది అన్నింటి కన్నా పాపం అనిపించింది. మళ్ళీ అటువంటి స్థితిలో కూడా పారిజాతం మీద నీచమైన ఊహలు వచ్చాయి. చెడిపోయి ఉంటుంది. ఎవరికో పిల్లల్ని కనే ఉంటుంది. ఈ ఊహలూ బాధే.

అలా తిరిగి తిరిగి కాకతాళీయంగా శేషయ్య అన్న రైతు ఇంట్లో మూడు రోజులు ఉండాల్సి వచ్చింది. ఇంత దేశాటనం, యోగులు, ఆశ్రమాలు తెలపని సత్యం, కేశవ్‌కి అక్కడ స్ఫురించింది.

పవిత్రంగా ఉన్న పారిజాతం పెంచిన కొడుకు పెద్ద నేత్రవైద్యుడవటం, అతని ద్వారానే కేశవ్‌కి చూపు రావటం జరుగుతుంది. ఆ తల్లీకొడుకులు ఎంతో పొంగిపోతూ కేశవ్‌ని దగ్గర చేసుకుంటారు.

ఈ కథ ఓ కాశీమజిలీ కథలా తోస్తుంది. కానీ కాంతారావుగారు చాలా చాక చక్యంగా ఈ కథని నడిపారు. తాను ప్రతిపాదించదలుచుకున్న జీవన సత్యానికి చక్కటి భూమికగా కథని మలిచారు.

పాత క్లాసిక్స్‌లో ఉండే నాటకీయత ఈ నవలలో ఉంది. నెమ్మదిగా ప్రారంభమై రానురాను చిక్కగా అల్లుకుంటుందీ కథ. ఎన్నో రకాల ఆటుపోట్లు, నాటకీయ పరిణామాలు ఉంటేనే కానీ ఎవరికీ తాత్త్వికతా తపన ఆరంభం కాదు.

కేశవ్‌ని అంతటి తపనలోకి తీసుకెళ్ళటానికి కాంతారావుగారు ఎన్నుకున్న మార్గం ఇది.

160 పేజీల ఈ నవలలో ఇంచుమించు చివరి నలభై పేజీలు పూర్తిగా తాత్త్విక మీమాంస. అదీ ఏదో అర్థంకాని పదాలతో సాగలేదు. చాలా చిన్న చిన్న వాక్యాలతో, ఎవరికేనా తేలిగ్గా తెలిసేలా చాలా లోతైన భావాల్ని కాంతారావుగారు అపురూపంగా కూర్చారు.

సంసారబంధమే తనకి అడ్డు అన్న భ్రమ నుంచి బయటికి వచ్చిన కేశవ్ చాలా ఏళ్ళు శ్రమించాక, నేను మామూలు మనిషిని. నాకు వేదాంతం రాదు. నాలో విజ్ఞానం లేదు. ఈ మనిషి ఆకారంలో పుట్టాను. నా జీవితకాలంలో సాధించవలసినదేమిటి? అలా సాధించటానికి ఇదే దారి అని మీరేదైనా దారి చెప్పగలరా? అంటాడు.

శేషయ్య దగ్గర అతనికి ఓ సమాధానం దొరికింది. 'మనిషిలోని భయానికీ, నిరాశకీ, కష్టాలకీ రక్షణయై సంసారజీవితమే రక్షిస్తుందేమో!'

శేషయ్య తనకి, తనవారికే కాక, తన చుట్టుపక్కలెందరికో అండగా ఉండటం కోసం తాపత్రయపడటం కనిపించింది కేశవ్‌కి. తను వేటిని చూసి అసహ్యించుకున్నాడో వాటన్నిటి కోసం ఈ శేషయ్య తాపత్రయపడుతున్నాడు. అక్కడ ఒక సమన్వయం, ఒక రీతి, ఒక దైవత్వం కనిపించాయి కేశవ్‌కి. శేషయ్య ఎన్నో బాధలు పడ్డాడు. చెట్టు వేసవిలో ఆకులు రాల్చినంత మాత్రాన చచ్చిపోదు కదా! మళ్ళీ చిగిర్చి పచ్చగా అవుతుంది. జీవితమూ అంతే... అదీ జీవితం పట్ల శేషయ్య భావన.

'నేను సంసారిగా సుఖం కోసమే తాపత్రయపడతాను. అదే నా మార్గం. ఆ సుఖంతో నేను మనశ్శాంతి పొందగలుగుతున్నాను...' అని నమ్మే శేషయ్య నుంచి కొత్త కాంతి కేశవ్ అనుభవంలోకి వచ్చింది.

అంతేకాదు కేశవ్ కథ అంతా విన్నాక శేషయ్య, 'మీలో ప్రేమ లేదు... మిమ్మల్ని మీరు ప్రేమించుకోగలిగినప్పుడే ఎదుటివాళ్ళని ప్రేమించగలరనుకుంటాను. ఆ ప్రేమ పరిపాలనే మీకు సుఖాన్నిస్తుంది. మీరు సుఖంగా బ్రతకనిది, సుఖంగా చావలేరు... నాకు పూర్తిగా విశ్వాసం ఉంది. సంసారిగా అదే నా దారి. రాత్రి చుక్కలు మెరుస్తాయని, ఉదయం వెలుగునూ, వర్షం నీటిని తెస్తాయని ఎంత నమ్మకమో, నాకు ఆ దారి మీద అంత నమ్మకం ఉంది. ఈ దారిన నేను ధర్మమార్గం గుండా నడిచినంత కాలం నేను గమ్యం తప్పక చేరుకుంటాను. నేను సుఖంగా ఈ దేహం చాలిస్తాను. నాది అదే దారి.' శేషయ్య అనే ఈ మాటల ద్వారా కాంతారావుగారు సామాన్య మానవ జీవితం విషయంలో ఓ చక్కటి ప్రతిపాదన చేశారు.

సాధారణంగా జీవించే ఎన్నో కోట్లమందికి ఓ కొత్త జీవన తాత్వికతని, ఇంత నిండుగా (పాజిటివ్‌గా) ఇంక ఏ రచన మాత్రం అందివ్వగలుగుతుంది.

తెలుగు నవలాలోకంలో అత్యంత ప్రత్యేకమైన తాత్విక రచన ఇదే దారి.

కీర్తిశేషులు బలివాడ కాంతారావు ధన్యచరితులు.

*జూన్, 2010*



# ఇల్లు కట్టి చూడు

## పురాణం సుబ్రహ్మణ్య శర్మ

శ్రీ.శే. పురాణం సుబ్రహ్మణ్యశర్మగారిని, మరే ఇతర రచయితతో పోల్చలేం. ఆయన రచనా తీరు, వ్యక్తిత్వం ప్రత్యేకమైనవి. హాస్యం, వ్యంగ్యం, ప్రత్యేకమైన మాటతీరుతో పాఠకులకి నవ్వు తెప్పిస్తూనే, లోలోపల గుండెల్ని పిండి చేసే దుఃఖ ప్రవంతిని కళ్ళకు కట్టించగల నేర్పరి. మహోన్నత చార్లీచాప్లిన్ నటనలాంటి ఎంతో అరుదైన రచనానైపుణ్యం ఆయనది.

ఎందరో మహా రచయితల రచనలతో పెరిగి, వేలకొద్దీ యువ రచనలు ప్రచురణకు పరిశీలించి, నవలా రచయితగా, మేలైన పత్రికా సంపాదకుడిగా, ఫీచర్ రైటర్‌గా, కథకుడిగా, విస్తృతమైన అనుభవమున్న వారు పురాణం. అంతేకాదు, పరస్పర విరుద్ధమైనా, తను ఎప్పుడు ఏది నమ్మితే దాన్ని నిర్భయంగా వ్యక్తీకరించిన ధీశాలి. రిక్షా కార్మికుడితోటి, మహా ప్రముఖుడితోటి ఒకే రకం చిరునవ్వుతో సంభాషించిన మంచి ప్రవర్తనాశీలి, చిత్రమైన మధ్యతరగతి ప్రతినిధి.

ముప్ఫై ఆరేళ్ళ క్రితం, ఆంధ్రజ్యోతి వారపత్రికలో ధారావాహికంగా ప్రచురితమై రెండు భాగాలుగా ప్రచురణ పొందింది.

ఇల్లు కట్టి చూడు - పెళ్ళి చేసి చూడు అన్న నానుడి ఆరోజుల్లో ఓ బెదిరింపులా ఉండేది. ఇల్లయినా, పెళ్ళయినా కొన్ని జీవితాల్ని అటో, ఇటో మార్చేసే రోజులవి... ముఖ్యంగా మధ్యతరగతి జీవితాల్లో.

విశ్వనాథం అలాంటి మధ్యతరగతి వ్యక్తి. జనతా బేంక్‌లో గుమాస్తా. మధ్య తరగతి దిగువకి, ఎగువకి మానసికంగా పాకి, దిగజారే కుటుంబజీవి. విశ్వనాథం సంతానంలో పెద్దది వసంత. తరువాత ప్రసాద్. ఆ తర్వాత మరిద్దరు చిన్నవాళ్ళు. మొత్తం నలుగురు పిల్లలతో భార్య రాజ్యలక్ష్మి, ముసలి తల్లి సీతారావమ్మగారితో రెండు గదుల ఇరుకు వాటాలో అద్దెకుంటున్నాడు ఆయన. ఆరోజు ఆఫీసు నుంచి గాలిపోయిన సైకిలుతో ఈసురోమంటూ ఇంటికొచ్చిన విశ్వనాథాన్ని వీధి గుమ్మం దగ్గరే నిలబెట్టి ఇల్లు ఖాళీ చెయ్యాలన్న తాఖీదు ఇచ్చాడు ఇంటి యజమాని వెంకట్రావు.

దిగువ మధ్యతరగతి సంసారాల్లో అద్దె ఇల్లు, ఆడపిల్ల పెళ్ళి తీవ్ర సమస్యలు. ఎప్పుడు ఏ క్షణాన ఏం ముంచుకొస్తుందో తెలియని అనిశ్చితత పెట్టే క్షోభ అంతా ఇంతా కాదు. ఇల్లు కట్టి చూడు నవల ఆరంభం ఇది.

ఇంటాయనతో మాట్లాడుతుండగానే లోపలి నుంచి భార్య పిలిచింది విశ్వనాథాన్ని. ఆవిడో సలహా ఇచ్చింది. ఆ సలహా మేరకు, 'వెంటనే ఇల్లు ఖాళీ చెయ్యటం మా వల్లకాదు... వేరే ఇల్లు అద్దెకు ఇప్పించండి వెళ్ళిపోతాం...' అని ధీమాగా చెపుదామని తిరిగి ఇంటి యజమాని దగ్గరకి వెళ్ళిన విశ్వనాథానికి వేరే తద్దినం ఎదురైంది. అప్పటికే అక్కడికొచ్చి ఉన్న సిద్ధాంతిగారు... ఈ ఇంట్లో ఉండటం వాస్తురీత్యా మంచిది కాదని... అందువల్ల వెంటనే చిన్న జాగా కొని, ఓ పాకేనా వేసుకుంటే... సొంతిల్లు ఏర్పడుతుందని దారి మళ్ళించి వెనక్కి పంపించాడు. విశ్వనాథంగారు తిరిగి తన వాటాలోకి వెళ్ళేటప్పటికి వసంతా, ప్రసాద్ దెబ్బలాడుకుని, కొట్టుకుని నానా బీభత్సం చేశారు. పులి మీద పుట్రలా ఆ రాత్రి గొడవ మీద గొడవలా గడిచింది.

మర్నాడు విశ్వనాథంగారు బేంక్‌కి వెళ్ళేటప్పటికి వాతావరణం వేరేగా ఉంది. స్టాఫ్ అంతా ఎంతో మర్యాద చూపించారు. బేంక్ ఏజెంటు స్వామినాథన్ స్వయంగా విశ్వనాథానికి మంచి వార్త చెప్పారు. సబ్ ఏజెంట్‌గా ప్రమోషన్ వచ్చింది. సెపరేట్ కేబిన్... హోదా... గౌరవం... అధికారం... అయినా విశ్వనాథంకి పెద్దగా 'థ్రిల్' ఏం కలగలేదు. ఆయన ఆశగా ఎదురుచూస్తున్న అవకాశం కాకపోవటంతో కంగారుగా కూడా ఉంది. మొత్తానికి సాయంత్రం వరకూ రకరకాలుగా గడిచిందాయనకి. రోజూలా సైకిల్ మీద కాక రిక్షాలో ఇంటికి వస్తున్న ఆయనకి దారిలోనే హాహాకారాలు స్వాగతం పలికాయి. విశ్వనాథంగారు ఉంటున్న ఇంటితో పాటు, ఆ చుట్టుపక్కల చాలా ఇళ్ళు అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. కట్టుబట్టలతోటి, మంటలకి ముందు దక్కించుకున్న కొద్దిపాటి వస్తువుల తోటి ఆయన కుటుంబం బైటపడింది. పూర్తిగా వీధి పాలైంది ఆ సంసారం.

ఆ ప్రాంతానికి కనకదుర్గమ్మలాంటి సిటీబస్ గైరమ్మ ధైర్యం చెప్పి ఆదుకోకపోతే అక్కడి పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. పాలమ్మి టీ కొట్టు పెట్టి, పైసాపైసా కూడబెట్టి ఓ సిటీబస్ ఓనరైంది గైరమ్మ. ఆర్థికంగా పైకి ఎదిగినా తన గతాన్ని, తను పెరిగిన చోటుని, చుట్టూ జనాన్ని మరిచిపోని మంచి మనిషి గైరమ్మ.

నెమ్మది మీద ఓ చిన్న జాగా కొని పాకేసుకుని, ఆ తర్వాత ఆ పాకనే చిన్న ఇల్లుగా మార్చుకోవటమే సరైన యోచనని విశ్వనాథం కుటుంబానికి ధైర్యాన్నిచ్చింది.

అంతకు కొద్దిరోజుల ముందు రైతు పోలయ్య తెచ్చిచ్చిన ఆరువేలు రొఖ్ఖం, వెండి కంచం, మరచెంబు లాంటి కొద్దిపాటి వస్తువులు ఉన్న వాళ్ళ పెట్టిని ఆ రాత్రి దొంగలు దోచుకెళ్ళారు. దాంతో మళ్ళీ దిగులు కమ్ముకుంది. ఎన్నో తర్జనభర్జనల తర్వాత, విశ్వనాథం, భార్య రాజ్యలక్ష్మి- సీతారావమ్మగారు, వసంత, పిల్లలతో కలిసి కొద్దికాలం తమ స్వగ్రామం వెళ్ళి, అక్కడ పాడుపడిన తమ ఇంటిని బాగు చేసుకుని ఉండటానికి నిర్ణయం జరిగింది. ఆ ఊరు కైకలూరుకు దగ్గర్లో ఉన్న పల్లె.

వీళ్ళని దగ్గరుండి తన రెండెడ్ల బండిలో ఇల్లు చేర్చాడు కృష్ణమూర్తి. ఇల్లు బాగు పడేదాకా వాళ్ళింట్లోనే ఆశ్రయం. పాడైపోయిన ఇల్లు చూశారు. అది ఇంటిల్లిపాది ఎంత గానో కష్టపడితేనే కానీ తిరిగి నివసించటానికి పనికిరాని దుస్థితిలో ఉంది. దిగులుపడిన ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి అందర్నీ ఆ పనిలోకి దించి, వారికన్నా ఎక్కువ కష్టం చేస్తున్నాడు కృష్ణమూర్తి. కృష్ణమూర్తి, వసంత దాగుడుమూతలు ఆడినట్టు పోట్లాటలు, కలిసిపోవటం, పంతాలు, వెక్కిరింతలు. ఇల్లు కొద్దికొద్దిగా నివాసయోగ్యంగా ఆకారం మార్చుకుంటోంది.

అక్కడ విశ్వనాథం కొత్త హోదాలో బేంక్ కార్యనిర్వహణా సంరక్షణలో పడ్డాడు. ఆయన్ని ఏజెంట్ స్వామినాథన్‌తో పాటు చిన్నాపెద్దా మొత్తం స్టాఫ్ అంతా ఎంతో బాగా చూస్తున్నారు. ఒక్క సురేష్‌బాబుకి మాత్రం విశ్వనాథం అంటే మంట, పగ, కోపం. ఆయన లేకపోతే ఆ ప్రమోషన్ తనకే వచ్చేదన్న అక్కసే కాక, జాతివైరం లాంటి విభేదం. విశ్వనాథం ముమ్మూర్తులా గాంధీలాంటివాడు. ఆ బుద్ధులన్నింటికీ వ్యతిరేకం సురేష్ బాబు. విశ్వనాథం ఈ రకంగా ఉద్యోగం, ఆయన కొడుకు ప్రసాద్ ఇళ్ళు కాలిపోయిన వారికి సేవ చేస్తుండగా ఇల్లు కట్టి చూడు నవల మొదటి భాగం పూర్తవుతుంది.

ఈ నవల రెండో భాగంలో మరెంతో డ్రామా నడిచింది. విశ్వనాథం మీద అక్కసుతో సురేష్‌బాబు ఆయన్ని బేంక్ కేసులో ఇరికించాడు. వెంటనే డబ్బు కడితే కేస్ లేకుండా చెయ్యగలనన్న ఏజెంట్ మాటతో ఊళ్ళో ఉన్న ఇల్లు, పొలం అమ్ముదా మనుకున్న విశ్వనాథం ప్రయత్నం బెడిసికొట్టింది. అదే ఊళ్ళో ఉన్న భార్యాపిల్లల్ని చూడకుండా రాత్రికి రాత్రే తిరిగి వచ్చేసిన విశ్వనాథం మీద కేసు, పోలీసులు అరెస్టు చేయడం జరిగింది.

ఇళ్ళు కాలిపోయిన వారి భోజనవసతుల కోసం గైరమ్మ వాళ్ళు వేయించిన పందిళ్ళ పక్కనే ఉన్న టొబాకో శ్రీహరిగారి మూడో పెళ్ళాం హేమ దగ్గర ఉద్యోగంలో చేరిన ప్రసాద్, ఆమెతో వ్యవహారంలో పడి ఆ ఊరు వదిలి, ఆమెతో లేచిపోయాడు. టొబాకో శ్రీహరిగారు పిచ్చి కోపంతో చిందులు తొక్కి, కేసు పోలీసులకు అప్పజెప్పారు.

ఇంక పల్లె వాతావరణంలో, పరిహాసాల జోరులో కృష్ణమూర్తి, వసంత నాటకీ యంగా ప్రేమలో పడ్డారు. ఆ విషయం తల్లితో చెప్పి, వసంతని పెళ్ళి చేసుకుంటా

నంటే, కృష్ణమూర్తిని చెడామడా వాయించింది ఆవిడ. ఇంట్లో సీతారావమ్మగారితో వసంత చెపితే ఆవిడ విపరీతమైన కోపంతో చెంప పగలగొట్టింది. ఏదో ఇల్లు బాగు చేసుకుని కాలక్షేపం చేస్తున్నారనుకున్న ఈ కుటుంబం తిరిగి విజయవాడకి బయలు దేరారు. వాళ్ళ వెనకే కృష్ణమూర్తి వెళ్ళాడు. విషయమేమిటంటే కృష్ణమూర్తి వసంతకి బాబాయి అవుతాడు.

విశ్వనాథం, ప్రసాద్ పోలీసుల పాలపడ్డారు. ఇదంతా అన్యాయం అని తెలిసిన గైరమ్మ నడుం బిగించింది. ప్రసాద్ గురువుగారు డబులెమ్మేగారు ఆమెతో చెయ్యి కలిపారు. ముల్లుని ముల్లుతో తీసినట్టు నాటకాలన్నింటినీ నాటకీయంగా విడగొట్టారు. తిరిగి విశ్వనాథంగారి కుటుంబం ఒక్కటై విజయవాడలోనే స్థిరపడింది. ఎటొచ్చీ విశ్వ నాథం సొంత ఇల్లు అన్న పాయింట్‌తో ఆరంభమైన ఈ నవల ఎలా ముగిసిందన్నదే గొప్ప చాతుర్యం.

వారపత్రికలో ఏ వారానికి ఆ వారం పట్టు పోకుండా జనం చదువుకోవటానికి ప్రధానంగా ఉద్దేశించిన హాస్యరస నవల ఇల్లు కట్టి చూడు. కానీ ఆ పరిధిని అంత వరకే ఉంచలేదు పురాణం. ఇల్లు కట్టి చూడుని ఓ మధ్యతరగతి ప్రతిబింబంలా, నవ రసాలు నిండిన ఆర్ద్రమైన రంగుల చిత్రంలా నిర్మించారు. అడుగడుగునా మధ్యతరగతి సంసారాల వాస్తవికత, తాత్వికత అరటిపండు వొలిచి అందిచ్చినట్టు అందుతుంది. ఎంతో రియలిస్టిక్‌గా సాగుతున్న నవలలో ఇలాంటి గాఢమైన నాటకీయ మేళవింపు అపురూపంగా అలరిస్తుంది.

ఎన్నో సంఘటనలు, పాత్రలు, సంభాషణలు పదేపదే స్మరించుకుని ఆనందించే స్థాయిలో ఉన్నాయి.

బెజవాడలోని ఒక వీధిలో, ఒక మధ్యతరగతి ఇంటిలో విశ్వనాథం గురించి చాలామంది రాస్తారు. కానీ మొత్తం ఆ వీధిలో మధ్యతరగతికి సంబంధించిన అన్ని అంశాలని, ఆ పరిధిలోకి అలా వచ్చి వెళ్ళే పాత్రలని, ఆ నేపథ్యంలో విజయవాడ వివరా లని, దేశ రాజకీయాలని ఇలా మేళవించగలగటం పురాణంగారి ప్రత్యేక ప్రతిభ.

నవలకి పెద్దగా అవసరం లేకపోయినా, గైరమ్మ, సీతమ్మ, టొబాకో శ్రీహరి, సురేష్‌బాబు భార్య మాచెమ్మ, డబులెమ్మే ఇలా ఎన్నో పాత్రలు సజీవ చిత్రాలు. చాలామంది రచయితల దృష్టికి అందని జీవితాలు.

అన్నింటా ఉచ్చులు పోసి అల్లరి చేసే విశ్వనాథం చిన్నాడి ఉదంతం దగ్గర నుంచి, మాచెమ్మ ప్రత్యేక జీవన పద్ధతి వరకూ ఎన్నోచోట్ల కడుపు పగిలాలే నవ్వు వచ్చినా, ఇల్లు కట్టి చూడు కేవలం హాస్య నవలే కాదు. గొప్పగొప్ప విషయల్నేం చర్చించక పోయినా, జీవితం తాలూకు రంగు, రుచి, వాసనని నిండుగా అందించిన మంచి నవల.

*జులై, 2010*



# సంసార వృక్షం

## ఆర్.ఎస్. సుదర్శనం

వివిధ రకాల తాత్త్విక శాఖలకి ప్రతినిధుల్లాంటి, కొన్ని పాత్రల ద్వారా, తాత్త్విక అధ్యయనానికి, చర్చకి, లోతైన అవగాహనకి, వెరసి సత్య నిరూపణకి కీ.శే. శ్రీ ఆర్.ఎస్. సుదర్శనంగారు సంకల్పించిన ప్రత్యేక రచన సంసార వృక్షం నవల. తాత్త్విక ప్రాతిపదిక కలిగిన ఆధునిక తెలుగు నవలలు చాలా తక్కువ. అటువంటి వాటిలో ప్రత్యేకంగా చెప్పుకోదగిన నవల సంసార వృక్షం. పాత్రల తత్వం ద్వారా కథని అర్థం చేసుకోవాల్సిన రచన ఇది. ఇదో ప్రత్యేక రచనా పద్ధతి.

'నేను' అన్న పాత్ర- 'నేను హేతువాదినీ, అంతకంటే అద్వైతినీ. హేతువాదంతో పూర్వ సంస్కారాలను ఛేదించి సమదర్శిత్వం అలవర్చుకోవడమే నా సాధన. అలా తర్కించి చూస్తే నాకు బాధ అనే 'భ్రమ' కలిగిందంటే, నాలో నిర్లిప్తత పరిపక్వం చెందకపోవటమే అందుకు కారణం అనుకోవాలి.

నిర్లిప్తతని పెంచుకునే నిరంతర ప్రయత్నంలో నేను కార్యవాదిని కాకపోవటం ఒక విధంగా నిజమే.

'నేను' భార్య సావిత్రి భర్త గురించి-

'చంపటమూ రాదు, బ్రతికించటమూ రాదు. వట్టి వేదాంతం కబుర్లు చెప్ప మంటే చెపుతారు. కబుర్లు చెపుతూ కూర్చుంటే మీకు సాగుతోంది. వెనక ఆస్తి పాస్తులున్నాయి. ఇంటి దగ్గర పండింది పంపే పెద్దవాళ్ళున్నారు.'

అటువంటి సావిత్రికి భర్త అంటే ఎంతో అభిమానం. చాలా క్లిష్టమైన సమస్యని ఆవిడ ఆకళింపు చేసుకున్న పద్ధతి చూడాలి. హేమసుందరి సావిత్రికి, అతనికీ కూడా బాగా తెలిసిన వ్యక్తి.

అతనితో పేచీ పడ్డాక కర్నూలు వెళ్ళిపోయిన హేమ చాలారోజులకి తిరిగి వస్తుంది. వచ్చినా ఇదివరకటిలా వీళ్ళింటికి రావటంలేదు. అతనితో అసలు మాటాడటం లేదు. ఈ విషయం గమనించిన సావిత్రి-

'హేమ నాతో బాగానే ఉండాలని ప్రయత్నం చేస్తోంది. మీ ప్రసక్తి వచ్చేటప్పటికి కవళికలు మారుతున్నాయి. మీతో ఏమైనా పేచీ వచ్చిందా అని గట్టిగా అడిగాను. రేపు చెపుతానంది. మీరు చెప్పండి,' అని భర్తనే అడిగింది.

అతనికి చెప్పక తప్పింది కాదు. 'హేమతోడి స్నేహం మా ఇరువురిలోనూ ప్రణయానికి దారితీసింది. మేలుకుని నేనే ఒక స్టేజిలో ఫుల్‌స్టాప్ పెట్టేశాను' అని చెప్పాడు.

సావిత్రి హేమనీ అడిగింది. 'అక్కయ్యా, పేచీ ఏమీలేదు. నన్ను క్షమించు, నీకు ద్రోహం చెయ్యాలనే ఉద్దేశం ఎప్పుడూ లేదు. మీ ఆయనతో స్నేహం పెంచుకోవటం దాని పరిణామం తెలీక చేసిన పొరపాటు. అందుకే ఆ పొరపాటు మళ్ళీ చెయ్యను,' అంది హేమ. వీళ్ళిద్దరికీ ఉన్న శారీరక సంబంధం సావిత్రికి అర్థమైంది.

ఇంత తెలిసీ సావిత్రి, 'ఏమండీ, నాకు పిల్లలు లేరు కదా, మీరా అమ్మాయిని చేసుకోండి!' అంది.

ఇటువంటి భార్యాభర్తల మధ్య ఎటువంటి పరిణామాలయినా దూరాన్ని సృష్టించగలవా?

సుదర్శనంగారు చాలా చాకచక్యంగా కథ నడిపారు. ప్రతి పాత్రకి ప్రయోజనం తాత్త్విక దృక్కోణంగా మలిచారు.

సావిత్రి వాళ్ళింటి దగ్గరే భావనారాయణ కుటుంబం. భావనారాయణ చెల్లెలు హేమసుందరి. వీళ్ళ పరిసరాల్లోనే మరో కుటుంబం, డాక్టరు వీరభద్రం, అతని తల్లి. ప్రధానంగా కథంతా ఈ కుటుంబాల మధ్యే నడుస్తుంది.

తన భర్తకి, హేమసుందరికి సంబంధం ఉందని తెలిసినా సావిత్రి ఉద్వేగ పడలేదు. కానీ, కర్నూలు నుంచి తిరిగి వచ్చిన హేమకి పెళ్ళి సంబంధాలు వెతుకుతున్నారని విన్న సావిత్రి భర్త బాధపడకుండా ఉండలేకపోయాడు. ఎంత హేతువాదైనా, హేమ పట్ల ఏ బాధ్యతా వద్దు, కానీ ఆమె తనదే అన్న తృప్తి కావాలి. అదీ బాధ. అతని బాధ మరింత పెరిగే పరిస్థితులు తోసుకు వచ్చాయి.

హేమని డాక్టరు వీరభద్రరావుకిచ్చి పెళ్ళి చెయ్యటానికి నిశ్చయం జరిగింది. వీరభద్రం విచిత్ర వ్యక్తి. విపరీత ధోరణి. సావిత్రి భర్తకి అది మరింత ఇరకాటం అయింది. డాక్టర్ని నక్సలైట్ అని, అభినవ మార్క్సిస్ట్ అని, స్వేచ్ఛా ప్రేమవాదని... ఇలా రకరకాలుగా అనుకున్నాడు అతను. అవన్నీ అయి, ఏదీ కాని వ్యక్తిలా తోస్తున్నాడు డాక్టరు సావిత్రి భర్తకి. దీనికి డాక్టరు అభిప్రాయాలు, వాదనలే సాక్ష్యం.

'రొమాంటిక్ ప్రేమ ఒక జబ్బు. ప్రేమకి, వివాహానికి సంబంధం లేదు. సెక్స్‌లో పెర్వర్షన్ దేవదాసుల్ని, మజ్నూల్ని సృష్టిస్తుంది. వివాహంలో స్త్రీ, పురుషులిద్దరికీ స్వేచ్ఛ ఉండాలి.' ఇదీ డాక్టరు అభిప్రాయం. సాంఘికపరమైన అతని ఉద్దేశాలు, వ్యక్తిగత ప్రవర్తన సావిత్రి భర్తకి మరింత గందరగోళంగా ఉంది. ఈనాటి మనిషికి హింసా పరమైన అనుభూతి తప్పదన్నది అతని సమర్థన. ఇటువంటి వ్యక్తితో హేమ జీవితం ఏమవుతుందో?

సావిత్రికి దగ్గుగా ఆరంభమైన అనారోగ్యం ఇస్నోఫీలియాకి సంబంధించిందని నిర్ధారించి ఇంజక్షన్స్ చేయటం ఆరంభించాడు డాక్టరు. మొదట్లో అతని ధోరణి నచ్చని సావిత్రి, క్రమేపీ డాక్టరు పట్ల ఆకర్షితురాలవటం, అతని ధైర్యసాహసాల్ని మెచ్చుకోవటం, అతనితో చాలా చనువుగా మెలుగుతూ, ఎంతో ఆప్యాయత ప్రదర్శించటం సావిత్రి భర్తకి నానా హింసగా మారింది. అంతవరకూ హేమ డాక్టర్ల పెళ్ళిని ఇచ్ఛగించని అతని మనసు డాక్టరు ఎంత తొందరగా హేమని పెళ్ళి చేసుకుంటే అంత బావుణ్ణు అన్న స్థితికి చేరింది. సావిత్రి పట్ల విసుగునీ, నిర్లక్ష్యాన్నీ వ్యక్తం చేసిన మనస్సే ప్రస్తుతం సావిత్రిని పదిలపరుచుకోవాలని తహతహలాడు తోంది.

డాక్టరు తల్లి మరణంతో హేమ, డాక్టర్ల పెళ్ళి సందిగ్ధంలో పడింది. తల్లి మరణం తర్వాత ఒంటరివాడైన డాక్టరు ఆలనాపాలనా చూట్టానికి, ఓదార్పుగా నిలబడుతూ నిర్భయంగా ప్రవర్తించటం ప్రారంభించింది సావిత్రి.

డాక్టరు 'సావిత్రిగారూ!' అనే తప్ప అక్కయ్య అనో, వదిన అనో ఏ వరుసతోటి పిలవడు. అంతేకాక తనని సావిత్రి డాక్టర్ అనే పిలవాలనీ చెప్పాడు. విషయం చిన్నదే అయినా, ఇదీ సావిత్రి భర్త మనసులో ముల్లే అయింది. అతన్ని ఆ ముల్లు లాంటి

బాధ నుంచి అతని నిర్లిప్తతగానీ, తాత్వికతగానీ రక్షించలేకపోయాయి. సావిత్రికి డాక్టరుకి మధ్య ఏమయినా ఉందా? లేదా? అన్న మీమాంస.

సావిత్రి భర్తకి ఇద్దరు అన్నగార్లు. పెద్దన్నగారికి గుండెనొప్పి రావటంతో కొన్ని విషయాలు పరిష్కారం చేసుకోవటానికి ఇతన్ని పిలిచారు. సావిత్రికి, అతనికి పిల్లలు లేరు కాబట్టి, పెద్దన్నగారి రెండో కొడుకుని దత్తత తీసుకోవటం అన్నది దానిలో ప్రధానాంశం. ఆ విషయం అతనికి అంతగా ఇష్టం లేదు. అలా అని అన్నగార్నీ కాదనలేడు. ఈ సంఘర్షణలో, పిల్లల విషయంలో ఎప్పుడూ సావిత్రికే పరీక్షలు జరిగాయి... అతనెందుకు ఓసారి పరీక్ష చేయించుకోకూడదన్న ఆలోచనొచ్చింది. డాక్టరు వీరభద్రం పరీక్ష చేసి అతనికి సంతాన సామర్థ్యం లేదని తేల్చాడు.

ఇది జరిగినప్పుడే, సావిత్రి గర్భవతైందని వైద్యనిర్ధారణ జరిగింది. అంతే అతని మానసిక ప్రపంచం పూర్తిగా అల్లకల్లోలమయింది. ఆ గర్భానికి కారణం వీరభద్రం అనే అతని విశ్వాసం.

'పతివ్రతా ధర్మం అలా ఉండనీ, సావిత్రికి నన్ను గూర్చిన బాధ్యత, ఆలోచన, నా పట్ల విశ్వాసం కించిన్మాత్రం ఉన్నా ఇలా జరిగేనా? ఇకనుంచీ ఆమె పట్ల బాధ్యత నాకూ ఏమీలేదు. ఇలా ఊరికే ఆ నాలుగ్గోడల మధ్య దుర్భరంగా జీవించడం నా చేత కాదు. ఇంకో ప్రాణి అవతరించిన తర్వాత పరిస్థితి మరీ క్లిష్టమైపోతుంది.

పోనీ ఆమె చేసిన తప్పును క్షమించి, ఆ పుట్టబోయే బిడ్డను మానవత్వపు దృష్టితో చూసే ఔన్నత్యం నాలో లేదా? లేదు, నిజంగానే నాలో ఇప్పుడు లేదు. ఆ స్థాయికి నేను ఎదగగలిగితే అది వేరేమాట! అప్పుడు సమస్య పరిష్కారమౌ తుందేమోగానీ, అది సాధ్యమా? ఆ స్థాయికి చేరుకున్నప్పుడే నేను ఇంటికి తిరిగి రావాలి.

అదే నా గమ్యం. నాకెవరూ లేరు. నేనెవరికీ లేను. ఏవి ఎలా పోయినా నా బాధకి నిష్కృతి కావాలి.'

ఆ రకంగా అతను ఒక్కడూ హైద్రాబాద్ చేరాడు. అలా అతని ఒంటరి ప్రయాణం రకరకాల మజిలీలు గడిచింది. హైద్రాబాద్, పూనా, కలకత్తా, తూర్పు బెంగాల్ సరిహద్దుల్లోని కాందిశీకుల శిబిరాలు- ఇలా అనేకచోట్ల అనేక అనుభవాలు. జిడ్డు కృష్ణమూర్తి, రమణమహర్షి తత్త్వ వివేచన, పూనాలో ఆచార్య రజనీష్ లాంటి బాబా ఆశ్రమనివాసంలో స్వేచ్ఛా శృంగార, భావవిముక్త వాతావరణం, కలకత్తాలో అమీయాబాబా శిష్యరికంలో అలౌకిక అనుభూతి, మంత్రపఠన మహిమానుభవం, నిశ్చల మనోస్థితి- ఇలా అతని జీవితం ఓ ప్రవాహంలా గడిచింది.

ఇన్ని అనుభవాల్లోనూ అతన్ని మానవత్వచ్ఛాయ, మమతానురాగాలు వదల్లేదు. కాందిశీకుల శిబిరంలోని బాధలు అతన్ని కరిగించాయి.

లోకంలో ఉన్న దుఃఖాన్నీ, జీవితం యొక్క అయోమయత్వాన్నీ చూసిన తర్వాత అతని సమస్య చాలా చిన్నదిగానే అనిపించింది. జీవితంలో దుఃఖమే తప్పనిసరి అయితే, దాన్ని అంగీకరించటమే మంచిది. తిరిగి వెళ్ళి స్వస్థానంలో కర్తవ్యం నిర్వ హించటమే మంచిది. దుఃఖాన్ని జయించే మార్గం లేనప్పుడు, పారిపోయి ఎక్కడో బతకటం కంటే స్వస్థానమే చేరుకోవటం మంచిదనిపించింది అతనికి.

బాబాగారు ఇంటికి వెళ్ళమని ఆదేశించారు. అతని బాధ ఆయనకి అవగతమై నట్టు, 'పొరపాటు నీ భార్యలో ఉందో, నీలో ఉందో, సైన్సులో ఉందో, సైన్సు చేసే ప్రయోగంలో ఉందో ఒకసారయినా ఆలోచించావా? ఆమె తప్పు చేసిందని ఏమిటి నీ నమ్మకం?' అన్నారు.

ఆ మాటలతో అతను మళ్ళీ వీర్యపరీక్ష చేయించు కున్నాడు.

'మీ వీర్యంలో బీజకణాలు సజీవంగా, చైతన్యవంతంగా ఉన్నాయి,' అని కలకత్తాలో పరీక్షించిన డాక్టరు నిర్ధారించాడు.

'ఇదంతా భగవంతుడి లీల,' అనుకుంటూ ఇల్లు చేరాడు. సావిత్రి, వారి పాపాయి, అతను ప్రశాంతంగా కలుసు కున్నారు.

అన్ని ఆదర్శాలు చెప్పే వీరభద్రరావు కట్నం డబ్బులు ఖచ్చితంగా వసూలు చేసుకున్నాడు. అంతేకాక, రచయితగా అవతారం ఎత్తే ప్రయత్నంలో ఉన్నాడు. 'అనుభూతి లోకాలు' అన్న సిద్ధాంత గ్రంథరచనకి పూనుకున్నాడు. సెక్స్ నుంచి శాడిజమ్ వరకూ హింసకూ సుఖానికి గల సంబంధాన్ని వివరించి- వ్యక్తి భూమిక నుంచి విప్లవమూ, నవ సమాజ వ్యవస్థ ఎలా ఏర్పడాలో సూచించే రచన.

ఇన్ని అనుభవాల తర్వాత, చింతనల తర్వాత అతనికి వీరభద్రరావు ఎవరో కాదు. నాలోని వాడే అనిపించింది.

'వీరభద్రరావు వచ్చి వెళ్ళిపోయాడు, నేను మిగిలాను' అనుకున్నాడు.

పరస్పర విరుద్ధ తత్వాల, భావాల కూర్పు జీవితం. స్వార్థ చింతనతో కాక, సత్య నిరూపణకి నిజాయితీతో ప్రయత్నిస్తే సంఘర్షణ తప్పదు.

'అనవసరమైన ఆలోచనలు, మనిషిలోని చైతన్యాన్ని హరించి, ఉన్న బరువుని పదింతలు చేసి క్రుంగదీస్తాయి. తర్కించి ప్రతి అనుభవానికి సిద్ధాంతాలు తయారు చేసే వాళ్ళు చాలామందే ఉంటారు. నిజానికి జీవితంలో ఇన్ని సిద్ధాంతాలు అనవసరం. అనవసర సిద్ధాంతీకరణ ఆగిపోతే స్పందన (ఫీలింగ్), ఇంద్రియ సంవేదన (సెన్సేషన్)

చైతన్యాన్ని పునరుజ్జీవితం చేస్తాయి. లోకంలో కొత్త వెలుగు కనిపిస్తుంది. అప్పుడు మామూలు క్షణాలే ఆనందదాయకంగా ఉంటాయి. చిన్నపిల్లలకిది సహజానుభూతి' అన్నది శ్రీ ఆర్.ఎస్. సుదర్శనంగారి భావసారం.

'చిన్నపిల్లలకిది సహజానుభూతి' అన్న ఆ వాక్యంలో ఎన్నో సిద్ధాంతాల, తాత్త్వికతల మానవ జీవనసారం ఉంది. ఆ సారాన్ని గ్రహించటానికి, నవీనమైన తాత్త్వికానుభూతిని పొందటానికి సంసార వృక్షం గొప్ప ఆలంబన.

*ఆగస్ట్, 2008*




# చీకటోళ్లు

## అర్నాద్

**చీ**కటోళ్లు అన్న పేరు, స్వాతి నవలల పోటీలో బహుమతి రావటం, ఆరోజుల్లో చాలామందిని ప్రత్యేకంగా ఆకర్షించిన అంశాలు. ముప్ఫై ఏళ్ళ క్రితం నవల చీకటోళ్ళు. అర్నాద్‌గా ప్రసిద్ధులైన డి. హరనాథరెడ్డి తొలి నవల. తొలి నవలకే బహుమతి, గుర్తింపు రావటమే కాక... చీకటోళ్ళు అర్నాద్ అన్న పేరు స్థిరపడటం విశేషం.

డెబ్భైయ్యో దశకంలో చాలామంది యువ రచయితలు పేదల జీవితాల మీద రచనలు చేశారు. మురికివాడల్లో రకరకాలుగా మగ్గిపోయే ఎన్నో జీవితాల్ని తమ రచనల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు. 'ఇలాంటి జీవితాలు ఉంటాయా? జీవితం ఇంత అథమంగా, నరకంలా ఉంటుందా?' అని ఎందరో పాఠకులు కలవర పడే బలమైన రచనలు వచ్చాయి. వస్తుపరంగా చీకటోళ్ళు ఆ కోవకి చెందిందే అయినా, రచనా విధానపరంగా ఎంతో వైవిధ్యం ఉన్న నవల.

అన్ని మురికివాడలు, పరిసరాలు, ఒకలాగే ఉంటాయి. కానీ వాటిలో నివసించే జనం అనుభవించే నరకాలు మాత్రం చాలా రకాలుగా ఉంటాయి. చీకటోళ్ళు నవల అప్పన్న జీవితంతో ఆరంభమైంది.

అప్పన్న పుట్టి పెరిగింది మురికివాడలో కాదు. పల్లెలో రైతుబిడ్డగా పుట్టాడు. నాలుగెకరాల పొలం వ్యవసాయం చేశాడు. కానీ చాలామంది రైతుల్లాగే అతనూ వ్యవసాయం మీద బతకలేకపోయాడు. అప్పుల పాలై పొలం పోగొట్టుకున్నాడు. బతుకు తెరువు కోసం, ముసలితల్లి, పెళ్ళాం బిడ్డలతో నగరానికి వచ్చాడు. కూలిపనులు చేశాడు. రాళ్ళు మోశాడు.

ఒరోజు పని దొరికితే మరోరోజు లేదు. ఆకలి బాధలు, ఇబ్బందులు. సరైన తిండి, పోషణ లేక అప్పన్న ఇద్దరి కొడుకులు ఒకరి తర్వాత ఒకరు చచ్చిపోయారు. మిగిలింది ఆడపిల్ల మంగ. ఆ తర్వాత ఆదెమ్మ పుట్టింది. ఆదెమ్మ పుట్టాక అప్పన్నకి చేతి నిండా పని దొరికింది. క్వారీలో పని. ఆ తర్వాత కొన్నాళ్ళకి ఓ పెద్ద కంపెనీలో కేజువల్ లేబర్ ఉద్యోగంతో పాటు, ఉండేందుకు ఆ మురికి వాడలో ఓ గుడిసె దొరికింది. అందుకే ఆదెమ్మంటే ఎంతో ప్రేమ అప్పన్నకి.

ఆ మురికివాడ పాకలోనే ఎర్రమ్మ, ఆ తర్వాతి పిల్లలూ పుట్టారు. గుడిసె అప్పన్నదే కానీ, గుడిసె స్థలం వరహాల్రాజుది. అందుకే ప్రతి నెలా అద్దె కట్టాలి. అక్కడే కాదు, చాలా మురికివాడలు ఇంతే.

ఆ మురికివాడలో వాడే ముత్యాలు. కానిస్టేబుల్. అన్నీ పెడబుద్ధులే. అతనికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు అసిరయ్య, రెండోవాడు అప్పలకొండ. ముత్యాలు భార్య చనిపోయాక అప్పగారు పాపమ్మ తమ్ముడి దగ్గరే మకాం పెట్టింది. మకాం పెట్టటమే కాక ముత్యాలు ఇంటి ముందు గదిలో చిల్లరకొట్టు పెట్టింది. ఆమెకి ఒక్కతే కూతురు గైరమ్మ. ముత్యాలు పోలీసు పవరు, పాపమ్మ పాపిష్టి బుద్ధుల వల్ల డబ్బుకేం లోటు లేకుండా గడుస్తోంది.

అసిరయ్య చాలా ఏళ్ళ క్రితం ఇంట్లోంచి పారిపోయి మిలటరీలో చేరి ఇన్నాళ్ళకి ఇంటికి వచ్చాడు. అలా రెండు నెలలు సెలవు పెట్టటంలో చాలా సరదాలు ఉన్నా, అతని ముఖ్య కార్యక్రమం పెళ్ళి చేసుకోవటం. అలాంటివాడు ఆదెమ్మని టీ కొట్టు దగ్గర చూశాడు. అంతే ఆమె అందానికి గింగిర్లు తిరిగిపోయి, తండ్రిని పెళ్ళి సంబంధం మాట్లాడమని పరుగులు తీయించాడు.

ముత్యాలు అప్పన్న దగ్గరకొచ్చి, కట్నకానుకలు వద్దు, రెండు వేపులా ఖర్చు మాదే, పిల్లనియ్యి అన్నాడు. అప్పన్నకి తెలుసు అది ఆదెమ్మకి సరైన సంబంధం కాదని. ఆదెమ్మకీ తెలుసు ఆ సంబంధం అంత సుఖమైంది కాదని. కానీ తండ్రి ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకున్న ఆడపిల్లగా చేసుకుంటానంది. అసిరయ్య ఆదెమ్మల పెళ్ళి జరిగిపోయింది.

అప్పన్న పనిచేస్తున్న కంపెనీలో కేజువల్ లేబర్‌ని పర్మనెంటు చెయ్యమన్న పోరాటం మొదలైంది. దానికి ముందు నిలిచి బాధ్యత వహించినవాడు అప్పన్న. సమ్మె చేస్తున్న లేబర్ నుంచి అప్పన్నని విడదియ్యాలని యజమాన్యం అప్పన్నకి పర్మనెంట్ ఉద్యోగం, అయిదువేలు డబ్బు ఆశ చూపాయి. అప్పన్న లొంగలేదు. ఆ తర్వాత పోలీసులు రంగంలోకి దిగారు. గొడవలయ్యాయి. అన్నింటికీ కక్కుర్తిపడే ముత్యాలు కూడా తనకి డబ్బు వస్తుందని అప్పన్న దగ్గరకి రాయబారం వచ్చాడు. అయినా అప్పన్న లొంగలేదు. ఆ గొడవల్లో జరిగిన ఫైరింగ్‌లో అప్పన్న చచ్చిపోయాడు.

అత్తింటిలో ఉన్న ఆదెమ్మ తన కుటుంబాన్ని ఆదుకోలేకపోగా, పాపమ్మ పెత్తనం వల్ల, దొంగతనాలు అంటగట్టడం వల్ల తనింటికి వెళ్ళే దారి కూడా లేక బాధపడింది. ఆదెమ్మ తర్వాత పిల్ల ఎర్రమ్మ కారేజీలు మోసే పనిలో కుదిరింది. అప్పన్నకి దగ్గరగా ఉండే అతని సహోద్యోగి నాగరాజు వాళ్ళ యూనియన్ సెక్రటరీ ఎర్రమ్మకి ఆ పని ఇప్పించటమే కాక ఆ కుటుంబం మంచీచెడూ చూస్తున్నాడు. ఆ విషయం తెలిసిన ఆదెమ్మకి కొంత ఆరాటం తగ్గింది.

అసిరయ్యకి సెలవులు అయిపోయేవరకు ఆదెమ్మని పీల్చి పిప్పి చేశాడు. ఆ పిప్పిని వదిలేసి ఉద్యోగానికి వెళ్ళిపోయాడు. అసిరయ్య లేని ఆ ఇంట్లో కాపురం ఆదెమ్మకి నిత్య నరకం అయింది. ఆఖరికి ముత్యాలు వావీ వరసా కూడా చూడకుండా ఓ రాత్రి ఆమె మీద పడేసరికి తెగతెంపులు చేసుకుని పుట్టింటికి వచ్చేసింది.

చాలామంది పేదోళ్ళకి నీతినిజాయితీలు ఉంటాయి. అప్పన్న, అతని భార్య నరసమ్మే కాక ఆ ఇంట్లో అందరిదీ అదే పద్ధతి. ఆదెమ్మ చెల్లెలు ఎర్రమ్మ అలాంటిదే. కానీ కారేజీలు మోసే పనిలో పదిళ్ళు, పది రకాల మనుషులు పరిచయం అయ్యారు. ఐశ్వర్యం, సుఖం కళ్ళపడ్డాయి. అవి తమ బతుకులకి ఎందుకింత దూరంగా ఉన్నాయన్న కసి తలెత్తింది. ఇదే సమయంలో వరహాలరాజు కొడుకు బంగార్రాజు కన్ను ఎర్రమ్మ మీద పడింది. 'ఏమంటావ్?' అన్నాడు. కన్నెవయసు. మనసులో చెప్పుకోలేని కసి, ఎప్పటికీ అందుబాటులోకి రాని సుఖాల కాంక్ష... మొత్తానికి తను చాలా తెలివిగా చేస్తున్నానన్న భ్రమలో, బంగార్రాజుకి కొన్ని షరతులు పెట్టి, సరే అంది. ఆ షరతుల ప్రకారం వారంరోజులు ఎర్రమ్మకి ఏం కావాలంటే అది చెయ్యాలి బంగార్రాజు. చీరలు, నగలు, సినిమాలు, షికార్లు... అందుకు ప్రతిగా అతని క్కావాల్సింది ఎర్రమ్మ ఇస్తుంది. బంగార్రాజుకి మంచి అనుకూలంగా ఉందీ ఒప్పందం. చీరలు, నగలు ఎర్రమ్మ ఇంటికి ఎలాగూ తీసుకెళ్ళదు. తీసుకెడితే తల్లి నరసమ్మ చంపేస్తుంది. అందువల్ల అవి ఎరువిచ్చినట్టే. మిగిలిన ఖర్చంటే, అంత లెక్కలోదికాదు అతనికి. వారం

రోజులు ఇద్దరూ తమతమ ముచ్చట్లు తీర్చు కున్నారు. ఆ తర్వాత ఎర్రమ్మ దగ్గర ఓ బ్రా చూసి నానా గొడవ చేసింది నర్సమ్మ. దానిని నిప్పుల్లో వేసి తగలెట్టింది. అలాంటి తల్లికి తన కడుపులో బిడ్డ ఉన్న సంగతి తెలిస్తే... తెలియకూడదు. అందుకే తెగించి ఆత్మహత్య చేసుకుంది ఎర్రమ్మ.

దెబ్బ మీద దెబ్బ. ఇల్లు గడవాలి. ఆదెమ్మ కారేజీలు మొయ్యటం మొదలెట్టింది. ఎండనక, వాననకా ఎంత కష్టపడినా బ్రతుకు బరువుగానే సాగుతోంది. పూర్తి నిస్సత్తువు గా, నిరాశగా ఉన్న ఆదెమ్మకి చిన్న ఆశారేఖ నాగరాజు, అతని ఆదరణ.

క్రమేపీ ఆదెమ్మ, నాగరాజుల బంధం బలపడింది. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఓసారి పెళ్ళయిన తనిని నాగరాజు నిండు మనసుతో చేర దీస్తుంటే పొంగిపోయింది ఆదెమ్మ.

కానీ వాళ్ళిద్దరికీ పెళ్ళి జరగలేదు. తమ కంపెనీలో పై ఉద్యోగం కోసం నాగ రాజుని భిలాయ్ ట్రైనింగ్‌కి పంపించారు. అక్కడతను జ్వరపడ్డాడు. ఆదెమ్మ కేరేజీలు తీసుకెళ్ళే కంపెనీలో సమ్మె జరిగింది. అందువల్ల కేరేజీల పని ఆగిపో యింది. సంపాదన లేదు. ఇంట్లో తిండి లేదు. పసిపిల్లల ఆకలి చూడలేకపోయింది ఆదెమ్మ. గుప్పెడు బియ్యం గింజల కోసం ఆ వాడలో అందర్నీ బతిమాలింది. చివరికి పిల్లల్ని ఆకలితో చంపలేక, తను చచ్చి బంగార్రాజు కొత్తగా కట్టిన లాడ్జిలో సరుకైపోయింది. నిప్పులా బతికిన ఆదెమ్మ చెడిపోయినా, వాళ్ళ గుడిసెలో పొయ్యి రాజుకుంది. కడుపు నిండు తోంది.

లాడ్జింగ్‌లో ఆదెమ్మని చూసిన ముత్యాలు పగబట్టాడు. ఆనాడు తనని కాదన్న కసి తీర్చుకున్నాడు. పోలీసు తెలివితేటలతో ఆదెమ్మని బ్రోతల్ యాక్ట్ కింద జైల్లో తోయించాడు.

ఆ సమయానికి నాగరాజు రాకపోతే, జరిమానా కట్టి విడిపించకపోతే జైలు పాలయ్యేది ఆదెమ్మ.

ఏ పరిస్థితుల్లో ఆదెమ్మ అలా చేసిందో, నాగరాజుకి తెలుసు. అందుకే అప్పటికీ ఆదెమ్మని పెళ్ళి చేసుకోవటానికే సిద్ధపడ్డాడు. కానీ ఆదెమ్మ అంగీకరించలేదు. "ఎర్రోడా, నీవు సిద్ధవయినంత మాత్రాన నాను సిద్ధపడాలనుందా. నాను సెడి పోయినా, సేరదీయ డానికి ఎనకాడని దేవుడివి. కానీ నాను ఈ ఎంగిలి వొళ్ళుని దేవుడికి నయివేజ్జం ఎట్టేటంత నీచురాల్ని కాదు రాజుబాబు," అంది. మేనకోడలు పార్వతిని పెళ్ళి చేసుకో మంది.

ఆదెమ్మ మురికివాడలోనే మిగిలిపోయింది.

ఆదెమ్మ కుటుంబంలో అందరూ నీతిమంతులవటం, ముత్యాలు కుటుంబం లో అందరికీ దొంగబుద్ధి ఉండడం, ఎర్రమ్మ వారంరోజుల భోగ జీవితం, ఆదెమ్మ లాడ్జిలో దొరికి జైలు పాలవటం, నాగరాజుని కాదనటంలో కొంత డ్రామా ఉంది. అలా అని మురికివాడల జీవితాల్లో ఇటువంటివి జరిగే ఆస్కారం లేదని ఖచ్చితంగా చెప్పలేం. దుర్భర దారిద్ర్యం, కష్టాల వెంట కష్టాలు తోసుకొచ్చి జీవితాన్ని నాటకంలాగే తయారు చేస్తుంది.

చీకటోళ్ళు నవలలో కథ ఏమిటి, అది ఎలా నడిచింది అన్న విషయాల కన్నా, అర్నాద్ కేంద్రీకరణ సాగిన విషయాలు మరికొన్ని ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని పాత్రలు, మరీ ముఖ్యంగా సోములమ్మ... ఆ మురికివాడకి మకుటం లేని మహారాణి. మురికివాడ కేమిటి, ఆ ఊళ్ళోనే ఏది కావాల్సినా సాధించుకోగలిగిన దిట్ట. కానీ ఆ మురికివాడ జీవితం తెలిసిన మనిషి. వదులుకోలేని ఆపేక్ష ఉన్న మనిషి.. అందరికీ నీడగా నిలబడిన మనిషి. అలాగే ఆదెమ్మ అక్క మంగ... పేదరికంలో ఆడకూతురు పుట్టింటికి ఎంత మాత్రం బరువవ్వ కూడదన్న ఆడపడుచు. మొగుడు తగిలించిన ముండ రోగాలని బాగు చేయించుకోవటానికి ప్రభుత్వ ఆసుపత్రికి వెడితే, ఆ రోగాల కన్నా ఎక్కువగా బాధించిన డాక్టర్ల పద్ధతికి కన్నీటి తో నిరసన తెలిసిన మనిషి.. అప్రధానంగా కనిపించినా టీ కొట్టు తిరపతయ్య... ఇటువంటి పాత్రలతో రచయితకి సరైన సంబంధం ఉంటే తప్ప, జవ సత్వాలతో అవి నవలలోకి రావు.

మరో ముఖ్య విషయం- ముప్ఫై ఏళ్ళు దాటినా ఇప్పటికీ చీకటోళ్ళు నవల చదవటం ఆరంభిస్తే, చివరిదాకా వదలలేనంత ఆసక్తికరంగా సాగుతుంది. అప్పటి ఆ మురికివాడలకి, ఇప్పటి మురికివాడలకి తేడా లేనట్టే అనిపిస్తుంది. ఏ రచనకైనా ఇది ఎంతో నాణ్యమైన విషయం.


విశాఖ ప్రాంతం రచనలకి ఉపమానాలు, పోలికలు గొప్ప బలం. 'అడుగు ఊడి పోయిన బతుకు పళ్ళెంలా శూన్యంగా ఉంది ఆకాశం'- ఇది నవల మొదటి వాక్యం. ఇలాంటివి మామూలే... కానీ అర్నాద్...

'తాగినవాడు సారాకొట్లోంచి తేలిపోతూ మేఘాల్లో నడుస్తున్నా, ఇంటికి వెళ్ళి పోగలిగే తెలివిలోనే ఉన్నవాడిలా, అసిరయ్య ఆదెమ్మ ఆడసుఖం తాగే నిషాలో ఉన్నా తెలివిగానే ఉన్నాడు' లాంటి పోలికలతో చాలాచోట్ల మరింత నైపుణ్యం కనబరిచారు అర్నాద్. ఉపమానాలు మనిషి తత్వాన్ని కూడా బహిర్గతం చేసే విధానంలో ప్రత్యేకత ఉంది.

చీకటోళ్ళు మురికివాడలో కథలా కాకుండా, మురికివాడల కథగా అర్నాద్ రాయటం విశేషం. వర్గపోరాటాలు చాలా నవలల్లో ఉంటాయి. కానీ చీకటోళ్ళు నవలలో స్వవర్గీయుల మధ్య సయోధ్య లేకపోవటం, ఈర్ష్యాసూయలు, అసహనం, తమ వర్గీయుల్ని తామే ఇతరుల కన్నా ఎక్కువగా అవమానించి, హింసించటం, తమ బతుకుల్ని తామే వినోదంగా చూడటం అద్భుతంగా చిత్రించగలిగాడు.

కనీస మానవత్వంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకి సుఖరోగ వైద్యం పద్ధతి మారి తీరాలని ఈ నవల చదివిన అందరికీ అర్థమవుతుంది. 'వ్యభిచరించినా ఆదెమ్మ నీతిమంతురాలే,' అని ఆ మురికివాడలో అందరూ సమ్మతించటమే కాదు, చీకటోళ్ళు చదివిన అందరూ కూడా సమర్థిస్తారు. తప్పు ఆ చీకటిది కానీ వ్యక్తులది కాదని ఒప్పుకుంటారు.

*సెప్టెంబర్, 2010*




# పితృవనం

## కాటూరి విజయసారథి

**పి**తృవనం అంటే స్మశానం అని కొద్దిమందికే తెలుసు. రుద్రభూమి, కాడు లాంటివి తెలిసినట్టు ఈ పదం చాలామందికి తెలియదు. ప్రత్యేకంగా పితృవనం అన్న పేరుని ఎన్నుకున్న విభిన్న ధోరణి, ఈ నవల వస్తువులోనూ ఉంది. ఆంధ్రప్రభ వారపత్రిక 1989 దీపావళి నవలల పోటీలో మొదటి బహుమతి పొందిన కాటూరి విజయసారథి నవల పితృవనం. సుప్రసిద్ధ కవి కాటూరి వెంకటేశ్వరరావు కుమారుడు విజయసారథి.

అటు ప్రభుత్వరంగానికి, ఇటు కార్మికరంగానికి చెందని కొన్ని వృత్తులు వుంటాయి. వాటి మీద బతికే లక్షలాది బడుగు జీవితాలున్నాయి. అటువంటి వృత్తుల గురించి కానీ, ఆ వృత్తి కొనసాగే పరిసరాల గురించి కానీ వచ్చిన నవలలు చాలా తక్కువ. అందులోనూ, కేవలం ఒక కూటానికే సంబంధించి సాగే నికృష్ట జీవన విధానం, అందులోని మానావమానాలను అద్భుతంగా పట్టుకున్న నవల పితృవనం.

'సూరిగాడు'గా వ్యవహరింపబడే ఒక శవవాహకుడి చుట్టూ సాగిన కథ పితృ వనం. ఈ నవలకి సూరిగాడే కథానాయకుడైనా, మామూలు నవలా నాయక లక్షణాలేవీ అతనిలో లేవు. సూరి ప్రధాన పాత్రగానే నవల సాగుతుంది. అతని చుట్టూ, అతని ఆలంబనగానే కథ నడిచింది.

సూరి తాత పరబ్రహ్మశాస్త్రి యజ్ఞం చేసి సోమయాజి అయ్యాడు. తండ్రి లక్ష్మీనారాయణశాస్త్రి పది ఊళ్ళ పౌరోహిత్యం చేసి సిద్ధాంతి అనిపించుకున్నాడు. సూరికి అటు స్కూలు చదువుగానీ, ఇటు కులవృత్తికి సంబంధించిన చదువుగానీ అబ్బలేదు. ఒకరోజు స్కూల్లో క్రమశిక్షణ పేరుతో భయంకరంగా ప్రవర్తించే హెడ్మాస్టరంటే భయ పడిపోయి చదువు మానేశాడు. చేసిన తప్పల్లా ఆరోజు స్కూలుకి ఆలస్యంగా వెళ్ళి నప్పుడు ఆయన కళ్ళబడటమే. కులద్వేషంతో ఆయన ప్రవర్తించిన తీరు సూరి బతుకులో నిప్పులు పోసింది. అతన్ని శవాలు మోసుకు బతికే జీవనస్థాయికి నెట్టింది.

ఎవరేనా చావాలి. అప్పుడే సూరికి సంపాదన. చచ్చేవాళ్ళు బ్రాహ్మలే అవ్వాలి. ఆ చచ్చిన వ్యక్తి మొయ్యటానికి నలుగురు లేని దిక్కుమాలిన వాడేనా అవ్వాలి, దుర్మార్గు డేనా అవ్వాలి. అప్పుడే సూరికి గిరాకి. తన వృత్తి వ్యవహారం మాట్లాడేటప్పుడు సూరి గొంతు చాలా కటువుగా లేకపోతే వ్యవహారం తేలదు. జీవితంలో రకరకాల దరిద్రాలు చూసినవాడు. పదిరకాల కష్టం తెలిసినవాడు. అందుకే అతని మనసు కటువు కాదు.

ఆనందన్న కుర్రాడి తండ్రి పోయాడు. అయిన వాళ్ళెవరూ లేరు. ఇద్దరు ప్లీడర్ల ఇళ్ళల్లో టైపు చేసి నెలంతా అతను సంపాదించేది రెండువందలు. దానితో అతను, భార్య, ఇప్పుడు పోయిన తండ్రి బతుకుతూ వచ్చారు. తండ్రి పోయాడు. ఏం చెయ్యాలో సరిగా తెలియదు. రెక్కలు ముక్కలు చేసుకు పెంచిన తండ్రి పోయిన బాధ, చేతిలో డబ్బులేని దరిద్రం, ఇంట్లో శవం దగ్గర ఒంటరిగా ఉన్న అర్భకురాలు భార్య. ఇదీ అతని పరిస్థితి. వెతుక్కుంటూ సూరి ఇంటికి వచ్చాడు. ఇదీ పితృవనం నవల ఆరంభం.

ఆనంద్ ఇంటికి స్మశానానికి ఉన్న దూరం తదితర వివరాలు తెలుసుకున్న సూరి శవం మోతకి నూటయాభై అవుతుందన్నాడు. ఆనంద్ గుండె జారిపోయింది. అతని దగ్గర ఉన్నదే రెండొందలు. ఇవిగాక కట్టెలు, కొత్తగుడ్డ, పాడె సామాను, మంత్రా నికి, ఆ తర్వాత తతంగానికి చాలా కావాలి. అవన్నీ సూరి ద్వారా విన్న అతను కుప్ప కూలిపోయాడు. తండ్రికి అంత్యక్రియలు చెయ్యలేని దరిద్రపు బతుకా? చావు తర్వాత, చావు కన్నా భయంకర స్థితి.

నూటయాభై అన్నాడేగానీ, అదంతా సూరి ఒక్కడికే కాదు. దాన్ని అయిదు వాటాలు వేస్తాడు. మూడువాటాలు శవం మోసిన మిగిలిన ముగ్గురికీ, ఒక వాటా శవం మోసే ఆ గుంపులో వ్యక్తుల అత్యవసరాలకి. ఒక్క వాటాయే సూరికి. అంటే ముప్పై రూపాయలు. వారానికి రెండు పీనుగుల్నేనా మోస్తే కానీ వాళ్ళ సంసారాలు గడవవు. మూడో పీనుగ లేస్తే పండగే. శవం లభించగానే సరిపోదు. ఒక్కోసారి మొయ్యలేనంత దూరం. ఒక్కొక్కసారి తేలిగ్గా లేపలేనంతగా ఒళ్ళంతా నీరుపట్టి బరువుండే శవం.

సూరి ముఠాలోని పద్దిగాడు ఒకసారి అలాంటి శవాన్ని మోసి, భుజాల్లో నెప్పితో మూడురోజులు మంచం పట్టాడు. శవవాహకులకి ఇలాంటి యాతనలు ఎన్నెన్నో. అందుకే సూరి వ్యవహారం విషయంలో చాలా కటువుగా ఉంటాడు.

చనిపోయే ముందురోజు కూడా ఆనంద్ తండ్రి, "నాయనా, నా పని అయి పోయింది. ఈ కట్టెని తగలెయ్యటానికి కూడా ఖర్చురా బాబూ! ఎలాగో తిప్పలు పడి తలకొరివి పెట్టు," అంటూ బాధపడి ప్రాణం వదిలాడన్న సంగతి ఆనంద్ చెప్పటం

వల్ల, అతని బేలతనం అర్థమవటం వల్ల, ఏదో ఒకటి చెయ్యకపోతే ఆ కుర్రాడు కాలు కదపలేడనిపించింది. మనసుతో పాటు కదిలాడు సూరి.

ఇలాంటి సందర్భాలలో దహన ఖర్చులకి లేదనకుండా, ఎంతో కొంత సాయం చేసే ప్లీడరు పంతులు సుబ్రహ్మణ్యంగారి దగ్గరికి ఆనంద్‌ని తీసుకెళ్ళాడు సూరి. ఆయన ఓ వంద ఇచ్చారు. దాంతో మొత్తం మూడొందలైంది.

ఆనంద్ తండ్రి శవం లేచింది. శవం ముందు నడుస్తున్న ఆనంద్‌లో రకరకాల బాధ. తండ్రి లేడన్న బాధ, సరిగా పోషించలేకపోవటమే కాదు, సరిగా సాగనంపలేని ఆఖరి ప్రయాణం బరువు, తండ్రి చచ్చిపోయి సుఖపడ్డాడన్న నిర్వేదం.

ఆనంద్‌కో బాధయితే, శవం మోసేవాళ్ళ బాధలు వాళ్ళవి. మంత్రం చెప్పటానికి వచ్చిన సుబ్బావధానికి మర్నాడు కుర్రాడి స్కూలు ఫీజు అరవై కట్టాలి. సూరి ఎంత ఇస్తాడోనన్న బాధ. కాటికాపరి వీరబాహుడికి సూరి అయిదు రూపాయలే ఇవ్వగలగటం బాధ. మొత్తానికి సూరి పుణ్యాన ఆ శవదహనం పూర్తయింది. ఒక చావులోనే ఇన్ని బాధలయితే, చావుల మధ్య బతికే వాళ్ళందరికీ ఎన్ని బాధలో!

చావు సమయంలో విలువలు తల్లకిందులవుతాయి. డబ్బు లెక్కలు క్రిందా మీదా అవుతాయి. అంతవరకూ ప్రేమించి, తపించి, ముద్దాడిన వ్యక్తులు చావుతో ఎందుకూ పనికిరాని వ్యర్థపదార్థంగా తోస్తారు. ఇటువంటి అనేకానేక విషయాల్ని, భావనల్ని కాటూరి విజయసారథి ఎంతో ప్రతిభతో కళ్ళకు కట్టించారు. అదీ, 192 పేజీలున్న పితృవనం నవల తొలి నలభై పేజీలు సాగేటప్పటికే.

సూరి, అతని బృందం కాటికాపరి వీరబాహుడే కాక పితృవనం నవలలో ఇంకా చాలా పాత్రలున్నాయి. వాళ్ళందరి ఇబ్బందులు, బాధలు, కష్టాల్లా వివరించకుండా, అధోజగతికి సంబంధించిన సహజ జీవితంలా రూపు కట్టించటం విజయసారథి గారి అద్భుత ప్రతిభ.

సూరికి ముప్ఫై అయిదేళ్ళు. ఆడతోడు లేని ఒంటరి. తన చుట్టూ సమాజంలోని అన్యాయం, అనైతికం బాగా తెలిసినా, తను మాత్రం పద్ధతిగా ఉండాలనుకునే వ్యక్తి. శవాలు మోసేవాళ్ళకి సాధారణంగా తాగుడు, ధూమపానం, వ్యభిచారం అలవాట్లుం టాయి. సూరికి అవేంలేవు. పైగా, నేను కన్య అంత స్వచ్ఛంగా, పవిత్రంగా ఉన్న బ్రహ్మచారిని. కన్యనే చేసుకోవాలనే కోరిక, అన్న ఉద్దేశం ఉన్నవాడు. ఆ అవకాశం తారసపడక, సంపాయించిందాంతో ఏదోలా బతికేస్తున్నాడు. వీలున్నప్పుడు మనసుకి తోచినప్పుడు తనవల్ల జరిగే సాయం ఎవరికయినా సరే చేస్తాడు. బదులుగా తనకి ఎవరో ఏదో చేసెయ్యాలని ఆశపడడు. ఒక రకం మొండిగా గడుస్తోంది అతని జీవితం.

అరుణ అందమైన అమ్మాయి. పల్లెటూరిలో కొంచెం ఉన్న కుటుంబం. పట్నం జీవితం మీద మోజు. చుట్టంచూపుగా వచ్చిన అర్జునరావు బుట్టలో పడింది. ఇంట్లో, అందుబాటులో ఉన్న నగానట్రా, డబ్బూ పట్టుకుని అతనితో పట్నం చెక్కేసింది. కొన్నాళ్ళు ఇద్దరూ పట్నాన్ని అనుభవించారు. డబ్బు, నగలు అయిపోగానే విశాఖ రైల్వేస్టేషన్‌లో అరుణని వదిలి పారిపోయాడు అర్జునరావు.

దిక్కు తెలియకుండా స్టేషన్‌లో ఉన్న అరుణని ఓ మెడికల్ రిప్రజెంటేటివ్ చూసి, మాట కలిపి తన రూమ్‌కి తీసుకెళ్ళటంతో ఆర్నెలు హాయిగా గడిచాయి. గవర్న మెంట్ ఉద్యోగం వస్తే ఢిల్లీ వెళ్ళిపోతూ, అయిదు వందలు, ఇంటికి ఓ నెల అద్దె, అరడజను కొత్త చీరలు తన దారిన తను వెళ్ళిపోయాడు. వీళ్ళిద్దర్నీ షికార్లకి, సినిమాలకి తిప్పే రిక్షా ముత్యాలు అరుణకి నెమ్మదిగా వ్యాపార కిటుకులు చెప్పి, ఫ్యామిలీ టైపు వ్యభిచారిణిని చేశాడు. నాలుగేళ్ళు అలా ఒక్కొక్క మెట్టు దిగుతూ శరీరాన్ని అమ్మింది అరుణ. చివరికి చీకట్లో ఒంటిని అప్పగించే వీధి వ్యభిచారి స్థాయికి వచ్చేసి, ఒళ్ళంతా మచ్చలు సంపాదించుకుంది. అక్కడ అందరూ అరుణని 'మచ్చలగొడ్డు' అంటారు. ఒకసారి రౌడీల నుంచి తప్పించుకోటానికి పారిపోతూ, సూరి ఇంట్లో దూరి తలుపేసు కుంది అరుణ.

అప్పుడే సూరి అన్నం వండుకుంటున్నాడు. మరో గుప్పెడు బియ్యం పోసి అన్నం పెట్టాడు. తిని ఒళ్ళెరగకుండా తెల్లార్లూ నిద్రపోయింది. పొద్దున్నే తన కథంతా సూరితో చెప్పుకుని ఏడ్చింది. మంచి కుటుంబంలో పుట్టి, మగాడు చెయ్యేస్తే అశుద్ధం పడ్డట్టని పించే అరుణ జీవితం, మగాడు వస్తేనే ఆకలి తీరుతుందనిపించే స్థాయికి దిగజారటం దారుణం. పొద్దున్న కూడా నిస్వార్థంగా అన్నం పెట్టి పంపించాడు సూరి. అరుణ వెళ్ళిపోయినా, ఆమె కథ సూరితో ఉండిపోయింది.


ఆడది చెడిపోతే ఏం జరుగుతుందో అరుణ కథ సాక్ష్యం సూరికి. చావులు, శవాలు, దయ్యాలు, భూతాలు, స్మశానం, అందులో కాపరి వీరబాహుడు, చితి మంటలు- ఇవేవీ సూరిని భయపెట్టలేవు. కానీ, ఆడది ఒళ్ళు అప్పగించి కళ్ళు మూసు కుంటానంటే భయం. ఆ భయం ఉన్న సూరి దగ్గరికి బతుకు చెదిరిన జయ వచ్చింది. అప్పటివరకు నాయర్ టీ కొట్లో ఆశ్రయం పొందిన జయ అతని చావుతో తనూ చద్దా మనుకుని, స్మశానం చేరి అక్కడ తారసపడ్డ సూరి నీడన చేరింది. జయ చెడిన ఆడది కాదు. భయంకరమైన పరిస్థితులకి ఎదురునిలిచి, నిలబడిన కన్య.

సూరి, జయల జీవితం కొన్ని మలుపులు తిరిగాక ఇద్దరూ స్వచ్ఛంగా బతకటం పితృవనం నవల ముగింపు.

అరుణ, మంగ, జయ- మూడు పాత్రల కథలలో విషయం, సంఘటనలలో కొత్తదనంలేని నాటకీయత తొంగిచూసినా, విజయసారథి ఆదర్శపంథాకి అను గుణంగా నడిచాయి. వృత్తిపర వస్తుసాంద్రత నవల తొలిభాగంలో ఉన్నంతగా, మలి భాగంలో లేకపోయినా, ఓ మంచి కోసం ఆదర్శంగా నిలిచే రచన పితృవనం.

ఈ నవలలో 'చావు' వస్తువుగా తోచినా, నిజానికి చావుతో ప్రత్యక్ష సంబంధం ఉన్న కొందరి వ్యక్తుల బతుకు పితృవనంలో వస్తువు. అట్టడుగు జీవితాల్లో ఎంత చీకటి ఉందో, ఎంత మొరటుతనం, మొండితనం ఉన్నాయో అంతటి మంచితనం, మెత్తదనం కూడా ఉంటాయని నిండుగా పలికిన నవల ఇది. నవలతో పాటు రెండు మంచి ముందు మాటలూ ఉన్నాయి. పితృవనం విలక్షణత కలకాలం నిలుస్తుంది.

*నవంబర్, 2010*




# అవతలి గట్టు

## అరవింద

కాల్పనిక సాహిత్యంలో స్త్రీ పురుష సంబంధాల మీద, ముక్కోణపు ప్రేమ సంఘర్షణల మీద వెలువడినన్ని రచనలు మరే ఇతర విషయం మీద రాలేదేమో. శ్రీమతి అరవింద (ఎ.ఎస్. మణి అసలు పేరు) రచించిన *అవతలి గట్టు* నవల 1973లో వచ్చింది. ఈ నవల వేదిక ముక్కోణపు సంఘర్షణే అయినా, విషయం కేవలం స్త్రీ పురుషుల ప్రేమ, కోరికల వరకే పరిమితం కాకపోవటం ఈ నవల ప్రత్యేకాంశాలలో ఒకటి. 1973లో పుస్తకంగా వెలువడటానికి కొంచెం ముందు *అవతలి గట్టు* ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఆరోజుల్లో ఎందరో రచయిత్రులు ఎన్నో రకాల ప్రేమకథలతో, వారపత్రిక ధారావాహికలతో నవలామణులుగా ఎంతో ప్రాచుర్యం పొందారు. జమీందారుల జీవితాల దగ్గర నుంచి, దిగువ మధ్యతరగతి అమ్మాయిల కలల కారుల హీరోల వరకు ఎన్నో రకాల రచనలు. ఆకర్షించటమే ప్రధాన ధ్యేయంగా సాగిన నవలలే ఎక్కువ. ఆ కాలపు నవలే అయినా, అవతలిగట్టులో శ్రీమతి అరవింద ఎన్నో రకాల జీవన సత్యాలని వెలుగులో నిలబెట్టి చర్చించటం విశేషం.

లీలకి నలభై ఏళ్ళు. ప్రభుత్వోద్యోగి. ఆవిడ స్వగతంలా సాగుతుంది అవతలి గట్టు నవల.

తల్లీ, తండ్రి, అన్నగారు, వదినలతో కలిసి కలకత్తాలో ఉండేది. అప్పటి లీల వయసు 27 ఏళ్ళు. తల్లి, తండ్రి మరణించాక తన ఒంటరి జీవితం స్తబ్ధుగా అనిపించి మార్పు కోసం బదిలీ కోరింది. ఆమెని హైద్రాబాదు ట్రాన్స్ఫర్ చేశారు. హైద్రాబాదులో లీలని రిసీవ్ చేసుకుని, ఆమె స్థిరపడేవరకు మంచిచెడ్డలు చూసే బాధ్యత ప్రభుకి అప్పగించాడు లీల అన్నగారు. కలకత్తా నుంచి హైద్రాబాద్ బయలుదేరిన ప్రయాణంతో లీల కథ ఆరంభమవుతుంది.

కొత్త ఊరు, కొత్త వ్యక్తులు, కొత్త వాతావరణంలోకి వెళ్ళబోతోంది. అంతేకాక, చాలా ఏళ్ళ తర్వాత ప్రభుని చూడబోతున్నందుకు లీల మనసు ఉద్విగ్నంగా ఉంది. అతనితో ఓ విచిత్ర బంధం ఉంది లీలకి. ఆమె పదహారో ఏట బంధువుల పెళ్ళిలో ప్రభుని మొదటిసారి చూసింది లీల. కొద్దిసేపట్లోనే అతని ఆకర్షణ ఆమెని గాఢంగా పట్టుకుంది. తన జీవితానికి సరైన మగతోడు అతనే అని గట్టిగా విశ్వసించింది. ప్రభు ఎన్నోసార్లు ఊహల్లో మెదిలాడు. అతని తలుపు వీడకుండా ఉంది. అంతవరకే పరిమిత మైంది ఆమె జీవితం. ఆ తర్వాత ఇన్నాళ్ళకి ఇప్పుడు తిరిగి అతన్ని కలుసుకుంటోంది.

ప్రభుకి పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. ఆస్తిపరుడు, అందగాడు. అటువంటి వ్యక్తికి భార్య అవటం ఎంతో అదృష్టం. ఆ అదృష్ట స్థానంలో ఉన్న శారదని తొలిసారి చూడబోతోంది.

స్టేషన్కి వచ్చి ప్రభు ఎంతో ఆదరంగా లీలని ఇంటికి తీసుకెళ్ళాడు. శారద పిల్లలతో కలిసి ఊరెళ్ళింది. ప్రభు చెల్లెలు మీనా ఉంది. ఆ ఇల్లు, ఆ మనుషులు బాగా నచ్చారు లీలకి. శారద ఊర్నించి వచ్చే వరకూ ఉండి ఆ తర్వాత ఇల్లు మారాలను కున్న లీల ప్రయత్నం ఫలించలేదు.

ప్రభు మాటల ద్వారా లీల గ్రహించిందేమిటంటే వాళ్ళది అంత అనుకూల దాంపత్యం కాదని. దానితో లీల ఊహలు వేరేలా సాగాయి. శారద అతనికి తగిన భార్య కాదని, పల్లెటూరి చదువురాని మొద్దని, అందగత్తె కాదని- తనకి అందని ప్రభు, వివాహ జీవితాన్ని ఆ రకంగా చిత్రించుకుని, ప్రభు పట్ల జాలి పడటం ఓ చిత్రమైన ఉపశమనంగా ఉంది లీలకి.

శారద పిల్లలతో ఊర్నించి వచ్చింది. ముందుగా పిల్లలిద్దరూ కనిపించారు లీలకి. ఎంతో బావున్నారు. మొదటిసారిగా శారదని చూసి ఆశ్చర్యపోయింది లీల. ఆమె ఊహ లన్నీ తల్లకిందులయ్యాయి. పోతపోసిన సౌందర్యంలా కనిపించింది శారద. ఎంతో నాగరికంగా మాట్లాడుతోంది. పల్లెటూరి మొరటుతనం మచ్చుకేనా లేదు. శారద ఎం.ఎ.

చదివిందని, నగరంలోని రకరకాల కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటుందని, ఎంతో మంచి అభిరుచి ఉందని ఆ తర్వాత తెలిసింది లీలకి. అయినా అసూయపడలేదు. ప్రభుకి దీటైన భార్య అని ఆనందపడింది.

ఆ తర్వాత గడిచిన కాలంలో లీలకి ఆ ఇంట్లో ఎన్నో రకాల పరస్పర విరుద్ధ ఆలోచనలు, అనుభవాలు ఎదురయ్యాయి. మూడేళ్ళ కాలంలో లీల జీవితం ఎన్నో ఆటుపోట్లకి గురైంది.

'ప్రభుకి దీటైన భార్య శారద' అని లీల అనుకున్నంతసేపు పట్టలేదు, వాళ్ళిద్దరి సంసారం సవ్యంగా లేదని తెలియటానికి.

ఏవేవో కారణాలు చెప్పి కొంతకాలం, సున్నితంగా నచ్చజెప్పి కొంతకాలం, చివరికి కొన్ని కఠోర సత్యాలని లీల ముందుపెట్టి, ఎలాగైతేనేం లీలని ఆ ఇంట్లోంచి వెళ్ళనివ్వలేదు శారద. ఆ ఇంట్లో ఉండటానికి భౌతికమైన ఏ ఇబ్బందీ లేదు లీలకి. కానీ, మానసికంగానే నిత్య సంఘర్షణ.

శారద లీలతోటే ఆమెకి కేటాయించిన గదిలోనే పడుకుంటోంది. నిజానికి ఆ గది శారదదే. ఏరోజూ ప్రభుతో రాత్రి గడపటం లేదు. వారిద్దరి మధ్య శారీరక సంబంధం లేదు. ఇక ముందు సాధ్యం కాదని శారద స్పష్టం చేసింది. అంతేకాదు, పరస్పరం ప్రభుకి, లీలకి ఒకరంటే ఒకరికి ఇష్టం ఉంది కాబట్టి వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటే సంతోషిస్తానంది.

ఆ మాట విన్న లీలకి అయోమయం, ఆశ్చర్యం, కోపం, ఉక్రోషం అన్నీ కలగలిసి ప్రత్యక్ష నరకాన్ని చూపించాయి. ఆ ఇంట్లోంచి వెళ్ళిపోవాలని తీవ్ర ప్రయత్నం చేసింది. ఆ ప్రయత్నాలని ఆ ఇంటి మనుషులు సాగనివ్వలేదు. పరిస్థితులు అనుకూలించలేదు. శారద తనంతగా తనే ఓ రాత్రి తన గతమంతా లీలకి చెప్పింది.

శారద ఎం.ఎ. హైద్రాబాద్ పిన్నిగారింట్లో ఉండి చదువుకుంది. అప్పుడు వాళ్ళింటికి ప్రభు వచ్చినప్పుడు ఒకరినొకరు చూసుకున్నారు. ఒకరంటే ఒకరికి ఎంతో ఇష్టం కలిగింది. అలా సాగిన వాళ్ళ ప్రణయాన్ని పెద్దలు పెళ్ళిగా మార్చారు.

ఒకరంటే ఒకరికి ప్రాణం. ఎంతో ఇష్టంగా సాగింది వాళ్ళ సంసారం. ఇద్దరు పిల్లలు పుట్టారు. అన్నిరకాలుగా స్వాతంత్ర్యం ఉంది శారదకి. భర్త, పిల్లలే తన జీవితం అనుకున్న ఆమె ఆలోచనల్లో క్రమేపీ మార్పు వచ్చింది. జీవితమంటే ఒకరికి సాయం చెయ్యాలి కానీ, ఒకరి చేత సేవ చేయించుకోకూడదన్న భావన ఆవిడ జీవితంలో మార్పు తీసుకువచ్చింది. పిహెచ్.డి. చెయ్యాలని నిశ్చయించుకుంది. 'ఎకనమిక్స్ ఆఫ్ రూరల్ ఆక్యుపేషన్స్' శారద రీసెర్చికి ఎంచుకున్న అంశం. ఆ చదువు, అధ్యయనం ఆవిడ ఆలోచనల్ని మరింత మార్చాయి. వ్యక్తి స్థాయి, సంసార పరిధి నుంచి శారద ఆలోచన

సంఘం, ప్రపంచ స్థితిగతుల స్థాయికి విస్తరించింది. అదే సమయంలో శారద పిన్ని చనిపోవటం, వాళ్ళ అమ్మాయి రాణిని తన దగ్గరికి తీసుకురావటం జరిగింది. రాణి కాలేజీలో రెండో సంవత్సరం చదువుతోంది. శారద వాళ్ళింట్లోని వాతావరణం, స్వేచ్ఛ ఆ అమ్మాయిని త్వరగా సేదతీర్చాయి. మంచి ఉత్సాహాన్నిచ్చాయి.

తన చదువు, పిల్లల పెంపకంతో ఎప్పుడూ హడావుడిగా ఉండే శారద దినచర్య, ప్రభుకి రాణికి ఏకాంతం కల్పించింది. బలహీనతో, ఆకర్షణో ప్రభు వల్ల రాణి నెల తప్పింది. డాక్టరు ద్వారా ఈ విషయం నిర్ధారణ అయ్యాక, భర్త వల్లే ఇది జరిగిందని తెలిశాక శారద నిగ్రహం కోల్పోయింది. ఆమె నమ్మకాలన్నీ దెబ్బ తిన్నాయి. వివాహం, ప్రేమ, నమ్మకం అన్నీ అర్థరహితం అనిపించాయి.

రాణి ఒక్కమాట మాట్లాడలేదు. భార్యతో ఏదో వివరించి చెప్పాలనుకున్న ప్రభు ప్రయత్నాన్ని ఎంతమాత్రం సాగనివ్వ లేదు శారద. ఈలోపు వాళ్ళు ఊహించని మరో దెబ్బ. రాణి ఆత్మహత్య చేసుకుంది. అంతే ఆ సంసారం అనూహ్యంగా మారిపోయింది. ఒకే ఇంట్లో ఉంటారు. అన్నీ పైకి బాగానే కనపడతాయి. కానీ రాత్రుళ్ళు పిల్లలతో ప్రభు పైన గదిలో ఉంటే, శారద కింద తన గదిలో ఉంటుంది. దగ్గరగానే ఉన్నా, ఇద్దరి మధ్యా ఎంతో దూరం.

పిల్లల్ని, శారదని ఇప్పటికీ ప్రాణంగా చూస్తాడు ప్రభు. ఇంటి బాధ్యతల్లో ఎంతో జాగ్రత్త వహిస్తాడు. ప్రభు సహృదయుడు, ప్రేమ స్వభావి. అటువంటి అతని ఓ బలహీనతని, ఓ తప్పుని క్షమించ మని అంతగా అతను కోరుకుంటుండగా, శారద క్షమించాలని, క్షమించి తిరిగి తన సంసారాన్ని అమృతతుల్యం చేసుకోవాలని లీల ఆకాంక్ష. అందుకు తన మనసు, శరీరం, వ్యక్తిత్వం- ఏదీ సహకరించదని శారద నిర్ద్వంద్వంగా చెప్పేసింది.

ఏం చెయ్యాలో లీలకి అర్థం కావటంలేదు. ఆ ఇంటి నుంచి, వాళ్ళ నుంచి దూరంగా వెళ్ళనివ్వటంలేదు. అక్కడే ఉంటే ప్రభుని పెళ్ళి చేసుకోమంటోంది శారద. లీలకా పరిస్థితి ఎంతో ఇబ్బందిగా ఉంది.

లీలది సాఫీగా గడిచిన జీవితం కాదు. బావ వరసైన ఓ బంధువుతో ఆమె పన్నెండో ఏట బాల్యవివాహం జరిగింది. ఇరు కుటుంబాలలోని వ్యక్తుల భిన్న తత్వాల వల్ల, పసితనపు లీల అమాయకత్వం వల్లా భర్తతో కాపురం ఆరంభించక ముందే విడిపోయింది. అతను వేరే స్త్రీతో, పిల్లలతో తెనాలిలో ఉన్నాడు. అటువేపు అతనితోగానీ, ఆ కుటుంబంతోగానీ ఏ అనుబంధం మిగలకపోయినా, ఓ రకం కలత లీలని బాధించి ఒంటరిగా మిగిల్చింది. ప్రభు పట్ల అనురాగాన్ని అలాగే ఉంచింది. ఇటువంటి పరిస్థితుల్లో, శారద ఇల్లు వదిలి వెళ్ళటానికి నిశ్చయించు కుంది. తీవ్రవాదం పట్ల ఆమెకి ఉన్న మొగ్గు ఇంట్లో పరిస్థితులు ఆవిడ ఆలా నిర్ణయించుకునేలా చేశాయి. తను

వెళ్ళిపోయాక, ప్రభుని పెళ్ళి చేసుకున్నా, చేసుకోక పోయినా, అతన్ని, పిల్లల్ని చూసుకోవాలని లీలకి చెప్పింది శారద. లీల ఎటూ తేల్చు కోలేని పరిస్థితి. అంతలో శారద అనారోగ్యం పాలైంది. కాన్సర్‌తో కొద్దికాలం బాధ పడి చనిపోయింది. ఆ జబ్బు తిరిగి భార్యాభర్తల్ని దగ్గర చేసింది. శారద పోయిన కొన్నాళ్ళకి ఇంటిని, పిల్లల్ని లీలకి అప్పజెప్పి ప్రభు అమెరికా వెళ్ళిపోయాడు.

పిల్లలు, ఆ ఇల్లే తన ఆలంబనగా జీవితం గడుపుతున్న లీల మనసు కుదుట పరచుకుంది. తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ, స్కూల్లో పిల్లలకి పాఠాలు చెపుతూ గడుపుతోంది. భర్తతో ఎన్నో ఏళ్ళుగా సంబంధం లేకపోయినా అతని ఆఖరి పిల్ల సుధకి సరైన సంరక్షణ కావాల్సి వస్తే తెచ్చి తన దగ్గరే ప్రభు పిల్లలతో పెంచుతోంది.

నలభై ఏళ్ళ లీల జీవితంలో అనేక అధ్యాయాలున్నాయి. ముప్ఫై ఏళ్ళ వరకూ తన స్థితికి కారకుల్ని అసహ్యించుకుంటూ బతికింది. ఆ తర్వాత ఆమె దృక్పథం మారింది. జీవన గమనం మారింది.

బద్ధకమే దరిద్రం. కృషిలోనే అన్ని సంపదలూ ఉన్నాయి. ధర్మాన్ని అతిక్ర మించకు. అన్యాయాల్ని సహించకు. బీదరికానికి, కష్టాలకు భయపడకు. ఆత్మ గౌరవాన్ని రక్షించుకో. నీ కంట్లో ఎవరేనా పొడిస్తే నీకెంత బాధ కలుగుతుందో, నువ్వు ఎవరి కంట్లోనేనా పొడిస్తే వాళ్ళకీ అటువంటి బాధే కలుగుతుంది.' సమ తుల్యం ఉన్న ఇటువంటి భావాల్ని పిల్లల మనసులకి చిన్నతనం నుంచీ అలవాటు చెయ్యటం ఆమె ధ్యేయం.

నింద, అసహనం వేపు నుంచి, మనో నిబ్బరం వ్యక్తిత్వ సాధనల వేపుకి లీల చేరిన కథ *అవతలిగట్టు*.

ఇంకా ఈ నవలలో శారద, ప్రభు, లీల వేపు కుటుంబ సభ్యులు, స్నేహితులు రకరకాల పాత్రలున్నాయి. లీల తండ్రి, అన్నయ్య, ప్రభు చెల్లెలు మీనా,స్నేహితులు రవి, కిరణ్, వాళ్ళిద్దరి తీవ్రవాద నిబద్ధత మీద శారద ప్రేమ, ఇంట్లో ఆ కుటుంబం తో కలిసిపోయిన పనివాళ్ళు. ఈ నవలాపరంగా చర్చించిన మౌలిక అంశాలకి కొన్ని పాత్రలు బలం కూర్చాయి, మరికొన్ని పాత్రలు కథానిడివిని పెంచాయి.

రచనా ప్రణాళికా, గాఢత, వైవిధ్యాలలో *అవతలి గట్టు* విశిష్టమైంది. పైపైకి వ్యక్తులపరంగా సాగుతున్న కథలాగే కనిపించినా, లోలోపలి వ్యక్తిత్వ సంఘర్షణని, వ్యక్తిస్థాయి నుంచి, సమాజస్థాయికి, కొన్ని సందర్భాలలో ఆధ్యాత్మిక స్థాయికి చేర్చి విపులంగా చర్చించిన నవల.

చదువుకి దూరంగా ఉన్న రోజుల్లో స్త్రీ పరిస్థితి వేరు. చదువుతో వికాసం, ఆ వికాసంతో తన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని ప్రశ్నించే చైతన్యం కలిగాయి. స్త్రీగా తనేం చెయ్యాలో, చెయ్యగలదో తెలుసుకునే జిజ్ఞాస వారి జీవితాల్ని ముందుకు నడిపిస్తోంది.

నలభై ఏళ్ళ క్రితమే ఈ అంశాన్ని ప్రధానంగా పట్టుకోవటమేగాక, దీనికి అనుబంధంగా ప్రేమ, ప్రగతి, అసూయ, ద్వేషం, ప్రేమతో సమాజంలో పదిమంది జీవితాల్ని గమనించటంలో అంకురించే నిజాయితీతో కూడిన తీవ్ర భావాలు, వాటి పరిణామాలు ఎంతో నిశితంగా, నిజాయితీగా, స్పష్టంగా అరవిందగారు చర్చించారు. పేజీలకి పేజీలు చర్చల్లా సంభాషణలు సాగినా ఎక్కడా చదివించే నేర్పు కుంటుపడలేదు. ఎన్నో క్లిష్టమైన అంశాల్ని, సంఘటనల్ని స్పష్టంగా, నిశితంగా చెప్పగలిగిన అరవిందగారి రచనాతీరు ఈ నవలలో తన విశ్వరూపాన్ని చూపించింది.

ఓ సంధికాలంలో స్త్రీ మనస్తత్వ చిత్రణకి మచ్చుతునక *అవతలి గట్టు*. ఆడవారి సొంతగొంతు పైకి గట్టిగా వినిపించకపోయినా, 1970 నాటికి ఎంత స్పష్టంగా ఉందో, పురుషుల పట్ల వాళ్ళకి నచ్చని విషయాల్లో ఎంతటి బలమైన అభిప్రాయాలు ఉన్నాయో తెలుసుకోవడానికి ఓ కరదీపిక *అవతలిగట్టు*.

*డిసెంబర్, 2010*



# మగువ మనసు

## ధనికొండ హనుమంతరావు

గుడిపాటి వెంకటచలంగారి తర్వాత వయోవర్గ భేదం లేకుండా, వేల మంది పాఠకులు ఎంతో ఆసక్తిగా చదివిన శ్రీ ధనికొండ హనుమంత రావు, కొవ్వలి, లత... ఇలా చాలామంది రచయితలు ఉన్నారు. కానీ వీరందరిలో ధనికొండ హనుమంతరావుగారి స్థాయి ప్రత్యేకమైనది. రకరకాల పరిస్థితుల్లో మనుషుల ప్రవర్తనని విశ్లేషించటంలో ఆయన పద్ధతి ప్రత్యేకమైనది. చాలా ప్రాచుర్యం పొందిన ఆయన ఎన్నో నవలల్లో మరింతగా పఠితల్ని ఆకట్టుకున్న నవల మగువ మనసు. 1956 జులై నెలలో తొలి ముద్రణ పొందిన ఈ నవల 1960 ఆగస్టు నాటికే మూడు ముద్రణలు పొందింది.

మగువ మనసు నవలలో ఇంచుమించు అన్ని పాత్రలు, సంఘటనలు, కథ చాలా తెలుగు నవలల్లో ఉన్నవే అనిపిస్తుంది. అయినా, 319 పేజీల ఈ పెద్ద నవలని వదలకుండా చదువుతాం. అతి సామాన్యమైన కథని ఇంత ఆసక్తికరంగా చెప్పగల ధనికొండ హనుమంతరావుగారి నేర్పు అద్భుతం.

రాజారావు చాలా పేద యువకుడు. తాగుబోతు తండ్రి తల్లిని నిత్యం పెట్టే నరకాన్ని చూస్తూ అమితమైన దుఃఖంతో పదేళ్ళ వయసు వరకూ అని బాల్యం గడిచింది. అతని తండ్రి మరణించాక తల్లి రెక్కలు ముక్కలు చేసుకొని, నానా రకాల చాకిరీ చేస్తూ అతన్ని చదివించింది. ఆ తల్లి తప్ప తనకి జీవితంలో ఇంకేం లేదన్న నిర్లిప్తతతో తనలోకి తనే ముడుచుకుపోయి కాలేజీలో అతి శ్రద్ధగా చదువుకుంటున్నాడు రాజారావు. తన తల్లిని సుఖపెట్టటానికే ఆ చదువు అన్నది అతని ఉద్దేశం. మరో రెండేళ్ళు చదివితే డిగ్రీ పూర్తవుతుంది.

బయట కూడా అతనికెవరూ స్నేహితులు లేరు. తల్లి ఓ ధనవంతుల ఇంట్లో వంటమనిషిగా పనిచేస్తూ ఆ ఇంట్లోనే ఉంటోంది. ఒంటరి గదిలో రాజారావు ఒక్కడే. వారానికో, పదిరోజులకో ఓసారి తల్లిని చూడటానికి వెడతాడు. తీరుబడి చేసుకుని దొడ్డి గుమ్మం దగ్గరకి వచ్చి కొడుకుని కావలించుకుని కళ్ళనీళ్ళు పెట్టు కుంటుంది. ఉన్న ఒక్క కొడుక్కి ఇంత వండి పెట్టలేని బతుకు అయిందని బాధపడుతుంది. తెచ్చి పెట్టుకుని ఒకరికొకరు ధైర్యం చెప్పుకుంటారు. మళ్ళీ వారం, పదిరోజుల వరకూ ఇద్దరిదీ గానుగ బతుకే. ఏ ఉత్సాహం లేని రొటీన్ జీవితమే.

రాజారావు తల్లికి వచ్చే జీతం ఇరవై రూపాయలు. అంతా చదువు కోసం అతని చేతికే ఇస్తుంది. అయినా అది సరిపోదు. అందుకే ఉదయం లేవగానే ఒకరింటికి వెళ్ళి ట్యూషన్ చెప్పి, రూమ్‌కొచ్చి ఇంత వండుకు తిని కాలేజీకి వెడతాడు. సాయంత్రం కాలేజి అవగానే పద్మనాభంగారింటికి వెళ్ళి సెకండ్ ఫారం చదివే వాళ్ళమ్మాయి చిట్టికి ట్యూషన్ చెపుతాడు. వీటివల్ల నెలకి పధ్నాలుగు రూపాయలు వస్తాయి. అయినా సరి పోవు. డబ్బు ఖర్చు తగ్గించటం కోసం వీలున్నంత వరకూ బస్సు కూడా ఎక్కకుండా రోజూ మైళ్ళు మైళ్ళు నడుస్తాడు.

అతనికి ఉన్నవన్నీ ముతకబట్టలే. ఒకటి ఉతుక్కుంటే, మరొకటి కట్టుకోవటం. తన పేదరికం, వేషం అతనిలో ఓ న్యూనతాభావాన్ని కలిగించాయి. కాలేజీలో చదువుతున్నా, తనకి మిగిలిన విద్యార్థుల్లా గుర్తింపు లేదు. అందుకే ఒక మూల రత్నాల మధ్య రాయిలా గడుపుతున్నాడు. ఎవరూ లేని అతనికి పుస్తకాలు నేస్తాలయ్యాయి. ఎందరో సాహిత్యకారుల రచనలు అతని మనసుకి ఊరటని, తృప్తి నిచ్చాయి. ఆ చదువే క్రమేపీ అతన్ని రచయితని చేశాయి. 'రాజు' అన్న కలం పేరుతో అతను పంపిన కథ పత్రికలో అచ్చయిననాడు అతని సంతోషం అంతా ఇంతా కాదు. అచ్చులో అతని పేరు చూసుకున్న తృప్తి అతనికి కొత్త ఉత్సాహాన్నిచ్చింది. కథలు రాయటం అతనికి తృప్తిగానే కాదు, కొంత సంపాదనకి ఆధారంగా మారింది.

లలిత, రాజారావు క్లాస్‌మేట్. అయినా, ఎప్పుడూ అతను ఆమెవేపు సరిగ్గా చూడనన్నా చూళ్ళేదు. కానీ లలితకి అతనంటే అభిమానం. తెలివైనవాడని, కాలేజీకే

ఉత్తమ విద్యార్థని ఆమెకి అతనంటే ప్రత్యేక దృష్టి ఉంది. అటువంటి లలిత, రాజారావు చిట్టికి ట్యూషన్ చెపుతున్న ఓ సాయంత్రం పద్మనాభం గారింటికి వచ్చింది. అక్కడ ఒకరినొకరు చూసుకున్నారు. లలితే చొరవగా మాట కలిపింది. రాజారావు ఆ ఇంట్లో ట్యూషన్ చెపుతున్నాడని లలితకి, లలితకి పద్మనాభంగారు బాబాయ్ అని రాజారావుకి అప్పుడే తెలిసింది. అంతేకాక, 'ఈయన రాజు అన్న పేరు మీద మంచి కథలు రాస్తాడు,' అని పిన్నితో లలిత చెప్పటం అతన్ని ఎంతగానో ఆశ్చర్యపరిచింది. తను కథలు రాస్తున్న విషయం ఎవరికీ చెప్పలేదు. లలితకి ఎలా తెలిసిందన్న ఆశ్చర్యం. ఆనాటి వారిద్దరి పరిచయం కాలేజీ జీవితంలో మరింత ముందుకు సాగింది. తరచుగా సాయంత్రం రాజారావు ఉండే సమయంలో పద్మనాభంగారింటికి లలిత రావటం ఆరంభించింది. ఆ తర్వాత లలితే రాజారావుకి చెప్పింది, ఒకసారి అతని పుస్తకాలలోంచి జారిపడిన కథని తను చూసిందని. తనే పత్రికకి పంపిందని కూడా చెప్పింది. అతని కథలనన్నింటినీ లోతుగా విశ్లేషించేది. ఆమె విశ్లేషణని మరోలా అర్థంచేసుకున్న రాజారావు బాగా కలవర పడ్డాడు. అంతేకాక, ఇంక తను కథలు రాయటం అనవసరం అని కొన్నాళ్ళు రాయటం మానేశాడు.

రాజారావు కథలు రాయటం లేదన్న విషయం గమనించిన లలితే మరింత విపులంగా మాట్లాడి, తన ఉద్దేశ్యాన్ని మరింత విపులంగా చెప్పి, అతన్ని తిరిగి ప్రోత్సహించింది. తిరిగి పుంజుకున్న ఉత్సాహం తో, నూతన దృష్టితో మరింత మంచి కథలు రాశాడు రాజారావు. తన కథల గురించి మాట్లాడే తోడు, తన మంచిచెడ్డలు పట్టించుకునే ఆత్మీయురాలు లలిత రూపంలో దక్కాయి రాజారావుకి. ఇదంతా ఓ మధురమైన అనుభవం. అయినా ఆమె పట్ల అతని భయాలు అతనికున్నాయి.

ఆమె బాగా ధనవంతురాలు. తను చాలా దిగువస్థాయి వాడు. అందుకే తను గీత దాటకూడదు. ప్రేమ అన్న భావనకి చోటిస్తే ఆమెకి చెరుపు. అందుకే, ఆమె ఎంత దగ్గరితనం చూపించినా అతను దూరంగానే ఉంటూ వచ్చాడు.

ఇలా సాగిన రాజారావు జీవితంలో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. తల్లి ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. ఏదయినా ఉద్యోగం చూసుకుని ఆమెని తన దగ్గరకి తెచ్చుకుని విశ్రాంతిగా చూడాలనుకున్నాడు. అందుకే ఓ పత్రికలో ఉద్యోగంలో చేరాడు. చదువు మానేశాడు. ఈలోగా అతన్ని చావుకి దగ్గరగా తీసుకెళ్ళిన టైఫాయిడ్ జ్వరం వచ్చింది. లలిత ఆర్థిక, ఆత్మీయ సహకారాలతో బతికి బయటపడ్డాడు. తిరిగి కోలుకునేలోపు పనిచేస్తున్న పత్రిక ఇబ్బందుల్లో పడింది. తల్లి మంచం పట్టింది. తప్పని సరిగా తన చీకటిగదికే తీసుకొచ్చాడు. దాచిన కొద్దిపాటి డబ్బు ఆవిడ అనారోగ్యాన్ని బాగు చేయలేకపోయింది. చేస్తున్న ఉద్యోగం పోయింది. వాళ్ళు రెండు నెలల జీతం ఎగ్గొట్టారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తనతోపాటు, తన తల్లి బాగోగులు చూడటానికి

తరచుగా అతని రూమ్‌కి వచ్చిన లలిత కూడా అవమానాల పాలై, ఇంట్లో పెద్దవాళ్ళ నిరసన ఎదుర్కొంది. ఆ పరిస్థితుల్లో ఆమెని తన రూమ్‌కి రావద్దని ఖచ్చితంగా తెగేసి చెప్పాడు.

నిష్ఠూరపడి చేసేదేం లేక లలితా దూరమైంది. రాజారావు తల్లి ప్రాణాలు దక్క లేదు. అతను సర్వస్వంగా భావించే పుస్తకాలని పాత పుస్తకాల షాపులో అమ్మేశాడు. తింటానికి తిండి లేదు. మనసుకి శాంతి లేదు.

లలిత నగలతోపాటు లేచిపోయిందని, లలితని రాజారావే ఎక్కడో దాచాడని పోలీసులు పట్టుకున్నారు. అతని నిర్దోషత్వాన్ని నమ్మిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ అతన్ని వదిలేయటమే కాక, ఓ సినిమాకి పనిచేసే అవకాశం కల్పించాడు. ఆ సినిమా పెద్ద హిట్ అవటంతో రాజారావు దశ తిరిగింది. ఎంతో డబ్బు సంపాదించాడు. కారు, ఇల్లు... అన్ని సౌకర్యాలూ ఏర్పడ్డాయి. అయినా రాజారావుకి సుఖం లేదు. జీవితానికి ఓ అర్థం లేదు. డబ్బు కూడబెట్టటమే తప్ప, దాని వినియోగం కూడా తెలియదు. లలిత దూరమైన జీవితంలో ఏ ఆశా లేదు.

లలిత ఏమైందో తెలియదు. మరో స్త్రీకి తన జీవితంలో చోటు లేదు. అక స్మాత్తుగా ఒకరోజు షూటింగ్‌లో ఎక్స్‌ట్రాల మధ్య లలితలాంటి స్త్రీ కనిపించింది. లలితేమోనని తెలుసుకోవాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. అక్క డ్నుంచి ఆమె కోసం అతను వేయి కళ్ళు చేసుకుని అన్వేషిం చాడు. ఓరోజు రోడ్డు మీద కనిపించింది. పరికించి చూశాడు. లలితే, సందేహం లేదు. కారు దిగి వెళ్ళి పలకరించాడు. తన కూడా రమ్మనమని బతిమాలాడు. చాలా మొరటుగా తిరస్కరించింది. మరోసారి సినిమా హాలు ముందు నిలబడి, ఆమె కోసం వచ్చిన ఇద్దరు కుర్రాళ్ళతో వెళ్ళిపోతూ కనిపించింది.

ఎటువంటి లలిత ఎలా మారిపోయిందని బాధపడ్డాడు. ఆమే కాదు, ఆమె కుటుంబం, ఆస్తి, డబ్బు అన్నీ చితికిపోయాయి. ఓ కొత్త సినిమా ఆరంభం రోజు నిర్మాత ఇచ్చిన పార్టీకి శరీరాన్ని అప్పగించటానికి వచ్చిన ముగ్గురు స్త్రీలలో లలిత కనిపించింది.

ఇటువంటి దయనీయ జీవితం ఎందుకని, ఆమెని ఆరోగ్యంగా చూసుకోగల డబ్బు, మనసు తనకి ఉందని రాజారావు చెప్పినా, లలిత తిరస్కరించింది. ఆమె మొండితనానికి, కరకు మాటలకి విసిగిపోయి, ఎప్పటికైనా రావాలనిపిస్తే రమ్మనమని తన విజిటింగ్ కార్డు ఆమె దగ్గర వదిలి వచ్చాడు.

చాలారోజులకి లలిత దగ్గర నుంచి కబురు వచ్చింది, రమ్మనమని. అప్పటికే లలిత ప్రభుత్వ హాస్పిటల్‌లో అవసాన దశలో ఉంది.

వెళ్ళిన రాజారావుని చూసి కృతజ్ఞతతో కరిగిపోయింది. ఎవరినో నమ్మి మోస పోయి, ఓ పాపకి తల్లి అయింది. అప్పటికే అన్ని రకాలుగా చితికిపోయిన తన వాళ్ళ

దగ్గరకి వెళ్ళలేక, పాప పోషణ కోసం రకరకాలుగా దిగజారి, చివరికి ఈ స్థితికి చేరింది. తన పాప 'జయ'ని రాజారావుకి అప్పగించి చనిపోయింది లలిత.

ఆ పాపకి తండ్రిగా అన్ని బాధ్యతలు వహించినా, తన బాధలో, తన లోకంలో తనుండి ఆ పసిదానికి అందాల్సిన అనురాగం అందించలేకపోయాడు రాజారావు. ఓ రోజు తన తప్పు తెలిసింది. అంతే, అతను అన్నింటినీ మించి ఆ పాపకి అంకితం అయిపోయాడు.

పాప విషయంలో తన అనురాగరాహిత్యాన్ని రాజారావు గ్రహించిన ఘటన నుంచి ఆరంభమైంది నవల. తనని స్వీకరించమని లలిత తన మనసు తెలుపుతూ ఆరోజుల్లో రాసిన ఉత్తరం అతనికి చేరలేదు. అతని నుంచి జవాబులేని నైరాశ్యం భరించలేక తన జీవితాన్ని అలా నాశనం చేసుకుంది లలిత.

రాజారావు పాత్ర ప్రధానంగానే నవల నడిచినా, మగువమనసు నవల హృదయం లలిత. అభిజాత్యం ఉన్న ఓ స్త్రీ మనసుని, జీవితాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరించింది మగువ మనసు నవల. స్త్రీకి భూమికున్నంత ఓర్పు అంటారు. మనం ఎన్ని తప్పులు చేసినా స్త్రీ భరిస్తుంది. ఒకసారి ఆమె అభిమానం దెబ్బ తింటే ఆ వ్యతిరేకత భయంకరం. దెబ్బ తిన్న మనసుతో లలిత తన జీవితాన్నే పణంగా పెట్టింది. ఆమె మమత, అభిమానం, మొండితనం, ప్రేమ, మాతృత్వం... ఇలా అన్ని కోణాలలో విలక్షణ విశ్లేషణ అద్భుతం. అందుకేనేమో ధనికొండ ఈ నవలకి మగువ మనసు అని పేరు పెట్టారు.

కథ, పాత్రల కన్నా ఈ నవలలో ధనికొండ హనుమంత రావు ఆవిష్కరించిన మానవ ప్రవర్తనా తీరుతెన్నులు, విశ్లేషణ చాలా ఉన్నతమైనవి. కథాగతికి అనుపానంగా నడిచిన ఎన్నో వాక్యాలు, భావనలు అద్భుత జీవిత సత్యాలు.

రచనలు చేసే కొత్తలో రచయిలకి తమ రచనలు ఎలా ఉన్నాయో  తెలుసుకోవాలన్న ఆసక్తి చాలా ఎక్కువగా ఉంటుంది. తొలి దశ రచనలతోనే గొప్పగా రాణించిన వాళ్ళు తక్కువ. ఇది గమనించకుండా చాలామంది ప్రోత్సాహానికి బదులు, లోతైన విమర్శలతో నిరుత్సాహపరుస్తారు. అది రచయితలకి చావుదెబ్బలాంటిది. లలిత అటువంటి పొరపాటే చేసింది. ఆ తర్వాత ఆమే రాజారావు రచనల్లోని బలం వివరించి, ధైర్యం చెప్పి మంచి రచయితని చేసింది. ఈ సంఘటన లేకపోయినా, నవలలో కథకేం లోటు రాదు. కానీ కొన్ని వేలమంది సాధారణంగా అప్పటికీ, ఇప్పటికీ చేస్తున్న పొరపాటుని ఎత్తిచూపించారు ధనికొండ. ఏ రచనలోనేనా ఉన్న సుగుణాన్నే ముందుగా చెప్పటం చాలా మంచి పద్ధతి.

వర్ధమాన రచయిత జీవితపు వివిధ పార్శ్వాలని ధనికొండ ఈ నవలలో ఎంతో నిశితంగా చిత్రీకరించారు. రచనలు చేసేటప్పటి ఉద్వేగం, సంతోషం, నిర్లిప్తత, నిరాశ

లతో పాటు వ్యక్తిగత జీవితం తాలూకు అలసట- ఇలాంటి వాటన్నింటినీ ఆయన పట్టుకున్న తీరు, దృక్కోణం ఎంతో అరుదైనవి.

తల్లిని సుఖపెట్టాలనుకునే దిగువ మధ్యతరగతి కొడుకు నిర్ణయాలు ఎప్పుడూ వాయిదా పడుతూనే ఉంటాయి. దరిద్రం అంతటి బలమైనది. ఎందరికో వంటచేసి కడుపునిండా రుచిగా వడ్డించే వంటావిడ తన ఏకైక కొడుక్కి అతని పుట్టినరోజు నాడైనా పట్టెడన్నం పెట్టలేని దైన్యం జీవితాన్ని ఎంతగా కృంగదీస్తుందో చూపిస్తూనే సజావైన బతుకు కోసం ఆ తల్లీకొడుకు పడిన ఆరాటాన్ని చిత్రించారు. జీవితం పట్ల నిజాయితీతో కూడిన ఆశాభావం మగువ మనసు.

బాధలు, కన్నీళ్ళు తప్ప ఏ థ్రిల్ లేని ఇటువంటి నవలని ఎంతో ఆసక్తిగా చదివేలా మలచటం నిస్సందేహంగా ధనికొండ హనుమంతరావుగారి గొప్పదనం. పందొమ్మిది పేజీల కథ, మూడు వందల పేజీల జీవిత సత్యాలు మగువ మనసు నవల.

*ఫిబ్రవరి, 2011*